ప్రజా

RNI No.APTEL/15835/2019

మణిపూస

తెలుగు

మాసపత్రిక

సంపుటి - 1 సంచిక - 11 డిసెంబర్ - 2020 పేజీలు : 80 వెల : 25/-



ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్
కనపర్తి రాజారావు

కొడుకుల శ్రీనివాస్, యాక్టివ్ జర్నలిస్ట్

అసోసియేట్ ఎడిటర్
శ్రీ కె.వెంకట అప్పారావు (Ph.D)

సీనియర్ సబ్ ఎడిటర్ & టెక్నికల్ అడ్వయిజర్
శ్రీ డా॥ ఎం.జయకుమార్,MBA.,Ph.D,.

ఎడిటర్ : శ్రీ బి.రాజేష్, B.Sc,.

సీనియర్ జనర్నలిస్ట్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్
ఎన్.భావన్నారాయణ (భాను)

ఫొటోగ్రాఫర్ : బి.వీరయ్య

డిజైన్ & డి.టి.పి
ఆర్.తేజేష్, Cell : 9866789072

Printed & Published by Shri Kanaparthi Rajarao and Printed at Amma Offset Printers, D.No.30-8-35, Bhanu Street, Visakhapatnam-530020, A.P. and Published at Praja Manipoosa (Telugu), Sai Towers II, Plot No.317, House No.10-12-6/59, Rednam Gardens, Visakhapatnam - 530002. Cell : **9492423833**
Email : prajamanipoosa2020@gmail.com, prajamedia2020@gmail.com

విషయ సూచిక

రచనలు పంపవలసిన చిరునామా : Praja Manipoosa, Sai Towers I, Plot No.302, House No.10-12-6/44, Rednam Gardens, Visakhapatnam - 530002.
Email : prajamanipoosa2020@gmail.com, prajamedia2020@gmail.com

గౌరవ సలహా మండలి

Registration No.1140/2019

ప్రజా మీడియా నెట్‌వర్క్
PRAJA MEDIA NETWORK

ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

కనపర్తి రాజారావు
చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్

సాయి టవర్స్-1, ఫ్లాట్ నెం.302, రెడ్నం గార్డెన్స్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 94924 23833.
హెచ్.నెం. 9-1-38, వైఎంసిఎ కాంప్లెక్స్, సర్దార్‌పటేల్ రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ,
ఫోన్ : 9885715927, 9912202720

ఎడిటోరియల్

బాల్యానికి బాసటేది..?



నేటి బాలలే రేపటి పౌరులు. వారిని బాధ్యతాయుత పౌరులుగా రూపుదిద్దేది తరగతిగది. అందుకే అంటారు ఆరోగ్యవంతమైన సమాజం తరగతిగదిలోనే నిర్మించబడుతుందని. పాలబుగ్గల బాల్యం పసిడి కాంతులు వెదజల్లాలంటే సరైన మార్గదర్శనం అవసరం. అందుకు నిలయాలు కుటుంబం, పాఠశాల. బుడిబుడి అడుగులు వేస్తున్న క్రమంలో వారి వెన్నంటే ఉండి పడిపోకుండా, గాయాలపాలు కాకుండా అహర్నిశలు పర్యవేక్షించే తల్లిదండ్రులు, వారి భవిష్యత్తు విషయంలో కూడా అంతే చొరవ, దూరదృష్టి ప్రదర్శించాలి. నేడు విచ్ఛిన్నమవుతున్న కుటుంబాలు పిల్లలకు సరైన మార్గదర్శనం చేసే పెద్దమ్మ, పెద్దనాన్న, అమ్మమ్మ, తాతయ్య, నానమ్మ లాంటి బంధాలకు, ఆత్మీయ పిలుపులను దూరం చేస్తున్నాయి. నీతికథలతో నైతిక విలువలను, జీవిత సారాన్ని ఉగ్గుపాలతో కలబోసే ఆప్యాయతకు ఆమడ దూరంలో ఉండాల్సిన పరిస్థితి నేడు పిల్లలకు దాపురించింది. దానికి తోడు తల్లిదండ్రులు ఇరువురు ఉద్యోగ బాధ్యతల్లో తలమునకలై పని ఒత్తిడి నుంచి బయట పడడానికి టీవీలకు అతుక్కుపోయి పిల్లల పట్ల సరైన శ్రద్ధ కనబరచకపోవడం దురదృష్టకరం. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లలకు ఆశించిన ప్రేమాను రాగాలు దొరకక నిరాశ చెందుతున్నారు. దాంతో పిల్లలు కూడా ప్రత్యామ్నాయాలైన టీవీ, సెల్‌ఫోన్‌లకు బానిసలై తీవ్ర మానసిక సమస్యలను ఎదుర్కొంటున్న తీరును మనం చూస్తున్నాం. మన దేశ భవిష్యత్తు మన పిల్లల చేతుల్లోనే ఉందని జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు. ఇప్పుడు బాల్యం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులను చూస్తుంటే మన దేశ భవిష్యత్తు అగమ్యగోచరంగా కనిపించడం సహజం.

క్రీ.పూ. 700ఏండ్ల నాటి తక్షశిల విశ్వవిద్యాలయం, క్రీ.పూ. 4వ శతాబ్దం నాటి నలంద విశ్వవిద్యాలయాలలో ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇవ్వడం, వృత్తివిద్యలకు ప్రాధాన్యతనివ్వడం విద్యావిధానంలో భాగంగా ఉండేది. అందుకే నాటి విద్యావ్యవస్థలో నిపుణులకు కొదువలేదు. "నా వరకు చదువు నేర్పడంలోనే మానవాళికి ముక్తి ఉంది అనిపిస్తోంది" అన్న జార్జి బెర్నార్డ్ షా మాటలు మానవ జీవితంలో విద్య యొక్క మహోన్నత పాత్రను తేటతెల్లం చేస్తున్నాయి. "దేశసంపద బ్యాంకుల్లో కాదు, ప్రాథమిక పాఠశాలల్లో నిక్షిప్తం కావాలి" అనే మౌలానా అబుల్ కలాం ఆజాద్ అభిప్రాయంలోనే విద్యారంగం పట్ల ఆయన దార్శనికత, ఔన్నత్యం కనిపిస్తుంది. భారత రాజ్యాంగం ద్వారా బడి ఈడు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్య హక్కుగా ప్రసాదించబడింది. ఇలా పూర్తిగా ప్రభుత్వాధీనంలో ఉండాల్సిన విద్యారంగాన్ని కార్పొరేట్‌మయం చేస్తూ నానాటికి విద్యారంగానికి నిధుల కేటాయింపును తగ్గిస్తూ వస్తున్న పాలకుల తీరు భావిభారత పౌరుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నది. నేడు ఆట, పాటలతో ఆనందంగా విలువలు, వివేకంతో వికాసవంతంగా సాగాల్సిన విద్య.. మార్కులు, గ్రేడుల పందేరంలో బాల్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. కార్పొరేట్ కబంధ హస్తాల్లో బందీ అయి విలవిల లాడుతున్నది. ఆరోగ్యవంతమైన, అభివృద్ధికరమైన దేశ నిర్మాణానికి మూల స్తంభాలుగా నిలవాల్సిన పిల్లలు నైపుణ్యం లేమితో అవరోధంగా మిగిలిపోతున్నారు. నైపుణ్యవంతమైన యువతగా ఎదగాల్సిన పిల్లలు బట్టీ చదువులతో నాసిరకం విద్యతో నిరుద్యోగులై ఉపాధిలేక కుంగిపోతున్నారు. దీనికి తోడు గత మార్చి 2020 నుంచి కరోనా వైరస్ విజృంభిస్తుండడంతో విద్యారంగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత విద్యా సంవత్సరం అర్థాంతరంగా ముగిసిపోగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరు నెలలు గడుస్తున్నా విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పాఠశాలల పునఃప్రారంభంపై ఇంకా ప్రభుత్వంవైపు నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇది ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను తీవ్రంగా కలవరపెడుతున్న అంశం. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలంగా ఉండాల్సిన విద్యాలయాలు కళావిహీనంగా మిగిలిపోయాయి. పిల్లలకు శారీరక వికాసం ఎంత ముఖ్యమో, మానసిక వికాసం కూడా అంతే ముఖ్యం. ఈ మానసిక వికాసానికి పునాదులు పడి ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దబడేది పాఠశాలలోనే. నేడు విద్య వ్యాపారమయమై అందులో పిల్లలు ముడిసరుకులుగా మారి కార్పొరేట్‌శక్తుల ఎదుగుదలకు కారణమవుతున్నారు. కానీ, తమ సృజనాత్మకతకు పదును లేకుండా, నైపుణ్యాలకు సానపెట్టకుండా మిగిలిపోతున్నారు. నేటి బాలలే రేపటి పౌరులని బాలల దినోత్సవం సాక్షిగా ఉపన్యాసాలు గుప్పించే నేతలు వారికి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవడంలో మాత్రం బాధ్యతా రాహిత్యాన్నే ప్రదర్శిస్తున్నారు. మంచి వాతావరణం నుంచి వచ్చిన పిల్లలు మంచి ప్రవర్తనతో ఎట్టి పరిస్థితినైనా విజయవంతంగా అధిగమించగలుగుతారు. అలాంటి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, పాఠశాల, ఉపాధ్యాయులు, సమాజం, ప్రభుత్వాలు కల్పించి వారి అభిప్రాయాలు, ఆసక్తులకు విలువనిస్తూనే, వారిపై సరైన పర్యవేక్షణ చేస్తూ మార్గనిర్దేశనం చేసినప్పుడు వికాసం పురులు విప్పుకొని ఆరోగ్యవంతమైన, దృఢమైన భారతానికి బాటలు వేసిన వారవుతారు.

చీఫ్ ఎడిటర్

ఆర్థిక శాస్త్రానికి ఇప్పుడు ఏమయింది?

- ఆచార్య కె.ఎస్.చలం,యు.పి.ఎస్.సి.పూర్వసభ్యులు

మానవ నాగరికత గమనాన్ని మార్చింది ఆర్థికపరమైన లావాదేవీలు, ఆర్థిక శాస్త్రం పుట్టుకముందు నుండి మనిషి ఉత్పత్తి, మార్పిడి, పంపిణీ, మార్కెట్ వినియోగించుకుంటూనే వున్నాడు. తగ 400 సంవత్సరాల్లో అంటే ఆర్థిక శాస్త్ర ప్రారంభం 1600 నుండి 2000 నాటికి ప్రపంచ సంపద 260 రెట్లు పెరగటానికి కారణం మాత్రం ఆర్థిక శాస్త్ర సిద్ధాంతాలు, విధానాలు. ఇందులో ఇంకో ముఖ్య అంశం ఇమిడివుంది. వలస వాద దేశాలు 1600లో ప్రారంభమయ్యావి. ముఖ్యంగా లండన్ ఈస్ట్ ఇండియా కంపెనీ డిసెంబర్ 1600న నమోదయింది. అప్పటి వరకు అంటే క్రీ॥పూర్వం నుండి 1600 వరకు ప్రపంచ ఆర్థిక సంపదలో రెండు దేశాలు భారత్, చైనాలు సుమారు 66 శాతం సమకూర్చాయి అని రిపోర్ట్. అంటే వలస దేశాలు ముఖ్యంగా యూరప్, జర్మనీ, మినహాయించి, ఆసియా, ఆఫ్రికా, అమెరికా ఖండాల్లోని దేశాలని కబళించిన తరువాత 1870 నాటికి ప్రపంచ సంపద 3 రెట్లు పెరిగింది. ఇందులో 35 శాతం సంపద యూరప్‌కు చెందింది. ఆ శాతం మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయి వలస దేశాలు స్వాతంత్ర్యం ప్రకటించేనాటికి కొనసాగుతూనే వుంది. ఈ వలస వాద దేశాల ముఖ్యంగా ఈస్ట్ ఇండియా కంపెనీలో పనిచేసిన వ్యాపారులు మన్, చైల్డ్ వంటి వ్యక్తుల రచనలతోనే ఆధునిక ఆర్థిక శాస్త్ర ఆధారాలు ప్రారంభమయ్యాయి. వారిని ఆర్థిక శాస్త్ర పితామహుడు ఆడమ్ స్మిత్, మెర్కంటలిస్టులు వాణిజ్య వేత్తలు అని విమర్శస్తూ తన గ్రంథం వెల్త్ ఆఫ్ నేషన్స్ 1776లో ప్రచురించాడు. వాణిజ్య వేత్తల ఉద్దేశంలో (నేటి పెట్టుబడిదారి దేశ ఆర్థికవేత్తలు అన్నట్లు) ఏ దేశ వాణిజ్యం రీత్యా ఎంత ఎక్కువ బంగారం, వెండి మిగతా దేశాలనుండి కొల్ల గొడితే అదే సంపద. దాన్ని కాదని, సంపదకు మూలం మనిషి శ్రమ, శ్రమవిభజన అని ఆడమ్‌స్మిత్ వివరించాడు. ఫ్రాన్స్‌లో డా.కెనే అన్నతను మనిషి రక్త ప్రసరణతో సంపద ప్రసరణను సరిపోల్చి చూసి ఇందులో ప్రకృతి సిద్ధమైన ఒక పద్ధతి ప్రకారం మనుషుల తృప్తి కోసం వ్యవసాయం నుండి మాత్రమే నికర ఉత్పత్తి సాధ్యం అంటూ చాలా వివరాలను పొందుపరిచారు తరువాత కాలంలో మార్క్స్‌ను ప్రభావితం చేసిన ఫ్రెంచి విప్లవానికి ముందు మేధావి వర్గ సమూహంలోని వారితో సమాజాన్ని ప్రభావితం చేశారు. అయితే ఆర్థిక శాస్త్రం అక్కడితో ఆగిపోలేదు. పారిశ్రామిక విప్లవం, పెట్టుబడి దారి వ్యవస్థ రూపొందటంతో ఆర్థిక శాస్త్ర అవగాహన విశ్లేషణ అన్ని దేశాల విధానాల రూపకల్పనతో ఉపయోగపడ్డాయి. ఆడమ్ స్మిత్‌ను కూడా ప్రభుత్వ విధాన నిర్ణయాలకు ముఖ్యంగా పన్నులు, ప్రభుత్వ ఖజానా వగైరాలకు సలహాలు ఇచ్చారు. 19వ శతాబ్దంలో ఆర్థిక శాస్త్రం ప్రత్యేక అంశంగా రూపొంది 1890 నాటికి కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాయలంలో మార్షల్ మొట్ట మొదటి ఆర్థిక ఆచార్యునిగా మొలయింది. నిజానికి ఆర్థిక శాస్త్రం తాత్విక పునాదులు, అభివృద్ధి మొత్తం ఇంగ్లాండ్, యూరప్ ఆధారంగానే జరిగింది. అమెరికాకు 20 శతాబ్దం వచ్చేవరకు పెద్ద అవకాశం రాలేదు. రెండో ప్రపంచ యుద్ధంలో ఆర్థికంగా కుదేలయిన దేశాలను అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో ఆర్థికాభివృద్ధి అనే ప్రత్యేక అంశం 1950 తరువాతే ప్రత్యక్షమయింది. అంతకుముందు బాగావెనుకబడిన సోవియట్ యూనియన్‌ను కొన్ని దశాబ్దాలలోనే అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు, ఆ ప్రణాళికలు రూపొందించటంలో వామపక్ష ఆర్థిక శాస్త్ర వేత్తల ఆలోచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. అమెరికాపెట్టుబడి దారి వ్యవస్థ 1929లో కుప్పకూలిపోయి మిగితా దేశాలను ప్రభావితంచేస్తున్న క్రమంలో మళ్లీ కీన్స్ తన సిద్ధాంతాలతో మార్కెట్ మాత్రమేకాదు, ప్రభుత్వ విధానాలు అవసరం అని చెప్పినిలదొక్కుకునేలా చేశాడు. తరువాత ప్రపంచ యుద్ధం ముగిసే నాటికి ప్రపంచ బ్యాంక్, ఐఎమ్ఎఫ్ వంటి సంస్థల అంటే బ్రిటన్ వుడ్స్ సిస్టమ్‌ను నెలకొల్పటానికి కారణమయ్యాడు. దానితో అమెరికా పెత్తనం నెమ్మదిగా పెరగటం అప్పటి వరకు ఇంగ్లండ్‌లో ఆర్థిక శాస్త్రం అధ్యయనానికి వెళుతున్న పరిశోధకులు అమెరికా వైపు వెళ్లటం ప్రారంభించారు. 1925లో మొదటిసారి ఆర్థిక శాస్త్ర, మానసిక శాస్త్ర, పబ్లిక్ పాలన, వాణిజ్యం మొదలగు అంశాలను జోడించి హార్వర్డ్ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంటు కోర్సును ప్రారంభించింది. అక్కడితో ఆర్థిక శాస్త్రానికి బహుశా కష్టాలు ప్రారంభమయ్యాయి. వాణిజ్య శాస్త్రానికి, ఆర్థిక శాస్త్రానికి మధ్య నున్న తేడాను తొలగించి వాణిజ్య ఆర్థిక శాస్త్రం అభివృద్ధి చేయటం ప్రారంభమయింది. ఆర్థిక శాస్త్రం తన నిర్వచనంలో మనిషి సంక్షేమం కోసం ప్రకృతి సిద్ధంగా కొరతగా వున్న వనరులకు ప్రత్యమ్నాయాలు కనుగొనడంద్వారా మనిషి వినియోగించటానికి ఉపయోగపడాలి అన్నారు. నువ్వు ఏవిధంగా మేనేజ్ చేసయినా లాభాలు సంపాదించగలగాలి, అన్న ఆలోచనలు మిగతా సిద్ధాంతాలమధ్య వైరుధ్యాలు పెరిగాయి. ముందు సంపద పెంచండి, అదే అందరికీ అందుతుందంటే, వ్యత్యాసాలు, వివక్షలు, చారిత్రిక వారసత్వాలతో సతమతమైన ప్రపంచంలో ఏ కొద్దిమందికో సంపద పోగుచే యటం అవినీతి మయం అవమానకరం అన్నారు. రెండు వైపులా పరిశోధనలకు ప్రపంచ బ్యాంక్



ప్రత్యక్ష సహకారంతో ఆర్థిక సామ్రాజ్యావాద లక్షణాలు గల సంస్థల వ్యక్తుల ప్రచురణలు పుంఖాను పుంఖాలుగా ఇంగ్లీషు భాషలోనే ఎక్కువ జరిగాయి. లాటిన్ అమెరికా, ఫ్రెంచ్, చైనీస్, జపాన్ దేశాల్లో జరుగుతున్న పరిశోధన వివరాలు పరిశోధకులకు కూడా అందుబాటులోకి రాలేదు. ఏక ధృవ ప్రపంచం ఏర్పాడిన తరువాత మేధావి వర్గంలో ఎక్కువ మంది ప్రపంచ బ్యాంక్ అనుకూలవైఖరి తీసుకున్నారు. ఇందులో భారత దేశ ఆర్థిక శాస్త్రవేత్తలే ఎక్కువమంది (సేన్ లాంచి వారు మినహా) గుజరాత్ ఆర్థిక శాస్త్రవేత్తలైన భగవతి, పణగారియా యిప్పటికీ భారతదేశంలోని పబ్లిక్ రంగం పనికి రాదు. ప్రైవేట్ చెయ్యమంటూనే వున్నారు. దానికో సిద్ధాంతాన్ని అదృశ్యపాదం (అదృశ్యహస్తంలా) అనే ప్రభుత్వం ఎక్కడ కాలుపెడితే అక్కడ సర్వ నాశనం అని చెప్పి ప్రణాళికా సంఘాన్ని మూసేయించి నీతి ఆయోగ్‌ను నెలకొల్పగలిగారు. ఇప్పుడు దేశంలోని పబ్లిక్ రంగసంస్థలను వ్యక్తులకు కట్టబెడుతున్నారు. పబ్లిక్‌రంగ సంస్థల లాభాలు, మిగులు విషయంలో జరిగిన పరిశోధనలలో కూడా పెద్దపెద్ద మేనేజ్‌మెంట్ స్కూళ్లకు చెందినవారు తప్పుడు లెక్కలు చూపి పరిశోదన పత్రాలు ప్రచురించారు. విద్య, వైద్యం ప్రజలకు దక్కకుండా కోవిడ్ వంటి ఉపద్రవాలు వచ్చినప్పుడు ప్రభుత్వం మీనవేషాలు లెక్కకట్టడానికి ఒక తరం ఆర్థిక శాస్త్రవేత్తలు అల్లిన సైద్ధాంతిక పరిశోధనలు కారణం, ఇటువంటి పరిశోధనలకు గుర్తింపు కావలసిన రీసెర్చ్ ఫండ్ కార్పొరేటు సంస్థలతో బాటు ప్రపంచ బ్యాంకు అందివ్వటంతో వారి పరిశోధనలకు ఒక హోదా వచ్చివారిని ప్రభుత్వ సలహా దారులుగా వినయోగించు కోవటం జరిగింది. అలాగే విజ్ఞాన శాస్త్రాలకు నోబెల్ ప్రైజ్ వున్నట్లే స్వీడన్ బ్యాంక్ స్వెంజెస్ రిక్స్ బ్యాంక్ అందించిన డబ్బుతో 1969 నుండి ఆర్థికశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రకటిస్తున్నారు. మొదట్లో ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమం, వనరులు నాంఛనీయరీతిలో ఎలా కేటియించొచ్చు, ఇన్‌పుట్ అవుట్‌పుట్, అభివృద్ధికి విదేశీవాణిజ్యం, వెనుక బడిన దేశాల ఆర్థికాభివృద్ధికి మార్గాలు, జాతీయాదాయగణన వంటి అంశాలకు రెండు దశాబ్దాలుగా గుర్తించిన నోబెల్ కమిటి 1990 ప్రాంతం నుండి ఫైనాన్సియల్ మార్కెట్స్, ప్రోపర్టీ రైట్స్, డెరివేటివ్స్ వంటి పూర్తి వాణిజ్య మేనేజ్‌మెంట్ అంశాలకు సంబంధించిన పరిశోధనలకు ప్రాధాన్యత యిస్తూ, గతేడాది భారతీయ ఆర్థిక శాస్త్రవేత్త అభిజిత్ బెనర్జి (మరి ఇరువురికీ) గ్లోబల్ పవర్టీని తగ్గించేందుకు ఉపయోగించే ఒకానొక పరిశోధనా పద్ధతికి ఇచ్చారు.

ఈ ఏడాది నోబెల్ మరీ అధ్వాన్నంగా వేలం వెర్రిగా వేలంపాటపాడటానికి ఉపయోగించే పద్ధతులు, (రేడియో వేవ్స్) ఎలావుండాలో చెప్పినందుకు ఇచ్చారు. ఈ పద్ధతుల మూలంగా రేడిమోఎల్స్ వంటి నూతనంగా వస్తున్న కొత్తతరం సరుకుల విలువలకు వుపయోగపడినా అది ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపదు. పైగా యీ ఆర్థిక అంశాలన్నింటిలో ఊహజనిత విశ్లేషణలు అవసరం లేకపోయినా గణితశాస్త్ర ఫార్ములాలు ఉపయోగించి ఆచరణాత్మక అంశాలను దూరం పెట్టడం జరుగుతోంది. దీనితో గతంలో మిగతా సామాజిక శాస్త్రాల పరిశోధకులు ఆర్థిక శాస్త్రవేత్తలు కూర్చొని సమాజాలు, దేశాలు వారి వారి ప్రత్యేక పరిస్థితుల్లో వస్తున్న సమస్యలకు విశ్లేషణ చేయటానికి వీలు లేకుండా పోయింది. ఆర్థిక శాస్త్రమంటే అర్థంకాని వ్యాపారాంశంలకు సంబంధించిన కార్పొరేట్ మార్కెట్‌కు ఉపయోగపడే పరిశోధనలన్న అపప్రద ఆర్థిక శాస్త్రం మూటగట్టుకని 2008 తరువాత అమెరికా వంటి దేశాల్లో సామాన్యుల మధ్య ఆర్థిక శాస్త్రవేత్తలకు గౌరవం లేకుండాపోయింది. ఈ నోబెల్ గ్రహీతల పరిశోధనలు వాణిజ్య శాస్త్రవేత్తల నూతన పోకడలతో తయారుచేసిన 'డెరివేటివ్స్' మార్కెట్ అమెరికాలో రియల్ ఎస్టేటు బూమ్ తయారుచేసి 2008లో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయేలా చేశారు. అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఆర్థిక శాస్త్రంలో మైక్రో ఎకనామిక్స్ చదవాలంటే బెణుకు, గణితశాస్త్రంతో పాటు ఆర్థిక శాస్త్రం ఐయస్, ఎల్ఎమ్ కర్వుల విశ్లేషన కొంత కాలం మూలపడింది. బ్లైండర్ అనే పరిశోధకుని వివరాల ప్రకారం అమెరికా, యూరప్ విశ్వవిద్యాలయాల్లో రిస్క్ ప్రీమియమ్, లిక్విడిటిట్రేప్, డెరివేటివ్స్, సెక్యూరిటైజేషన్ వంటి అంశాల బోధన కుంటుబడింది.

పెట్టుబడి దారి దేశాల్లో స్టేట్ అనే ఆర్థిక స్టడీ విశేషం వున్నది అని ఎవరూ నమ్మలేకపోయారు. జనరల్ ఈక్విలీ బ్రియమ్ నో అంటే వెరవకపోయినా చిలీ దేశ అధ్యక్షుడు అలెండి చావుకు కారకుడైన పిచమిత్రుడు పేరటో ఆప్టిమాలిటీ అంగీ అమర్త్యసేన్ అన్నట్లు ఇదిఒక దుర్మార్గ జోక్‌గా మారింది. ఇది ఒకరోజులో జరిగింది కాదు.

ఆర్థికశాస్త్రం మిగతా సామాజిక శాస్త్రాలకంటే భిన్నంగా వుండటానికి గత రెండు వందల సంవత్సరాల్లో అది మిగతా శాస్త్ర విజ్ఞానాల మాదిరిగా ఖచ్చితమైన అంచనాలు యివ్వటం, సిద్ధాంత పరంగా చెప్పే ఊహలను శాస్త్రీయంగా తప్పు, ఫాల్స్ పయగుల్‌గా నిరూపించగలిగే ఉపకరణాలను ఆర్థిక శాస్త్రం సంపాదించగలిగింది. అయితే 1990 తరువాత వీటిని కొన్ని సంస్థలు, వ్యక్తులు దుర్వినియోగం చెయ్యటమో తప్పుగా అపాదించడమో చేసి జనానికందరికీ ఉపయోగపడేలా కాకుండా కొన్ని కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేసేలా చేయటంతో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణం వినాయిం కోమార్గం లేదనే భ్రమను కల్పించారు. అందుకు ప్రధాన కారణం వాషింగ్‌టన్ కన్‌సన్ అంటారు. అంటే వాషింగ్‌టన్‌లో వుండే ప్రపంచ బ్యాంక్, ఐయమ్ఎఫ్. అమెరికా ఫెడరల్ సిస్టమ్ మూడు కలిసి రూపొందించిన 'టెన్ కమాండ్ మెట్స్' విచ్చలవిడిగా అమెరికా తదితర పెట్టుబడి దేశాల అనుకూల ఆర్థిక విధానాలను ప్రపంచ బ్యాంక్ యితర సంస్థలు ద్వారా ప్రవేశపెట్టడం జరిగింది. టెన్ కమెండమెంట్స్‌లో ముఖ్యమైనవి, ప్రభుత్వ వ్యయం తగ్గించటం, పన్నుల సరళీకరణ, వాణిజ్యం సమీకరణ, విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం, పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేట్ చెయ్యటం, ఫిస్కిల్ పాలసీ వంటివి. భారత్ 1991లోనే అంకీకరించింది. దీనితో బలపద్ద అమెరికా, దాని మిత్ర దేశాలు ఫైనాన్స్ కంపెనీలను, బ్యాంకులను యిందులోకి దింపి లేమాన్ బ్రదర్స్, గోల్డ్‌మాడ్ సాక్స్ కుదేలు అయి వాల్‌స్ట్రీట్‌ను ముంచేశాయి. సుమారు 64.4 ట్రిలియన్ డాలర్లు నష్ట పోయినట్లు ఒక అంచనా. అమెరికాలో ఆక్యుపైవాల్ స్ట్రీట్ వంటి ఉద్యమాలు వచ్చాయి. తోమస్ పికిటి కేపిటల్ ఇన్ ట్వంటి ఫస్ట్ సెంచరి కేపిటల్ అండ్ ఐడియాలజీ వంటి రచనలు ప్రాచుర్యం పొందటానికి అవకాశం కల్పించింది. ఈ దిగజారుడు వెనుక ఒక వర్గం ఆర్థిక శాస్త్రాలు వున్నట్లు అంచనా. అయితే ఆర్థిక శాస్త్రం చదివి దానిపై బ్రతికిన మాలాంటి వాళ్లం అందరికీ వర్తించదు అని చెబుతున్నాం. 2000 సంవత్సరం తరువాత వస్తున్న ఆర్థిక శాస్త్ర పరిశోధనలు, నోబెల్ ప్రైజ్‌లు ప్రధానంగా వాణిజ్య ఆర్థిక శాస్త్రంకు సంబంధించినవి. వీరంతా ఆర్థిక శాస్త్ర ఆచార్యులుగా పిలువబడుతున్నవారు మేనేజ్‌మెంట్ స్కూళ్లలో వాణిజ్య ఆర్థిక శాస్త్రం పాఠాలు పరిశోధనలు చేస్తున్నారు. ఆ విధంగా కొంత మంది నిజమైన ఆర్థిక శాస్త్రవేత్తలు, ప్రజలు, దేశాలు మానవాభివృద్ధిలో ముందుకు వెళ్లాలి, అసమానతలు తొలగాలి అనే వారికి యిది ఒక ఓదార్పు మాత్రమే. నాలుగు శతాబ్దాలు మానవాళి మనుగడకు అభివృద్ధికి దోహదపడిన ఆర్థిక శాస్త్రం ఎప్పుడూ పాక్షికంకాదు. కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నా యిప్పటి ఆర్థిక సామాజిక సమస్యలకు తిరిగి పరిష్కారాలు చూపిస్తుంది. ఆదిశగా కొంత కృషి జరుగుతోంది. అందులో భారతీయ ఆర్థిక వేత్తలు వుంటారని ఆశిస్తున్నాం.

(ది ట్రిబ్యూన్‌లో ప్రచురించిన ఇంగ్లీషు వ్యాసానికి అనువాదం)

Herbal mask for covid-19 of Indian rural people




Photo of the day.. Poor but not Irresponsile

'దృక్పథాన్ని' విస్మరించని ఆచార్య రాచపాళెం

ప్రసిద్ధ తెలుగు సాహిత్య విమర్శకుల్లో ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు ఒకరు. తొలుత సంప్రదాయ సాహిత్యాన్ని అభిమానించినా, అనతికాలంలోనే అభ్యుదయ, విప్లవ, స్త్రీవాద, దళిత, మైనారిటీ సాహిత్య వాదాలకు బలమైన వెన్ను దన్నుగా నిలిచారు. గుర్రం జాషువా సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కానీ, దళిత కవులు, రచయితలను ప్రోత్సహించడంలో కానీ వీరి పాత్ర సామాన్యమైనది కాదు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, తెలుగు శాఖలో ఆచార్యులుగా ఆయన అనేక సంవత్సరాలు పనిచేసి, తర్వాత, యోగి వేమన విశ్వవిద్యాలయంలో పాఠ్య ప్రణాళికను సిద్ధం చేయడంలో తనదైన ముద్ర వేశారు. విద్యాబోధనలో ప్రగతిశీల, దళిత, స్త్రీవాద, మైనారిటీ సాహిత్యాలకు అవకాశం కల్పించారు. సంప్రదాయ సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూనే సమకాలీన సాహిత్యం పట్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన ఉండాలనేది ఆయన అభిప్రాయం. దానికి అనుగుణంగానే ఆయన రచనలు, ఆయన ప్రసంగాలు ఉండటం ఈ సందర్భంగా మనం గమనించాలి. ఈ వ్యాసంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి 2008 ఉత్తమ సాహిత్య పురస్కారం పొందిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు 1988 నుండి 2005 వరకు ఆయన రాసిన ముఖ్యమైన 38 వ్యాసాల "చర్చ" (తెలుగు సాహిత్య విమర్శ, పరిశోధన మీద వ్యాసాలు) వ్యాస సంపుటి ఆధారంగా చేసుకుని వారి సాహిత్య విమర్శ దృక్పథాన్ని వివరించే ప్రయత్నం చేస్తాను.




ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనివర్సిటీ,
హైదరాబాద్,
ఫోను: 9182685231

రాచపాళెం వారి దృక్పథం- స్పష్టత:

రచన చేసే వాళ్ళలో అత్యంత ముఖ్యంగా ఉండవలసిన వాటిలో ఒకటి 'దృకథం'. తాను నమ్మే భావాల్ని జాగ్రత్తగా ఒక సైద్ధాంతిక చట్టంలో చేరేటట్లుచేసుకోగలగాలి. ఒకవేళ రచయిత లేదా కవికి అటువంటి ప్రాపంచిక దృక్పథం పట్ల స్పష్టత లేకపోతే వాటిని చదివే పాఠకులు మరింత అయోమయంలో పడే అవకాశం ఉంటుంది. భగవంతుడు, దెయ్యాలు,దేవతలు, ప్రకృతి అతీతశక్తులు వంటి ఏవో తమను నడిపిస్తున్నాయనుకునే వాళ్ళు కొంతమంది ఉంటారు. వాళ్ళని భావ వాదులు, ఆధ్యాత్మికవాదులుగా చెప్పుకోవచ్చు. వీళ్ళు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతూ, ప్రతి విషయాన్ని పూర్వజన్మ సుకృతంగా భావిస్తూ తాము నిమిత్తమాత్రులమని అనుకుంటారు. ఇటువంటి వారిని రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు భావ వాదులు అంటారు. ఇటువంటి ధోరణిని అవాస్తవిక తిరోగమన పాయ అని దాన్ని ఆయన వ్యాఖ్యానిస్తారు.

సమాజంలో మానవుడు తన అస్తిత్వం, తన జీవితం ఆ విధంగా ఉండటానికి గతితార్కిక చారిత్రక భౌతిక పరిస్థితులే కారణమవుతాయని తెలుసుకుంటూ, ఆ చారిత్రక పరిణామాన్ని, ఆ కార్యకారణ సంబంధాలు విశ్లేషించుకుంటూ, హేతుబద్ధంగా ముందుకు వెళ్లి వాళ్ళని భౌతిక వాదులుగా చెప్పుకోవచ్చు. ఇటువంటి వారు దైవం, దెయ్యం, కర్మ ఫలితం పునర్జన్మ వంటి వాటి పట్ల విశ్వాసాన్ని ప్రకటించరు. ప్రతి విషయాన్ని హేతుబద్ధంగా, శాస్త్రీయంగా తన జీవితానుభవాల నుంచి విశ్లేషించుకుంటూ ఉంటారు. ఇటువంటి వారిని భౌతిక వాదులు అని రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు అన్నారు. ఇటువంటి ధోరణిని వాస్తవిక పురోగమన పాయిగా ఆయన అభివర్ణించారు. తాను ఈ భౌతికవాద దృక్పథానికి చెందిన వాడిగా చెప్పుకోవడమే మాత్రమే కాకుండా, భావవాద తిరోగమన ధోరణిని తిరస్కరిస్తున్నానని కూడా స్పష్టంగా చెప్పడం ఆయన విమర్శ దృక్పథాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. అయితే ఈ వాదాల్ని తిరస్కరించినంతమాత్రం చేత అటువంటి నిర్మించే వ్యక్తుల్ని ప్రేమించడంలేదని భావించకూడదని కూడా ఆయన అంటారు. దీని ద్వారా భావజాలం పట్ల వ్యక్తుల్ని, మానవ సంబంధాల్ని దూరం చేసుకోకూడదనీ, వైయక్తిక సంబంధాల్ని గౌరవం ఇస్తూనే తమ భావజాలాన్ని ప్రదర్శించే క్రమంలో తమ దృక్పథానికే కట్టుబడి ఉండాలని ఆయన భావిస్తారు. అంటే మానవీయ సంబంధాలకీ, భావజాల సంబంధాలకు మధ్య గల ఒక సన్నని పొర గుర్తించడం ద్వారా తన భావజాలం పట్ల తనకెంతో స్వేచ్ఛ ఉంటుందో ఇతరులకూ అంత స్వేచ్ఛ ఉంటుందనే భావన 'స్వేచ్ఛ'కు ప్రాణవంటిదానిగా గుర్తిస్తూ ఆచార్య రాచపాళెం వారు తన స్వేచ్ఛను కూడా కాపాడుకుంటారని అర్థమవుతుంది. ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారి ఈ "చర్చ" వ్యాససంపుటిలో భౌతిక వాద దృక్పథాన్ని వివరించే వ్యాసాలే ఉన్నాయి. ఈ వ్యాసాలను మూడు విభాగాలుగా విభజించుకోవచ్చు. ఒకటి: వ్యక్తులుగా కవులు, రచయితల జీవితాలను వారి సాహిత్య పరిణామాల్ని వివరించే వ్యాసాలు. రెండు: సాహిత్య విమర్శ, పరిశోధన తీరు తెన్నులను వివరించే వ్యాసాలు. మూడు: తులనాత్మక,పునర్మూల్యాంకన విమర్శ వ్యాసాలు.



వ్యక్తి జీవితం- సాహిత్య వికాసం:

ఒక వ్యక్తి సాహిత్యాన్ని విలువ కట్టేటప్పుడు ఆ వ్యక్తి జీవితాన్ని, రచనలను అన్నింటిని గమనించాలి. అలాంటి సమగ్రమైన పరిశీలన తర్వాతే ఒక నిర్ణయానికి రాగలుగుతాం. దీనికి కాలానుసరణ పద్ధతిని పాటించాలి. ఆ పద్ధతి ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారి వ్యాసాలలో కనిపిస్తుంది. ఒక కవి లేదా రచయిత మొదటి చేసిన రచనకూ, తర్వాత చేసిన రచనకూ మధ్యగల రచనలను కాలాను సరణపద్ధతిలో గమనిస్తూ ఆయన ఆ భావ పరిణామాన్ని మూల్యాంకనం చేస్తూ ఉంటారు. దీనివల్ల ఏదో ఒక రచనను ఆధారం చేసుకుంటూ ఆ వ్యక్తిని లేదా ఆ రచనను మూల్యాంకనం చేయకూడదనే సూచనను చేస్తున్నట్లుంటాయి. ఈ చర్చ పుస్తకంలో రాసిన తాపీ ధర్మారావు, గురజాడ, కోరాడ రామకృష్ణయ్య, రాచమల్లు రామచంద్రారెడ్డి, బళ్ళారి రాఘవ, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, నూతలపాటి

గంగాధరం, గుడిపాటి వెంకటేశ్వర్లు మొదలైన వారి వ్యాసాల్ని ఈ విభాగంలో గమనించవచ్చు. ఈ వ్యాసాలు ఒక్కొక్కటి వారి జీవితాన్ని, వారి రచనలను ఆసాంతం పరిశీలించి రాసిన వ్యాసాలు. అందువల్ల ఒక సిద్ధాంత గ్రంథంలా మనకి ఈ వ్యాసాలు కనిపిస్తాయి. దీనిలో ఉన్న ప్రతిపాదనలు వారిపై పరిశోధన చేసేవారికి మార్గదర్శకంగా నిలుస్తాయి. ఆయా రచయితల రచనల మౌలిక సూత్రాలను ఆ వ్యాసాల్లో ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు ఎంతో శాస్త్రీయంగా వివరించారు.

తాపీ ధర్మారావు గారు గురించి రాస్తూ, ఆయన మొదట సంప్రదాయ సాహిత్యాన్ని, గ్రాంథిక భాషను సమర్థించారని పరిచయం చేస్తారు. తర్వాత కాలంలో ధర్మారావుగారు సంప్రదాయం పేరుతో జరుగుతున్న ఆధిక్యాన్ని వ్యతిరేకించారు. వ్యవహారికభాషను సమర్థించారు. సంస్కృత భాషవల్ల తెలుగు సాహిత్యానికి అపకారం జరిగిందన్నారు. తాపీ ధర్మారావుగారు సామాజిక శాస్త్రాలను చదవడం వల్లనే ఆయనకు ఈ ఆధునికత అర్థమయ్యిందనీ వ్యాఖ్యానించి చక్కటి అన్వయంతో మూల్యాంకనం చేశారు. సర్దేశాయి తిరుమలరావు గురించి రాస్తూ, 'ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకు అంతర్జాతీయ లక్షణాన్ని సంపాదించి పెట్టిన విమర్శకుడు'గా అభివర్ణించారు. ఈ వ్యాసం చదివితే సర్దేశాయి వ్యక్తిత్వం, సాహిత్య కృషి, తులనాత్మక దృష్టి పాఠకులకు స్పష్టమవుతుంది.

ఆరుద్ర రాసిన 'గురజాడ గురుపీఠం' గ్రంథంలో చర్చించిన యుగకర్తల విషయంలో జరుగుతున్న చర్చను మరోసారి కొనసాగిస్తున్నట్లుగా 'యుగాలే గానియుగకర్తలుండరు' అనే మరో వ్యాసంలో ఆధునిక సాహిత్యంలో సమాజమే నాయకుడుగా ఉండాలనే మలయాళ రచయిత శివశంకర పిళ్ళై మాటల్ని సమర్థిస్తారు. "ఒక వ్యక్తిని యుగకర్తను చెయ్యడం సంప్రదాయ దృష్టి, ఆధునిక దృష్టి కాదు. దేవుడినో, రాజునూ, ఒక రాజకీయ నాయకుడినో చరిత్ర నిర్మాతగా ఆమోదిస్తే ఒక రచయితను యుగకర్తగా ఆమోదించవచ్చు. అయినా అలా ఆమోదించడం ఆధునిక దృష్టి కాదు" (పుట: 90) అని ఎంతో స్పష్టంగా చెప్పారు. ఈ మాటలు సాహిత్య చరిత్రకారులకు, విమర్శకులకు, పరిశోధకులకు ఒక సైద్ధాంతిక సూత్రీకరణ చేసేటప్పుడు గుర్తించాల్సిన మౌలిక భావనలు. ఇలాంటి భావనలు ఈ పుస్తకంలో అనేక సందర్భాల్లో కనిపిస్తాయి.

కోరాడ రామకృష్ణయ్య గురించి రాసిన వ్యాసం మహాభారత రచనలో తిక్కన చేసిన కృషి కళ్ళముందునిలుపుతుంది. రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా) సాహిత్య విమర్శ శైలి గురించి రాసిన వ్యాసంలో -సాహిత్య విమర్శలో కూడా విమర్శకుడు తన ఆధిక్యాన్ని ప్రదర్శించుకునే శైలిని ప్రదర్శిస్తుంటాడనే ఒక కొత్త విషయాన్ని చెప్పారు. రా.రా. విమర్శ శైలిలో కాఠిన్యం, ధైర్యం, స్పష్టత, సూటిదనం, చురుకుదనం, నిర్మొహమాటం మొదలైన లక్షణాలు ఉన్నాయన్నారు. "మార్క్సిస్టు విమర్శకులు రచనను గురించి ఉబుసుపోక ప్రశంస చెయ్యరు. అంచెనా కడతారు. అంచనా కట్టడంలో నిర్మొహమాటమే అవసరం. ముసుగు పనికిరాదు. అది శైలిలో కనిపించాలి. రా.రా.శైలిలో ఈ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి" (పుట:62) అన్నారు. వీటిలో చాలా వరకు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి విమర్శకు కూడా వర్తిస్తాయి. రా.రా. గురించే "రా.రా. సాహిత్య దృక్పథం' అనే వ్యాసాన్ని కూడా ఈ పుస్తకంలో రాస్తూ రా.రా. ది భౌతిక ప్రాపంచిక దృక్పథమని, రా.రా. మార్క్సిస్టు రచయిత, విమర్శకుడు అని సోదాహరణంగా వివరించారు. మనం సాహిత్యంలో ప్రయోగించే ప్రాపంచిక దృక్పథం, అభ్యుదయం, నిబద్ధత, భావజాలం, వస్తువు-శిల్పం, సాహిత్యంలో రాజకీయాలు వంటి అంశాల పట్ల ఒక అవగాహన రావాలంటే, ఈ వ్యాసాన్ని చదివితీరాల్సిందే.

తెలుగు సాహిత్య విమర్శకుల్లో సరైన గుర్తింపుకునోచుకోని విమర్శకుల్లో రూపనగుడి నారాయణరావు రాసిన 'కావ్యనిదానం' విమర్శ గ్రంథాన్ని ఆధారంగా కవికి భావన, రసజ్ఞత, ఉపజ్ఞ, ప్రతిభ ఉండాలని రూపనగుడి ప్రతిపాదించారని అన్నారు. ప్రసిద్ధ నాటక కర్త బళ్ళారి రాఘవ గురించి 'గిరీశం మాట- 'బళ్ళారి' వ్యాఖ్య " వ్యాసంలో గురజాడనూ, బళ్ళారి రాఘవనూ పరిశీలిస్తూ రాసిన వ్యాసం ఆలోచనాత్మకం. కన్యాశుల్కం నాటకంలో గురజాడవారు తన గిరీశం పాత్ర ద్వారా భారతదేశ పతనానికి పదకొండు కారణాలున్నాయన్నారు. అవేంటో కట్టమంచి రామలింగారెడ్డి కనుక్కోమని బళ్లారి వారిని ఆలోచిం చమనడం ద్వారా వాటిలో తొమ్మిదింటిని మాత్రమే గుర్తించారని వాటిని సాహిత్యంతో సమన్వయించి చూపారు. అవి. ధనాన్ని, కాలాన్ని, కళా ప్రజ్ఞలను, మేధోశక్తి సంపదను వ్యర్థం చేయడంతో పాటు, ఆవేశాలను దుబారా చేయడం, అపాత్ర దానం ద్వారా దానగుణాన్ని నిరుపయోగం చేయడం, యువశక్తులు అస్తిత్వాన్ని వ్యర్థం చేయడం, ఉచ్ఛ్వాస విశ్వాలను నిరుపయోగ పరచడం, సార్వత్రికంగం భౌతిక శక్తుల్ని వ్యర్థం చేయడం అనేవి ఆ పదకొండు కారణాల్లో తొమ్మిది కారణాలు గా బళ్ళారి చెప్పిన అంశాల్ని స్పష్టంగా వివరించి, ' రచనలో అంతర్గత విషయాల ఆధారంగా విమర్శ చేసే మౌలిక విధానానికి రాఘవ ఒరవడి పెట్టార'ని (పుట:75) వ్యాఖ్యానిస్తారు. శబ్ద చర్చ నుండి వస్తువు వైపు సాహిత్య విమర్శను మళ్ళించిన వారు కట్టమంచి రామలింగారెడ్డి అయితే, వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'మామూలు పాఠకులకు సైతం అర్థమయ్యేలా దాదాపు వెయ్యిపేజీల సాహిత్య విమర్శ రాసి, కథా, నవలా విమర్శకులకు కరదీపికల్లాంటి సిద్ధాంత గ్రంథాలను రాశారని ప్రశంసించారు. జాతిని ముందుకు నడిపించడమే సాహిత్యం యొక్క ప్రయోజనమని నమ్మిన నూతలపాటి గంగాధరాన్ని ఒక అభ్యుదయ విమర్శకుడిగా నిరూపిస్తూనే, ఆయనలోని అసహనాల్ని, సంయమనం కోల్పోయిన సందర్భాల్ని పేర్కొన్నారు.

మార్క్సిస్టు విమర్శకుల్లో సైద్ధాంతిక పునాది కలిగిన విమర్శకుడు వి. చెంచయ్య ఒకరు. చెంచయ్య గారు రాసిన 'సాహిత్య దృక్పథం" గ్రంథాన్ని ఆధారం చేసుకొని సాహిత్య విమర్శలో ప్రయోగిస్తున్న కొన్ని పారిభాషిక పదాలకు సైద్ధాంతిక పునాదితో కూడిన వివరణల్ని వివరించడంలో శాస్త్రీయతను ప్రదర్శించిన విమర్శకుడిగా విశ్లేషించారు. "సామాజిక స్పృహలేని కవి ఉండదు అంటూ కవిత్రయానికి, శివకవులకూ, శ్రీశ్రీ, విశ్వనాథలకు అందరికీ సామాజిక స్పృహ ఉందనీ, చాలామందికి లేనిది సామాజిక చైతన్యమని" చెప్పి, ఆ రెండింటి మధ్యా గల భేదాల్ని వివరించడంలో చెంచయ్యగారు ప్రదర్శించిన స్పష్టతను రాచపాళెం వారు చక్కగా వివరించారు. డాక్టర్ ద్వా.నా.శాస్త్రి గారి సాహిత్య విమర్శలో గల వైరుధ్యాల్ని వివరించిన వ్యాసం ప్రతి సాహిత్య విద్యార్థీ చదవదగింది. సాహిత్య విమర్శకుడు ఎలా ఆలోచించాలో నేర్పే వ్యాసం. ఈ వ్యాసంలో 'నిబద్ధత' ను కేంద్రం చేసుకొని చర్చ చేశారు. నిజానికి ద్వా.నా. సాహిత్య విమర్శ మీద చర్చలా అనిపిస్తున్నా, అలా ఆలోచించేవారందరి పైనా కొనసాగిన సాహిత్య చర్చ గా దాన్ని చూడాలి. సాహిత్య, కళా ధర్మాల్ని సాహిత్య విమర్శకులు అవగాహన చేసుకోవాల్సిన అంశాల్ని ఒక నమూనా చెప్పిన వ్యాసంగా దీన్ని చెప్పుకోవచ్చు. ఇలా వ్యక్తి కేంద్రంగా సాహిత్య విమర్శ, దాని పరిణామాలు, అవగాహన-అవగాహన రాహిత్యాలు, సాహిత్యం- వ్యక్తిత్వం, సాహిత్యం- రాజకీయాలు వంటి అంశాల్ని ఈ వ్యాసాలన్నింటిలో గమనించవచ్చు. ఈ పుస్తకంలో వ్యక్తి కేంద్రంగా సాహిత్య విమర్శ, పరిశోధనలను చెప్పినా, వాటిని ప్రత్యేకించి మరింత మౌలికంగా చెప్పిన వ్యాసాలు కూడా దీనిలో ఉన్నాయి.

సాహిత్య పరిశోధన, విమర్శ- మౌలికాంశాల వివేచన :

సుదీర్ఘ కాలం పాటు విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధన, విమర్శ రంగాల్లో అనుభవం ఉన్న ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు తెలుగు సాహిత్య విమర్శ, పరిశోధనలు బాగుపడాలని తపించారు. ఉత్తమ సాహిత్యం రావట్లేదనో, ఉత్తమ పరిశోధనలు జరగట్లేదనో అప్పుడప్పుడూ కొంత మంది కొన్ని అభిప్రాయాల్ని ప్రకటించడం గమనిస్తుంటాం. వాటికి గల కారణాల్ని చారిత్రక దృక్పథంతో సామాజిక వాస్తవికతను ఆధారంగా చేసుకొని నిజాయితీగా

సమీక్షించుకోవాలని ఆచార్య రాచపాళెం సూచిస్తారు.

గతకాలంలో జరిగినవన్నీ గొప్పవనో, సమకాలీనంగా జరుగుతున్న పరిశోధనలన్నీ మంచివి కాదనో భావించడం సమదృష్టి లోపించడమేనని ఆచార్య రాచపాళెం వారు అంటారు. గతంలో జరిగిన మంచి కొనసాగిస్తూ, లోపాల్ని సరిదిద్దుకున్నప్పుడే పరిశోధనలు బాగుపడతాయని ప్రబోధిస్తారు. ఆయన చెప్పడమే కాదు, చేసి చూపించారు.

సాహిత్య విమర్శ ఎలా ఉండాలో ఆయన అనేక పుస్తకాలు రాశారు. దానిలో గుర్తించదగిన పూర్వకృషిని ప్రశంసిస్తూనే, కొనసాగించాల్సిన విధానాన్ని సూచించారు. తెలుగు పరిశోధన సిద్ధాంతాల్ని, పద్ధతుల్ని బోధన పద్ధతుల్ని వివరించిన సరైన గ్రంథాలు లేవని గమనించి, ఆచార్య హెచ్. ఎస్.బ్రహ్మానందం గారితో కలిసి 'సాహిత్య పరిశోధన సూత్రాలు, సాహిత్య బోధన పద్ధతులు' అనే పుస్తకాల్ని రాశారు. సాహిత్య విమర్శ గ్రంథాలు, వ్యాసాలు అనేకం ప్రచురించారు. ఒక్కమాటలో చెప్పాలంటే సమకాలీన సాహిత్య తీరుతెన్నుల్ని నిజాయితీగా అవగాహన చేసుకోవడానికి నిజమైన ఆకరాల్ని వెతికితే అవి ఆచార్య రాచపాళెం గారు రాసిన విమర్శ వ్యాసాలు, గ్రంథాలుగా మనకు కనిపిస్తాయి. 'ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయలు', కథాంశం, కొన్ని కావ్యాలు-కొందరి కవులు, ఆధునికాంధ్ర కవిత్వం-ఉద్యమాలు, సందర్భాలు, చర్చ, మరో చర్చ మొదలైన గ్రంథాలు వెలువరించారు. వీటితో పాటు గురజాడ, జాషువాలపై వెలువరించిన పుస్తకాలు రాశారు. దళిత కథలు, దళిత నవలలు, స్త్రీవాద నవలలు మొదలైన పుస్తకాలకు సంపాదకులుగా వ్యవహరించారు. వీటితో పాటు పత్రికల్లో, ప్రత్యేక సంచికల్లో, పరిశోధన పత్రికల్లో అనేక వ్యాసాలు రాస్తున్నారు. ప్రతిసంవత్సరం సాహిత్య విమర్శ మీద రాసే వార్షిక సమీక్షా వ్యాసాలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. ఇవన్నీ ఆచార్య రాచపాళెం గారి సాహిత్య విమర్శ కృషిని తెలిపేవే. సమకాలీన, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకాలే.

సాహిత్య పరిశోధనలు - సామాజిక శాస్త్ర దృక్పథం:

విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు సరిగ్గా జరగడం లేదనీ, ప్రమాణాలు పాటించడం లేదనే వాళ్ళు ఎంతమంది దాని బాగుగురించి ప్రయత్నం చేశారని ఆలోచించాలి. కానీ, ఆచార్య రాచపాళెం ఈ దిశగా తన వంతు ప్రయత్నం చేశారని ఆయన చేసిన ఉపన్యాసాలు, రచనలే నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. అందుకే ఆయన విమర్శ, పరిశోధనల గురించి మాట్లాడ్డంలో నిజాయితీ ఉంది. ఈ రంగాలు బాగుపడాలనే తపన ఉంది. వీటి గురించి మాట్లాడే హక్కు ఉంది. ఈ అంశాల్ని ఈ "చర్చ" అనే ఒక్క పుస్తకాన్ని ఆధారం చేసుకొని చూసినా తెలుస్తుంది. విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న తెలుగు భాషా సాహిత్య పరిశోధనల మీద ఒక ఖండన వ్యాసంగా రాసిన వ్యాసంలో పరిశోధన తీరుతెన్నులను చర్చించారు. ఒక తాత్విక నేపథ్యంతో పరిశోధన చేసే వాళ్ళు. ఎలాంటి తాత్విక నేపథ్యం లేని వాళ్ళు. ఈ వ్యాధితో బాధపడుతున్న వాళ్లు అనే మూడు రకాలుగా పర్యవేక్షకుల వర్గీకరించ వచ్చును అని చెప్పారు. ఈ మొదటి రకం పర్యవేక్షకులు నుంచి కొంతమంది పరిశోధన ఆశించగలమనీ, కానీ అటువంటి వాళ్ళు విశ్వవిద్యాలయాల్లో తక్కువగా ఉన్నారని అన్నారు.'థీసిస్ లో మెథడాలజీ ఉండాలంటే పరిశోధకులకు ఒక ప్రాపంచిక దృక్పథం ఉండాలి. అది ఉపాధ్యాయుల్లోనే కరువైంది' (పుట్టి 25)

పరిశోధనలు బాగా జరగట్లేదనడానికి అనేకమైన కారణాలు ఉన్నప్పటికీ అనుకూల సామాజిక పరిస్థితుల్లో పరిశోధన సైతం కొంత తాకిడికి గురవుతుందని చెప్పారు. ఆ పరిస్థితులు మారినప్పుడు పరిశోధన తీరుతెన్నులు కూడా మారతాయని వాస్తవిక దృష్టితో విశ్లేషించారు. డాక్టర్ మంచాల గంగాధర్ సిద్ధాంత గ్రంథం ఆధునిక తెలుగు కవిత్వంలో విప్లవ ధోరణులు- ఒక విశ్లేషణ గ్రంథం గురించి రాస్తూ ఒక తాత్విక దృష్టితో విశ్లేషించిన గ్రంథంగా వ్యాఖ్యానించారు. తెలుగు సిద్ధాంత గ్రంథాల్లో అయోమయం, పులుముడు, దృక్పథరాహిత్యం వంటివన్నీ పరిశోధన స్థాయిని దిగజారుస్తున్నాయని వాటిపట్ల పరిశోధకులు, పర్యవేక్షకులు జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ఆధునికాంధ్ర కవిత్వాన్ని/ సాహిత్యాన్ని వక్రీకరించే కుహనా సాహిత్య చరిత్రకారులు ఉద్యమం కాని దాన్ని మహోద్యమంగా చిత్రిస్తూ దానికి ఒక మహత్తర చరిత్ర ఉన్నట్లు చెప్తూ నిజమైన ఉద్యమాన్ని అసలు ఉద్యమం కాదని వాదించే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డాక్టర్ కె. లక్ష్మీనారాయణ చేసిన పరిశోధన గ్రంథం 'హరిజనా భ్యుదయం- తెలుగు కథానిక' గురించి వ్యాఖ్యానిస్తూ తెలుగు సాహిత్య పరిశోధన కు అది ఒక గవాక్షాన్ని తెరిచిందన్నారు.

విశ్వవిద్యాలయాల సాహిత్య పరిశోధన పరిచయం ఉండి విశ్లేషణకు, సిద్ధాంతీకరణకు అనిర్దిష్టత నుండి నిర్దిష్టతకు చేరుకునే దశను దిశను సూచిస్తున్న గ్రంథంగా వ్యాఖ్యానించి, విశ్వవిద్యాలయాల్లో మంచి పరిశోధనలు కూడా వస్తున్నాయని దీన్ని చెప్పడానికి ఒక నమూనాగా చూపించారు. అయితే తెలుగు పరిశోధన తీరుతెన్నులు గురించి ఏదైనా ఒక విమర్శ వచ్చినప్పుడు దాన్ని విశ్వవిద్యాలయాల్లో ఉన్న తెలుగు పర్యవేక్షకులు స్పందించకపోవడం పట్ల కూడా ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తన అసహనాన్ని చాలా స్పష్టంగా వెల్లడించారు. ఇప్పటికైనా తెలుగు శాఖలులో పబ్లిక్ డిమాండ్‌కి ప్రతిస్పందిస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలుగు పరిశోధనలు ఆరోగ్యకరంగా లేని మాట నిజమే కానీ తమను తాము ఆత్మ విమర్శ చేసుకుంటున్న సందర్భాలు ఉన్నాయన్నారు. అభ్యుదయ విమర్శ విశేషం సంచిక, తెలుగు అకాడమీ, వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించినటువంటి పరిశోధన తీరుతెన్నుల ఆ సందర్భంగా వచ్చిన పుస్తకాల గురించి చర్చించారు. ఒక విశ్వవిద్యాలయ ఆచార్యుడిగా ఆ విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్నటువంటి ఆ పరిశోధనల తీరుతెన్నులు గురించి ఒక బాధ్యత కలిగిన పరిశోధకుడిగా ఈ వ్యాసాన్ని రాశారు. ఈ వ్యాసంలో పరిశోధనల్లో జరుగుతున్న భావజాల సంఘర్షణల పట్ల చంద్రశేఖర రెడ్డి గారి విశ్లేషణ వాస్తవికంగా, ప్రజాస్వామిక దృక్పథంతో ఉంది.

సాహిత్యాన్ని సాహిత్య ప్రమాణాలతోనే పరిశోధించాలని వాదించే వారున్నారు. అలాగే సాహిత్యేతర ప్రమాణాలతో అంటే సామాజిక శాస్త్ర ప్రమాణాలతో పరిశీలించాలనే వారూ ఉన్నారు. ఇది భావజాల సంఘర్షణ. సాహిత్యం సామాజిక ప్రయోజనాన్ని ఆశించాలని ఆలోచించే సందర్భంగా జరిగే సంఘర్షణ. సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలని, సామాజిక ప్రయోజనం ఆశించే వారు సాహిత్యాన్ని సాహిత్యేతర ప్రమాణాలతో కూడా చూస్తారని దాన్నే తాను సమర్థిస్తానని చాలా స్పష్టంగా చెప్పడం ద్వారా ఆచార్య రాచపాళెం ప్రగతిశీల సాహితీ వేత్తగా నిరూపించుకున్నారు."యూనివర్సిటీ పరిశోధకుల ఆలోచనలు ఆధునిక సామాజిక శాస్త్రాలకు అనుగుణంగా ఉండాలి వాస్తవికత ఉట్టిపడాలి." (పుట:64) అనే అభిప్రాయం ఆయనకున్న దృక్పథాన్ని స్పష్టం చేస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మొదలైన సంస్థలు ఇస్తున్న నిధుల వల్ల తాళ్ళపాక కవులు అలాగే క్షేత్రయ్య, త్యాగయ్య, సారంగపాణి, పోతులూరి వీరబ్రహ్మం, యాగంటి కవులు, సిద్ధయ్య, అన్నమయ్య మొదలైన వారి పద సాహిత్యంపై విస్తృతంగా పరిశోధనలు కొనసాగుతున్నా, వాటిలోని శాస్త్రీయ దృక్పథాన్ని పరిశోధకులు పట్టించుకోవడం లేదని తన విచారాన్ని వ్యక్తం చేస్తారు. ప్రొఫెసర్ గంగాధర్ గాడ్గిల్ ఒక ప్రసంగంలో రచయితలు ఒక సిద్ధాంతానికి బద్ధులై రాయడాన్ని వ్యతిరేకించి, సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు ఇచ్చారు. దీనికి ప్రతిస్పందనగా ఆచార్య రాచపాళెం 'సిద్ధాంత వ్యతిరేకత ప్రజావ్యతిరేకతే' అనే వ్యాసాన్ని రాశారు . ఎలాంటి సిద్ధాంతం లేకుండగా ఏ సమాజం మనుగడ కొనసాగిం చలేదనీ, ఆ సమాజంలో భాగమైనా మనిషికి కూడా ఏదో ఒక సిద్ధాంతం ఉంటుందనీ, అది గాడ్గిల్ కి కూడా ఉందనీ, దాన్ని గుర్తించకుండా ఒక గందరగోళ స్థితిలో , బాధ్యతారాహిత్యంగా ఆయన ప్రసంగించారని ఆచార్య రాచపాళెం వివరించారు. ఇది మార్క్సిజాన్ని వ్యతిరేకించేవాళ్ళూ, సమర్థించే వాళ్ళూ, పరిశోధకులు అందర చదవలవలసి వ్యాసం. ఇవన్నీ సమకాలీన

తెలుగు పరిశోధన మీద జరుగుతున్న చర్చను కేంద్రీకరించిన వ్యాసాలు.

సాహిత్య విమర్శ-శాస్త్రీయ దృక్పథం:

తెలుగులో సాహిత్య విమర్శ గురించి విమర్శ గురించి ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు రాసిన భావాలు ఎంతో విలువైనవి. ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకులు అనే వ్యాసంలో ఒక చోట ఇలా అంటారు." ఆధునికకవిత్వానికి కూడా మన ప్రాచీనాలం కారిక గ్రంథాల సూత్రాలను అన్వవించ బోయి దెబ్బతిన్న వాళ్లు కూడా తెలుగులో ఉన్నారు. ఆధునిక కాలంలో మార్బిస్ట్ విమర్శకులు చెప్పేవన్నీ కూడా ప్రాచీనులు చెప్పినవే అని నిరూపించే ప్రయత్నం కూడా జరిగింది. ఇవన్నీ వాస్తవాన్ని తలకిందులు చేసి చూసే పద్ధతికి నిదర్శనాలు (పుటః27) అంటారు. ఆర్. ఎస్. సుదర్శనం గారు ఏ గ్రంథాన్ని అయినా సరే వ్యక్తివాద దృష్టితో వ్యాఖ్యానిస్తారు అనేది ఆచార్య రాచపాళెం వారు గుర్తించిన ఒక విశిష్టమైన అంశం. (పుట. 29)

నవలల ద్వారా సమాజంలో కొంతమంది అనారోగ్యకరమైన అభిరుచిని కలిగించడం అది కుహనా వైజ్ఞానిక చారిత్రక నవలలుగా రావడం గుర్తించదగిన అంశమని చెప్పి, దానిని శాస్త్రీయంగా విమర్శించే ప్రయత్నంలో రంగనాయకమ్మ, బాలగోపాల్ మొదలైన వారు విశేషమైన కృషి చేశారని పేర్కొన్నారు. స్త్రీవాద, దళిత, పోస్ట్ మోడర్న్ మొదలైన వాటిని సాహిత్యంలో తీసుకొచ్చిన విమర్శకులను, ఆ విమర్శ పద్ధతులను ఒక క్రమంగా వివరించిన ఈ వ్యాసం చాలా విలువైన వ్యాసం. అయితే తెలుగు సాహిత్య విమర్శలో అన్నీ ఆరోగ్యకరమైన ధోరణులే వచ్చాయని అనుకోలేకపోయినా, ఉత్తమ సాహిత్య విమర్శ కూడా ముందుకు పోతూనే ఉందని ఒక చక్కటి అంచనా కట్టారు. తెలుగులో సాహిత్య విమర్శ ఎదగలేదా?అంటూ ఆచార్య రాచపాళెం వారు ఒక వ్యాసాన్ని రాశారు. పాఠ్యాంశాలలో విమర్శ బోధించేటప్పుడు సరైన ప్రణాళిక లేకపోవడాన్ని, కొంతమంది రాసి విమర్శలలో అవగాహనా రాహిత్యాన్ని ఈ వ్యాసంలో బయటపెట్టారు. అలంకార శాస్త్రాలకు సాహిత్య విమర్శకు మధ్య గల భేదాన్ని గుర్తించకుండా కొంతమంది విమర్శలు చేస్తున్నారు. అలాగే పాశ్చాత్య సాహిత్య విమర్శ సిద్ధాంతాలను సరిగ్గా అవగాహన చేసుకోకుండా, తమకు తెలిసిన కొన్ని సూత్రాలతో సాహిత్య విమర్శలు కొనసాగించడం కూడా తెలుగులో సాహిత్య విమర్శ సరిగా జరగలేదని దానికి ఒక కారణం గా కనిపిస్తుందని అన్నారు. అన్ని వేదాల్లోనే ఉన్నాయ న్నట్లుగా కొంతమంది మార్బిస్టు సాహిత్య విమర్శ గురించి అన్వయించేటప్పుడు సైద్ధాంతిక అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారని సోదాహరణంగా వివరించారు. అటువంటి విమర్శ చూసినప్పుడు తెలుగులో సాహిత్య విమర్శ ఎదగలేదనే అనుమానం రావడం కూడా సమంజసమేనని చెప్పారు. అందుకని సాహిత్య విమర్శను శాస్త్రీయంగా ఎదగకుండా అడ్డుకుంటున్న కువిమర్శకులను ఎదుర్కోవడం విమర్శకుల బాధ్యతగా భావించాలని అంటారు. (పుటః47). అంతేకాకుండా సాహిత్య విమర్శలో నిబద్ధత, సిద్ధాంతం, భావజాలం, దృక్పథం మొదలైన పారిభాషిక పదాల్ని వివరించిన ఈ వ్యాసాలు ఈ గ్రంథంలో అనేకం ఉన్నాయి. ఈ విమర్శ గ్రంథం మార్బిస్టు సాహిత్య విమర్శను అనుసరించే వారికి, దాన్ని అర్థం చేసుకోవాలనుకునే వారికి ఒక మార్గదర్శిగా నిలుస్తుంది. దీనితో పాటు సాహిత్యంలో తులనాత్మక విమర్శతో పాటు, మూల్యాంకనానికి పునర్మూల్యాం కనానికి గల తేడాను గుర్తించడానికి కూడా ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుంది. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఈ పుస్తకానికి ఉత్తమ విమర్శ గ్రంథం పురస్కారం ఇచ్చి ఒక మంచి గ్రంథాన్ని గుర్తించిందనిపిస్తుంది.

ఒక బాధ్యతగల సాహితీవేత్తగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా, ఒక ఆచార్యుడిగా ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు ఎంత బాధ్యతా యుతంగా ఉన్నారో గమనించే వారికి ఈ గ్రంథం ఒక ఆదర్శనీయమైనటు వంటి స్ఫూర్తినిస్తుంది. ఈ గ్రంథం ద్వారా తెలుగు సాహిత్య విమర్శ గౌరవాన్ని పెంచిన వ్యక్తులలో ఆచార్య చంద్రశేఖర రెడ్డి గారు ఒకరని తెలుస్తుంది. సాహిత్యంలో నిబద్ధతకు, దృక్పథానికి నిలువెత్తు నిదర్శనం ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు.

మనం "చంపేసిన" తెలుగు పదాలు..

1.అన్నము-బువ్వ (మీల్స్)
2. కూర (కర్రీ)
3)కంచం (ప్లేట్)
4) లోటా (గ్లాస్)
5)పచ్చడి - (చట్నీ)
6)ఊరగాయ -(పికిల్)
7) నీళ్లు -(వాటర్)
8)సీసా - (బాటిల్)
9)చెంచా - (స్పూన్)
10) పాలు -(మిల్క్)
11) పెరుగు - (క ర్)
12) ఉల్లి- (ఆనియన్)
13) నూనె - (ఆయిల్)
14)తుండు గుడ్డ -(టవల్)
15)చొక్కా- అంగి (షర్ట్)
16)ఉప్పు - (సాల్ట్)
17)ఘాటు - (స్పై సి)
18) చేతి గుడ్డ - (హేఁడ కీ)
19) బల్ల - (టేబిల్)
20) కుర్చీ - (ఛైర్)
21) మంచం - (కాట్)
22)పొడుగు లాగు- (పాంట్)
23)తీపి - (స్వీట్)
24)తలుపు -(డోర్)
25) కిటికీ - (విండో)
26)తాళం - (లాక్)
27)తాళం చెవులు - (కీస్)
28)మీట - (స్విచ్)
29) పుస్తకం -(బుక్)
30)కాగితం - (పేపర్)
31)కలం - (పెన్)
32)పలక -(స్లేట్)
33)సూది -(నీడిల్)
34)దారం - (థ్రెడ్)
35)స్నానం - (బాత్)
36)సబ్బు - (సోప్)
37)సంచి - (బాగ్)
38)పొడి - (పౌడర్)
39)బడి - (స్కూల్)
49)పాఠం - (లెసన్)
50)లెక్కలు -(మాథ్స్)
51)ఎక్కాలు- (టేబుల్స్)
52)సాంఘీకమ్ - (సోషల్)
53)సామాన్య శాస్త్రం -(సైన్స్)
54)చరిత్ర - (హిస్టరీ)
55)అర్ధ శాస్త్రం-(ఎకనామిక్స్)
56)బలపం -(పెన్సిల్)
57) రంగు - (కలర్)
58)సమయం - (టైం)
59)దారి - దోవ- (రోడ్)
60) అమ్మ -(మమ్మీ)
61)నాన్న -(డాడీ)
62)నెల - (మంత్)
63) పిన్ని-అమ్మ- అత్త (ఆంటీ)
64)పెదనాన్న-బాబాయ్ మామ(అంకుల్)

ఇంకా ఎన్నో... అన్నీ రకాల రంగుల పేర్లు, అన్నీ రకాల కూరగాయల పేర్లు, అన్నీ వారాల పేర్లు, అన్నీ నెలల పేర్లు.. చాలా జాగర్తగా కుటుంబ అంతా కలసి చంపేశామ్... మనకు వీలైతే ఇంగ్లీష్ పదం, తెలియక పోతే హిందీ పదం, ఇంకా తెలియక పోతే తమిళ పదం ఐనా వాడతాం కాని.. ఇంకేమి లేకపోతే అప్పుడు తెలుగు పదాన్ని అతి కష్టంగా వాడతాం... ఇంత దారుణమైన భాషా హత్య ఏ భాషలో కూడా జరుగలేదు.. దయచేసి చనిపోయిన పదాల్ని బ్రతికిద్దాం కనీసం మన తర్వాతి తరానికి , భాష కు కొంత ఊపిరి పోద్దాం...

మానవ హక్కులు – నేటి పరిస్థితి

"నీవు పువ్వులను ధ్వంసం చేయగలవేమో కాని వసంతాన్ని ఆపలేవు"

– పాబ్లోనెరుడా, చిలీ దేశకవి.



- ఆచార్య కె.పి.సుబ్బారావు
Emeritus Fellow (UGC),
Dept of Education, Andhra University

ప్రతి సంవత్సరం డిసెంబర్, 10న మానవ హక్కుల దినాన్ని ప్రపంచమంతా జరుపుకుంటుంది. 1948లో ఐక్యరాజ్య సమితి, జనరల్ అసెంబ్లీ ఆమోదించిన మానవ హక్కుల ప్రకటన ఆధారంగా ప్రపంచదేశాలు మానవ హక్కుల దినాన్ని పాటిస్తున్నాయి. అందులో భాగంగా మనదేశం కూడా పాలుపంచుకుంటుంది.

మానవ హక్కులు అంటే మానవులలో సహజంగా ఉండే హక్కులు. మానవ హక్కులను ఎవరు తెచ్చిపెట్టారు. మానవులున్నారుగాబట్టే మానవ హక్కులున్నాయి. మానవ హక్కులను ఈ విధంగానే మనం అర్థం చేసుకోవాలి. "The Rights of Man" రచయిత థామస్‌పైనే హక్కులను మానవహక్కులు, పౌరహక్కులుగా విభజించాడు. మానవ హక్కులంటే సహజంగా ఉండే వని, పౌర హక్కులంటే సమాజంలోని సభ్యులుగా పొందే హక్కులన్నాడు. కాబట్టి మానవ హక్కులు సహజ హక్కుల క్రిందికి వస్తాయి. మానవ హక్కులకు జాతి, కుల, మత, లింగ, ప్రాంతీయ బేధాలుండవు. మానవ హక్కులు మానవులందరికీ వర్తిస్తాయి. ఇవి ప్రపంచంలోని మానవులందరికీ చెందుతాయి. మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే వాటిని నివారించడానికి చట్టాలున్నాయి. అవి ప్రాథమిక హక్కుల రూపంలో ఉంటాయి. ముఖ్యంగా మానవులకుండే స్వేచ్ఛ (Freedom), గౌరవం (Dignity) లాంటి వాటికి ఏరకమైన భంగం కలగ కుండా చట్టాలు పనిజేస్తాయి. అలాగని చట్టాలు ప్రజలకు హక్కులు ఇవ్వలేవు. మానవ హక్కులు, మానవ హక్కుల చట్టాలు ప్రత్యేకమైన కార్యాచరణకు చెందినవి. మానవ హక్కుల ఒడంబడికలలోను, ఒప్పందాలుగా తీసుకు రాబడతాయి. అంతిమంగా వాటిని పరిరక్షించవలసింది అంతర్జాతీయ హక్కుల ఒడంబడికపై సంతకంచేసిన ప్రభుత్వాలదే బాధ్యత.

మానవ హక్కుల ప్రధానలక్షణాలు :

1. మానవ హక్కులు మానవుల గౌరవం, విలువ (worth) మీద ఆధారపడి ఉంటాయి.
2. మానవ హక్కులు సర్వ వ్యాప్తితమైనవి. ఎటువంటి విచక్షణ లేకుండా సమానంగా మానవులందరికి చెందినవి.
3. మానవ హక్కులు మానవుల నుండి విడదీయరానివి. అవి మానవులున్నంతకాలం మానవులతోనే ఉంటాయి.
4. మానవహక్కులు విభజించలేనవి, ఒకదానితో ఒకటి సంబంధం గలవి. ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి.

మానవ హక్కులలోని ప్రధాన అధికరణలు :

అధికరణ – 1. మానవ హక్కుల చట్టం

అధికరణ – 2. జీవించే హక్కు

అధికరణ – 3. అమానవీయంగా, హింసాత్మకంగా, హీనపరిచే విధానాల నుండి స్వేచ్ఛ

అధికరణ – 4. బలవంతపు శ్రమ, బానిసత్వాలనుండి స్వేచ్ఛ


అధికరణ – 5. స్వేచ్ఛ, రక్షణల కొరకు స్వేచ్ఛ

అధికరణ – 6. స్వేచ్ఛాయుత జీవితం

అధికరణ – 7. చట్టాలకతీతమైన శిక్షల నిషేధం.

మానవ హక్కులు – రకాలు

1. పౌర, రాజకీయ హక్కులు : జీవించే హక్కు, స్వేచ్ఛ, సమానత్వం, భావప్రకటనా స్వేచ్ఛ
2. సాంఘిక,



సాంస్కృతిక, ఆర్థికపరమైన హక్కులు

3. సాంస్కృతిక రంగంలో పాల్గొనే హక్కు
4. ఆహారం పొందే హక్కు
5. విద్యను పొందే హక్కు

క్లుప్తంగా హక్కులన్నింటిని పౌర, రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాధారణ అభివృద్ధిలో భాగంగా చూడవచ్చు.

మానవ హక్కుల చారిత్రకనేపథ్యం :

ఐక్యరాజ్య సమితి యొక్క జనరల్ అసెంబ్లీ డిసెంబర్ 10, 1948న మానహక్కుల గురించి అంతర్జాతీయ ప్రకటనచేసింది. ఇది ఐక్య రాజ్య సమితి సాధించిన ఘనకార్యాలలో అతిముఖ్యమైనదని చెప్పవచ్చు. చాలా ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల దినాన్ని ఒక ప్రత్యేక దినంగా పాటిస్తున్నాయి. 1950 జనరల్ అసెంబ్లీ ఈ ప్రకటన [423(V)] చేసిన తర్వాత అన్ని దేశాలను ఆహ్వానించి డిసెంబర్ 10 మానవహక్కుల దినంగా ప్రకటించాలని కోరింది. ఈ రోజును పురస్కరించుకొని విడుదల చేసిన పోస్టల్ స్టాంప్ రెండు లక్షకు పైగా అమ్ముడయ్యాయంటే దాని ప్రాముఖ్యత ఎంతో ఆనాడే అర్థమైంది.

మానవ హక్కుల ప్రకటన రాజకీయ, పౌర, ఆర్థిక, సాంఘిక సాంస్కృతిక హక్కులకు సంబంధించిన ఒక డాక్యుమెంట్. దీనిలో సుమారు అరవది పరికరాలు (Instruments) లతో అంతర్జాతీయ ప్రమాణాలు కల్గివుంది. ఇవి ఇప్పటికీ నిజ జీవితంలో చాలా విశేషంగా ఆదరించబడుతున్నాయి. దీని అత్యున్నతమైన అధికారయుతమైన కేంద్రమైన 'Higher Commission' మానవ హక్కుల దినాన్ని ప్రతీసంవత్సరం జరిగేలా పర్యవేక్షణ చేస్తుంది.

నేటి పరిస్థితిలో మానవహక్కులు :

ప్రస్తుతం మనదేశం తీవ్రమైన సంక్షోభంలో ఉంది. అది మెజారీటి వాదం పేరిట అతిసుందరమైన భావన 'భిన్నత్వంలో ఏకత్వం'ను తుంగలోకి తొక్కే ప్రయత్నం చేస్తుంది. కనీసం ఆ భావననే ప్రశ్నిస్తూంది. ఇది సమాజంలోని వివిధ అస్తిత్వాలను అతలాకుతలం చేస్తుంది. సంస్కృతి, సాంప్రదాయాల పేరిట మతోన్మాదాన్ని ప్రచారం చేస్తుంది. భారతదేశ ప్రత్యేకతలను అణిచివేయడం ద్వారా మెజారిటీరిన్ సంస్కృతిని ముందుకు తీసుకువస్తూంది. ఏం తినాలి, ఏం ధరించాలి, ఎవరిని ప్రేమించాలి, ఏ దేవుణ్ణి పూజించాలో ఏకపక్షంగా నిర్ణయం చేస్తుంది. దేశభక్తి పేరిట విభిన్న ఆలోచనలు కల్గినవారిపై అజమాయిషీ చేస్తూ వారిని రెచ్చగొడుతుంది. ఒకేదేశం, ఒకే సంస్కృతి, ఒకేభాష అంటూ బహుళత్వాన్ని హరించివేయడానికి తీవ్ర ప్రయత్నం చేస్తుంది. ఇలాంటి పరిస్థితులలో ప్రజలకుండే ప్రాథమిక హక్కులు హరించిపోతాయి. ఎందుకంటే మానవహక్కులు రాజ్యాగంలోని ప్రాథమిక హక్కులతో సమానమైనవి. మానవులకు స్వభావికంగా వచ్చిన స్వచ్ఛత, గౌరవం, సమానత లాంటి మానవ హక్కులను తిరస్కరిస్తే ప్రజలు జీవించడం వ్యర్థంగా మారుతుంది. మానవ హక్కులు హరించి వేసేటప్పుడు ప్రజాస్వామిక వ్యక్తులు, సంస్థలు ప్రభుత్వాలతో చర్చలు జరపడంద్వారా, పోరాటాలు చేయడంద్వారా కోల్పోయిన హక్కులను తిరిగి పొందవచ్చు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రతీపౌరుడు గౌరవంగా, స్వేచ్ఛగా జీవించాలని ప్రతిజ్ఞ పూనాలి.



కుల నిర్మూలన - దేశాభివృద్ధి

కోటేశ్వరరావు కనపర్తి, (ఐపియస్ రిటైర్డ్), 8985408906.

మానవులందరు సమానమే అని చెప్పేవారు, నమ్మేవారు, మహాత్మా పూలే అంబేద్కర్ వారసులు, అభ్యుదయవాదులు, క్రైస్తవులు, బుద్ధిస్టులు తమ నిజ జీవితంలో మనుష్యులను మనుష్యులుగా గుర్తిస్తున్నారా? అంటే సామాజిక, ఆర్థిక, వివాహ సంబంధ విషయాల్లో సమానతా, ప్రేమానురాగాలతో ఉంటున్నారా?. దురదృష్టం కొద్దీ మనం ఈదేశంలో పుట్టాం కాబట్టి సంబంధాలన్ని కులంతో ముడిపడి ఉన్నాయి. మన పొరుగువారు, సహ ఉద్యోగి, తోటి ప్రయాణికుడు ఏ కులస్తుడో దానిని బట్టి మన సంభాషణ, ఇతర విషయాలు ఆధారపడి వుంటాయి. తన కులస్తుడైతే కుటుంబ విషయాలు, ఆర్థిక - వ్యాపార విషయాలు, తమ కులంలోని ముఖ్యమైన వ్యక్తులు మరియు పెళ్ళిసంబంధాల వరకు చర్చించు కుంటారు. సంబంధాలు పెంచుకోవడానికి అడ్రసులు, ఫోను నంబర్లు ఇచ్చుకొంటారు. ఇతర కులస్తుడైతే రాజకీయ విషయాలో, ఇతర కబుర్లో చెప్పడం లేదా ముభావంగానో ఉండిపోతారు. తన కులస్తుడు ఎంత దూరం వాడైనా ప్రేమ, జాలి, ఆదరణ చూపిస్తాడు. సహాయం చేయడానికి సిద్ధ పడతాడు. ఈ కుల జబ్బు మహాత్మా పూలే వారసులు, అంబేద్కరిస్టులు, క్రైస్తవులు, బుద్ధిస్టులలో కూడా ఎక్కువగా వుంది. కులాన్ని నిర్మూలించ వలసిన అంబేద్కరిస్టులు, సమానత్వం, ఐక్యత, ప్రేమ ఆయుధాలుగా కలిగిన వుండవలసిన క్రైస్తవులు, బుద్ధిస్టులు తమ తమ మత సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుస్తున్నారు.వారికి కూడా కులమే వివాహ విషయాల్లో ప్రధానంగా కనిపిస్తుంది. వారి ప్రకారం ఆ మతాలకు వ్యతిరేకమైన కులాన్ని పాటిస్తే పరలోకంకు పోలేరు, మోక్షం దొరకదు అని తెలిసినా కులాన్ని పాటిస్తున్నారు. అంటే హిందూ మనువాదంలో కూరుకు పోయారు. వారిలో కులతత్వం అంత బలంగా నాటుకుపోయింది. కులం ఉన్నంత కాలం మనలో ఐక్యత రాదు. రాజకీయ పార్టీలు మన కులాలలోని బలహీనతలను గమనించి వివిధ కులాల మధ్య అనేక వైషమ్యాలు సృష్టించి వారు కలువకుండా అగాధాన్ని, అడ్డుగోడ నిర్మిస్తారు. ఉత్తర ప్రదేశ్లోని కొన్ని ఉప కులాలను విడదీసి బీజేపీ అధికారంలోకి రాగలిగింది. ఉమ్మడి ఏపిలో మాల-మాదిగల మధ్య అగాథం ఏర్పరచారు. అదే విధంగా బీసీల మధ్య అగాథం ఏర్పరచారు. ఐక్యత రానంతకాలం మనం రాజ్యాధికారానికి దూరంగా వుంటాము. మనపై కుల పరమైన దాడులు జరుగుతూనే వుంటాయి. ఆర్థిక పరమైన దోపిడి జరుగుతూనే వుంటుంది. అధికారానికి, అభివృద్ధికి మూలమైన రాజకీయాలలో మనల్ని ఎదగనీయరు. మన వారిలో నుండే పాలక పార్టీలకు అనుకూలంగా చెంచాలను, దళారీలను తయారు చేస్తూనే వుంటారు. మన ప్రజాప్రతినిధులను మన సమస్యలపై మాట్లాడనీయరు. తెల్లదొరల పాలన పోయి 73 సంవత్సరాలు దాటినా మనమూ ఎదగలేదు, మన దేశమూ అభివృద్ధి చెందలేదు. అభివృద్ధి చెందినదల్లా మెజారిటీ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, కమ్మ, రెడ్డి, వెలమ కులాలవారే.

మనమేమి చేయాలి?. కులాల వలన మనలో ఐక్యత లేదు. రాజ్యాధికారంతో కులాన్ని నిర్మూలించ వచ్చు. నీవు అధికారంలోకి రావడానికి కులం ముఖ్య అడ్డుగోడ. ఐక్యత లేనందున అధికారం, రాజ్యాధికారం మనకు లేదు. రాజ్యాధికారం లేనందున మన అభివృద్ధి, దేశాభివృద్ధి జరగలేదు. మనలో ఐక్యత సాధించడానికి మన వైషమ్యాలకు కారణమైన కులాన్ని కొంత వరకైనా నాశనం చెయ్యాలి. కులాంతర వివాహాలు కొంత మేర ఐక్యతను ఏర్పరుస్తాయ్. కులాన్ని నాశనం చేసే శక్తి యువకులకే వుంది. మహాత్మా పూలే, నారాయణగురు, సాహూమహారాజ్, పెరియార్, అంబేద్కర్, కాన్షీరామ్ మున్నగు మహాపురుషుల ఆశయాలను నమ్మే యువకులు ఉప కులాంతర, కులాంతర వివాహాలు చేసుకోవాలి. పెద్దలు కులాంతర వివాహాలు ప్రోత్సహించాలి. పాలక కులాలు మన ఐక్యతను చెడగొట్టడానికి అనేక కుట్రలు, ప్లానులు వేస్తారు కాబట్టి కులాంతర వివాహాలు జరపడం ఇతర కార్యక్రమాలతో పాటు ఒక కార్యక్రమంగా చేపట్టాలి. దానికి ఒక మ్యారేజి ప్లాట్ ఫామ్ వుండాలి. అందు కోసం ఎలాంటి ఫీజు లేకుండా ఫ్రీగా మ్యారేజ్ బ్యూరో నేను నిర్వహిస్తున్నాను. దాని పేరు adarshaintercastemarriages.com (AIM). ఈ సైట్లో కులాంతర వివాహాల లక్ష్యము, కులాంతర వివాహాలు చేసుకున్న ప్రముఖుల పేర్లు, కులాంతర వివాహాలకు ముందుకు వచ్చిన వారి ఫొటోలు పెట్టడం జరిగింది. కులాన్ని కులాంతర వివాహాల ద్వారా నిర్మూలించాలి, భారత సమాజాన్ని బాగుచేయాలనుకునే యువకులు ఈ మ్యారేజ్ బ్యూరోలో మీ వివరాలు పంపి ఫ్రిగా రిజిస్టరు చేసుకోవచ్చు. అందు కోసం మీ పేర్లు, అడ్రస్, వయసు, చదువు, జాబ్, ఫొటోలు నాకు వాట్సప్లో పంపండి. అందరూ సంతోషంగా ఉండే అసమానతలు లేని సమసమాజం కోసం ఈ బ్యూరో ఫ్రీగా నిర్వహించడం జరుగుతుంది. వివాహాల అనంతరం కూడా ఈ బ్యూరో ఆ వధూవరులతో ఫోన్ ద్వారా కానీ, అపుడపుడూ గెట్టుగెదర్ మీటింగులు నిర్వహించడం ద్వారా వారి క్షేమ సమాచారం తెలుసు కోవడం జరుగుతుంది.

కులాంతర వివాహాలు మన మధ్య వైషమ్యాలు, అనుమానాలు పోగొడ్తాయి. సోదరబావం, మనమందరం మనుషులం అనే తత్వం ఏర్పడుతుంది.

ఐక్యతకు మార్గమేర్పడుతుంది.

ఇదొక చిన్న కార్యక్రమం మాత్రమే. దీనిలో భాగంగా మీకు తెలిసిన వారు ఎవరైనా కులాంతర, ఉప కులాంతర వివాహాలు గతంలో చేసుకున్నా ఆ భార్యా భర్తలను ఏదైనా సందర్భంలో సన్మానించండి. కులాంతర వివాహాలు చేసుకున్న వారి పేర్లు, వారి ఫోను నంబర్లు నాకు పంపించండి. అవి మన కార్యక్రమాలకు ఉపయోగపడ్తాయి. మన మహా పురుషులైన మహాత్మా పూలే, నారాయణగురు, పెరియార్, అంబేద్కర్, కాన్షీరామ్ మరియు ఇతరులు మనకు అందించిన వారిజీవిత మార్గాలు, వారి ఆలోచనలు అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. అనైక్యత వలన రాజకీయంగా, ఆర్థికంగా మన పీడిత వర్గాల ప్రజలు ఎంత నష్టపోతుందీ వివరించాలి. తద్వారా మన ప్రజల మధ్య ఐక్యత సాధించాలి. ఈ ఐక్యత రాజ్యాధికార సాధనకు,దేశాభివృద్ధికి పునాది కావాలి. ఈ రాజ్యాధికారం అన్ని వర్గాల ప్రజలు సుఖంగా, సంతోషంగా జీవించడానికి, అభివృద్ధి చెందడానికి, అసమానతలు లేని సమాజ నిర్మాణానికి పయోగించాలి. రాజ్యాధికార ఫలాలు కొన్ని కులాలకు, వర్గాలకు కాకుండా అన్ని కులాలకు వారి వారి జనాభా ప్రాతిపదికన అందాలి. సామాజిక న్యాయం, కుల రహిత సమసమాజం మన దేశంలో నెలకొనే వరకు రాజ్యాధికార ఫలాలు అన్ని కులాల ప్రజలకు జనాభా ప్రాతిపదికన అందాలి. అభివృద్ధి చెందిన దేశాలు ఆ స్థాయికి వెళ్ళాయంటే ఆ దేశ పాలకులే కారణం. సింగపూర్ దేశానికి భూగర్భవనరులు లేవు. భూమి ఆ దేశానికి సరిపోయినంత లేదు. అయినప్పటికీ ఆ దేశం ప్రపంచంలో అత్యత ధనిక దేశం. కులాలకు ప్రాధాన్యమిచ్చే మన పాలకుల వలన 73 సంవత్సరాల తర్వాత కూడా మన దేశం పేద దేశంగానే వుండి పోయింది. దేశాన్ని అభివృద్ధి చేయడం కూడా సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలి. అంటే అందరి శ్రేయసుకోరే

ఎమ్మెల్యే, యంపిలు, సర్పంచ్లు, యంపిపిలను ఎన్నకోబడే విధంగా చూడాలి. ఇది రాజకీయం అనుకోటం పొరపాటు. సమస్యను సరిగా అర్థం చేసుకోకపోవడం అవుతుంది. రాజ్యాధికారం ప్రతి దేశానికి "మాస్టర్ కీ". ఈ మాస్టర్ కీ ద్వారా అన్ని సమస్యలు పరిష్కరించి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా, సూపర్ పవర్గా తయారు చేయవచ్చు. అందుచే మంచి పాలకులను దేశానికి అందించడం అందరి సామాజిక భాధ్యత. అందరి శ్రేయసు కోరే మంచి పాలకులు అంటే ఎమ్మెల్యే, యంపిలు గెలిచినపుడు సమాజానికి మంచి జరిగి, దేశం అభివృద్ధిచెందును.

మన సమాజం, మన దేశం అభివృద్ధి కోసం ఐక్యత సాధించాలి. ఐక్యత రావాలన్నా, సమాజ, దేశ పరిస్థితులు తెలియాలన్నా మహాత్మా పూలే, నారాయణగురు, సాహూ మహారాజ్, పెరియార్, అంబేద్కర్, కాన్షీరామ్ మున్నగు మహాపురుషుల జీవితాలను, వారి ఆలోచనలను అన్ని గ్రామాలు, పట్టణాల ప్రజల్లోకి తీసుకు పోవాలి. ఈ కార్యక్రమాలను యువకులు తమ మధ్య వున్న విభేధాలు విడచిపెట్టి శాశ్వత ప్రయోజనాల కోసం, అందరి శ్రేయసు కోసం అన్ని చోట్ల చేపట్టాలి. 73 సంవత్సరాలుగా మన పీడిత వర్గాల నాయకులు 85% పైగా వున్న పీడిత కులాల ప్రజలను అభివృద్ధి చేయడంలో, వారి మధ్య ఐక్యత తీసుకు రావడంలో, తెలుగు రాష్ట్రాలలో మరియు దేశంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారు. మహాత్మా పూలే, అంబేద్కర్ ఐడియాలజీ వున్న యువ నాయకులను తయారు చేయాలి. దీనిని చదివిన ప్రతి ఒక్కరూ కుల నిర్మూలనకు-అసమానతలు లేని సమాజ నిర్మాణానికి తద్వారా దేశాభివృద్ధికి, పీడిత కులాల అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కులాంతర వివాహాల ప్రోత్సాహిస్తూ సహకరించాలని నా విన్నపం. మరియూ మీ అమూల్య సలహాలు ఇవ్వగలరని నా మనవి.

☺☺☺☺☺

వాట్సాప్.. సరికొత్త ఫీచర్లు

కె.గౌతం



మెసేజింగ్కు సరికొత్త అర్థాన్ని ఇస్తూ ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందికి చేరువైంది. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తోంది. తాజాగా యూజర్స్ కోసం మరిన్ని మెరుగైన ఫీచర్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. వీటిలో కొన్ని ఇప్పటికే యూజర్లకు అందుబాటులోకి రాగా, మరికొన్ని బీటా దశలో ఉన్నాయి. వేర్వేరు డివైజ్‌లలో... ఈ ఫీచర్ కోసం చాలా మంది ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ డివైజ్‌లలో లాగిన్ అవ్వాలనుకునే వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మొబైల్‌తో పాటు డెస్క్ టాప్‌లో లాగిన్ అయ్యేందుకు మాత్రమే అవకాశం ఉంది. త్వరలో అందుబాటులోకి రానున్న మల్టీ డివైజ్ సపోర్ట్ ఫీచర్‌తో ఒకేసారి వేర్వేరు డివైజ్‌లలో లాగిన్ అవ్వచ్చు. అలా ఒకేసారి మెసేజ్‌లను వేర్వేరు డివైజ్ లలో చూసుకోవడంతో పాటు, అంతకముందు మీరు మార్క్ చేసిన స్టార్ మెస్సేజ్‌లు, ఆర్కైవ్ చాట్స్ కూడా కొత్తగా లాగిన్ అయిన డివైజ్‌లో సింక్ అవుతాయి. 50 మందితో.... గూగుల్ మీట్, జూమ్ యాప్ తరహాలో వాట్సాప్ కూడా ఒక వీడియో కాల్‌లో ఒకే సారి 50 మందితో మాట్లాడుకునే ఫీచర్‌ని అందుబాటులోకి తీసుకురానుంది. అలానే గ్రూప్ క్రియేట్ చేసి, ఇతరులను వాట్సాప్ వెబ్ లేదా డెస్క్ టాప్ నుంచి ఇన్ వైట్ చేసుకోవచ్చు. ఎమోజీలతో తమ భావాలను వ్యక్తపరిచే వారి కోసం కొత్తగా 138 ఎమోజీలను వాట్సాప్ తీసుకొస్తోంది. యానిమేటేడ్ స్టిక్కర్లు.. ప్రస్తుతం ఇవి వాట్సాప్ ఆండ్రాయిడ్ బీటా వెర్షన్ యాప్ ఉపయోగించే వారికి మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటిలో చెఫ్, ఫార్మర్, పెయింటర్ తో ఇతర వృత్తులకు చెందిన ఎమోజీలనూ ఇస్తున్నారు. అలానే కొత్తగా నాలుగు యానిమేటేడ్ స్టిక్కర్ ప్యాక్స్‌ను కూడా యూజర్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మ్యూట్ ఫీచర్ .. మనలో చాలా మంది ఒకటి కంటే ఎక్కువ వాట్సప్ గ్రూపుల్లో సభ్యులుగా ఉండే ఉంటారు. వాటిలో కొన్ని మనం తరచుగా ఉపయోగించేవి అయితే, మరికొన్నింటిలో సభ్యులుగా ఉన్నప్పటికీ చురుగ్గా వ్యవహరించం. అటువంటి వాటిని మ్యూట్‌లో పెడుతుంటాం. అయితే మ్యూట్ ఫీచర్ లో ఇప్పటి దాకా 8 గంటలు, ఒక వారం, ఏడాది పాటు మ్యూట్ చేసుకునే అవకాశం మాత్రమే ఉంది. ఇక మీదట పూర్తిగా అంటే మీరు అన్ మ్యూట్ చేసేవరకు గ్రూప్ నోటిఫికేషన్స్‌ను మ్యూట్ చేసుకునే సదుపాయం అందుబాటులోకి తీసుకురానుంది వాట్సాప్..కోడ్ ఎవరైనా కొత్త వ్యక్తుల ఫోన్ నంబరు మన కాంటాక్ట్ లిస్ట్‌లో సేవ్ చేసుకోవాలంటే వాళ్ల ఫోన్ నంబర్, పేరు టైప్ చేసి యాడ్ చేసుకోవాల్సి ఉంటుంది. దీనిని మరింత సులభతరం చేస్తూ వాట్సాప్ క్యూఆర్ కోడ్ ఆప్షన్‌ని అందుబాటులోకి తీసుకొచ్చింది. మనం ఏ వ్యక్తి ఫోన్ నంబర్ సేవ్ చేసుకోవాలనుకుం టున్నామో వారి వాట్సాప్ లో సెట్టింగ్స్ లోకి వెళ్లి అక్కడ ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే వారి ఫోన్ నంబర్, పేరు మీ ఫోన్‌లలో సేవ్ అవుతుంది. గ్రూప్ కాలింగ్.. ఇప్పటి వరకు 8 మంది ఒకేసారి మాట్లాడుకునే సదుపాయం ఉంది. ఈ గ్రూప్ కాలింగ్‌లో ఎవరు మాట్లాడుతున్నా స్క్రీన్ పై అందరి ముఖాలు ఒకే సైజులో కనిపిస్తాయి. దాని వల్ల ఎవరైతే మాట్లాడుతున్నారో వారిపై దృష్టిపెట్టడానికి అవకాశం ఉండదు. ఇక మీదట మాట్లాడే వ్యక్తిని హైలెట్ చేసే విధంగా కొత్త ఫీచర్‌ను పరిచయం చేయనుంది వాట్సాప్. ఇందు కోసం గ్రూప్ వీడియో కాల్‌లో మాట్లాడే వ్యక్తి విండోపై ప్రెస్ చేసి హోల్డ్ చేస్తే వారి విండో పెద్దదిగా కనపడుతుంది. దాంతో మిగతావారి దృష్టి సదరు వ్యక్తిపైనే ఉంటుంది. అలానే గ్రూప్ లో ఉన్న వారితో (ఎవరైనా ఎనిమిది మంది మాత్రమే) వీడియో కాల్ చేసేందుకు కొత్తగా వీడియో ఐకాన్ ను యాడ్ చేసింది.

☺☺☺☺☺

సమకాలీన సమాజిక స్పృహ గల పద్యకవి మల్లవరపు రాజేశ్వరరావు

"ప్రకాశం జిల్లా సాహిత్య చరిత్రలో మల్లవరపు జాన్ గారిదొక మధురమైన అధ్యాయం. భావకవి నాయని సుబ్బారావు తర్వాత ఈ జిల్లాలో పద్యానికి ప్రాభవం తెచ్చిన పరిమళం జాన్ కవిత్వానికుంది. అతుకుల బ్రతుకులను ఆరవేసినా, సరస వినోదాలు నూరి పోసినా, సూక్తులను ఏరి కోసినా - జాన్ కవిత్వమై ప్రవహిస్తాడు తప్ప పాండిత్యం కోసం పరిమళం తలుపు తీయడు. చీమకుర్తి కొండ కదలదు. చీమకుర్తి కదలదు. కదలకుండా ఉన్నచోటే బాచాపట్లేసుకుని ఉదాత్తమైన కీర్తిని మూటగట్టుకునే వైనం చీమకుర్తి కొండకీ తెలుసు- జాన్ కవి గుండెకీ తెలుసు. ఇటువంటి జాన్ కవిగారి కుమారుడు రాజేశ్వరరావు కూడా కవే. అలాగే రాజేశ్వరరావు గారి ఇద్దరు కుమారులు ఒకరు కవిగా మరొకరు చిత్ర కళాకారుడిగా కళా ప్రావీణ్యం సాధించారు" అని ప్రసిద్ధ కవి డా.నాగభైరవకోటేశ్వరరావు ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు.



డాక్టర్ ఎం.మంజుశ్రీ,
అసిస్టెంటు ప్రొఫెసరు, తెలుగు శాఖ,
తారా ప్రభుత్వ డిగ్రీ, స్నాతకోత్తర కళాశాల, సంగారెడ్డి, తెలంగాణ
ఫోను: 9958626733

సమకాలీన సాహితీ వేత్తలతో ప్రశంసలు పొందుతూనే, సమాజానికి అవసరమైన ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించిన గొప్ప కవి మల్లవరపు రాజేశ్వరరావుగారు. తన తండ్రి జాన్ కవి గారి పద్య వారసత్వాన్ని కొనసాగిస్తూనే, తనదైన ప్రత్యేకతతో గేయాన్ని, నాటకాల్ని, వచన సాహిత్యాన్ని రాసిన కవి. ఆయన 17 డిసెంబరు 1949 వ తేదీన ప్రకాశం జిల్లాలో జన్మించారు. ఇటీవలే బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో జాన్ కవి గారి స్మృత్యర్థం ఒక జాతీయ సదస్సుని నిర్వహించారు. ప్రతి యేడాదీ మల్లవరపు జాన్ కవిగారి పేరు మీదుగా ప్రసిద్ధులైన సాహితీవేత్తలకు పురస్కారాల్ని ప్రకటించి, ఘనంగా సన్మానిస్తున్నారు. ఆయన రాసిన సాహిత్యం సంప్రదాయానికీ, ఆధునికతకూ సమన్వయం చేస్తూ ఒక చక్కని సాహిత్య వారధిని కొనసాగిస్తుంది. అందువల్ల సాహిత్య అభిమానులు ఆయన జయంతోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న సందర్భంలో ఆయన సాహిత్యాన్ని ఒకసారి గుర్తు చేసుకుందాం. మల్లవరపు రాజేశ్వరరావుగారి కలం నుండి పద్యకావ్యాలు, శతకాలు, కవితా ఖండికలు వెలువడ్డాయి. వీటిలో జీవనది కవితాఖండిక వీరికి ఎంతో పేరుతెచ్చింది. ముంతాజ్ మహల్ (2000) పద్యకావ్యం అనేకమంది సాహితీవేత్తల ప్రశంసలు అందుకుంది. భక్తయోబు, అనాథ గంగ, ఎయిడ్స్ మహమ్మారి, బాలగేయాలు, హన్నా, కాళింది, రజయ ప్రణయం, ఎస్తేరు రాణి మొదలైన రచనలు చేశారు. మల్లవరపు శతకం (2013) సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించేలా ఉంటుంది. ఈయన రాసిన జీవనది (2009) కావ్యంపై ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారి పర్యవేక్షణలో తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయంలో వరకుమార్ అనే పరిశోధకుడు ఎం.ఫిల్ పరిశోధన చేశారు.

కాల ప్రవాహము ఆగదు
కాలముతో నదియు సాగు కలకాలము సౌ
ఖ్యాలను గను మానవ దీ
పాలను తనలోన దాచి పాఱుచునుండున్ (జీవనది, పుట: 114)

అంటూ సాగిన జీవనది కావ్యం ఎంతో విశిష్టమైందంటూ ప్రముఖ పద్యకవి ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారు జీవనది పేరును ధరించిన ఈ ఖండ కావ్య సంపుటికి మొట్టమొదట చెప్పుకోదగినదినామౌచిత్యం. ఈ ఖండ కావ్య సంపుటిలో వస్తు వైవిధ్యం, పద్య శిల్ప చమత్కృతి తగిన పాళ్ళలో ఉన్నాయి. తెలుగు పద్యం తీయందనాలరాశి అయితే ఎందరో కవులు తమ తమ కవిత నిర్మాణ సామర్థ్యం చేత, ప్రయోగ పారీణత చేత ఆరంగంలో బంగారు పంటలు పండించారు. ఒక్కో కవిది ఒక విలక్షణ రీతి, ఒక విశిష్ట శిల్ప విన్నాణ రీతి. ఇది నన్నయకజీవనదిలా అనవరతంగా సాగివస్తున్నది అటువంటి తెలుగు పద్య సాహిత్యానికి రాజేశ్వరరావు తన ఈ కృతిని మరొక సత్కృతిగా సమర్పిస్తున్నార" అన్నారు. ఈ కావ్యాన్ని ప్రముఖ జానపద సాహితీవేత్త ఆచార్య తంగిరాల సుబ్బారావుగారు కూడా దీన్నొక రసతరంగిణిగా భావించారు. ఈయన రాసిన 'మల్లవరపు శతకం' సాహిత్య విలువలతో పాటు, సమకాలీన సమస్యల్ని ప్రతిబింబించిందని సాహితీవేత్తలు ప్రశంసించారు. బాలసాహిత్యంలో ఉత్తమ సాహిత్యాన్ని అందించే పాఠ్యావాచకాలు రూపొందించే కార్యక్రమానికి సహ సంపాదకులుగా కూడా వ్యవహరించారు. మధుర సాహిత్య భారతి సాంస్కృతిక సంస్థ ద్వారా కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ఉత్తమ సాహిత్య సృష్టి కర్తలను ప్రోత్సాహించేవారు. "తాజ్‌మహల్" నిర్మాణంలో సామాన్య ప్రజల దృష్టికోణంతో తాజ్ మహల్ కావ్యాన్ని రాశారు.

రాళ్లు మోయగలేక నిర్మాణమందు
మండుటెండలు దహియింప-మరణశయ్య
కొయ్యలకు బలియైరి, యేగొంతులెండి
పోయెనోగద! కార్మిక పుత్రుకలకు (పుట: 35)

ఈ కావ్యంలో షాజహాన్ - ముంతాజ్‌ల ప్రణయగాథను వర్ణించడంతోపాటు, ఆ నిర్మాణానికి చక్రవర్తి ప్రజల్ని అష్టకష్టాలకు గురిచేసిని బాధించిన తీరును వర్ణించడం ఒక విశేషం. షాజహాన్ వారసులైన దారాషికో, ఔరంగజేబు, రోషనార, జహనారల గురించి వారి మధ్య జరిగిన రాజ్యాధికార సంఘర్షణలను కూడా ఈ పద్యకావ్యంలో వర్ణించారు కవి. ఈ కవి కంటే ముందే ఎంతోమంది తాజ్ మహల్ గురించి సాహిత్యాన్ని రాశారు. గుఱ్ఱం జాషువా, శ్రీశ్రీలు శ్రామిక కోణం నుండే తాజ్ మహల్ నిర్మాణాన్ని చూశారు. అలాగే, రాజేశ్వరరావుగారు కూడా తాజ్ మహల్ కావ్యాన్ని వర్ణించారు. మల్లవరపు రాజేశ్వరరావు ఈ ప్రేమేతిహాసానికి ఒక వైపు చారిత్రక నేపథ్యాన్ని సరిచూసుకుంటూ మరో వైపు కమనీయ వర్ణనలను సంతరిస్తూ షాజహాన్ ముంతాజుల అనురాగానికి కావ్యరూపం కలిగించారని డా.సి.నారాయణ రెడ్డి ఈ కావ్యం గురించి వ్యాఖ్యానించడం ఈ కావ్యం గొప్పతనం తెలుపుతుంది.

"ఎస్తేరు రాణి" గేయకావ్యాన్ని మాత్రాఛందస్సులో బైబిల్ లోని ఒకకథను తీసుకొనిరాసినా, ఎంతోరసభరితంగా సాగింది. "ఎస్తేరు" యూదా జాతిస్త్రీ.. బెన్యామీను గోత్రానికి చెందిన అబీహాలూయి కుమార్తె బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి పెద్ద తండ్రి "మొర్దెకై" దగ్గర పెరుగుతుంది. పారశీక దేశపు రాజు "అహష్వేరోషు" తన మొదటి భార్య అయిన "వష్తీరాణి" యొక్క పొగరుబోతుతనాన్ని భరించలేక ఆమెను వదిలివేస్తాడు. తర్వాత ఎంతో అందగత్తె, అందంతో పాటు చొరవ, ధైర్యం, సమయస్ఫూర్తిని గమనించి ఆమెను వివాహం చేసుకొంటాడు. అప్పటి నుంచి ఎస్తేరు భర్తతో మిక్కిలి ప్రేమానురాగాలతో ఉంటూ భర్తకు ప్రీతిరాలుగా ఉండేది. దీన్ని కవి ఇలా వర్ణించారు."కువల యేక్షణ చూడ్కుల/ కూరిమి వెన్నెల కురియక/కరకమలముల గొని ముద్దు/కురిపె ధవుడను రాగమున (ఎస్తేరు రాణి అముద్రిత కావ్యం). ఇది మాత్రాఛందస్సులో పాడుకోవడానికి వీలుగా చక్కని గేయంలా అనిపిస్తుంది. రాజు గారి దగ్గర ప్రధాన మంత్రిగా ఉన్నటువంటి "హమాను" కుటిలబుద్ధితో పారశీక దేశంలోని మొత్తం యూద జాతిని సమూలంగా నాశనం చేయాలనుకొంటాడు. ఎస్తేరు రాణి పెద్ద తండ్రియైన మొర్దెకైని ఉరి తీయించడానికి ఉరికొయ్యను కూడ తయారు చేయించి రాజు ఆజ్ఞకై నిరీక్షించి వుంటాడు. "హమాను" కుటిల నీతిని గ్రహించిన ఎస్తేరు. తన సమయస్ఫూర్తితో, వినయ విధేయతలతో భర్త అనుగ్రహం పొంది

'హమాను' కుటిల బుద్ధిని రాజుకు తెలిసేలా చేసి 'హమాను'ను ఉరి తీయిస్తుంది. తర్వాత తన పెద్ద తండ్రి మొర్దెకైని ప్రధాన మంత్రిగా నియమించి మొత్తం తన యూదాజాతిని కాపాడుకొంటుంది. ఆ విధంగా ఒక స్త్రీ ఒక జాతిని ఎలా కాపాడిందనే కోణాన్ని వర్ణించి, స్త్రీ అభ్యుదయాన్ని, బైబిల్ లోని అనేక పార్శ్వాల్ని ఆలోచింపజేశారు కవి.

యోబు గ్రంథంలోని కథను తీసుకొని, కష్టనష్టాలు వచ్చినా, తన విశ్వాసాన్ని వీడకూడదని చెప్పే గొప్ప కథగా భక్త యోబు చరిత్ర గేయకావ్యాన్ని రాశారు. యోబు ఐశ్వర్యవంతుడు,దైవం పట్ల భక్తివిశ్వాసాలు గలవాడు. అతడి భక్తిని పరీక్షించడానికి సాతాను అనేక ప్రయత్నాలు చేసి విఫలమవ్వడం, విశ్వాసానికి ప్రతీకగా యోబు ఎలా నిలిచాడో ఈ కావ్యంలో వర్ణించారు. చినుకు వాన తడిసి ఆకులు/శిథిలముగ జీర్ణించి పోదా!/ఇంతకంటెను యేమి చెప్పుదు/ చింతలను సృష్టించి నంతనె/చీకాకు రగిలించినంతనె/వ్యాకులుండై అసత్యమాడు/ శోక జలధిని మునింగి పోవు/మోక్షనాధుని వీడిపోను" అని భౌతిక ప్రపంచానికీ, ఆధ్యాత్మిక ప్రపంచానికీ మధ్య గల భేదాల్ని చెప్పి, శాశ్వత సత్యాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తాడు యోబు. తన సర్వస్వాన్నీ కోల్పోయినా దైవాన్ని నిందించని సంయమనం మనం నేర్చుకోవాలనేది ఈ కావ్యం అందించే నీతి. ఉపాధ్యాయుడిగా పనిచేసిన మల్లవరపు రాజేశ్వరరావుగారు పాఠశాల పిల్లలకు పాఠ్యాంశాలు కాదగిన రచనలెన్నో రాశారు. వాటిలో బాలగేయాలు పేర్కొనదగినవి. అమ్మ ఒడిలో నాకు/ కమ్మగా వుంటుంది/అయ్య మదిలో నాకు/తియ్యగా వుంటుంది/ తాత ఒడిలో నాకు/తాయముంటుంది/అవ్వ సంచిలో నాకు/అటుకులుంటాయి. ("అమ్మఒడి)

దీపాలు దీపాలు/దివిలోని రూపాలు/ఇలలోని దీపాలు/పసిపాప రూపాలు/ అమ్మనాన్నల ప్రేమ/లపురూప తేజాలు/భువిలోన వెలిగెడి/భూరి ప్రతిరూపాలు (దీపాలు- దీపాలు)"

పున్నమి పువ్వులు/పూచిన కలువలు/వెన్నెల విరిసిన/వేడి నిట్టూర్పులు/మాపాప అందాలు/మా యింటికానందాలు (అందాలకు ప్రతిరూపం)

చందమామ నాకన్న/చక్కనైనదా అమ్మ/చందమామ నాకంటె/అందమైనదా అమ్మ/చల్లనైన వెన్నెలలో/మల్లెపూలు పూస్తుంటే/ మల్లెకన్న నానవ్వే/ మధురమైనదోయమ్మ.....(చందమామ)

ఇలాంటి గేయాలెన్నో రాజేశ్వరరావుగారు రాయడంలో తాను పాఠాలు బోధించిన అనుభవం, వారికి కావలసిన సాహిత్యం ఏమిటో తెలియడం వల్ల భాష, భావం పాఠశాల స్థాయిలో ఉండాల్సిన విధంగా ఉంది. రాజేశ్వరరావుగారు రాసిన 'మల్లవరపు శతకం'లో సామాజిక సమస్యల్ని వర్ణించారు. 'మతము లన్నియు జనుల హితమునే కూ ర్చును/ సత్యము వాని నమ్మి సాగువారి/ బ్రతుకులందు శాంతి భావాలు వెలుగొందు/ మల్లవరపు మాట మల్లెమూట' అని మతం ప్రజలకు హితాన్ని కలిగించి ముందుకు తీసుకుపోవడానికి ఒక మార్గంగా ఉండాలని ధ్వన్యాత్మకంగా ప్రబోధించారు.సమాజంలో జీవిస్తున్న బాధ్యతాయుత మైన కవిగానీ, కళాకారుడు గానీ తన చుట్టూ జరుగుతున్న వాటికి స్పందించడంలో 'కళాత్మకత' ఉంటుం ది. అది బయటకొచ్చే వరకు 'పురిటి నొప్పులు' భరించాల్సిందే నన్నట్లుంటుంది. కొన్నిసార్లు 'గుండెగొంతులో కొట్లాడుతూనే ఉం టుంది. నిలబడనీయదు. అందరి లో ఉన్నా ఒంటిరిని చేస్తుంది. ఒంటరిగా ఉన్న సమూహాన్నీ చేస్తుంది. అది బయటకొచ్చిన తర్వాత కవి గొప్ప రిలీఫ్ పొందుతాడు. కవి మల్లవరపు రాజేశ్వరరావు అటువంటి 'తల్లి'గురించి 'కనెడి వేళ తల్లి కష్టంబు పడునెంతొ/ కాన్పులైన పిదప కలత మరచు/ హత్తుకొనును బిడ్డ పొత్తిళ్ళలో నుంచి/మల్లవరపు మాట మల్లె మూట'. అని వర్ణించడంలో ఏంతో ఔచిత్యం కనిపిస్తుంది.

జీవనది కావ్యం వీరి సాహిత్య కృషికి నిలువెత్తు రూపంగా కనిపిస్తుంది. దీనిలో సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలెన్నో వర్ణించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని, భారతదేశ కీర్తి ప్రతిష్టల్ని, నాయకుల్ని, దళిత సమస్యల్ని, స్థానిక దేవతల్ని అనేక పార్శ్వాల్లో వర్ణించారు. ఒక్క ఉదాహరణ చూద్దాం

"పచ్చనైన పల్లె పట్టున వసియించి/ పల్లె మట్టి పీల్చి బ్రతుకు నాకు/మాతృభువిని విడి విమానమ్ముపైనెక్కి/అన్యదేశమేగు టవసరంబె? అని మాతృదేశాన్నీ, పల్లెల్నీ కీర్తించిన కవి " పెక్కు దైవాల సుక్షేత్ర పృథివి వీడి/ధవుని వెనువెంటనరుగు నాత్రంబు లేదు/ముక్తి మార్గంబు దొఱకు ప్రమోద భరిత/భరత ధాత్రిని వీడ నాతరముగాదు" (పుట: 37) అన తన దేశం పట్ల అభిమానాన్ని ప్రకటిస్తారు.

మల్లవరపు శతకానికి ప్రముఖ విమర్శకుడు డాక్టర్ నూకతోటి రవికుమార్ అభిప్రాయం రాస్తూ"తెలుగు సాహిత్యంలో శతక ప్రక్రియ "శివకవి యుగం" నుంచి ప్రారంభమైంది. ఈ శతక ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రజల మన్ననలను పొందుతూనే ఉంది. అక్షర జ్ఞానంలేని సామాన్యులను సహితం విజ్ఞానాన్ని పంచి పెట్టగలిగేటువంటివి శతకాలు. ఇటువంటి శతకాలకు ఉదాహరణగా "వేమన శతకం" సుమతీ శతకం. భాస్కర శతకం వంటి శతకాలని చెప్పుకోవచ్చు. పద్యాల సంఖ్య, వృత్త నియమం, భాష నియమం, మకుట నియమం శతకానికి బాహ్య లక్షణాలు. చివరి పాదం అయినా "మకుటం" శతకాన్ని ప్రజల మనస్సులోకి తొందరగా చేరవేస్తుంది. సాహిత్య అభిమానులకు ఒక పెన్నిధిలా ఎదిగిన ఈ ప్రక్రియ సమాజంలోని ప్రతి సామాజిక సందర్భాన్నీ తనలో గర్భీకరించుకుంటూ జాతి జీవన నాడిగా ఎదిగింది. శతకంలో ఆత్మాశ్రయ స్వభావంతో కవి సామాజిక దృక్పథాన్ని చాటి చెప్పడమనేది అంతర్నిర్మాణ లక్షణంగా ఉండడం వల్ల తాను చూసిన దానిని, భావించిన దానిని అనుభవించిన దానిని సూటిగా ఎదుటివారికి వివరించి చెప్పడానికి ఈ ప్రక్రియలో మరింత అవకాశం ఉందన్నారు. ఆవిధంగానే డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలోనే కాశీలోని హిందూ విశ్వవిద్యాలయంలో శతకసాహిత్యంపై వీరి స్మృత్యర్థం జాతీయ సదస్సు కూడా నిర్వహించారు.

తెలుగుసాహిత్యంలో మల్లవరపుకవులుగా వీరి కుటుంబం పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటుందని ప్రముఖ సాహిత్య విమర్శకుడు ఆచార్య దార్లవెంకటేశ్వరరావు "మల్లరపుశతకా"నికి రాసిన ముందుమాటలో ప్రశంసిస్తూ ఇలా అన్నారు. "మృదువైనశబ్దాలతో, పదున్కెన భావాల్ని మధురమైన కవిత్వంగా అందిస్తున్న కవి మల్లవరపు రాజేశ్వరరావుగారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఇప్పటికే తనకంటూ ఒకస్థానాన్ని పదిలపర్చుకున్న ఈయన పద్యకవిగా ఎంతగానో ప్రసిద్ధులు. పద్యాన్ని రాయడంతోపాటు దాన్ని భావ, రాగయుక్తంగా ఆలపించడంలో కూడా తనద్కెన ఒక ప్రత్యేక ముద్రను సొంతంచేసుకున్న కవి. మల్లవరపు జాన్ కవిగారి వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని పోతనలోని మాధుర్యాన్ని, కరుణశ్రీలోని మృదుత్వాన్ని, వేమనలోని వస్తు లంకారాలతో సత్యాన్ని సామాన్యులకు కూడా అందించగల నేర్పునీ, జాషువాలోని సామాజిక స్పందన్నీ ఏకోన్ముఖంగా మనకి అందించగల కళాన్కైపుణ్యమీయన కవిత్వంలో కనిపిస్తుంది.ఈయన కుమారులు సుధాకరరావు, ప్రభాకరరావులు కూడా బలమైన వ్యక్తీకరణతో వచనకవిత్వాన్ని దీప్తిమంతం చేస్తున్నారు. అందుకనే కవిత్వ విద్యను తన వారసులకు కూడా అందించి సాహిత్యంలో "మల్లవరపు కవులు" అనే ఒక అధ్యాయానికి కావాల్సినంత కృషిని చేశారని అనగలుగుతున్నాను." వీరి సాహిత్యాన్ని గమనిస్తే ఈ మాటలు అక్షరసత్యాలని అనిపిస్తుంది.

రాజేశ్వరరావు గారు 1997వ సంవత్సరంలో ప్రకాశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా 2007వ సంవత్సరంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో అప్పటి ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర రెడ్డిగారు రాజేశ్వరరావుగార్ని ఘనంగా సన్మానించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వారు ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. 17 మార్చి 1991 వ తేదీన విశ్వభారతి సాహితీ సంస్థ, ఒంగోలు వారు "కవిమిత్ర" బిరుదుతో సత్కరించారు. 12 జనవరి 2008 పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా స్మారక పరిషత్ దుగ్గిరాల వారు నిర్వహించిన సాహిత్య సభలో "సాహితిరత్న" బిరుదుతో సత్కరించారు. 07 ఏప్రిల్ 2008

కాపు కళ్యాణ మండపం, ఒంగోలులో సర్వశిక్షా అభియాన్ జిల్లా విద్యాశాఖ మరియు రాజీవ్ విద్యా మిషన్ సంయుక్తంగా నిర్వహించిన కవితాసభలో కవీశ్వర పురస్కారం ఇచ్చారు. 06 సెప్టెంబర్ 2008 భారత రత్న మదర్ థెరిస్సా సాంస్కృతిక సేవా సమితి దుగ్గిరాల వారు "సాహిత్య సేవా భూషణ" బిరుదుతో సత్కరించారు. 2009వ సంవత్సరంలో ప్రకాశం జిల్లా ముస్లిం రచయితల సంస్థ నిర్వహించిన సభలో అధ్యక్షులు, కార్యవర్గం వారు "మాతృభాషా" పురస్కారం ప్రదానం చేసి సత్కారించారు. 10 జనవరి 2010 తేదీన ప్రకాశం జిల్లాలోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపంలో, ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఒంగోలు నందు నిర్వహించిన సాహిత్య సభలో డా॥ వల్లభనేని నాగేశ్వరరావుగారు స్మారక సాహిత్య పురస్కారం ఇచ్చి సన్మానించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు వారు 35వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వివిధ సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించినందుకు గాను, కవిత్వంలో విశిష్టసేవలకు గాను 11 సెప్టెంబర్ 2011న యూనివర్సిటీ ఆడిటోరియంలో ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. 2013వ సంవత్సరంలో జాషువా సాంస్కృతిక సమితి, దుగ్గిరాల వారు జాషువా స్మారక సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. 2014వ సంవత్సరంలో జానపద కళాపీఠం, అద్దంకి వారు సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ, మరియు మరికొన్ని విశ్వవిద్యాలయాల్లో వీరి రచనలు పాఠ్యాంశాలుగా కొనసాగుతున్నాయి. వివిధ విశ్వవిద్యాలయాల్లో వీరి రచనలపై పరిశోధనలు చేస్తున్నారు. ఇంత విశిష్టత కలిగిన మల్లవరపు రాజేశ్వరరావుగారు 24 అక్టోబరు 2018 వతేదీన మరణించారు. కానీ, ఆయన సాహిత్యం ద్వారా నిత్యం జీవిస్తూనే ఉన్నారు.

(మల్లవరపు రాజేశ్వరరావు గారి జయంతి 17 నవంబరు 2020 వ తేదీన ప్రకాశం జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్న సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాసం)



ఎర్ర బంగారం కాపాడుకోలేమా??

శారద


ఎన్ని చట్టాలు చేసినా, ఎంత మంది అధికారులను నియమించినా, ఎన్ని సార్లు హెచ్చరించినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అత్యంత విలువైన, అరుదైన ఎర్రచందనం తరలిపోతూనే ఉన్నది. పట్టుబడిన స్మగ్లర్లపై కేసులు నమోదు చేస్తున్నారు. జైళ్లకు పంపుతున్నారు. కొన్ని సందర్భాల్లో కాల్పులకు వెనుకాడటం లేదు. అయినా ఇవేమీ ఈ స్మగ్లింగ్‌ను ఆపలేకపోతున్నాయి. ఈ ఎర్ర చందనం అక్రమ రవాణాను కాపాడేందుకు చాలాకాలం క్రితమే ఏకంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. అవసరమైన హంగులన్నీ కల్పించారు. అయినా ఇది ఆగడం లేదు. ఇటీవల దాడుల్లో బయటపడుతున్న ఎర్రచందనం దుంగలు పట్టుబడుతున్న స్మగ్లర్లు ఈ విష యం చెప్పకనే చెబుతున్నాయి. కడప జిల్లాలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు స్మగ్లర్లు సజీవదహనంకాగా మరో ఇద్దరు చావు బతుకుల మధ్యఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. పెద్దఎత్తున ఎర్రచందనం దుంగలను నింపుకొని ముందు ఒక ఎస్కార్ట్ వాహనం మరొక కారులో రెండు వాహనాలు కలిసి ప్రయాణిస్తున్న సమ యంలోనే ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. హైజాక్ గ్యాంగ్ వెంబడించడంతో వేగం పెంచడమే కారణమని అధికారులు చెప్తున్నారు. టిప్పర్ డీజిల్ ట్యాంకుకు వాహనం ఢీ కొట్టడంతో మంటల చెలరేగాయి. దీంతో వాహనాల్లో ఉన్న స్మగ్లర్లు ఐదుగురు సజీవదహనం కాగా మరో ఇద్దరు కాలిన గాయాలతో బయటపడ్డారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ఆస్పత్రికి తరలించారు. మృతి చెందినవారు తమిళనాడుకు చెందినవ్యక్తులుగా ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది. ఎర్రచందనం దుంగలు కూడా మంటలకు ఆహుతయ్యాయి. గతమూడు, నాలుగు దశాబ్దాలుగా అత్యంత విలువైన ఈ వృక్షసంపద తరలిపోతూనే ఉన్నది. కూలికోసం వచ్చి ఎర్రచందం చెట్లు కొడుతున్న తమిళనాడుకు చెందిన కూలీలు పట్టుబడుతు న్నారేతప్ప వారి వెనుక ఉన్న పెద్దల హస్తం వెలుగు చూడటం లేదు. ఇటీవల కాలంలో తిరుపతి ప్రాంతంలో గట్టి బంధోబస్తు ఏర్పడటంతో ఇతర మార్గాల్లో తరలింపు కార్యక్రమం జరుగుతున్నది.

ఆంధ్రప్రదేశ్ కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం **తరువాయి 33వ పేజీలో**

కలానికి సంకెళ్ళా??


వాసుశ్రీ, సీనియర్ జర్నలిస్ట్

జర్నలిజం వృత్తి కాదు ప్రవృత్తి. అదొక జీవనవిధానం. నిర్ణీత పనిగంటలు సౌలభ్యం కోసమే తప్ప జర్నలిస్టులు నిరంతరం ఆన్‌డ్యూటీలో ఉంటారని ప్రసిద్ధ పత్రికావేత్తలు చెప్పేమాట. సామాజిక ధోరణులనీ, సమాజ గమనాన్ని అసంకల్పితంగానే గమనిస్తూ వార్తల్ని, వార్తాకథనాల్నీ అందించే దృష్టికోణం జర్నలిస్టులది. ఇందుకు అనుగుణంగా రూపొందే వారి జీవనవిధానంపై పెనుదాడి సరికొత్త పరిణామాల పరంపర. నిజానిజాలు రాసే, చెప్పే కలాల్నీ, గళాల్నీ మూసుకోమని చెప్పడం అసంగతం, భావస్వేచ్ఛని శిరోధార్యంగా భావించే వృత్తిగా, జీవనవిధానంగా జర్నలిజానికి ఇది మరణశాసనం.



తను చూస్తున్నది, వింటున్నది, అర్థం చేసుకొని అసలు ఉద్దేశాలను విశ్లేషించి చెప్పడానికి ప్రయత్నించే అవకాశం లేకపోతే జర్నలిస్టుగా పని చేయడం ఎందుకు? వృత్తిధర్మాన్ని అనుసరించలేనప్పుడు ఈ వృత్తిని ఎంచుకోవడం అవసరమా? మెదడునీ, మనస్సాక్షినీ, ఆలోచనలనీ తాకట్టు పెట్టడం ఆత్మవంచన కాదా? ఈపని చేయడం కన్నా ఇతరేతర వృత్తులు ఎంచుకోడం సబబేమో? ఈరకమైన ప్రశ్నలు పొడసూపితే మున్ముందు జర్నలిజం అస్తిత్వమే ప్రమాదంలో పడుతుంది. అంతిమంగా నిజాలు చెప్పేవారు కరువయి వందిమాగధులు, వేనోళ్ళ పొగిడేవారే జర్నలిస్టులుగా చెలామణవుతారు. ఇంతకన్నా ఆత్మహత్యాసదృశ్యం జర్నలిజానికి ఉంటుందా? అబద్ధాలు చెప్పడానికి అలవాటు పడిన వారికి నిజానిజాలు రుచించవు. నిజం నిష్ఠురసత్యం. అయితే ఆ సత్యాన్ని చెప్పడానికి వెరవకపోవడమే జర్నలిజపు లక్షణం. ఇది ఒకనాటి విశ్వాసం. ఇప్పుడు అది గిడసబారుతున్న దృశ్యం నిత్యమూ, నిరంతరమూ చూస్తున్నాం. ఇందులో భాగంగానే ఒక పత్రికలో పనిచేసే జర్నలిస్టులు ఎక్కడా కూడా పత్రిక విధానానికి భిన్నంగా మాట్లాడరాదని శాసిస్తున్నారు. ఒక అంశంలో ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన అభిప్రాయం వ్యక్తం చేస్తే, దానిని క్రమశిక్షణా ఉల్లంఘనచర్యగా పాలకుల కొమ్ముగాసే యాజమాన్యం పరిగణిస్తున్నది. మొదటిసారి ఇది తగదని చెబుతుంది. రెండోసారి హెచ్చరిస్తుంది. మూడోసారయితే ఇంటికి పంపిస్తుంది. రాజ్యాంగం ప్రసాదించిన భావప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమైన విధానమిది. అయితే ఏదో ఒక కారణాన్ని సాకుగా చూపి సాగనంపుతారు. ఈవిధంగా జర్నలిస్టుల భావాల నియంత్రణకు పనిగట్టుకుని దిగడం ఏ పరిణామాల ఫలితమో అర్థం చేసుకోవాలి. అసలైన వార్తల్ని తొక్కిపట్టాలంటే వార్తలు కాని వాటిని వార్తలుగా తెరమీదకు తీసుకురావాలన్న కుటిలవ్యూహం జర్నలిజంలో పెచ్చరిల్లింది. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియా అంతటా ఇదే ధోరణి. చిరంజీవి ఇల్లు ఎంత పెద్దగా ఉంటే ఎవరికేం పట్టింది? సిరివెన్నెల ఇంట్లో పెళ్ళయితే సామాన్య పాఠకుడికేం అవసరం? కరీనా కపూర్ రెండో బిడ్డని కనబోవడం వంటి వార్తల సరంజామా మీడియాలో ప్రముఖంగా కనిపించడం గమనార్హం. అలాగే ఐపీఎల్‌లో ఏ జట్టు ఏ దశకు చేరిందో పదేపదే ఊదరగొట్టే వార్తలు ఎవరి మేలు కోసం? కంగనా రనౌత్‌కు ఇచ్చినంత ప్రచారం, వేలాది మంది రైతుల నిరసన ప్రదర్శనలకు ఇవ్వకపోవడం జాతీయ మీడియా సిగ్గుచేటయిన సరళికి నిదర్శనం. వార్తలు కాని వాటిని వార్తలుగా చేయడం ద్వారా అసలైన నిజాలకు, వార్తలకు పాతర వేయవచ్చన్న వ్యూహాత్మక విధానం కార్పొరేట్ మీడియా అనుసరిస్తున్నది. సినిమా పేజీలకో, స్పోర్ట్స్ పేజీలకో పరిమితం కావలసిన వార్తలు ప్రధాన వార్తలుగా చెలామణవడం విలువలకు పాతరేసిన జర్నలిజంలోని వికృతత్వం. భావప్రకటనా స్వేచ్ఛ భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు. దానికి భంగం కలిగినప్పుడు పత్రికలు స్పందించాలి. భావస్వేచ్ఛపై దాడిని నిరసించాలి. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన పత్రికల విధి, కర్తవ్యమిది. ఇందుకు భిన్నంగా పత్రికలే భావస్వేచ్ఛ హననానికి పాల్పడటం వైచిత్రి. ప్రజాస్వామ్యంలో ఏదయినా పారదర్శకంగా ఉండాలని చెప్పే పత్రికల యాజమాన్యాలు హక్కుల హననాన్ని చాలా పకడ్బందీగా హరించడానికి ప్రయత్నించే ధోరణి మొదలయింది. ఉద్యోగుల్లో క్రమశిక్షణ, నిబద్ధత ఇనుమడింపజేయడం లక్ష్యమన్నట్టుగా చెబుతాయి. కానీ అంతిమంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే ఉద్యోగులపై కఠినచర్యలు తప్పవని బెదిరిస్తాయి. అవసరమైతే విధుల్లోంచి తొలగిస్తామని హెచ్చరిస్తాయి. ఇటీవలి కాలాన కొన్ని పత్రికల్లోని పరిణామమిది. హద్దుల్లో ఉండాలని మౌఖికంగా కాదు, లిఖితపూర్వకంగా సర్క్యులర్ జారీ చేయడం విడ్డూరం.

చేపలో జంతుజాలక పరాన్నజీవులు – ఆహార భద్రతలో వాటి ప్రభావాలు




Chlonorchis chinensis

Opisthorchis viverrinid



Dr. V.Anu Prasanna, M.Sc., Ph.D
Assistant Professor, Head of the Department,
Department of Zoology,
Yogi Vemana University,
YSR Kadapa, A.P


చేపలు మనుషులకి ముఖ్యమైన పోషక ఆహారంగా, పెద్ద చేపలు పట్టడానికి ఎరగా మరియు ఆనందాన్ని ఇచ్చే జీవులుగా ప్రఖ్యాతి పొందాయి. సహజ వనరులలో చేపలు పట్టడం మరియు ఆక్వాకల్చర్ వెంచర్లు రెండింటి నుంచి ఆక్వాకల్చర్ ఉత్పత్తులుని మెరుగుపరచడానికి అనేక యాంత్రిక పురోగతులు ఉన్నప్పటికీ, జంతుసంబంధిత పరాన్నజీవులతో సహా అనేక కారకాల వల్ల మన ఆహార భద్రత నిరంతరం ప్రశ్నించబడతుంది. చేపలు నుంచి మనుషులుకు వ్యాప్తి చెందే వ్యాధులు ను Fish borne parasitic zoonoses అంటారు. అది ఒక ముఖ్యమైన ప్రజా ఆరోగ్య సమస్య. చేపల ద్వారా వ్యాపించే జూనోటిక్ కేసులు 1950 చివర్లో ప్రారంభమై 1980లో వెలుగులోకి వచ్చాయి. చారిత్రకంగా చాలా తక్కువ నివేదికలు ఉన్నప్పటికీ ఆక్వాకల్చర్ ఉత్పత్తిలో పెరుగుదల, వివిధ రకాల రోగ నిర్ధారణ పద్ధతులు ద్వారా ఈ వ్యాధులు ఉప్పుడు చాలా బయటపడ్డాయి. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో పచ్చి చేపల ను (సుషి, శషమి, కేవిచ్చే, కరపక్కివ) తినే అలవాటు వల్ల ఈ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ రకమైన వ్యాధులు తక్కువ మరియు మధ్య-ఆదాయ దేశాలలో నివసిస్తున్న జనాభాను ఎక్కువ ప్రభావితం చేస్తాయి, కానీ పెరుగుతున్న అంతర్జాతీయ మార్కెట్లు; మెరుగైన రవాణా వ్యవస్థలు మరియు జనాభా కదలికల కారణంగా ఈ వ్యాధులు ఇప్పుడు ప్రపంచవ్యాప్తం విస్తరిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) మరియు ఐక్యరాజ్యసమితి యొక్క ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (FAO) 2002 లో 18 మిలియన్ల మందికి పైగా చేపలు నుంచి సంక్రమించే జూనోటిక్ trematodiasis బారిన పడ్డారని అందులో 7000, పైగా జనాబా మరణించారు అని అంచనా వేసింది మరియు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల Fish borne zoonotic trematodiasis ఇన్ఫెక్షన్లను అభివృద్ధి చెందుతున్న అంటు వ్యాధుల జాబితాలో కూడా చేర్చింది. భారతదేశవ్యాప్తంగా, ఆహార-ద్వారా వ్యాపించే పరాన్నజీవ జంతుసంబంధ సమస్యలు విభిన్న ఆహార అలవాట్ల కారణంగా వేర్వేరుగా ఉంటాయి. అయితే, అపరిశుభ్ర జీవన పరిస్థితులు, విద్య లేకపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడం, పేదరికం మరియు వృత్తి వంటి ఇతర కారకాలు కూడా పరాన్నజీవుల వ్యాప్తికి దోహదపడతాయి. జంతుజాలక పరాన్నజీవుల ముఖ్యంగా (nematodes, digeneans, cestodes, myxospores) ద్వారా కలుషితమైన చేపల పదార్థాలు ఆహార భద్రతకు ముఖ్యమైన ఆందోళనలో ఒకటి. ముఖ్యం గా సముద్ర చేపలు మరియు సెఫలోపాడ్లలో (cephalopods) నెమటోడ్ (Nematode) అంటే నులి పురుగులు- Anisakis మరియు Gnathostoma వల్ల మానవులో Anisakiasis మరియు Gnathostomiasis అనే వ్యాధులును కాలగజేస్తుంది. అలాగే మూడు రకాల Digeneans- Chlonorchis chinensis, Opisthorchis viverini మరియు Fasciola hepatica, F. gigantica వల్ల Chlonorchiasis; Opisthorchiasis; Fascioliasis అనే వివిధ రకాల వ్యాధులును కాలగజేస్తుంది. అదే విధంగా Diphyllobothrium latum అనే Cestode కలిగించే Diphyllobothriasis మరియు Kudoa అనే myxozoan కలిగించే వ్యాధులు చాలా తీవ్రమైన జూనోటిక్ వ్యాధులుగా పరిగణించబడ్డాయి. అయితే ఈ వ్యాధులు ను సకాలంలో గుర్తిస్తే Albendazole, Praziquantel or niclosamide లాంటి మందులు ద్వారా నివారించవచ్చు. ఒక వైపు మానవ జనాభా పెరుగుదల, అడవి నుండి చేపలు పట్టడం తగ్గడం, జలపర్యావరణం లో నాణ్యత తగ్గడం, మరియు పరాన్నజీవుల వ్యాధుల కారణంగా చేపల నాణ్యతా క్షీణించిన ఆక్వాకల్చర్ సెక్టార్ పెరుగుదల కారణంగా చేపల ఉత్పత్తులకు భద్రత కరువైంది. అడవి చేపలలో పరాన్నజీవుల వ్యాధుల వల్ల నేరుగా మరియు పరోక్షంగా వాటి పెరుగుదల, పునరుత్పత్తి మరియు మనుగడపై ప్రభావం చూపిస్తాయి అయితే ఆక్వాకల్చర్లో పేరేగే చేపలలో ఈ పరాన్నజీవులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగించడం వల్ల వాటి ఉత్పత్తి పతనావస్థకు లోనవుతున్నాయి. ఈ ప్రతికూల ప్రభావాలు ఉన్నప్పటికీ పరాన్నజీవులు చాలా విధాలు గా Food chain నిర్మాణంలో, భారీ లోహాలు కోసం జీవ సూచికలుగా ఉపయోగపడడంలో, కాలుష్యం, పర్యావరణ కాలుష్యాలు మరియు చేపల స్టాక్ అంచనా వేయడంలో, అలాగే అవి నివసించే చేపల శరీరంలో భారీ లోహాలు చేరిక తగ్గించడంలో, మత్స్య వనరులు ఆహార భద్రత, చేపల భద్రత మరియు ఆహార స్థిరత్వాన్ని పరిష్కరించడంలో చాలా సహాయపడతాయి.




Fasciola hepatica




Anisakis sp



Gnathostoma sp



Diphyllobothrium latum



Kudoa

"ప్రశాంత" తో మమత గట్టెక్కుతుందా???

బుకర్

వచ్చే ఏడాది జరగబోతున్న కీలకమైన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ చేతిలో నుంచి అధికారం చేజారకుండా ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) అడ్డుకోగలరా?

ప్రస్తుతం తృణమూల్ కాంగ్రెస్‌తోపాటు రాజకీయ వర్గాల్లోనూ ఇదే చర్చ జరుగుతోంది. బిహార్ ఎన్నికల సమయంలో విరామం తీసుకున్న పీకే అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూ తృణమూల్ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను తలకెత్తుకున్నారు. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆయన బీజేపీకి వ్యతిరేకంగా వేసిన వ్యూహాలు ఫలించలేదు. వరసగా మూడోసారి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తమవైపు తీసుకొచ్చే బాధ్యతలను పీకేపైనే తృణమూల్ కాంగ్రెస్ పెట్టింది. అయితే ఇదే పార్టీలో అసంతృప్తికి కారణమవుతోంది. చాలా మంది పార్టీ నాయకులు బహిరంగంగానే ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సుభేందు అధికారి అయితే, పీకేపై నేరుగా విమర్శలు చేస్తున్నారు. ఆయన్ను శాంతింప జేయడంలో పీకే విఫలమయ్యారనే చెప్పాలి. 2014 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ వ్యూహాలను తీర్చిదిద్దడంలో పీకే కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాతి ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయన కీలకంగా మారారు. వరుస విజయాల తర్వాత రాజకీయ పార్టీల్లో ఆయనకు డిమాండ్ పెరిగింది. పీకే తమ వైపు ఉంటే కచ్చితంగా గెలుస్తామనే ధీమా రాజకీయ వర్గాల్లో ఉండేది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో(2019) వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ గెలిచేలా పీకే వ్యూహాలను రచించారు. అయితే, పౌరసత్వ సవరణ చట్టానికి సంబంధించి చేసిన వ్యాఖ్యలపై బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌తో పీకేకు విభేదాలు వచ్చాయి. దీంతో పీకేను జేడీయూ గత జనవరిలో బహిష్కరించింది.

2015లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పీకే పేరు బాగా వినిపించింది. అయితే, ఈ సారి మాత్రం ఆయన ఎక్కడా కనిపించలేదు. నీతీశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్న తర్వాత పీకే ట్వీట్ చేశారు. "బీజేపీ నామినేట్ చేసిన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్న నీతీశ్ కుమార్‌కు ధన్యవాదాలు. అలసిపోయిన, రాజకీయంగా ప్రాముఖ్యంలేని ముఖ్యమంత్రితో బిహార్ మరికొన్నేళ్లు నెట్టుకురావాలి"అని ఆయన ట్వీట్ చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీ.. పీకేను తమ శిబిరంలోకి తీసుకొచ్చారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై ఆయన వ్యూహాలు ఫలించని సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించేలా ప్రశాంత్ కిశోర్‌కు చెందిన వేల మంది ఐప్యాక్ సంస్థ సిబ్బంది పనిచేస్తున్నారు. పీకే సూచనలపై మమత తీసుకున్న నిర్ణయాలతో పార్టీ నేతల్లో ఆగ్రహం పెరుగుతోంది. ముఖ్యంగా సంస్థాగతంగా మార్పులు చేయడంతో సీనియర్ నాయకుల్లో అసంతృప్తి పెరుగుతోంది. రవాణా మంత్రి సుభేందు అధికారిలో అసంతృప్తి పెరగడానికి పీకేనే ప్రధాన కారణం. ఆయన్ను ఆఫీసుతోపాటు ఇంటిలో కూడా పీకే కలిశారు. కానీ ఆయనను శాంతింప జేయడంలో పీకే విఫలమయ్యారు. మరోవైపు సుభేందు బీజేపీలో చేరబోతున్నారని, మరోవైపు కొత్త పార్టీ పెట్టబోతున్నారని ఊహాగానాలు కూడా వస్తున్నాయి. ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశాలకు కూడా ఆయన హాజరు కాలేదు. మమతా అధికారంలోకి రావడానికి కారణమైన భూసేకరణ వ్యతిరేక ఉద్యమం నందిగ్రామ్‌లోనే మొదలైంది. ఇక్కడ సుభేందుతోపాటు తృణమూల్ కాంగ్రెస్



నాయకులూ తరచూ ర్యాలీలు, సమావేశాలు జరుపుతుంటారు. ఇటీవల ఇక్కడే పీకేకు వ్యతిరేకంగా చాలా మంది ఎమ్మెల్యేలు, తృణమూల్ కాంగ్రెస్ నేతలు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తంచేశారు. ముఖ్యంగా సీనియర్ నాయకుల్ని పార్టీ పక్కన పెడుతోందని, గత ఎన్నికల్లో బీజేపీకి సాయం చేసిన వారిని ఇప్పుడు చేరదీస్తోందని వారు ఆరోపిస్తున్నారు. గత ఆదివారం ముర్షిదాబాద్‌లో జరిగిన ర్యాలీలో హరిహర్‌పారాకు చెందిన ఎమ్మెల్యే నియామత్ షేక్ నేరుగా పీకేపై వ్యాఖ్యలు చేశారు. "పార్టీలో వస్తున్న అన్ని సమస్యలకూ ప్రశాంత్ కిశోరే కారణం. ముర్షిదాబాద్‌లో పార్టీ పటిష్ఠం అయ్యేందుకు సుభేందు కృషిచేశారు. కానీ ఇప్పుడు ఆయనతో మాట్లాడే నాయకుల్ని వేధిస్తున్నారు" అని నియామత్ అన్నారు. "మేం ప్రశాంత్ కిశోర్ నుంచి రాజకీయాలు నేర్చుకోవాలా? ఒకవేళ జరగబోతున్న అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌కు షాక్ ఎదురైతే, అది ఆయన వల్లే అవుతుంది"అని ఆయన అన్నారు. ముర్షిదాబాద్ జిల్లా కేంద్రం బ్రహ్మపుర్‌లో గత నెలలో తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు అతికించిన ఒక పోస్టర్‌లో అయితే పీకేను బందిపోటుగా పేర్కొన్నారు. అయితే, పీకేపై వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమైనవని ముర్షిదాబాద్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అబూ తాహిర్ ఖాన్ వివరించారు. ఆ పోస్టర్లను విపక్ష నాయకులే అతికించారని ఆయన చెప్పారు. మరోవైపు కూచ్‌బెహార్ ఎమ్మెల్యే మిహిర్ గోస్వామి కూడా బహిరంగంగానే పీకేపై విమర్శలు చేస్తున్నారు. "తృణమూల్ కాంగ్రెస్ అసలు మమతా బెనర్జీ పార్టీనేనా? లేకపోతే పార్టీని ఎవరికైనా మమత కాంట్రాక్టుకు ఇచ్చారా?"అని సోషల్ మీడియాలో ఆయన ఒక పోస్టు పెట్టారు.

"మమతకు పార్టీపై నియంత్రణ లేదు. తృణమూల్ కాంగ్రెస్ బాగా మారిపోయింది. మీరు కావాలంటే ఉండొచ్చు. లేకపోతే హాయిగా బయటకు వెళ్లిపోవచ్చు"అని ఆయన వ్యాఖ్యానించారు.

కొంతకాలం వరకు క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండాలని తను నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. "తృణమూల్ కాంగ్రెస్ వచ్చే ఎన్నికల్లో గెలవాలని అనుకుంటే.. అందరూ తమ భేషజాలను పక్కనపెట్టి పనిచేయాలి. పార్టీలోని సీనియర్ నాయకుల్ని పక్కన పెట్టేయాలనే కుట్ర జరుగుతోంది"అని అదే జిల్లాకు చెందిన సీతాయ్ ఎమ్మెల్యే జగదీశ్ వర్మ బసునియా వ్యాఖ్యానించారు. తృణమూల్ ఒక్కసారిగా పీకేపై అంతృప్తి పెరగడానికి గల కారణాలు ఏమిటి? జులై నెలలో పీకే సూచనలపై మమతా బెనర్జీ పార్టీలో చాలా మార్పులు చేశారు. బ్లాకు, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల్లోనూ మార్పులు

చేశారు. ఈ మార్పులే పార్టీలో అసంతృప్తికి కారణమని వార్తలు వస్తున్నాయి. "పీకే బృందం సమర్పించిన ఒక నివేదిక ఆధారంగా పార్టీలో చాలా మార్పులు చేశారు. ప్రతి జిల్లానూ సందర్శించిన తర్వాత పీకే బృందం ఈ మార్పులు సూచించింది. మరోవైపు అసంతృప్త నాయకులపైనా పీకే టీమ్ ఒక నివేదిక సమర్పించింది. మంచి ప్రజాదరణ కలిగిన నాయకుల్ని ముందుకు తీసుకురావడమే ఈ మార్పుల లక్ష్యం"అని సీనియర్ తృణమూల్ నాయకుడు ఒకరు తెలిపారు. ఈ విషయంపై ప్రశాంత్ కిశోర్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. అయితే పీకే సంస్థకు చెందిన ఓ అధికారి మాట్లాడారు. "మమతా బెనర్జీ, పార్టీలోని సీనియర్ నాయకుల సూచనలపై మేం పనిచేస్తున్నాం. మా పని సూచనలు ఇవ్వడం మాత్రమే. వాటిని అమలు చేయాలా? వద్దా అనేది పార్టీ ఇష్టమే. కాబట్టి పార్టీలోని అసంతృప్తులపై మేం మాట్లాడటం సరికాదు"అని ఆయన చెప్పారు. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్‌లో పీకే జోక్యం పెరగడంతో చాలా మంది నాయకులు తమను పక్కన పెట్టేసినట్లు భావిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

పార్టీ అంతర్గత వ్యవహారాల్లో పీకే టీమ్ జోక్యం చేసుకుంటోందని తిరుగుబాటు జెండా ఎగురవేస్తున్న సుభేందు అధికారి వివరించారు.

సుభేందు అధికారి సొంత జిల్లా తూర్పు మేదినీపుర్‌లో పీకే బృందం నిర్వహించే చాలా కార్యక్రమాలకు సుభేందు హాజరుకాకపోవడమూ పార్టీలో అసంతృప్తి పెరుగుతోందనే వాదనను మరింత బలపరుస్తోంది.

"తృణమూల్ కాంగ్రెస్ అనేది సీపీఎం లాంటి క్యాడర్ ఆధారిత పార్టీ కాదు. ప్రస్తుతం బ్లాక్‌తో మొదలుపెట్టి రాష్ట్ర స్థాయి వరకు పార్టీలో క్రమశిక్షణ పెంచేందుకు పీకే బృందం ప్రయత్నిస్తోంది. ఇలాంటి చర్యలతో కొంత అసంతృప్తి ఉండే మాట వాస్తవమే. అయితే, పార్టీ అధినాయకత్వం పీకే బృందానికి గట్టి మద్దతు ఇస్తుండటంతో అసంతృప్తి పెద్దగా ఫలితం చూపిస్తుందని అనుకోవడం సరికాదు"అని రాజకీయ విశ్లేషకుడు విశ్వనాథ్ చక్రబర్తి వివరించారు. అయితే, ఏళ్ల నుంచి బెంగాల్ రాజకీయాలను దగ్గర నుంచి పరిశీలిస్తున్న సీనియర్ జర్నలిస్టు శ్యామలేందు మిత్ర భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. "పీకే బృందం ముందుకు వెళ్లడం చాలా కష్టంగా మారుతోంది. తృణమూల్ నాయకులు, ఎమ్మెల్యేలు మమతను మాత్రమే తమ నాయకురాలిగా చూస్తారు. పీకే పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంతో అసంతృప్తి బాగా పెరుగుతోంది. ఫలితంగా పీకే ఊహించిన స్థాయిలో ఇక్కడ సఫలం కాకపోవచ్చు"అని ఆయన అన్నారు.

శ్రీమతి రావు కమలకుమారి ...

ప్రజామీడియా నెట్‌వర్క్ సౌజన్యంతో

హరికథ కళాకారిణి, ప్రముఖ రంగస్థల మరియు సినీనటులైన రావు గోపాలరావు సతీమణి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ మొదలైన రాష్ట్రాలలో 5వేలకుపైగా హరికథలు చెప్పింది.

జననం :

కమలకుమారి 1944, ఏప్రిల్ 21న మండా సూర్యనారాయణ, రాజరాజేశ్వరి దంపతులకు విజయనగరం లో జన్మించింది. సూర్యనారాయణ స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా భాగ్‌రథీపురం. కమలకుమారి తాత కవిరాయుని లక్ష్మీనారాయణ శాస్త్రీ విజయనగర సంస్థాన విద్వాంసులు.

రావు గోపాలరావు దంపతులు :


కళారంగం :

కమలకుమారి తండ్రి సూర్యనారాయణ శాస్త్రి విజయనగరం సంగీత కళాశాలలో కర్నాటక సంగీతంలోనూ, పూనాలోని హిందూస్థానీ సంగీతంలోనూ డిప్లొమాలు పొందిన విద్వాంసులు. వీణ, గాత్రం, భరతనాట్యం, హరికథా కళలను అభ్యసించిన కమలకుమారి ఎనిమిదేళ్ళ వయసులో తండ్రి హరికథ మధ్యలో భరతనాట్యం చేసేది.

స్వరజతి, వర్ణం, తిల్లాన, స్వరం, శబ్దం, సాహిత్యం అభ్యసించింది. తన పాటలు తానే పాడుకుంటూ జానపద నృత్యాలు చేసేది. తిరుపతి, శ్రీశైలం, భద్రాచలం, అన్నవరం, యాదగిరిగుట్ట మొదలైన పుణ్యక్షేత్రాల్లో హరికథా గానం చేసింది.

వివాహం – పిల్లలు :

వీరిది ప్రేమ వివాహం. ప్రముఖ రంగస్థల, సినీనటులైన రావు గోపాలరావుతో 1966, జనవరి 16న కమలకుమారి వివాహం జరిగింది. పురాణ కథలను, పౌరాణిక కళలలను ద్వేషించే రావు గోపాలరావు... కాకినాడ లో కమలకుమారి హరికథకు వచ్చి



అల్లరిచేయాలనుకున్నారు. ఆరు గంటలపాటు హరికథ విని, ముగ్ధులై కమలకుమారితో ప్రేమలో పడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు రావు రమేష్ సినీనటుడు. రెండో కుమారుడు క్రాంతికుమార్ అమెరికాలో ఇంజనీర్, కుమార్తె సీతాదేవి.

బిరుదులు :

సకల కళా విశారద – ప్రవాసాంధ్ర కళాసమితి, టాటా నగరం, మద్రాస్

నాట్యకుమారి, హరికథా శిరోమణి, కోకిల వాణి – కాకినాడ

మధుర గాన సుహాసిని – కలకత్తా

సకల జన రంజన హరికథా కళా ప్రపూర్ణ – ఖరగ్‌పూర్

అభినవ సరస్వతి – బెంగళూరు

శారదావతరిణి – విజయనగరం

ఆదర్శ హరి కథా సుధామతి – గుంటూరు

పోరాట పతాక కాస్ట్రో...

బి.రాజేష్

ఒక దేశ ప్రజల ఆకాంక్షలు నింపుకున్న దేహం అతడు
సమ సమాజ నిర్మాణ ఆశయానికి నిలువెత్తు నిదర్శనం అతడు
మానవీయ ఆచరణను బోధించే అనుభవపాఠం అతడు
ఉక్కు సంకల్పానికి ఉద్యమ రూపానికి కొండంత ఉదాహరణ అతడు



అతడే ఫిడెల్ కాస్ట్రో. తనను తాను సమూహంలోకి వొంపేసుకుని సమూహాన్ని తనలోకి నింపుకున్నవాడే నిజమైన నాయకుడై నిలుస్తాడు. చరిత్రలో సందేశమై ప్రేరణనిస్తాడు. మనకాలంలో నివసించి, ఆచరించి, సంభాషించి, శత్రువుల నెదిరించి, విజయాలు సాధించి ప్రపంచ ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచే వ్యక్తి కాస్ట్రో. అతనొక వ్యక్తి కాదు, ఒక సమూహం. ఒక ఉద్యమం. ఒక ఆశయం. ఒక సంకల్పం, ఒక నిబద్ధత, ఒక నిజాయితీ, ఒక ఆచరణ... ఎన్ని విశేషణాలయినా ఆ వ్యక్తిత్వానికి తక్కువే. క్యూబా ఓ చిన్నదేశమే కావచ్చు... కానీ ఈ ప్రపంచానికి ఘనమైన సందేశాన్నిచ్చిన ఆదేశ ప్రజల చైతన్యానికి ప్రతీక ఆయన.

కాస్ట్రో వర్ధంతి సందర్భంగా ఆయన గురించి గొప్పగా చెప్పుకోవటం మాత్రమే చేస్తే అది నిజమైన నివాళిగా నిలవదు. నేటి మన ఆచరణలో ఆయన జీవితపు పాఠాలు ఏవిధంగా ఉపయోగపడతాయో ఆలోచించి, వాటిని అన్వయించుకొని ముందుకు పోవటమే ఆయనకు అసలైన నివాళి అవుతుంది. కాస్ట్రో విప్లవకారుడు, ఉద్యమయోధుడు, పోరాటంలో ముందుండిన ధీరోదాత్తవీరుడు. అంతే కాదు.. ఒక అర్ధశతాబ్దికాలం ఒక దేశాన్ని పాలించిన పరిపాలనాదక్షుడుకూడా. ప్రజల ఆశలను ఆకాంక్షలను పట్టుకోగలిగిన దిట్ట. ప్రజలందరిని ఆశయాలదారిలో నిలబెట్టగలగిన నాయకుడు. అందుకే ఆయనను చదువుకోవాలి మనం. అతను దాన్నెలా సాధించాడో అవగాహన చేసుకోవాలి. ఇది ఈనాటి సందర్భాంగా మన కర్తవ్యం. మార్క్స్ అందించిన ఆచరణయుత సిద్ధాంతాన్ని తన దేశానికి అన్వయించి, ఎన్ని ఆటుపోటులు ఎదురైనా, దాడులు జరిగినా మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొని నిలబడి, దేశాన్ని నిలబెట్టిన అరుణకేతనధారి కాస్ట్రో.

ఉత్తర, దక్షిణ అమెరికాకు మధ్యన ఉన్న చిన్న ద్వీపదేశం క్యూబా. స్పానిష్ వలస దేశంగా చాలాకాలం ఉంది. తర్వాత అమెరికా ఆధీనంలోకి వచ్చింది. స్పెయిన్ నుంచి వలస వచ్చిన చెరకు రైతు ఏంజెల్‌కు క్యూబా వాసియైన లినాకు 1926 ఆగస్టు 13న జన్మించిన ఏడుగురు పిల్లల్లో ఒకడు కాస్ట్రో. పుట్టింది గ్రామీణ వాతావరణంలోనే. అత్యంత పేదలు, జబ్బులతో బాధపడేవాళ్ళు, తిండి, బట్టలు లేక ఇబ్బందులు పడేవారి మధ్యే కాస్ట్రో బాల్యం గడిచింది. స్థానిక పాఠశాలలోనే ప్రాథమిక విద్య చదువుకున్నాడు. నిత్యం ప్రార్థనలు, మత బోధనల మధ్య హైస్కూల్ విద్య కొనసాగినప్పటికీ ఆ ప్రభావాలకు ఆకర్షితుడు కాలేదు. 'యాంత్రిక పద్ధతుల ద్వారా నాకు ఎవరూ హేతువిరుద్ధమైన భావాలు, మత విశ్వాసాలు నేర్పించలేక పోయార'ని అతనే స్వయంగా వివరిస్తాడు. హవానాలో విశ్వవిద్యాలయంలో చేరి ఆర్థిక పాఠాలు వినడం, ఆ సందర్భంలోనే కమ్యూనిస్టు మ్యానిఫెస్టో పరిచయం కావడం, న్యాయశాస్త్ర పట్టా పొందటం ఇవన్నీ అతని ఆలోచనల్లో మౌలిక మార్పులు తీసుకువచ్చాయి. ఉన్నతమైన నిస్వార్థమైన అభిప్రాయాలు లేకపోతే రాజకీయ అభిప్రాయాలకు ఎలాంటి విలువా ఉండదనీ, ఉన్నతమైన, అభిప్రాయాలు కూడా న్యాయమైన భావనలపై ఆధారపడకపోతే దేనికీ ఉపయోగపడవనీ ఆయన స్వతంత్ర అనుభవం, విశ్లేషణ ద్వారా తెలుసుకోగలిగాడు.

అమెరికా కీలుబొమ్మ బాటిస్టా అధిపతిగా ఆనాటికి క్యూబా ప్రజలు అనేక బాధలకు గురవుతున్న సందర్భం. ఒకవైపు పల్లె ప్రజలపై అత్యాచారాలు, ఆకలి, నిరుద్యోగం, కూలీల, రైతుల దుర్భర స్థితులు, లంచాలమయమైన వ్యవస్థ... మరోవైపు అమెరికన్ యూనిఫారాలతో కత్తులు, రైఫిల్స్ పట్టుకుని గుర్రాలపై ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే రూరల్‌గార్డ్స్... ఇవన్నీ చూసిన కాస్ట్రో రాజకీయ రంగంలోకి దూకాడు. క్యూబన్ పీపుల్స్ పార్టీలో వామపక్ష భావాలతో ప్రజా ఉద్యమాన్ని నిర్మించాడు.

తన ఇరవైఆరో యేటనే యువగెరిల్లా పోరాటయోధులను తయారుచేసుకుని మంకోడా దుర్గంపై దాడికి పూనుకున్నాడు. నిర్బంధాలకు గురయ్యాడు. 'నాపై ఎన్ని నేరారోపణలైనా చేయండి, నేను నిర్దోషినని చరిత్ర రుజువు చేస్తుంది' అని ప్రకటించి, తిరిగి బలం పెంచుకుని 1959లో సాయుధ గెరిల్లా పోరాటంతో నియంత బాటిస్టాను తరిమికొట్టి విప్లవాన్ని విజయవంతం చేశాడు. అప్పటికే క్యూబాలో కమ్యూనిస్టులు కార్మికవర్గంలో పనిచేస్తున్నప్పటికీ పెద్ద ప్రభావాన్ని కలిగించలేదు గానీ కాస్ట్రో విప్లవంలో పాలుపంచుకున్నారు. 1965లో క్యూబా కమ్యూనిస్టుపార్టీని స్థాపించి కేంద్రకమిటీ కార్యదర్శిగా కొనసాగాడు.

ఈ విప్లవ కార్యాచరణకు ముందుగానే అర్జెంటీనాకు చెందిన ఎర్నెస్ట్

చేగువేరా కాస్ట్రోను కలుసుకోవడం, వారి మధ్య జరిగిన సంభాషణలతో చేగువేరా క్యూబా విప్లవంలో పాల్గొనాలని నిర్ణయించుకోవడంతో వారిద్దరి మధ్య మైత్రి పెరిగింది. ఇది దేశ ప్రజలను విముక్తి చేసే మైత్రి. దక్షిణ అమెరికా దేశాలలో అనేక విప్లవ పోరాటాలలో చేగువేరాకు కొండంత స్ఫూర్తినీ, బలాన్నీ ఇచ్చిన మైత్రి. అందుకే "ఒక అసాధారణ వ్యక్తిగా ఫిడెల్ నాకు నచ్చాడు. అసాధ్యమైన కార్యాలను చేపట్టి పూర్తి చేశాడు. ఒక్కసారి క్యూబాకు బయల్దేరితే అక్కడికి చేరుకుంటానని, ఒకసారి అక్కడికి చేరుకున్నాక పోరాడతానని, పోరాడితే గెలుస్తానని ఆయనలో అపారమైన నమ్మకం ఉండేది. ఆయన ఆశావాదంతోనే నేనూ ఏకీభవించాను" అని చేగువేరా కాస్ట్రో గురించి వివరిస్తాడు. వీరిద్దరూ ఒకే తరానికి చెందినవారు. ఒకేరకమైన సైద్ధాంతిక, ఆచరణాత్మక అభిప్రాయాలు కలవారు. వ్యక్తిత్వ భావావేశాలూ ఒకటే. అందుకనే వాళ్ళు ఆదర్శ స్నేహితులు.

విప్లవం విజయవంతం కాగానే ప్రజానుకూలమైన దాదాపు పదిహేను వందల నూతన డిక్రీలను తీసుకొచ్చాడు కాస్ట్రో. అమెరికా పెట్టుబడిదారుల ఆధీనంలో ఉన్న అన్ని పరిశ్రమలను జాతీయం చేశాడు. వీటన్నింటినీ వ్యతిరేకించిన అమెరికా సీఐఏకు ధనాన్ని సమకూర్చి క్యూబా ప్రజా ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు, దాడులు మొదలుపెట్టింది. ఆ దాడి ఇప్పటికీ కొనసాగుతోంది. కొన్ని వందల సార్లు కాస్ట్రోను చంపాలని సీఐఏ ప్రయత్నాలు చేసి విఫలమైంది. విష ప్రయోగం కూడా చేయడానికి పూనుకున్నది. ఇక దుష్ప్రచారానికి అంతేలేదు. క్యూబా దేశ బాలలు ఆహారంగా తీసుకునే పాలడబ్బాలనూ అందించ నిరాకరించి తన అమానవీయతను చాటుకొంది. సామ్రాజ్యవాదపు వికృత ప్రవర్తన ఎలా ఉంటుందో అమెరికా ప్రభుత్వం తన చేష్టల ద్వారా నిరూపించింది.

ఈ రోజున మన దేశ ప్రభుత్వం అదే అమెరికాతో అంటకాగుతూ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నెరపుతోంది. మన దేశంలోని ప్రజారంగ సంస్థల్నీ వ్యవస్థల్నీ ప్రైవేటు కార్పొరేట్లకు కట్టబెడుతూ ధరల పెంపునకు కారణమవుతున్నది. వ్యవసాయరంగాన్ని ప్రైవేటు పరం చేస్తున్నది. ఇది మనదేశ ప్రజల ప్రయోజనానికి వ్యతిరేకమనే విషయం క్యూబా చరిత్రను పరిశీలిస్తే మనకర్థమవుతుంది.

నేడు ప్రపంచమంతా క్యూబా వైపు చూడటానికి కారణం సోషలిజాన్ని నిర్మించడం కోసం కాస్ట్రో చేసిన కృషి ఫలాలే. ప్రపంచంలోనే వైద్య, విద్యా రంగాల్లో గొప్ప విజయాలు సాధించారు క్యూబన్లు. నేటి కరోనా నివారణ కోసం క్యూబా అరవైకి పైగా దేశాలకు తమ వైద్య సిబ్బందినీ, ఔషధాలనూ సహాయంగా పంపిస్తోందీ అంటే అది సోషలిస్టు వ్యవస్థ యొక్క గొప్పదనంగానే చెప్పుకోవాలి. "ప్రపంచంలో ఎక్కడైనా సైనిక జోక్యానికి సామ్రాజ్యవాదం సర్వసన్నద్ధంగా ఉంటుంది. అలాంటి దేశానికి క్యూబాతో పోటీ దేనికి? విమాన వాహక నౌకలన్నిటిని ఆస్పత్రులుగా మార్చినా సరే.. అవి లక్షలాది మందికి క్యూబా అందిస్తున్న వైద్య సేవలకు సరితూగలేవు. యేటా పదిలక్షల మందికి చూపునిచ్చే శస్త్రచికిత్సలు చేయాలన్న లక్ష్యానికి చేరువలో ఉన్నాం. అమెరికా మాతో పోటీ పడగలదా? జ్ఞానాన్ని తప్ప, మారణాయుధాలను అందజేయడం మా విధానం కాదు. సాటి మనుషుల పట్ల సానుభూతితో, మాకన్నా వనరులు అధికంగా ఉన్న దేశాలకూ ఉచితంగా సేవలు అందిస్తాం. అమెరికా మాకు పోటీయే కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే.. చీమ, ఏనుగుకన్నా శక్తిశాలి అని రుజువైంది" అని తమ విధానాన్ని స్వయంగా కాస్ట్రో వివరిస్తాడు. పందొమ్మిది వందల తొంభైలలో సోషలిస్టు దేశాలు కూలిపోయిన సందర్భంలో కూడా నిబ్బరంగా, మార్క్సిజంపై అచంచల విశ్వాసంతో ప్రజా ప్రయోజకమైన సోషలిస్టు వ్యవస్థను దేశంలో నిలబెట్టుకుని ప్రపంచ ఉద్యమాలకు ఒక పాఠాన్ని అందించిన వాడు కాస్ట్రో. చాలా మంది క్యూబా కూలిపోతుందని భావించారు. కానీ నిలబెట్టి నిరూపించాడు.

కాస్ట్రో వ్యక్తిత్వంలోంచి మనందరం స్వీకరించాల్సిన మరో అంశం 'సంభాషణ'. ప్రజలతో, ప్రతివారితో సంభాషించడం అనేది ఆయన అలవాటు. సంభాషణ అనేది కాస్ట్రోకు ఒక వ్యసనం కూడా. ప్రపంచం పట్ల ఆయన అంకిత భావం అద్భుతమైనది. తాను విజయవంతంగా హవానా నగరంలోకి అడుగుపెట్టిన దాదాపు వారం రోజుల్లోనే ఆయన టెలివిజన్‌లో ఏడుగంటల పాటు ఏకధాటిగా మాట్లాడారు. ఇదొక ప్రపంచ రికార్డు. అయితే ప్రజలందరూ తమ పనులు చేసుకుంటూనే ఆయన మాటలు విన్నారు. ఒక్కో సందర్భంగా రాత్రంతా సంభాషిస్తూనే ఉంటాడు. కార్యకర్తలతో, ప్రజలతో మాట్లాడితేనే ఆలోచనలు తెలుస్తాయి. మనో భావాలు, ఆకాంక్షలు అర్థమవుతాయి. బాగున్నవి స్వీకరించవచ్చు. సరైనవి కాకుంటే మార్చవచ్చు. అందుకోసం నిత్యం సంభాషించాలి అంటాడు కాస్ట్రో. అందుకే కాస్ట్రో చివరికంటా సామ్రాజ్యవాద ప్రమాదాన్ని ప్రజలకు వివరిస్తూనే ఉన్నాడు.

"చరిత్రలో వచ్చిన గొప్ప విప్లవాల మహత్తర దృశ్యం నన్ను ఉత్తేజపరచింది. కొద్దిమంది స్వార్థపరశక్తుల ప్రయోజనాల కంటే అత్యధిక జన సంక్షేమం, సంతోషాలే ముఖ్యమన్న భావాల విజయాన్ని ఈ విప్లవాలు ఘంటాపథంగా చాటిచెప్పాయి. ప్రజలందరూ సుఖంగా ఉండగలిగితే వారి కోసం నేను ఎంత మంది ద్వేషాన్నయినా సహించడానికి సిద్ధంగా ఉంటాను" అని ఉద్ఘాటించగల ఉదాత్త మహామనిషి కాస్ట్రో.

ప్రాంతీయ పాస్పోర్టు అధికారిగా దాసరి బాలయ్య



హైదరాబాద్: హైదరాబాద్ ప్రాంతీయ పాస్ పోర్టు అధికారి(ఆర్పీవో)గా ఐఆర్ఎస్ అధికారి దాసరి బాలయ్య నియమితుల య్యారు. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఆర్పీవోగా విధులు నిర్వహించిన ఐఎఫ్ ఎస్ అధికారి ఇ. విష్ణువర్ధన్ రెడ్డి ఇటీవల దిల్లీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో 2008 బ్యాచ్ కు చెందిన బాలయ్య బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్ ఆర్పీవోగా నియమితులైన తొలి ఐఆర్ఎస్ అధికారి ఈయనే కావడం గమనార్హం. ఇతను అంతకుముందు రూర్కెలాలో జీఎస్టీ సంయుక్త కమిషనర్(భువనేశ్వర్ జోన్)గా పనిచేశారు. అక్కడి నుంచి డిప్యుటేషన్ పై కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలో చేరారు. గతంలో శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ ఉప కమిషనర్‌గా, సనత్ నగర్ లోని ఇన్లాండ్ కంటైనర్ డిపో(ఐసీడీ), సికింద్రాబాద్, మేడ్చల్ జీఎస్టీ కమిషనరేట్ లో సంయుక్త కమిషనర్‌గా విధులు నిర్వహించారు.

పరిమళించిన మానవత్వం శేషయ్య

ప్రొ. జి. హరగోపాల్

రాయలసీమ వెనుకబాటుతనం తెలిసినవాడుగా ప్రొ. శేషయ్య తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటించాడు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించడం పౌరహక్కుల ఉద్యమ ప్రజాస్వామిక స్వభావానికి నిదర్శనమని భావించేవాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రెండు ప్రాంతాల ఉద్యమానికి శేషయ్యను సమన్వయకర్తగా ఎన్నుకోవడంలోనే ఆయన విశిష్ట వ్యక్తిత్వం చూడవచ్చు. కరోనా మహమ్మారి ప్రపంచంలో ఒక విలయాన్ని సృష్టించి విలువైన మనుషుల ప్రాణాలను హరిస్తున్నది. అలాంటి చాలా విలువైన మనిషి, పౌరహక్కుల ఉద్యమ నేత, భారత రాజ్యాంగం మీద లోతైన అవగాహన ఉన్న న్యాయశాస్త్ర కోవిదుడు ప్రొఫెసర్ శేషయ్య. రాజ్యాంగంపై ఆయన ప్రామాణిక పరిశోధనలు చేశారు. న్యాయశాస్త్ర జ్ఞానం, సామాజిక చైతన్యం ద్వారా సమాజ జీవిత ప్రజాస్వామ్యీకరణకు దాదాపు నాలుగున్నర దశాబ్దాల కాలం విరామం లేకుండా కృషి చేసిన మేధావి ప్రొ. శేషయ్య. ఇప్పుడు ఆయన మన మధ్యన లేకపోవడం వ్యక్తిగతంగానే కాక, పౌరహక్కుల ఉద్యమానికి, మొత్తం తెలుగు సమాజానికి తీరని లోటు.

న్యాయశాస్త్ర పరిశోధన వలన, హక్కుల ఆచరణ వల్ల పెరిగిన లోచూపుతో రాజ్యాంగంలోని సంక్లిష్ట అంశాలను వివరిస్తూ, సమాజాన్ని నిరంతరం ఎడ్యుకేట్ చేసే కృషిని శేషయ్య అలసిపోకుండా చేసాడు. ఆరోగ్యం సహకరించకున్నా పట్టువదలకుండ పని చేసాడు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని మానవ హక్కుల అధ్యయన కేంద్రానికి ప్రతి సంవత్సరం అతిథి ప్రొఫెసర్‌గా వచ్చి 'రాజ్యాంగం: బలహీన వర్గాలు' అనే అంశమే కాక గత ఏడు దశాబ్దాలుగా వచ్చిన కొత్త చట్టాలను చాలా లోతుగా విమర్శనాత్మకంగా వివరించేవాడు. ఆయనకు సామాజిక సంక్లిష్టతపై అలాగే వ్యవస్థాగత పరిమితులు, వైరుధ్యాలపై సమగ్ర అవగాహన ఉండడం వలన విద్యార్థులను చాలా లోతైన చర్చలోకి తీసుకు వెళ్లేవాడు. అలాగే ఈ పాఠ్యాంశాల మీద మేము విద్యార్థుల కొరకై ప్రచురించిన స్టడీ మెటీరియల్‌లో విలువైన వ్యాసాలు వ్రాసారు. ఇప్పటికీ ఆయన వ్రాసిన పాఠాలే ఈ కేంద్రం ఉపయోగిస్తున్నది. బహుశా భారతదేశంలో రాజ్యాంగం మీద ఇంత విమర్శనాత్మక అవగాహన ఉన్న లా ప్రొఫెసర్స్ చాలా తక్కువ మంది ఉన్నారు. ప్రొఫెషర్ శేషయ్యకి మార్క్సిజం తాత్విక, చారిత్రక లోతులు తెలుసు. పౌరహక్కుల సంఘం దాదాపు దశాబ్ద కాలం జరిపిన వాడి, వేడి చర్చల్లో ఆయన కీలకపాత్ర నిర్వహించాడు. మార్క్సిస్టు దృష్టిలో మానవ హక్కులు, మానవ హక్కుల దృష్టిలో మార్క్సిజం అనే చర్చ జరిగినప్పుడు మార్క్సిస్టు దృక్కోణం నుండి హక్కులు అనే పంథా వైపు చాలా దృఢంగా నిలబడ్డాడు. ఆ దృక్పథం తీసుకున్న కార్యకర్తలకు కొత్త విశ్వాసాన్ని, ఆత్మస్థైర్యాన్ని ఇచ్చాడు. తన వ్యక్తిగత మంచితనం వలన చర్చ సుహృద్భావ వాతావరణంలో జరిగేలా చూసాడు. బహుశా ప్రపంచంలో ఏ హక్కుల ఉద్యమంలో కూడా ఇంత సమగ్ర చర్చ నాకు తెలిసినంత వరకు జరగలేదు. చర్చ చాలా కాలం జరిగినా ఒక ఆరోగ్యకర వాతావరణంలో సాగింది. దృక్పథాలలో ఎన్ని విబేధాలున్నా వ్యక్తిగత మానవ సంబంధాలు ఆత్మీయతతో కొనసాగాయి. సంస్థ విడిపోయినా మానవ హక్కుల వేదికకు పౌరహక్కుల సంఘానికి ఎక్కడ బహిరంగ సభ జరిగినా సభ్యులందరూ సంయమనం పాటించేలా ఒక వైపు బాలగోపాల్ మరొక వైపు శేషయ్య చాలా కృషి చేసారు. మా ఇద్దరి మధ్య దృక్పథాలలో కొంత తేడా ఉన్నా నేను పౌరహక్కుల సంఘంలో కొనసాగడానికే నిశ్చయించుకున్నాను. సంస్థ విడిపోయిన తర్వాత పౌరహక్కుల సంఘానికి శేషయ్య అధ్యక్షుడుగా, అమరుడు పురుషోత్తం సెక్రటరీగా బాధ్యతలు తీసుకుంటే సంస్థ చాలా చురుకుగా పని చేస్తుందని బాలగోపాల్ ఒక స్నేహపూరిత సలహా ఇచ్చారంటే శేషయ్య పట్ల బాలగోపాల్ గౌరవం, అలాగే సంస్థ బాగా పనిచేయాలనే ఆకాంక్ష ఎంత బలంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

రాయలసీమ వెనుకుబాటుతనం తెలిసినవాడుగా శేషయ్య తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి తన పూర్తి మద్దతు ప్రకటించాడు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించడం పౌరహక్కుల ఉద్యమ ప్రజాస్వామిక స్వభావానికి నిదర్శనమని భావించేవాడు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమం ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ డిమాండ్ ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించిన మొదటి సంస్థ. ఇలా రెండు ప్రాంతాలవారు అంగీకరించేలా చూడబట్టే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా రెండు ప్రాంతాల ఉద్యమానికి శేషయ్యను సమన్వయకర్తగా ఎన్నుకోవడంలోనే ఆయన విశిష్ట వ్యక్తిత్వం చూడవచ్చు.

ప్రొ. శేషయ్యకు ఉన్న ప్రతిష్ఠ వలన శాంతిచర్చలలో ఆయన ఒక మధ్యవర్తి పాత్ర నిర్వహించారు. చర్చల సందర్భంలో భూసంస్కరణల గురించి, అలాగే పౌర ప్రజాస్వామిక హక్కులకు సంబంధించిన చర్చకు ఆయన చాలా దోహదపడ్డారు. మిగతా మధ్యవర్తుల్లాగే ప్రజా సమస్యలకు చర్చలు ఏ మేరకు ఉపయోగపడినా ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని భావించాడు. హింస ప్రతిహింస వలయం నుండి బయటపడి ఇటు రాజ్యం అటు విప్లవోద్యమంలో రాజకీయాల ప్రాధాన్యత పెరగాలనేది చర్చల లక్ష్యం. అయితే చర్చలు ఫలవంతంగా జరుగుతాయనే విశ్వాసం ఆయనకు ఎక్కువగా ఉండేది కాదు. అయినా ఆ ప్రయత్నానికి తన వంతు కృషి చేసారు.

శేషయ్య కేవలం రాజ్యాంగాన్ని విశ్లేషించడమేకాక రాజ్యాంగ నిబంధనలను ఎలా ప్రజల ప్రయోజనానికి ఉపయోగించాలని ఆలోచించబట్టే రాయలసీమ సమస్యల మీద ప్రత్యేక దృష్టి పెట్టి స్థానిక సమస్యలకు స్పందించి తన ప్రయత్నం తాను చేసేవారు. అనంతపురం జిల్లా కరువు గురించి, వెనకబాటుతనాన్ని గురించి, అస్తిత్వాన్ని గురించి పట్టించుకొని మాట్లాడాడు. అలాగే ప్రజల సమస్యలకు నిర్దిష్ట పరిష్కారాల కొరకు ఆయన చేసిన కృషికి సంబంధించిన చాలా సంఘటనలు ఉన్నా రెండు సంఘటనలు ఇక్కడ పేర్కొనాలి. అనంతపురంలో దాదాపు 150 కుటుంబాలు నిర్వాసితులైనప్పుడు వాళ్ల పునరావాసం గురించి తనకుండే పలుకుబడిని, హక్కుల అవగాహనను ఉపయోగించి వాళ్ళకు పునరావాసం జరిగే దాకా పోరాడి దాంట్లో విజయం సాధించాడు. ఇప్పుడు ఆ కుటుంబాలు తమకంటూ ఒక కాలనీ ఏర్పరుచుకొని అందులో జీవిస్తున్నారు. అలాగే స్పిన్నింగ్ మిల్ కార్మికులు సమ్మె చేస్తే మిల్లు మూసివేయకుండా చూడడమే కాక వాళ్ల సమస్య పరిష్కారానికి దోహదపడ్డాడు. ఇవి కేవలం మచ్చుకు ఉదాహరణలు మాత్రమే. తన దృష్టికి ఏ సమస్య వచ్చినా దానికొరకు తన వంతు పాత్ర నిర్వహించడం వలన, రాయలసీమ ప్రజలు శేషయ్య వైపు చూడడం వలన ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠ పెరగడమే కాక పౌరహక్కుల ఉద్యమానికి పేద వర్గాలలో సాధికారత సాధించగలిగారు.

ఆయన నిర్వహించిన పాత్ర వల్ల రాజ్య ఆగ్రహానికి గురి అయ్యాడు. ఆయన ఇంటి మీద దాడి చేశారు. ఆయన వాహనాన్ని ధ్వంసం చేశారు. అలాగే ఉమ్మడి రాష్ట్రంలో పోలీసులు ప్రోత్సహించిన పులులు, వేటకుక్కల పేర అసాంఘిక శక్తులు ఆయనను బెదిరించేవారు. ఆ బెదిరింపులకు భయపడక అదే పట్టుదలతో చివరి శ్వాస వరకు ప్రజల పక్షాన నిలబడ్డారు. ప్రజాస్వామిక శక్తులు శేషయ్య స్ఫూర్తితో పని చేసి ఒక మానవీయ ప్రజాస్వామ్య సమాజ సౌధ నిర్మాణానికి రాళ్ళు మోయవలసిందే. అదే ఆయనకు సరైన నివాళి.

దోచుకున్నవాడికి... దోచుకున్నంత....

రామగౌతం



నానాటికీ తీసికట్టు నామం బొట్టు అని వెనకటికి సామెత. లేదా చదవేస్తే ఉన్నమతి పోయింది అన్నది ఇంకో సామెత. దేశం మొత్తం సంగతి పక్కన పెడితే తెలుగు రాష్ట్రాల రాజకీయాలు, ముఖ్యంగా ఆంధ్ర రాజకీయాలు ఇలాగే వున్నాయి. నామం బొట్టు మాదిరిగానే నానాటికీ తీసికట్టు అవుతున్నాయి. చదువుకున్న వాళ్లు రాజకీయాల్లోకి వస్తే దేశం బాగుపడుతుంది అంటే జనం నిజమనుకున్నారు. నిజంగానే యువతరం రాజకీయాల్లోకి వచ్చింది. కానీ దేశం ముందుకు వెళ్లడం సంగతేమో కానీ రాజకీయాలు మరింత దిగజారాయి. స్వాతంత్ర్యానికి పూర్వం రాజకీయాలు లేవు. స్వాతంత్ర పోరాటం మాత్రమే వుంది. అప్పుడు నాయకుల సంఖ్య అతి తక్కువ. అనుచరుల సంఖ్య చాలా ఎక్కువ. అప్పట్లో స్వతంత్ర సాధన తప్ప మరో ఆలోచన లేదు. స్వార్థం లేదు. సంపాదన ఆలోచన లేదు, స్వతంత్రం వచ్చింది. అప్పుడు దేశంలో రాజకీయాలు అన్నవి పూర్తి స్థాయిలో ప్రారంభం అయ్యాయి. నిజానికి రాజకీయాలు అనే కన్నా అధికార రాజకీయాలు అన్నవి కీలకంగా మారాయి. అధికారం అన్నది కేవలం ఓ హోదాగా, పరపతిగా భావించే కాలం అది. రాజ్యాలు పోయాయి. రాజులు పోయారు, జమీందారులు పోయారు, జమీలు పోయాయి. పరగణాలు పోయాయి. కానీ అజమాయిషీ వుండాలనుకునే కాలం అది. అందుకే ఆ అజమాయిషీ కోసమే, ఆ అధికార సాధన కోసమే రాజకీయాలు చేసేవారు. అవినీతి అనే పదం చాలా అరుదుగా వినిపించేది.

1960 నుంచి 70 మధ్యకాలం

ఈ దశకంలో రాజకీయ నాయకులు కాస్త సంపాదనకు అలవాటు పడడం ప్రారంభమైంది. కానీ ఆ ఆదాయ మార్గాలు ఇప్పుడు వింటే, చిలక్కొట్టుడు మాదిరిగా, చిరుతిళ్ల మాదిరిగా వుంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలు ముఖ్యంగా ఎయిడెడ్ లేదా రెగ్యులర్ టీచర్ పోస్టులు వేయించడం, బదిలీలు చేయించడం, సిమెంట్ పర్మిట్లు, బస్ పర్మిట్లు అరేంజ్ చేయడం వంటివి చేసేవారు. ఆ విధంగా చిన్న చిన్న మొత్తాలు ఆర్జించేవారు. జనాలకు ఓట్లకు డబ్బులు ఇచ్చే వ్యవహారం అంతగా వుండేది కాదు. డ్యూటీ పడిన ఎన్నికల సిబ్బందికి మాత్రం ఆయా ఊళ్లలో సకల సదుపాయాలు కల్పించేవారు. ఇలా అప్పుడే అధికారం అడ్డు పెట్టుకుని సంపాదించడం అనే అడుగు పడింది అవినీతి తొలి అడుగు ఈ నియామకాలు, బదిలీలు, పర్మిట్లు అనే రంగం మీద పడింది.

1970 నుంచి 83 మధ్యకాలం

రాజకీయాలు పోటీ అనే దారి నుంచి కుట్రలు కుతంత్రాలు, కాళ్ల లాగడాలు వంటి దారి పట్టాయి. అధికార లాలస భయంకరం అయిపోయింది. గ్రూపు రాజకీయాలు పెరిగాయి. దీని ఫలితంగా ఎప్పుడు ఏ ముఖ్యమంత్రి ఉంటారో, ఎప్పుడు ఏ సీఎమ్ గద్దె దిగుతారో? అన్నపరిస్థితి వచ్చింది. తెలుగు రాష్ట్రంలో తొలిసారి సామాజిక బేధాలు తెర వెనుక పురుడు పోసుకున్నాయి. రాష్ట్రంలోని అన్ని విధాలా బలమైన కమ్మ సామాజిక వర్గం తొలిసారిగా తమకు ఓ పార్టీ వుండాలనే ఆలోచన చేసింది. ఫలితంగా పుట్టుకువచ్చిందే తెలుగుదేశం పార్టీ.

తెలుగుదేశం పార్టీ కుల బంధాల సంగతి అలా వుంచితే, ఆ పార్టీ వస్తూనే చేసిన ఓ పనేమిటంటే, దాదాపు 90 శాతం మంది కొత్త, యువ రక్తాన్ని రాజకీయాల్లోకి తీసుకురావడం. అప్పటి వరకు ఓ మాట ఎక్కువగా వినిపించేది. రాజకీయాల్లోకి యువత రావాలి. అప్పుడే దేశానికి మంచి జరుగుతుంది. కొత్త తరం రాజకీయాలు కనిపిస్తాయి అని పదేపదే పెద్దలు వేదికల మీద చెప్పేవారు. ఆ విధమైన మార్పుకు తెలుగుదేశం నాంది పలికింది.

కానీ...అదే తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయాల్లో కొత్త తరహా అవినీతికి బీజం వేసింది. అప్పటి వరకు అవినీతి అంతంత మాత్రంగా వుండేది. పైగా కుంభకోణాలు అని అప్పుడప్పుడు వినిపించేవి. కానీ యువరక్తం రాజకీయాల్లోకి వచ్చాక అవినీతికి అనే కన్నా డబ్బు సంపాదనకు రాజకీయాలు వాడుకోవడం అనే కొత్త మార్గాన్ని కనిపెట్టారు. అది ఆదిగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాధికారం, ధన సంపాదన, రెండూ పూర్తిగా మమేకమై, చెట్టాపట్టాలు వేసుకుని తిరగడం ప్రారంభమైంది. ఇలా రాజకీయాధికారం-ధన సంపాదన ఎప్పుడయితే కీలక

విషయాలుగా మారిపోయాయో, చిన్న చిన్న చిరుతిళ్లు మానేసారు.

కొడితే ఏనుగు కుంభస్థలం కొట్టాలనే పద్ధతికి అలవాటు పడ్డారు. ఆ విధమైన ఆలోచనకు, ఆ విధమైన సంపాదనకు రాజకీయ నాయకులకు అనువుగా కోట్లకు కోట్లు సంపాదించేందుకు దోహదం పడే రంగాలు కొన్ని వున్నాయి. ఇక్కడ చిన్న ఉదాహరణ. ఓ ఉత్తరాంధ్ర జిల్లాలో ప్రైవేటు బస్‌లు వుండేవి. ఆ రూట్లు జాతీయం అనే మాట తరచు వినిపించేది. అలా వినిపించినపుడు బస్ యజమానులు సూట్ కేసుతో హైదరాబాద్ లో వాలిపోయేవారు. ముందే చెప్పుకున్నట్లు రోజులు మారాక మళ్లీ జాతీయం అన్నారు. సూట్ కేసులు రెడీ అయ్యాయి. సంబంధిత పెద్దాయిన బస్ ఓనర్లతో ఇలా అన్నారని అప్పట్లో వినిపించింది. "..మీరు ఇచ్చే ఈ బుల్లి సూట్ కేసు నాకెందుకు? ఒకేసారి వందల బస్‌లు కొంటే వచ్చే పెద్ద సూట్ కేసు లెక్కే వేరు." అని. ఇది మారిన రాజకీయ సంపాదనా విధానానికి అద్దం పడుతుంది. రాజకీయ నాయకుల సంపాదనలో కీలకమైన రంగాలు ...1. భూములు...2. మైనింగ్... 3. కాంట్రాక్టులు... 4..బినామీ పెట్టుబడులు..ఇవీ కీలకమైనవి. వీటిల్లో వచ్చే ఆదాయాన్ని లేదా దోచుకునే ఆదాయాన్ని చూస్తే, అంతకు ముందు తరం రాజకీయ నాయకులు ఎంతటి అమాయకులో లేదా, ఎంతటి అల్ప సంతోషులో అనిపిస్తుంది.

ఎందుకంటే ఈ కొత్త తరం యువ రాజకీయ నాయకులకు డబ్బు సంపాదనలో తెలిసినన్ని మార్గాలు కానీ, కనిపెట్టినన్ని దారులు కానీ సీనియర్లకు పాపం తెలియనే తెలియవు. ఇన్ని డబ్బు సంపాదన మార్గాలు ఆనాటి రాజకీయ నాయకులకు తెలియవు. జనాల దగ్గర తీసుకోకుండా ఇన్ని ఆదాయ సముపార్జన మార్గాలు వున్నాయన్నది ఈ తరం రాజకీయ నాయకులు నేర్చుకున్న కొత్త విషయం.

1. భూములు

భూమిని నమ్ముకున్నవాడు ఎప్పుడూ చెడిపోడు అన్నది ఓ నానుడి. రైతు భూమిని అమ్ముకుంటుంటే, నాయకులు భూమిని నమ్ముకున్నారు. ఎక్కడ అనాథ భూములు వున్నాయి. ఎక్కడ పోరంబోకు లేదా బంజర్లు వున్నాయి, ఎక్కడ దేవాలయ భూములు వున్నాయి ఇలా దుర్భిణీ వేసి ఎవరి నియోజక వర్గాల్లో వారు గాలించేసి, గాయబ్ చేయడం ప్రారంభమైపోయింది.

భూములు సంపాదించాలంటే చాలా మార్గాలు వున్నాయి. మొదటిది కొనుగోలు చేయడం. ఈ పని రాజకీయ నాయకులు పెద్దగా చేయరు. బ్లాక్ మనీ వస్తే, దాన్ని తీసుకెళ్లి ఎక్కడో పెద్ద మొత్తంలో భూములు కొంటారు తప్ప లేదంటే కొనే పని చేయరు. దేవాలయ భూములు వుంటే, లాంగ్ టర్మ్ లీజ్‌కు సంపాదించడం. ఏకంగా 99 ఏళ్ల లీజు. ఆ లీజు మొత్తాలు చాలా తక్కువ మొత్తాల్లో వుండేలా చూసుకోవడం. ఆపైన వాటిని సబ్ లీజుకో, అద్దెకో ఇచ్చి కోట్లు సంపాదించడం. విశాఖలో ఆర్టీసీ స్థలాలు అన్నీ ఇలాగే మాయం అయ్యాయి. వాటిల్లో ఇప్పుడు భారీ మాల్స్, నగల దుకాణాలు వచ్చి చేరాయి. దేవాదాయ శాఖ ఆలయాలు, ధర్మ సత్రాలు నిర్వహణకు పూర్వం దాతలు, ధర్మ ప్రభువులు వేలాది ఎకరాలు దానం చేసారు.

ఇప్పుడు ఆ భూములు అయితే అమ్మకం లేదా లీజు. భూములు లేకుండా దీనంగా మిగిలిన ధర్మ సత్రాలు కూడా లీజుకు ఇచ్చేసారు. మళ్లీ ఈ అద్దెల వసూళ్లలో సవాలక్ష అవకతవకలు. చాలా వరకు తొంభై శాతం దేవాలయ భూములు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ నాయకుల వద్దకు చేరిపోయాయి. ఇక భూములు సంపాదించడానికి రెండో మార్గం. సంస్థలు పెట్టడం. సంస్థలు అంటే రకరకాలు. ఇండస్ట్రీలు, విద్యా సంస్థలు, ట్రస్ట్ లు, ఇలా రకరకాలు. ప్రైవేటు విద్యా సంస్థలకు అసలు ప్రభుత్వం స్థలాలు ఎందుకివ్వాలో అన్నది అర్థం కాని ప్రశ్న. పోనీ వీళ్లేమైనా ఉచితంగా విద్య నేర్పుతారా? అంటే అదీ వుండదు. అటానమస్ పేరిట ఫీజులు వారి ఇష్టం. డొనేషన్ల, పేమెంట్ సీట్లు ఇలా లెక్కే లేదు. ప్రభుత్వం మన చేతిలో వుంటే చాలు ఈ మార్గంలో భూములు సంపాదించడం పెద్ద కష్టమే కాదు. పేపర్ చేతిలో వుంటే భూమి అడగవచ్చు, సినిమాలు తీసేవాళ్లు అయితే భూమి తెచ్చుకోవచ్చు, ఓ ఫ్యాక్టరీ పెడతాం అని భూమి సంపాదించవచ్చు.

ఇచ్చిన భూమి సక్రమ వినియోగం చేయకపోతే, వెనక్కు తీసుకుంటామని అంటే కోర్టులు వుండనే వున్నాయి. ఇలా వెళ్లి, అలా స్టే తెచ్చుకుని ఏళ్లకు ఏళ్లు ఆ భూములను అనుభవించడం. పైగా ప్రభుత్వం దగ్గర భూములు తీసుకుని, ఆ భూములనే తాకట్టు పెట్టి రుణాలు తెచ్చుకోవడం. ఆ రుణాలు ఎగ్గొడితే బ్యాంకులు భూముల మీదకు వస్తే మళ్లీ స్టే. ఛారిటీ పేరుతో ప్రైవేటు ఆసుపత్రులకు ప్రభుత్వ భూములు. ఇదో పెద్ద చిత్రమైన వ్యవహారం. ప్రైవేటు ట్రస్ట్ ఆసుపత్రులకు ప్రభుత్వ భూములు ఇస్తే కొంతమందికి అయినా ఉచిత వైద్యం చేసే షరతు మీద ఇస్తారు. కానీ ఆ తరువాత ఆ షరతు ఎలా నెరవేరుతోందో గమనించేవారు ఉండరు.

ఈ షరతు పక్కన పెడితే మిగిలిన వారిని ఫీజుల పేరుతో ఎలా పీల్చి పిప్పి చేస్తున్నారో పట్టించుకునేవారు వుండరు. ట్రస్ట్ ఆసుపత్రి పేరుతో కోట్లు కొల్ల కొట్టడానికి ప్రభుత్వ భూములు. పైగా ఆసుపత్రి నేరుగా పరీక్షలు, ఫీజులు వసూలు చేయదు. దానికి మరో బినామీ కంపెనీ వుంటుంది. దానికి దీనికి నామినల్ గా చిన్న మొత్తంతో ఒప్పందం వుంటుంది. ట్రస్ట్ ఆదాయం అంతే. కానీ కోట్లు ఫీజుల పేరుతో కొల్లగొట్టే ఆ కంపెనీ నుంచి దొడ్డిదారిన ఆసుపత్రి యాజమాన్యాలకు అందాల్సినమొత్తం అందాల్సిన రూటులో అందుతుంది.

ఇక బి ఫారం పట్టా భూములు, ఇనాం భూములు, అనాథ భూములు అంటూ ఇలా సవాలక్ష వ్యవహారాలు. రెవెన్యూ వ్యవహారాలు తెలిసిన వారు ప్రక్కన వుంటే చాలు, ప్రభుత్వం మనదైతే చాలు ఎన్నోవిధాలుగా సంపాదించవచ్చో భూముల్ని. అన్ని విధాల్లోనూ ఆరితేరిపోయారు మన రాజకీయ నాయకులు. ఇంక అలాంటి నేపథ్యంలో చిన్నచిన్న చిలక్కొట్టుళ్లు ఎందుకు?

2. మైనింగ్

రాజకీయ నాయకులకు మైనింగ్ అనేది కామధేనువు. పిండుకున్నవారికి పిండుకున్నంత. మైనింగ్ అంటే బహుళార్థక పదం. ఇసుక దగ్గర నుంచి గ్రానైట్ మీదుగా ముడి ఇనుము వరకు ఏదైనా వుండొచ్చు. ఈ మైనింగ్ వ్యాపారంలో తెలుగుదేశానికి మద్దతు ఇచ్చే ఓ సామాజిక వర్గం ఆరితేరిపోయింది. ఎంత ఆరితేరిపోయింది అంటే ఈ జిల్లా ఆ జిల్లా అని లేదు.

ప్రతి జిల్లాకు ఈ వ్యాపారం పేరుతో పాకేసింది. విశాఖ జిల్లాలో మైనింగ్ వ్యాపారం మూడు వంతులు ఈ వర్గం చేతిలోనే. మైనింగ్ లైసెన్స్ సంపాదించడం అంటే అంత సులువు కాదు. ఆ వ్యాపారంలో ఆరితేరి వుండాలి. రాజకీయ నాయకుల అండా దండా వుండాలి. అప్పుడే సాధ్యం. ఈ వ్యాపారంలో చలామణీ అయ్యేంత నల్ల ధనం మరెక్కడా వుండదని ప్రతీతి. ఈ మైనింగ్ వల్ల ఇటు రాజకీయ నాయకులు అటు ఆ రంగంలోని కీలక ఉద్యోగులు ఇద్దరికీ లాభసాటి వ్యవహారమే. జరుగుతున్న అక్రమ మైనింగ్ ను చూసీ చూడనట్లు వదిలేయడమే ఈ ఉద్యోగుల కర్తవ్యం. ఎంత ఏరియా లీజుకు తీసుకున్నారు, ఎంత ఏరియాకు తవ్వకాలు ఆక్రమించారు. ఎన్ని టన్నులకు ప్రభుత్వానికి ఇవ్వాల్సింది ఇచ్చారు. ఎన్ని టన్నులకు ఎగ్గొట్టారు అన్నది ఎవరికీ పట్టని వ్యవహారం. ప్రతి మైనింగ్ లోనూ ఇదే వ్యవహారం. ఓ గోదావరి జిల్లాలో గతంలో అధికారంలో వున్న ఓ ఎంపీ కేవలం ఇసుక మీద వందల కోట్లు వెనకేసారని వార్తలు వినిపిస్తూ వుంటాయి ఇప్పటికీ. శ్రీకాకుళం నుంచి ప్రకాశం వరకు, అటు రాయలసీమలో మైనింగ్ మీద సంపాదించని రాజకీయ వేత్తలు లేరంటే అతిశయోక్తి కాదు.

ఇలా మైనింగ్ మీద వచ్చిన నల్ల ధనాన్ని సినిమాల్లోకి పంప్ చేసే మహానుభావులు మరెందరో? అదే నల్ల ధనాన్ని రియల్ ఎస్టేట్ లోకి పంపించి మళ్లీ అంతకు అంతా సంపాదించడమే కార్యక్రమం. పొరపాటున అక్రమ మైనింగ్‌ను కనిపెట్టి ఎవరైనా సీజ్ చేస్తే, కోర్టు, స్టే వుండనే వుంటాయి. మరి వందల కోట్లు తెచ్చే మైనింగ్ వుండగా, బదిలీలు, చిన్న చిన్న పనులు లాంటి

చిలక్కొట్టుళ్లు రాజకీయ నాయకులకు ఎందుకు?

3. కాంట్రాక్టులు

కాంట్రాక్టులు అంటే చిన్నా చితక అర్థం కాదు. పైగా ఇప్పుడు కొత్తగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే కొత్త పేరు వచ్చింది దీనికి. ప్రభుత్వ పనులు కాంట్రాక్టు తీసుకోవడం, చేసుకోవడం అన్నది సింపుల్ మీనింగ్. కానీ దీని వెనుక చాలా వుంది. ప్రభుత్వ పనుల ప్లానింగ్ దగ్గర నుంచే అవినీతి ఆరంభం అవుతుంది. మామూలుగా మనం చేయించుకుంటే ఓ పని పది రూపాయల్లో అవుతుంది అనుకుంటే కాంట్రాక్టుకు ఇస్తే 15 రూపాయలు అవుతుంది. కానీ మన సౌలభ్యం కోసం కాంట్రాక్టు ఇస్తాం. అదే పని ప్రభుత్వం చేస్తే యాభై రూపాయల అంచనా వుంటుంది. అంటే ప్రభుత్వ పనుల ఎస్టిమేషన్ నుంచే అవినీతి ఆరంభం అవుతుంది. మామూలుగా యూనిట్ కు అయిదు వందలు అయ్యే పని ప్రభుత్వం లెక్కల్లో వెయ్యి రూపాయలు వుంటుంది. కాంట్రాక్ట్ లో లోయెస్ట్ కొటేషన్ అని ఇచ్చినా అక్కడికి ఇంకా బోలెడు లాభం వుంటుంది. ఇది లోకల్ రాజకీయ నాయకులకు పదిశాతం, సంబంధిత ఉద్యోగులకు పదిశాతం, ఇంకా చిన్నా చితక జనాలకు పదిశాతం పోగా, కనీసం ఇరవై శాతం కాంట్రాక్టర్‌కు వుంటుంది

కానీ పెద్ద పనుల వ్యవహారం ఇంకోలా వుంటుంది. ముందుగా కాంట్రాక్టు తీసేసుకుంటారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ అనే పేరిట ప్రభుత్వమే వడ్డీ లేని అప్పు ఇస్తుంది. ఆ మొత్తం చేతిలో పడ్డాక మెల్లగా పనులు మొదలు పెట్టొచ్చు. సగంలోకి తెచ్చి ఆపేయచ్చు కూడా. ఎందుకు ఆపేసారు అంటే రేట్లు గిట్టడం లేదు అని ఓ లెటర్ రాసిపడేయడమే. గిట్టనపుడు ఎందుకు ఒప్పుకున్నావు అని ప్రభుత్వం అడగదు. ఉదారంగా మళ్లీ అంచనాల సవరిస్తుంది. రేట్లు పెంచుతుంది దాంట్లో మళ్లీ ఎవరి కమీషన్లు వారికి వుంటాయి. కానీ ఇలా కాంట్రాక్టులు సంపాదించడం, రేట్లు సవరించడం అంటే అందరికీ సాధ్యం అయ్యే పని కాదు. కేవలం అధికారంలో వున్నవారికి, వారిని నమ్ముకున్నవారికి మాత్రమే సాధ్యం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కాంట్రాక్టుల్లో బిఓటి అన్నది మరీ చిత్రం, ఇలాంటివి అందరికీ రావు చాలా చాలా పలుకుబడి వుండాలి. ఆయా కంపెనీల్లో రాజకీయ నాయకుల బినామీ పెట్టుబడీ వుండాలి. కంపెనీ ప్రొఫైల్ చూపించి రోడ్ కాంట్రాక్టు తెచ్చుకోవడం, ఆ కాంట్రాక్టు చూపించి ఇంత ఆదాయం వస్తుందని లెక్కలు కట్టి, బ్యాంకుల నుంచి లోన్లు తెచ్చుకోవడం, ఆపై పని పూర్తి చేసి, ఇక టోల్ గేట్ ల పేరుతో, యూజర్ చార్జీల పేరుతో దండుకోవడమే దండుకోవడం.

4.బినామీ పెట్టుబడులు

ఈ పదానికీ నానార్థాలు వున్నాయి. తమ తమ నియోజక వర్గం పరిధిలో లాభసాటి వ్యాపారాలు చాలా వాటిలోకి రాజకీయ నాయకుల బినామీ పెట్టుబడులు వెళ్తూనే వుంటాయి. రాజకీయ నాయకుల బినామీ పెట్టుబడులు ఉభయతారకంగా వుంటాయి. బార్ల దగ్గర నుంచి మాల్స్ వరకు రాజకీయ నాయకుల పెట్టుబడులు వుంటే వ్యాపారంలో ఎలాంటి అక్రమాలు వున్నా చలామణీ అయిపోతాయి. వ్యాపారాలకు అధికారులు అడ్డం పడే పనే వుండదు. చాలా మంది రాజకీయ నాయకుల బినామీ పెట్టుబడులు వారివారి ప్రాంతాలను దాటి దూరం వెళుతుంటాయి. వసూలు కెపాసిటీని బట్టి సినిమాల్లోకి, వడ్డీ వ్యాపారాల్లోకి ప్రవహిస్తుంటాయి. ప్రైవేటు బస్‌ల రూపంలో తిరుగుతుంటాయి. మరీ భారీ మొత్తాలు అయితే చాలా ధర్మంగా రూపాయి వడ్డీకి, కాస్త మీడియం మొత్తాలు అయితే రెండు రూపాయల వడ్డీకి తిరుగుతుంటాయి. తమ దగ్గరకు వివిధ పనుల మీద వచ్చే వ్యాపార జనాలను, వారి వ్యాపారాలను కని పెట్టి, వాటిలోని లాభసాటిని గుర్తించి, తమ డబ్బును అందులోకి మళ్లించడం అన్నది రాజకీయ నాయకులు నేర్చుకున్న కళ.

5. బ్యాంకు రుణాలు

అన్నింటికి మించిన ఆదాయం బ్యాంకు రుణాల్లోనే. రాజకీయాల అండ వుంటే రుణాలు ఈజీ అవుతాయి. కేంద్రంలో పలుకుబడి వుండాలి. ఎంపీ పదవి చేతిలో వుండాలి. వందలు, వేల కోట్ల రుణాలు వచ్చి పడతాయి. చాలా పద్ధతిగా కంపెనీలు ఫ్లోట్ చేయాలి. ప్రొఫైల్ పెంచాలి. ఆపై రుణాలు. రుణాల మీద రుణాలు. ఆపై రాని బాకీలు. పలుకుబడి ఉపయోగించి రద్దు చేయించుకోవడం. మోడీ వచ్చే వరకు ఇది చాలా వరకు నడిచింది. ఎప్పుడు అయితే బ్యాంకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చి, ఇలాంటి వ్యవహారాలు కట్టడి చేసారో, ఇక అక్కడి నుంచి ఈ లోన్ల బాగోతం బయటకు రావడం ప్రారంభం అయింది. లగడపాటి, రఘురామకృష్ణం రాజు లాంటి రాజకీయ నాయకులకు, డెక్కన్ క్రానికల్ లాంటి మీడియా కంపెనీలకు వేల కోట్ల బ్యాంకు రుణాల బకాయిలు వున్నాయంటే, ఏం జరిగివుంటుందో అర్థం చేసుకోవచ్చు. కేవలం బ్యాంకులను, వాటి రుణాలను అడ్డం పెట్టుకుని, కోట్ల దగ్గర నుంచి వందలు,వేల కోట్లను ఈ దేశంలో బడాబాబులు దోచేసారంటే ఈ దోపిడీని అర్థం చేసుకోవచ్చు.

6 ఇంకా ఎన్నో కేవలం ఇవి మాత్రమే కాదు. రాజకీయ నాయకులు సంపాదనకు, సంపాదించిన దానిని అంతకు అంతా చేసుకోవడానికి వున్న మార్గాలు. అవి అనంతం. ప్రతి రంగంలోనూ ఇవ్వాళ రాజకీయ నాయకులు చొచ్చుకుపోయారు. లేదూ అంటే ప్రతి రంగంలోనూ రాజకీయ నాయకుల పెట్టుబడులు వున్నాయి. వారి వారి నియోజక వర్గాల్లో ఎక్కడ సంపాదన వుంటే అక్కడ వాలిపోవమడే. ఆఖరికి నియోజక వర్గ నిధుల్లో కూడా కమిషన్ వ్యవహారాలు. ఎంపీ నిధులు, ఎమ్మెల్యే నిధులు అంటే 10 పర్సంట్ ఆటోమెటిక్ గా వారి జేబుల్లోకి రావాల్సిందే. 10 పర్సంట్ ఇచ్చేస్తే చాలు ఫండ్స్ రిలీజ్ అయిపోవడమే. రాజకీయం ఇంత లాభసాటిగా మారింది కేవలం చదువుకున్న రాజకీయ నాయకుల వల్ల. అంతే కానీ పంచెలు కట్టిన నాటి తరం రాజకీయ నాయకుల వల్ల కాదు. వారి హయాంలో పరిస్థితి చాలా మెరుగు. ఇప్పటి పరిస్థితితో అంచనా వేస్తే. ఇక్కడ తప్పు పట్టాల్సింది రాజకీయ నాయకులను మాత్రమే కాదు. మీడియాను కూడా. ఎందుకంటే మీడియాకు కూడా ఈ పాపంలో భాగం వుంది. అది మూడు విధాలుగా.

1. తమకు అనుకూలమైన పార్టీ అధికారంలో వుంటే ఇలాంటి వ్యవహారాలు అన్నీ కప్పి పుచ్చడం. అదే మన పార్టీ అధికారంలో లేకపోతే అదేదో అన్యాయం ఇప్పుడే కొత్తగా జరుగుతునట్లు గగ్గొలు పెట్టడం.

2. బడా కాంట్రాక్టుల నుంచి దొడ్డి దారిన ముడుపులు అందుకోవడం.

3. లోకల్ లో కొందరు మీడియా జనాల చిలక్కొట్టుడులు. బెల్ట్ షాపులు, ఇసుక తవ్వకాలు, గ్రావెల్ తవ్వకాలు, ఇలా లోకల్ లో జరిగే ప్రతి దందాలోనూ అక్కడ చిన్న, చితక మీడియా జనాలకు పావల, పదిపైసలు కేటాయించడం అన్నది, కొన్ని చోట్ల నెలవారీ పంపకాలు అన్నవి వున్నాయన్నది క్షేత్ర స్థాయిలో వినిపించే వాస్తవం. పెద్ద వాళ్లు తింటే ఫలహారం అయినపుడు, చిన్నవాళ్లు తింటే చిరుతిళ్లు ఎందుకు అవుతాయి. వారి వ్యవహారం వారిది.

మొత్తం మీద రాష్ట్రాన్ని అన్ని విధాలుగా డబ్బుగా మార్చేసుకుంటున్నారు. దోచేసుకుంటున్నారు. ఇది ఈ పార్టీ వ్యవహారం,. ఆ పార్టీ వ్యవహారం కాదు. 1980 దశకం నుంచి ఇప్పటి వరకు ఏ పార్టీ అధికారంలో వున్నా జరుగుతున్న వ్యవహారం. అవసరం అయితే చటుక్కున పార్టీలు మారేది అందుకే. వీరికి పార్టీలు ముఖ్యం కాదు. వ్యాపారాలు ముఖ్యం..దోపిడి ముఖ్యం. ఇది భూమి లోలోపలికీ వేళ్లానుకుపోయిన విషవృక్షం. ఇలా వెర్రి తలలు వేస్తూ ఎదుగుతూనే వుంటుంది. నిజానికి మోడీ స్వచ్ భారత్ అంటూ రెండేళ్లు ప్రయత్నించి ఊరుకున్నట్లు, ఆంధ్ర సీఎమ్ జగన్ కూడా గత ఏడాదిగా ఈ మైనింగ్ వ్యవహారాలను, భూముల వ్యవహారాలను ఓ కొలిక్కి తేవాలనుకుంటున్నారు. కానీ అదంతా కక్షసాధింపుగా ప్రొజెక్ట్ చేయడం ప్రారంభమైపోయింది. కోర్టులకు వెళ్లడానికి, స్టేలు తెచ్చుకోవడాలు మొదలైపోయాయి. మీడియా వ్యతిరేక కథనాలు ఆరంభమైపోయాయి. మరి జగన్ కూడా ఆరంభశూరుడు అనిపించుకుంటారా? ఈ అవినీతి వేళ్ళూడబీకి, దాని అంతం చూడగలుగుతారా? వెయిట్ అండ్ సీ.

మహిళలకు పూర్తి స్వేచ్ఛ

పి.వినోదిని



భారతీయ సాంప్రదాయంలో ప్రస్తుత తరుణంలో ఒక కుటుంబం సంతోషాలతో ఉన్నదంటే కారణంగా ఆ కుటుంబ బాధ్యతలను మహిళామణులు చూసుకోవ డమనేది నగ్నసత్యం. అలాంటి తరుణంలో పూర్తిగా నిర్ణయ బాధ్యతలు సైతం వారికే ఇస్తే సమాజాన్ని బాగు పరుస్తారు కదా! ఎందుకీ ఈ మగవారి పెత్తనం. అంటే రాజ్యాంగపరంగా వారికంటూ అవకాశాలిస్తూ వాటిని మగవారు చేతుల్లోకి తీసుకోవడమా! ఇది సరైన పద్ధతేనా? కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై దృష్టి కేంద్రీకరించి సరైన చర్యలు తీసుకొని, వారికి ప్రత్యేక శిక్షణలిస్తూ, స్వతహాగా నిర్ణయం తీసుకునేలా, వారి తరపు మగవారి పెత్తనం లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలా చేయకపోతే ఆడవారికి ప్రత్యేక రిజర్వేషన్స్ అనే విషయంలో ఎలాంటి అర్థం, లాభం లేని పరిస్థితి. ఎన్నికలలో గెలిచిన మహిళలకు పూర్తిగా స్వేచ్ఛ ఉండేలా, వారిపై వారి కుటుంబ సభ్యుల నియంత్రణ లేకుండా కార్యాలయాలలో ఆడచాటు మగపెత్తనం ఉండకుండా చర్యలు తీసుకుంటూ మహిళలకు వచ్చిన రిజర్వే షన్సను గౌరవిస్తూ, స్వేచ్ఛను కల్పించే విధంగా ప్రభుత్వాలు పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం ఆడవారంటే వంటింటికే పరిమితం. ఆడపిల్లలను కనడానికి, చదివించడానికి సైతం అంత శ్రద్ధ వహించేవారు కాదు. ఎందుకంటే పెళ్లి చేస్తే అత్తారింటికి వెళుతుంది. మనకెందుకులే అని తెలువకుండానే ఆర్థిక సంబంధాల గురించి తెలియచేసే ప్రక్రియ. ఆ తర్వాత కాలక్రమేణా ఎన్నో మార్పులు. ఎంతోజ్ఞానం. ఒకనాడు డబ్బులిచ్చి వధువును కొనుక్కొనే స్థాయి నుంచి డబ్బులు తెచ్చే వధువు వరకు పరిణితి చెందాం. ఆనాడు భారతీయ మొదటి మహిళా అధ్యాపకురాలుగా పేరుగాంచిన సావిత్రిబాయి పూలే మొదలుకొని, నేటి వాస్తవిక సమాజంలో ఎందరో మహామణుల కృషి ఫలితంగా నేడు వారికంటూ ఒక స్థానాన్ని ఏర్పర్చుకోవడమే కాకుండా మగవారికి ఎంతవరకు రిజర్వేషన్స్ ఉన్నాయో, అంతా మాకుకూడా కావాలని ప్రశ్నించే గొంతుకలను చూస్తున్నాం.

అలాగే 'మాకెవరు సాటి, మాకు మేమే సాటి అనేలా మగవారు చేసే ప్రతిపనిని చేస్తూ నిరూపిస్తున్న తరుణం. ఒక్క రంగంలో కాకుండా ప్రతి రంగంలోకి ప్రవేశించి మహిళ అంటే ఏంటోనని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న ఆదర్శ మహిళలెందరో ఉన్నారు. అలాగే సాహిత్యరంగంలో సైతం ఎందరో మహిళలు ఎన్నో రచనలు చేస్తూ దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్న తరుణం. అందులో భాగంగా ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకుంటున్న సమయం. ఇదియేకాకుండా విభిన్నరంగాలలో మహిళామణులు తమకంటూ ఒకస్థానాన్ని ఏర్పరచుకొని మాకెవ్వరు సాటిలేరని చెప్పే సమయంలో ప్రస్తుత సమాజమున్నది. ప్రత్యేకంగా పాలకవర్గంలో మహిళామూర్తులు ఆదర్శవంతమైన పాలన గావించి తమ ధైర్యసాహసాలను చెప్పకనే చెప్పడం జరిగింది. అలాంటి సందర్భంలో గ్రామీణ ప్రాంతాలలో దానికి విరుద్ధంగా జరుగుతుందని చెప్పడంలో ఎలాంటి అబద్ధం లేదు. స్థానిక ఎన్నికలలో రిజర్వేషన్ల కారణంగా ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పిటిసిలు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు భర్తలకు అవకాశం రాకపోవడంతో వారి భార్యలను ఎన్నికల బరిలోకి దిగబెట్టి, గెలుపొంది, ఆయా స్థానాలను చేజిక్కించుకోవడం జరిగింది. కానీ వారిని కేవలం సంతకాలకే పరిమితం చేసి, వారి స్థానాలలో భార్యచాటు భర్తలా అధికారాలను చెలాయించడం జరుగుతుందంటే కారణం ఏమిటో అర్థంకానీ పరిస్థితి. కార్యాలయాల్లో ఎన్నిక కాబడిన మహిళా మణులున్నా కూడా ఏదైనా అవసరనిమిత్తం వెళ్తే ముందుగా వారి భర్తను కలిసి పర్మిషన్ తీసుకొని, అతను సమాచారం అందిస్తేకానీ పని కాని పరిస్థితి దాపురించిందంటే అతిశయోక్తిలేదు. ఇదంతా దేనికి సూచియో అర్థంకానీ పరిస్థితి. ఎందరో ఆదర్శ మహిళలు పోరాడి, రాజ్యాంగపరంగా వారికంటూ స్థానాలుండాలని కొని యాడితే ఇలాంటి అవకాశాలు పొందడం జరిగింది. కానీ చివరికి అధికార చెలాయింపు, నిర్ణయాలు తీసుకునే అధికారం వారికి లేకపోవడమే బాధాకరం. ఇలా చేయకపోతే ఆడవారికి ప్రత్యేక రిజర్వేషన్స్ అనే విషయంలో ఎలాంటి అర్థం, లాభం లేని పరిస్థితి. ఎన్నికలలో గెలిచిన మహిళలకు పూర్తిగా స్వేచ్ఛ ఉండేలా, వారిపై వారి కుటుంబ సభ్యుల నియంత్రణ లేకుండేలా కార్యాలయాలలో ఆడచాటు మగపెత్తనం ఉండకుండా చర్యలు తీసుకుంటూ మహిళలకు వచ్చిన రిజర్వే షన్సను గౌరవిస్తూ, స్వేచ్ఛను కల్పించే విధంగా ప్రభుత్వాలు పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాజంలో మహిళలకు రాజ్యాంగపరంగా 33 శాతం రిజర్వేషన్స్ కలిగి ఉన్నారు. గత కొంతకాలంగా పురుషులకు సరిసమానంగా అన్ని రకాల కార్యకలాపాలలో పాల్గొంటూ 'మాకు ఎవరు సాటి లేరు అని నిరూపిస్తూ చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్స్ కావాలని పోరాడుతూ వస్తున్నారు. త్వరలో అధికారికంగా సాధించిన ఆశ్చర్యపోనక్కర్లేదు. కానీ క్షేత్రస్థాయిలో అక్కడక్కడ ఆడచాటు మగ పెత్తనం రాజ్యాంగపరంగా మహిళ ఎన్నికైనా, వారిని అడ్డం పెట్టుకొని మగవారే అధికారం చెలాయిస్తూ, రాజకీయంగా ఎదగనివ్వడం లేదనడంలో ఎలాంటి అబద్ధం లేదు. ఇంటికి దీపం ఇల్లాలు అంటారు. ప్రస్తుతం అధికశాతం కుటుంబాలలో మహిళా నిర్ణయాలే శిరోధార్యం. అలాంటి కుటుంబాలే అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నాయి అనడం సైతం జగమెరిగిన సత్యం. వారికి పూర్వ స్వేచ్ఛను ఇస్తే వారి తెలివిని రుజువు చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. అంతెందుకు దేశానికి ఇందిరాగాంధీ ప్రధానిగా పగ్గాలు చేపట్టి, ఒక మహిళాశక్తి ఏంటో నిరూపించలేదా? ప్రతిభాపాటిల్ దేశ ప్రథమ పౌరురాలుగా, రాష్ట్రపతిగా విధులు నిర్వహించలేదా? సుష్మా స్వరాజ్ ప్రధాన ప్రతిపక్ష నేతగా పనిచేయలేదా? షీలాదీక్షిత్, మాయావతి, జయలలిత, మమతాబెనర్జీ, వసుంధర రాజే, సుచేతా కృపాలాని, ఉమాభారతి, రబ్రీదేవి, ఆనందిబెన్ పటేల్ ఇలా వివిధ రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా, కేంద్ర మంత్రులుగా సేవలు చేయలేదా? అలాగే విభిన్న రంగాలలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ అగ్రస్థానాలకు చేరుకున్న వారెందరో ఉన్నారు. అలాంటిది ప్రస్తుత రాజకీయాల పట్ల మహిళామణుల దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఇంకా ఎంతో మంది మహిళలు స్వతహాగా నిర్ణయాలు తీసుకుంటూ పాలకరంగంలో రాణించిన మాట వాస్తవం కాదా! గ్రామాలలోకి వచ్చే సరికి సొంత నిర్ణయాలు తీసుకునే అవకాశం ఇవ్వకపోవడమనేది దేనికి నిదర్శనమో అంతుపట్టని ప్రశ్నగా మిగిలిపోతుంది. పుట్టుకతోనే ఎవరు అన్నీ నేర్చుకోరు. క్రమంగా అర్థమవుతుంటాయి. వారికి ఆ స్వేచ్ఛనిస్తే రాణిస్తారనడంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. రాజ్యాంగపరంగా ఎవరి హక్కులను కాలరాయకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు ప్రతి ఒక్కరిపై ఉన్నది. ఇకనైనా సమాజంలో మార్పురావాలి.

OooooO

అభివృద్ధి ఫలాలు పేదలకందాలి...

వై.సోమేష్

ఏ దేశానికి అయినా అభివృద్ధి అనేది అవసరమే. కానీ అది సామాన్య మానవుని పురోగతికి దోహదపడాలి.

మనం తలపెట్టే అభివృద్ధికార్యక్రమం వలన ఏవైనా నష్టాలు వాటిల్లుతున్నట్లయితే వాటిని అరికట్టడానికి ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది.

కానీ దేశంలో ఎన్నో సమస్యలతో ప్రజానీకం అష్టకష్టాలు పడుతున్నారు. వారి గురించి ఆలోచించే నాయకులు కరువవుతున్నారు.

ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అట్టడుగు, పేద ప్రజానీకం గురించి ఆలోచించి పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి, పారదర్శకంగా అమలుపరిచి వారి అభివృద్ధికి పాటుపడాలి.

కాలం మారుతున్న కొలది మానవ జీవన మనుగడలో పరివర్తన అనేది పురో గాభివృద్ధిని సూచించాలి. కానీ నేటి ఈ సమాజంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నది.

దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి రాకెట్ వేగంతో పరుగులు పెట్టినా పేదవాడి కడుపును నింపలేకపోతున్నది. ప్రస్తుత సమాజంలో ధనవంతుడు ఇంకా ధనవంతుడు అవుతున్నాడే తప్పా పేదవాడు మాత్రం ఆ అదృష్టానికి నోచుకోలేకపోతున్నాడు.

దేశంలో అత్యధిక శాతం ప్రజలు గతంలో వ్యవసాయరంగంపై ఆధారపడి, ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా ఆహారపంటలనే పండిస్తూ ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు.

కానీ సాధిస్తున్న ప్రగతిలో భాగంగా నేడు వివిధ కార్పొరేట్ సంస్థలు వ్యవసాయంపైన వ్యాపారం చేయడం మొదలుపెట్టి అధిక లాభాలను పొందుతున్నారు. చల్లని,బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి అన్ని రకాల ఆహారపదార్థాలను పండింపచేసి అధిక ధరలకు అమ్ముతున్నారు.

నేడున్న పరిస్థితులలో గ్రామాలలోనున్న సన్నకారు రైతులు కూడా వారికున్న ఒకటి రెండు ఎకరాల్లో ఆహార పంటలను కాకుండా వాణిజ్య పంటలు పండించడానికే ఎక్కువ మక్కువ చూపుతున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.

అయినా వారికి లాభాలు రాకపోగా, నష్టాల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్యలకు పాల్పడిన రైతులను వివిధ పత్రికలలో చూస్తూనే ఉంటాం. దీనికిగల కార ణాలెన్నో ఉంటాయి. ప్రస్తుత పరిస్థితులలో ఒక రైతు పంట పండించాలంటే ఎంతో ఖర్చుతో కూడుకొని ఉంటుంది.

గతంలో వలే పాడిపశువులు కనుమరుగైపోయి వివిధ యంత్రాల సహా యంతో నేలను చదునుచేసి, రసాయనాలతో కూడిన విత్తనాలను అధిక ధరతో విక్రయించి, అధిక దిగుబడి నిమిత్తం క్రిమి రసాయనిక ఎరువులు, మందులు వాడి పంటను పండిస్తారు.



చివరికి అతివృష్టి, అనావృష్టి జరగకపోతే ఎంతోకొంత పంట దిగు బడి వచ్చిన, దానికి గిట్టుబాటు ధర దొరకకపోవడం, మొదటి నుండి ఆర్థిక వెసులుబాటుకై మధ్యవర్తులపై ఆధారపడి, అధిక వడ్డీలకు అప్పులు చేసి చివరికి అప్పుల ఊబిలో చిక్కుకుపోయి ప్రాణాలను తీసుకునే పరిస్థితులు దాపరించాయి.

ఇదిలా ఉంటే మార్కెట్‌లలో లభించే ఆకుకూరలు, కూరగాయలు, పలురకాల ఆహార పదార్థాలను వివిధ రసాయనిక మందులు వాడి, పండించడం మూలంగా అందులోని నాణ్యత కోల్పోయి, వివిధ అనారోగ్య పరిస్థితులకు ఊతమిస్తుందనడంలో ఎలాంటి అవాస్తవం లేదు. చివరికి వివిధ రకాల పండ్లను సైతం కాయలుగా ఉన్నప్పుడే కోసి, రంగు రావడానికి, పండ్లుగా మారడానికి కార్బైడ్ లాంటి పదార్థాలను వాడి మార్కెట్‌లోకి తెస్తే విక్రయ దారులు వాటిని తిని వివిధ రోగాల బారినపడుతుంటారు.

గతంలో ఎలాంటి అధునాతనమైన వైద్యసౌకర్యాలు లేనప్పుడు సగటు మానవుడు వందకుపైగా ఏళ్లు జీవించేవారు. నేటి అభివృద్ధిలో ఎన్నో వైద్యాలయాలు వెలసినా జనాలతో కిక్కిరిసి అర్థాయుష్షుకే పరిమిత మవుతున్నారంటే కారణం అది మన ప్రగతియేనని చెప్పకతప్పని పరిస్థితి.

పెద్దపెద్ద పట్టణాలలో, నగరాలలో పెద్ద వ్యాపారస్తులు ఆహారపదార్థాలను పండించి వ్యాపారాలు చేస్తూ లాభాలను గడిస్తుంటే వాటిని పండించే రైతులు నగరాలకు, పట్టణాలకు వలసలు వెళ్లి, పొట్టకూటికై వ్యవసాయేతర పనులు చేసుకుంటూ అధిక డబ్బు వెచ్చించి ఆహారపదార్థాలను కొనడం కొసమెరుపు ఇక్కడ! కేవలం ఆహార పదార్థాలే కాకుండా పాలు, నీళ్లు, నూనెలు అన్ని కల్తీఅయి జనాల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయనడంలో ఎలాంటి ఆశ్చర్యం అక్కర్లేదు.

పాతిక సంవత్సరాల వయస్సు రాగానే విభిన్న వ్యాధులతో బాధపడే పరిస్థితులు దాపరించాయి. ధ్వనికాలుష్యం, వాయు కాలుష్యం, జలకాలుష్యాలతోపాటు ప్లాస్టిక్ వినియోగం, పాలిథిన్ కవర్స్ వాడకం ఎక్కువైంది.

దేశంలో అభివృద్ధి కొరకై అటవీ వినాశనానికి దారితీయడం, తయారీరంగంలో ముందుకు సాగడానికి ఎన్నో కంపెనీలకు అవకాశాలిచ్చి గ్లోబల్ వార్మింగ్‌కు కారకులవుతున్నాం. ఇప్పటికే ఏడాదికేడాది ఉష్ణోగ్రతలు పెరిగి, భూగర్భ జలాలు అడుగంటిపోతూ, వర్షాలకై ఎదురుచూపులు చూసేతరుణం ఆసన్నమైంది.

వీటన్నింటి దృష్ట్యా రాబోయే తరాల జీవనగమనం ప్రశ్నార్థకమవుతుం దేమోనన్న భయం వెంటాడక మానదు. ఒక్క రంగంలోనే కాదు అభివృద్ధి అనే సాకుతో విభిన్నరంగాలలో పలుమార్పులు చోటు చేసుకొని మానవ మనుగడకు అంతరాయం కలిగిస్తున్నాయనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.

మానవ సంబంధాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. మనుషులు యాంత్రిక జీవనానికి అలవాటుపడిన ప్రేమ,వాత్సల్యం, అనురాగం అనే మాటలకు అర్థాలు తెలియకుండా తయారవుతున్నారు.

మానవ సంబంధాలకంటే ఆర్థికపరమైన సంబంధాలకే ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం నేటి అభివృద్ధికి దిక్సూచిగా మారింది.

పాలక వర్గానికొస్తే మసి పూసి మారేడుకాయ చేసేటట్లుగా గద్దెనెక్కేదాక ఎన్నో కట్టుకథలు చెప్పి, తీరా గద్దెనెక్కగానే కథలు మార్చే తంతు కొనసాగుతుంది.

నిమ్నవర్గాలకు, దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలను కాపాడవలసిన ప్రభుత్వాలు లెక్కలకే పరిమితమై ఆచరణలో అంతగా ప్రాధాన్యతనివ్వడం లేదన్నది నూటికి నూరుపాళ్లు నిజమనక తప్పదు.

దానికి కారణాలు పరిశీలిస్తే అనేకం. ఈ ప్రపంచీకరణలో పరుగెడుతున్న శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి,మన ఆహారపు అలవాట్లలోని మార్పులే కారణం.

దీని నియంత్రణకు పాల్పడక పోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోకతప్పదు. పాతిక సంవత్సరాల వెనుకకు వెళ్లి చూస్తే శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి జరగలేదు. అయినా మనుషులు సుఖవంతమైన జీవితాలను గడిపేవారు.

వ్యవసాయదారులు కేవలం వర్షాలపై ఆధారపడి, ఆహార పంటలు, చిరుధాన్యాలు, జొన్నలు, సజ్జలు, రాగులు, పెసర్లు, ఉలవలు, కందులు, మినుములు,తైదలు లాంటి పంటలు పండించడం, వాటికి ఎలాంటి క్రిమిసంహారక, రసాయనిక మందుల వాడకం ఉండేదికాదు.

విత్తనాలను సైతం వారే తయారు చేసుకోవడం, పంటదిగుబడి ఎక్కువ రావడానికి సహజ ఎరువులను వాడటం జరిగేది. సమాజంలో వాతావరణ కాలుష్యంతోపాటు, నేల కాలుష్యాన్ని తగ్గించడానికి రూపకల్పన జరిగి, ఖచ్చితంగా నెరవేర్చుటకు ప్రత్యేక యంత్రాంగాన్ని తయారు చేయాలి.

ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత తొందరగాఅరికట్టాలి. అడవులను అభివృద్ధి చేసుకోవడానికి ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ రైతులకు చిరుధాన్యాలను పండించడానికి ప్రోత్సహిస్తూ, గిట్టుబాటు ధరలను కల్పించాలి.

మార్కెట్లలో లభించే ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్, తీసుకోవడం వలన జరిగే అనర్థాలను ప్రజలకు తెలిసే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న నాటి నుండే ఆహారపు అలవాట్లలో విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

వీలైనంత తక్కువ క్రిమి సంహారక మందులు, రసాయనాలను వాడేటట్లు,రోగనిరోధక శక్తిని కలిగి విత్తనాలను తయారు చేయడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు పూనుకొని దానికనుగుణంగా పరిశోధనలు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

వీటన్నింటిని క్రమపద్ధతిలో నెరవేర్చుకుంటూ అవలంబిస్తే కొంతమేరలో మన ఆరోగ్యాలను కాపాడుకున్న వాళ్లమవుతాం.

లేనియెడల భవిష్యత్తులో నేటి పరిస్థితులు కొనసాగితే తీవ్ర గడ్డుపరిస్థితులు ఎదుర్కొని తమ ఆయుష్షును తామే నాశనం చేసుకునే విధంగా దోహదపడుతుందనడంలో ఎలాంటి అనుమానం అక్కరలేదు.

సమాజంలోని అన్నివర్గాల ప్రజలు పూనుకొని సమిష్టిగా అవలంభించిన ప్పుడే దానికితోడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారం లభించి నప్పుడే సాధ్యపడుతుంది. కానీ లేనియెడల ఫలితం శూన్యమే.

ఆహారపు అలవాట్లను మార్చుకుందాం.అనారోగ్యాలను పార ద్రోలుదాం. పోషకాల ఆహారమే ఆరోగ్యానికి అండ. రైతులను ప్రోత్సహిస్తూ గిట్టుబాటు ధర కల్పిద్దాం. ఏ దేశానికి అయినా అభివృద్ధి అనేది అవసరమే. కానీ అది సామాన్య మానవుని పురోగతికి దోహదపడాలి.

మనం తలపెట్టే అభివృద్ధి కార్యక్రమం వలన ఏవైనా నష్టాలు వాటిల్లుతున్నట్లయితే వాటిని అరికట్టడానికి ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాల్సిన అవసరంఎంతైనా ఉంటుంది.

కానీ దేశంలో ఎన్నో సమస్యలతో ప్రజానీకం అష్టకష్టాలు పడుతున్నారు. వారి గురించి ఆలోచించే నాయకులు కరువవుతున్నారు.

ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అట్టడుగు, పేద ప్రజానీకం గురించి ఆలోచించి పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి, పారదర్శకంగా అమలుపరిచి వారి అభివృద్ధికి పాటుపడాలి.


జో బైడెన్: అమెరికా ‘అత్యుత్తమ ఉపాధ్యక్షుడు’ అధ్యక్ష పదవి వరకూ ఎలా చేరుకున్నారు?

- ఎస్.సిహెచ్. వెంకటేష్, ఎం.ఎ., ఎంఫిల్ - బెంగళూరు

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన జో బైడెన్.. శ్వేతసౌధాన్ని సొంతం చేసుకోవటానికి మూడుసార్లు ప్రయత్నించి ఎట్టకేలకు విజయం సాధించారు. ఒకసారి 1987లో, రెండోసారి 2008లో డెమొక్రటిక్ పార్టీ టికెట్ కోసం జరిగే పోటీల నుంచి తప్పుకున్న బైడెన్.. ఈసారి టికెట్ కోసం బరిలోకి దిగేటప్పుడే ఫ్రంట్ రన్నర్‌గా ఉన్నారు. పార్టీ నామినేషన్ దక్కించుకున్న ఆయన తనతో పాటు ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసే అభ్యర్థిగా కమలా హారిస్‌ను ఎంపిక చేసుకున్నారు. ఆమె కూడా అధ్యక్ష పదవి టికెట్ కోసం పోటీ పడ్డారు. నిజానికి 2008 అధ్యక్ష ఎన్నికల్లో బరాక్ ఒబామా పార్టీ నామినేషన్ గెలుచుకున్నపుడు.. ఆయన తనతో పాటు ఉపాధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేయటానికి జో బైడెన్‌ను ఎంపిక చేసుకున్నారు. ఆ ఎన్నికల్లోనూ, ఆ తర్వాత 2012 ఎన్నికల్లోనూ ఒబామా, జో జో బైడెన్ ద్వయం గెలిచింది. అలా రెండు సార్లు అమెరికా ఉపాధ్యక్షుడిగా జో బైడెన్ పనిచేశారు. అమెరికా ఉపాధ్యక్షుల్లో ‘అత్యుత్తమ ఉపాధ్యక్షుడు’ అని జో బైడెన్‌ను కీర్తించారు. అయినప్పటికీ.. జో బైడెన్ నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం మీద తీవ్ర విమర్శలూ ఉన్నాయి. అసలింతకీ జో బైడెన్ ఎవరు? అధ్యక్ష పదవి వరకూ ఎలా చేరుకున్నారు?నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం... జో బైడెన్ పూర్తి పేరు జోసెఫ్ రాబినెట్ జో బైడెన్ జూనియర్. ఆయన 1942 నవంబర్ 20న పెన్సిల్వేనియాలోని స్క్రాంటన్‌లో జన్మించారు. 1968లో ఆయన లా పట్టా అందుకున్నారు. డెలవేర్ నుంచి ఆరు సార్లు సెనేటర్‌గా పనిచేసిన జో బైడెన్.. మొదటిసారి 1972లో సెనేట్‌కు ఎన్నికయ్యారు. జో బైడెన్‌ను అచ్చమైన వాషింగ్టన్ డీసీ వాసిగా చెప్పవచ్చు. 36 ఏళ్ల పాటు సెనేటర్‌గా, ఎనిమిదేళ్ల పాటు ఉపాధ్యక్షుడుగా ఉన్న ఆయన రాజకీయ జీవితం ప్రధానంగా అమెరికా రాజధానిలోనే రూపుదిద్దుకుంది. కెరీర్ తొలి నాళ్లలో.. స్కూలు బస్సుల్లో విభిన్నజాతుల ప్రజలను సమ్మిళితం చేయాలంటూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును వ్యతిరేకించిన దక్షిణాది వేర్పాటువాదులకు మద్దతు తెలిపారు.1991లో సెనేట్ జ్యుడీషియరీ కమిటీ అధ్యక్షుడిగా.. సుప్రీంకోర్టుకు నామినేట్ అయిన క్లారెన్స్ థామస్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ అనిటా హిల్ ఆరోపణలపై విచారణను నిర్వహించిన తీరు కారణంగా తీవ్ర విమర్శల పాలయ్యారు.

ఈ విచారణ కమిటీలో అందరూ తెల్లజాతీయులైన పురుషులే సభ్యులుగా ఉన్నారు. అనిటా హిల్‌కు మద్దతుగా నిలిచిన పలువురు మహిళలను జో బైడెన్ సాక్ష్యం చెప్పడానికి పిలవలేదు. 2019 ఏప్రిల్‌లో ఒక టీవీ ఇంటర్వ్యూలో ఈ కేసు గురించి మాట్లాడుతూ జో బైడెన్... “ఆవిడతో వ్యవహరించిన విధానానికి సిగ్గుపడుతున్నాను” అని చెప్పారు.

ఒబామా వారసత్వం...



జో బైడెన్ 1988లో మొదటిసారి డెమొక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థిత్వం కోసం పోటీ పడ్డారు. అయితే, బ్రిటిష్ లేబర్ పార్టీ నేత నీల్ కినాక్ ప్రసంగాన్ని కాపీ కొట్టారన్న విమర్శలతో ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. రెండోసారి 2008లో కూడా ఆయన డెమోక్రాటిక్ పార్టీ నామినేషన్ కోసం పోటీ పడ్డారు. తర్వాత వెనక్కుతగ్గారు. ఒబామాతో పాటు ఉపాధ్యక్షుడిగా పోటీచేశారు. 2012లోనూ ఒబామా, జో బైడెన్‌లు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

ఒబామా అధ్యక్షుడిగా ఉన్న ఎనిమిదేళ్ల కాలం ఉపాధ్యక్షుడిగా ఉన్న జో జో బైడెన్.. తమ హయాంలో అమలు చేసిన అఫర్డబుల్ కేర్ యాక్ట్ వంటి పథకాల్లో చాలా భాగం తన కృషి ఫలితమేనని చెప్పుకోవటానికి వీల్లేంది.

ఒబామా ‘సోదరా’ అని పిలిచేంత సాన్నిహిత్యం వల్ల ఆఫ్రికన్ – అమెరికన్ ఓటర్లలో ఆయనకు మద్దతు కొనసాగటానికి కారణమై ఉండొచ్చు.

‘మిడిల్ క్లాస్ జో’గా పేరుపడ్డ జో బైడెన్.. శ్రామికులైన శ్వేతజాతీయుల ఓట్లను కూడా సాధించగలిగారు. స్వలింగ సంపర్క వివాహాలు తనకేమీ

ఇబ్బంది కాదని ఆయన ప్రకటించారు. ఆ తర్వాత ఆ విధానానికి ఒబామా పూర్తి మద్దతునిచ్చారు.వ్యక్తిగత జీవితంలో విషాదం...

జో బైడెన్ రాజకీయ జీవితంపై వ్యక్తిగత విషాద ఘటనలు కూడా ఎంతో ప్రభావం చూపాయి. జో బైడెన్ 1972లో మొదటిసారి సెనేటర్‌గా ఎన్నికైన కొద్ది రోజులకే ఒక కారు ప్రమాదంలో ఆయన మొదటి భార్య, కూతురు మరణించారు. ఆ రోడ్డు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ తన ఇద్దరు కొడుకులు బ్యూ, హంటర్‌లను చూసుకుంటూ ఆస్పత్రిలో ఉన్న ఆయన అక్కడి నుంచే సెనేటర్‌గా మొదటిసారి ప్రమాణ స్వీకారం చేశారు. అయితే.. 2015లో జో బైడెన్ కొడుకు 46 ఏళ్ల బ్యూ బ్రెయిన్ కేన్సర్‌తో మరణించారు. అందుకే, ఆయన తన విధాన లక్ష్యాల్లో ఆరోగ్యం చాలా ముఖ్యమైనదిగా భావిస్తారు. జీవితంలో ఎన్నో విషాదాలను ఎదుర్కొన్న ఆయనకు ఒక కుటుంబపరమైన వ్యక్తిగా గౌరవం దక్కింది. అమెరికన్లు ఆయన్ను 'మిడిల్ క్లాస్ జో'గా పిలుచుకుంటారు. 2015లో జో బైడెన్ కొడుకు 46 ఏళ్ల బ్యూ బ్రెయిన్ కేన్సర్‌తో మరణించారు జో బైడెన్ సెనేటర్ పదవి చేపట్టిన తరువాత మొదటి 14 సంవత్సరాల కాలంలో తన వ్యక్తిగత జీవితంలో నిలదొక్కుకునే ప్రయత్నాలు చేశారు. భార్య, కూతురి మరణం తరువాత తన కొడుకులిద్దరికీ మంచి జీవితం అందించాలనే తాపత్రయంతో తన సొంతిల్లు ఉన్న డెలవేర్ నుంచీ వాషింగ్టన్‌కు రోజూ వచ్చి వెళుతుండేవారు. తదనంతరం, స్కూల్ టీచర్ అయిన జిల్ జాకబ్స్‌ను వివాహమాడారు. వారి కుమార్తె ఆష్లే జో బైడెన్ ఒక ఫ్యాషన్ డిజైనర్, యాక్టివిస్ట్ కూడా జో బైడెన్ పాలన ఎలా ఉంటుంది?.

2021 జనవరిలో వైట్ హౌస్‌లోకి అడుగుపెట్టబోతున్న 78 ఏళ్ల జో బైడెన్ ఇప్పుడు అమెరికాకు 46వ అధ్యక్షునిగా అసలు సిసలు సవాళ్లు ఎదుర్కోబోతున్నారు. ఇప్పటివరకూ అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన వారిలో అతి పెద్ద వయస్కుడు ఈయనే. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో వైట్ హౌస్ పీఠం కోసం జో బైడెన్ ఎంతో సంఘర్షణకు గురయ్యారు. కానీ ఆయనకు అత్యంత కఠినమైన సవాళ్లు ముందు ముందు ఇంకా మిగిలే ఉన్నాయి.

దేశాధ్యక్షుడుగా ఎన్నికైన జో బైడెన్ ఇప్పుడు అమెరికా రూపురేఖల్ని మార్చే అవకాశాన్ని చేజిక్కించుకున్నారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్నప్పటికీ.. ఆయన పాలన ఎలా ఉండబోతుంది అనే విషయానికి వస్తే, సమాధానం లేని ప్రశ్నలు చాలానే ఉన్నాయి. ఎన్నికల ప్రచార సమయంలో అత్యంత వివాదాస్పద అంశాల్లో కొన్నింటి పట్ల తన వైఖరి ఏంటో ఆయన వెల్లడించలేదు. ఒబామా పాలనా కాలానికి కొనసాగింపు ఇస్తానని మాత్రమే ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ పగ్గాలు చేపట్టాక జో బైడెన్ ఎదుర్కోనున్న సవాలు ఒక్కటే. ఏకాభిప్రాయం, ఒప్పందాల పట్ల మొగ్గు చూపించడానికి, తనకు ఓట్లు వేసిన ప్రజల ఆకాంక్షలకూ మధ్య సమతుల్యాన్ని సాధించడం.

18వ పేజీ తరువాయి

జిల్లాల్లో మాత్రమే ఈ ఎర్రచందనం వృక్షాలు విస్తరించి ఉన్నాయి.

వీటిని 1973లో అరుదైన వృక్షజాతి జాబితాలో సైడ్స్ (కన్వెన్షన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ స్పైసీస్)లోకి చేర్చారు.

దీనివల్ల ఎర్రచందనం దుంగల ఎగుమతిపై నిషేధం అమలులోకి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లోనే పరిమితంగా ఉన్న ఈ వృక్షాలను సంరక్షించుకునేందుకు వెసులుబాటు కల్పించారు.

వాస్తవంగా చూస్తే ఈ ఎర్రచందనానికి మనదేశంలో పెద్దగా గిరాకీ లేదు. మార్కెట్ కూడా లేదని చెప్పొచ్చు. కానీ చైనా, జపాన్ దేశాల్లో మాత్రం ఊహించని రీతిలో డిమాండ్ ఉంది.

అది అంతకంతకు పెరుగుతుండటంతో కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండటంతో ఎర్రచందనం దుంగలను స్మగ్లర్లు అక్రమంగా విదేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

సముద్ర మార్గాల ద్వారా దేశ సరిహద్దులు దాటించేందుకు ఎప్పటికప్పుడు కొత్త కొత్త వ్యూహాలు అనుసరిస్తున్నారు.

కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయోత్పత్తుల పేరుతో భోగస్ అనుమతులు పొందుతున్నారు.

చెన్నై, ముంబయి, కొచ్చిన్ తదితర రేవుల నుంచి రవాణా ఓడల ద్వారా తరలిపోతున్నది. రోడ్డు మార్గాన్ని కూడా వదిలిపెట్టడం లేదు. ఢిల్లీ, చండీఘడ్‌లోని గోదాముల్లో దాచిన సరుకును ఒక వ్యూహం ప్రకారం నేపాల్‌కు తరలిస్తున్నారు. అక్కడ నుంచి చైనాకు రవాణాచేస్తున్నారు.

ఇదికాక, మణిపూర్, మిజోరం రాష్ట్రాల నుంచి కూడా ఈ రవాణా యధేచ్ఛగా జరుగుతున్నట్లు సమాచారం.

ఈ చెట్లు శేషాచలం, వెలుగొండల అడవుల్లో మాత్రమే పెరగడానికి కారణాలు ఏవో ఇప్పటికీ మన శాస్త్రవేత్తలు కనుగొనలేకపోతున్నారు.

కొన్ని వందల సంవత్సరాలుగా వృక్షశాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నా తెలియడం లేదు.

1700సంవత్సరంలో బ్రిటిష్ శాస్త్రవేత్తలు ఎర్రచందనం చెట్లకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చివరకు తమ దేశానికికూడా తీసుకువెళ్లి పరీక్షలు జరిపారు. పెంచేందుకు ప్రయత్నంచేశారు. ఏమాత్రం సత్ఫలితాలు ఇవ్వలేదు.చెట్లు పెరగడం లేదు. పెరిగినా అందులో కావాల్సిన నాణ్యత లభించడం లేదు. ఇక ఈ చెట్లకు ఇంత విలువ ఎందుకు వస్తున్నదిఎందుకు ఉపయోగిస్తున్నారు? అన్న విషయంలో కూడా ఇప్పటికీ స్పష్టత లేదు.

సంగీత పరికరాలకు, ఆటంబాంబుల కోసం జపాన్ వీటిని కొంటున్నదని ప్రచారం జరిగినా అందులో అంత వాస్తవికత కన్పించడం లేదని శాస్త్రజ్ఞులే అంగీకరిస్తున్నారు. అణు ఇంధనం తయారీలోనూ, శృంగార సామర్థ్యం పెంచే కొన్ని మందుల్లోనూ వీటిని వాడుతున్నారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. జపాన్ కానీ, చైనా కానీ వీటిని తాము ఎందుకు కొంటున్నాం, ఎందుకు ఉపయోగిస్తామనేది ఏమాత్రం బయటపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. అంతర్జాతీయ బయోడైవర్సిటీ అంచనా ప్రకారం ఒక టన్ను ఎర్రచందనానికి ఆ దేశాల్లో ఏడెనిమిది కోట్ల రూపాయలు ఉంటుందని చెప్తున్నారు. అందుకే రాయలసీమలోని మాఫీయా ముఠాలు, కొందరు ఫ్యాక్షన్ నేతలు ఇంకొందరు రాజకీయవాదులు ఎర్రచందనం స్మగ్లింగ్‌ను తమ వ్యాపకంగా మార్చుకున్నారు. అటవీ శాఖ, పోలీసు శాఖ సిబ్బందిలో కొందరు అధికారులు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలను కూడా కొట్టి వేయలేం. అందుకే కూలీలు పట్టుబడుతున్నారే తప్ప ఈ స్మగ్లింగ్ వెనుక ఉన్న పెద్దల హస్తం వెలుగుచూడటం లేదు. ఆ ప్రాంతాల్లో ఎవరిని అడిగినా ఈ ఎర్రచందనం స్మగ్లింగ్ వెనుక పాత్ర ఎవరెవరికి ఉందో కథలుకథలుగా చెప్తున్నారు. అయినా పాలక పెద్దలు మూలాల్లోకి వెళ్లకుండా ఈ అక్రమ స్మగ్లింగ్ నిరోధించేందుకు ప్రయత్నాలు చేయడం ప్రయోజనం లేకుండా పోతున్నది.

☺☺☺☺☺

సైన్సే రామన్ మతం ....

పి.కె.విక్రాంత్

మన దేశంలో విశ్వవిద్యాలయాలకు, జాతీయ సైన్స్ పరిశోధనా సంస్థలకు మధ్య ఒకప్పుడు గొప్ప సమన్వయం ఉండేది. పరిశోధనా సంస్థలకు, విశ్వ విద్యాలయాలకు మధ్య సంబంధాలు సన్నగిల్లాయి. విద్యార్థుల డిమాండ్‌కు అనుగుణంగా మన దేశంలో ఐఐటిల సంఖ్య పెంచాలి. విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలు పెంచే విధంగా పాఠ్యాంశాలు రూపొందించాలి. అప్పుడే దేశం నుంచి సైన్స్ రంగంలో నోబుల్ బహుమతి అందుకొనే స్థాయికి విద్యార్థులు చేరగలుగుతారు. 1930లో సి.వి. రామన్‌కు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చిన తరువాత ఇప్పటి వరకు మనదేశంలో జన్మించి, నివసిస్తున్న ఏ ఒక్క శాస్త్రవేత్తకు నోబుల్ బహుమతి లభించకపోవడం దురదష్టకరం. మన దేశంలో జన్మించి, విదేశాలలో స్థిరపడ్డ హరగోవింద్ ఖురానా(1968), సుబ్ర హ్మణ్యం చంద్రశేఖర్ (1983), వెంకట్రామన్ రామకృష్ణన్ (2009) లకు మాత్రమే సైన్స్‌రంగంలో నోబుల్ బహుమతులు లభించాయి. సత్యేం ద్రనాధ్ బోస్, జి.యం. రాంచంద్రన్, ఉత్పల్, మాణిక్‌పాల్ భద్ర, మేఘనాధ్ సాహ, శంభునాధ్‌దే, హోమీ బాబా, జగదీష్ చంద్రబోస్, సి.ఎన్.ఆర్. రావు వంటి భారతీయ శాస్త్రవేత్తలు సైన్స్ పరిశోధనా రంగంలో అంత ర్జాతీ యంగా ఖ్యాతిగడించి నప్పటికీ, నోబెల్ బహుమతులు పొందలేక పోయారు. 1930లో నోబెల్ బహుమతి స్వీకరించిన సందర్భంలో సీవీ రామన్ బహుమతి ప్రదానోత్సవానికి హాజరైన సభికులకు తాను ఆవిష్కరించిన రామన్ ప్రభావాన్ని ప్రదర్శించేందుకు 'ఆల్కా హాల్'ని మాధ్యమంగా ఉపయోగించారు. అనంతరం ఏర్పాటుచేసిన కాక్‌టెయిల్ పార్టీలో 'ఆల్కహాల్ తీసుకుంటారా'? అని రామన్‌ను విందుకు హాజరైనవారు అడుగగా 'ఇప్పటి వరకు మీరు ఆల్కహాల్‌లో రామన్ ఎఫెక్టు చూసారు, రామన్‌పై ఆల్కహాల్ ఎఫెక్ట్ చూడాలని కోరుకోవద్దు' అని చమత్కరించి పరోక్షంగా తాను మద్యానికి దూరంగా ఉంటాననే విషయాన్ని స్పష్టం చేశారు. సి.వి.రామన్ 1888 నవంబర్ 7న ఆనాటి మద్రాసు ప్రావిన్సులోని తిరుచరాపల్లిలో చంద్రశేఖర్ అయ్యర్, పార్వతి అమ్మాల్ దంపతులకు జన్మించారు. ఆయన బాల్యం నుంచే చురుకైన విద్యార్థిగా ఉంటూ కేవలం 11ఏండ్ల వయస్సులోనే మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. చిన్నతనం నుంచే పరిశోధన రంగంపై ఆసక్తి వున్న ఆయన విద్యాభ్యాసం అనంతరం 1907లో ఇండియన్ ఫైనాన్స్ డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ ఎకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు పరిశోధనపై దృష్టి సారించారు. తన లక్ష్యసాధన కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి 1917లో కలకత్తా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరారు. 1919లో 'ది ఇండియన్ అసోషియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్‌కు' గౌరవ కార్యదర్శిగా నియమితులయ్యారు. సీవీ రామన్ కాంతిపై పరిశోధనలు చేసి 1928లో 'రామన్ ఎఫెక్టు' కనుగొన్నారు. కాంతి కిరణాలు ఒక ద్రవ పదార్థంపై పడినప్పుడు ఆ కాంతి పరిక్షేపం చెందుతుంది, అంటే కాంతికిరణాలలోని ఫోటాన్ కణాలు ద్రవపదార్థాల పరమాణువులపై పడి పరిక్షేపణ చెందుతాయి. దూరపు కొండలు, సముద్రపు నీరు, ఆకాశం నీలిరంగులో ఉండటానికి గల కారణాలను రామన్ ఎఫెక్టు విశ్లేషిస్తుంది. వైద్యరంగంలో మందుల విశ్లేషణకు, రసాయన పదార్థాలలోని అణువులు, పరమాణువుల పరిశీలనకు, మనం ధరించే వస్త్రాల రంగుల అధ్యయనానికి రామన్ ఎఫెక్టు దోహదపడుతుంది. ఆయన పరిశోధనలకు 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభిం చింది. రామన్ ఎఫెక్టు కనుగొన్న రోజైన ఫిబ్రవరి 28న భారత ప్రభుత్వం 'జాతీయ సైన్స్ దినోత్సవంగా' ప్రకటిం చింది. 1933లో బెంగుళూరు లోని ప్రతిష్ఠాత్మక 'ది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్'కు రామన్ డైరెక్టర్‌గా నియమించబడ్డారు. 1948లో ఆయన బెంగుళూరులో 'రామన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను' స్థాపించి పలువురు యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించారు. కేవలం రూ.250తో రామన్ తన ప్రయోగాన్ని ఆవిష్కరించడం విశేషం. 1954లో రామన్‌ని 'భారతరత్న' వరించింది. మత విశ్వాసాల ఆధారంగా విద్యాలయం నడిపే ఒక మతసంస్థ రామన్‌ను తమ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించమని ఆహ్వానిస్తే 'స్వర్గం, నరకం, పునర్జన్మ వంటి అశాస్త్రీయ విషయాలపై నేను మాట్లాడను' అని ఆ సంస్థ ఆహ్వానాన్ని ఆయన తిరస్కరించారు. 'సైన్సే నా మతం' అని రామన్ స్పష్టం చేశారు. ఆయన ధ్వనిపై కూడా పలు పరిశోధనలు చేసారు. నోబెల్ బహుమతి పొందినప్పుడు రామన్ ఒకవైపు సంతోషం వ్యక్తంచేస్తూనే మరొకవైపు 'దేశం పరాయిపాలనలో ఉందని బహుమతి అందుకునేటప్పుడు నాదేశం తరపున, నా దేశ జాతీయజెండా లేకపోవడం నన్ను బాధిస్తుందని' రామన్ తెలిపి దేశం పట్ల తనకున్న ప్రేమను చాటుకున్నారు. 'ది లైట్ ఆఫ్ ఏషియా' పుస్తకం రామన్‌పై అమిత ప్రభావం చూపించింది. ఆత్మన్యూనతా భావాన్ని, ఓటమి భయాన్ని వీడి ధైర్యంతో ముందడుగు వేసి పరిశోధనా రంగంలో భారత కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయంగా నిలపాలని' రామన్ విద్యార్థులకు సూచించారు.



విశ్లేషణ

అర్ణబ్ గోస్వామితో ఆగేనా?

నాగమణి



రిపబ్లిక్ టీవీ ఎడిటర్-ఇన్-చీఫ్ అర్ణబ్ గోస్వామిని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఇది ఊహించిందే. ఏదో ఒక రోజు ఇలా జరుగుతుందని కొందరు ముందుగానే పసిగట్టారు. అలాగే జరిగింది. ఈ వార్త మీడియాలో కంటే సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. మీడియా లోనూ ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా దీనిపై వ్యాఖ్య చేశారు. ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ అగ్రనాయకులు మహారాష్ట్ర ప్రభుత్వ తీరును, పోలీసుల ప్రవర్తనను, అరెస్టు చేసిన విధానాన్ని తీవ్రంగా ఖండించారు. దీన్ని మరో ఎమర్జెన్సీగా అభివర్ణించారు. ఇందిరాగాంధీనాటి ఎమర్జెన్సీని గుర్తుచేశారు. వాక్ స్వాతంత్ర్యానికి, పాత్రికేయ స్వేచ్ఛకు ఇది గొడ్డలిపెట్టుగా భావిస్తూ, మహారాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వివిధ జర్నలిస్ట్ సంఘాలు కూడా అర్ణబ్ అరెస్టును, అరెస్టుచేసిన తీరును తీవ్రంగా తప్పు పట్టాయి. పలుచోట్ల నిరసనలు జరిగాయి. అర్ణబ్ గోస్వామి అరెస్టుపై మిశ్రమమైన స్పందనలు వినిపిస్తున్నాయి. నిన్న జరిగిన అరెస్టుకు, మీడియా స్వేచ్ఛకు ఎటువంటి సంబంధంలేదని, ఇందులో జర్నలిజం కోణాన్ని చూడాల్సిన అవసరమేలేదని, ఇది ఒక ఆత్మహత్య, మోసం అనే అంశాలకు మాత్రమే సంబంధించినదని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అంశాలు ఏవైనా, ఒక జర్నలిస్ట్‌ను ఈ తీరున అరెస్టు చెయ్యడం సరికాదని, సాటి జర్నలిస్ట్ గా, ఈ విధానం బాధ కలిగించిందని ఎక్కువ మంది జర్నలిస్టులు తమ స్పందనలు వినిపించారు. ఈరోజు అర్ణబ్ అయ్యాడు, రేపు మనకూ అదే పరిస్థితి రావొచ్చునేమోననే భయాన్ని, భావనలను మరి కొందరు వెలిబుచ్చుతున్నారు. అర్ణబ్ గోస్వామి అరెస్టు కొందరికి ఆనందం, కొందరికి ఆగ్రహంగా మారింది. గోస్వామి విషయంలో జాతీయ స్థాయిలో, మీడియా కూడా రెండు భాగాలుగా విడిపోయింది. కొన్ని సంస్థలు తటస్థ వైఖరిని అవలంబించాయి. ఎడిటర్స్ గిల్డ్ అరెస్టు తీరును ఖండించింది. ఈ దిశగా మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ఉత్తరం కూడా రాసింది. నేటి మీడియాలో అర్ణబ్ గోస్వామి శైలి భిన్నం. ప్రత్యక్ష ప్రసారంగా వచ్చే చర్చా కార్యక్రమాలలోనూ, ఇంటర్వ్యూలు చేసే సమయంలోనూ పెద్ద పెద్ద కేకలు వేస్తూ, అతిథులను అడుగడుగునా అడ్డుకుంటూ విచిత్రంగా ఉంటుంది. ఈ తీరుపై మొదటి నుండీ ఎక్కువ మంది తప్పు పడుతూనే ఉన్నారు. అర్ణబ్ భాష, దేహభాషపై (బాడీ లాంగ్వేజ్) ఎక్కువమందికి అభ్యంతరాలే ఉన్నాయి. ఆయన్ను అభిమానించేవారూ కొందరుంటారు, అనుసరించాలని ప్రయత్నం చేసే జర్నలిస్టులూ కొందరుంటారు. సరే, ఇది వేరే సంగతి. రిపబ్లిక్ టీవీ పూర్తిగా బీజేపీకి మద్దతు ఇచ్చే మీడియా అనే ముద్ర ఏనాడో పడిపోయింది. అర్ణబ్ ను బీజేపీ గొంతుగానే ఎక్కువమంది భావిస్తారు. బహుశా! నేటి అరెస్టుకు అది కూడా ప్రధానమైన కారణంగా చెప్పవచ్చు. అసలే, బీజేపీకీ-మహారాష్ట్ర శివసేన ప్రభుత్వానికి అస్సలు పడడంలేదు. రెండింటి మధ్య పచ్చగడ్డి వేస్తే, భగ్గుమనే చందంగా మారింది. దీనికి తోడు, సుశాంత్ సింగ్ కేసు, బీహార్ ఎన్నికలు మొదలైనవి దీనికి ఆజ్యం పోశాయి. మహారాష్ట్ర ప్రభుత్వ పెద్దలను, పోలీసులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ రిపబ్లిక్ టీవీ వండి వడ్డించిన కథనాలు మరింత ఆజ్యం పోశాయి. రిపబ్లిక్ టీవీ అంటేనే, అర్ణబ్ గోస్వామి. అర్ణబ్ గోస్వామి అంటేనే రిపబ్లిక్ టీవీ అన్న విషయం అందరికీ తెలిసిందే. సుశాంత్ సింగ్ మరణం కేసు ఎన్ని మలుపులు తిరిగిందో, అర్ణబ్ వెర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కూడా అన్నే మలుపులు తిరుగుతూ సాగుతోంది. ఇంతకూ సుశాంత్ సింగ్ కేసు పక్కకు వెళ్ళిపోయిందనే అనుకోవాలి., కొత్త కొత్త రాజకీయ రూపకాలన్నీ తెరపైకి వచ్చేశాయి. వీటి నేపథ్యంలో, రేటింగ్ పెంచుకోడానికి కొన్ని ఛానల్స్ అక్రమమార్గాలు పడుతున్నాయని, అందులో రిపబ్లిక్ టీవీ కూడా ఉందని మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మీడియాకు, ముఖ్యంగా, వార్తా ఛానల్స్ కు సంబంధించిన అంశం కాబట్టి, ఇది ఒక తీరులో సాగుతోంది. అసలు ఈ అంశంలోనే అర్ణబ్ ను అరెస్టు చేసి, దర్యాప్తు పేరుతో మహారాష్ట్ర పోలీసులు వేదించాలని ప్రణాళిక చేస్తున్నారనే వార్తలు ఆమధ్య బాగా వైరల్ అయ్యాయి. ఇంతలో, ఒక పాత కేసును మరోసారి బయటకు తీయడంతో, ఇంకో కొత్త అధ్యాయం ఆరంభమైంది. దీని సారాంశమే, నేటి అర్ణబ్ గోస్వామి అరెస్టు పర్వం. ఈ కేసుల విషయాలన్నీ అలా ఉంచగా, బీజేపీ-మహారాష్ట్ర ప్రభుత్వం-మధ్యలో గోస్వామిగా... మరో కథ మొదలైంది. ఈ రూపకాలన్నీ ఎటువంటి రూపాలు తీసుకుంటాయో తెరపై చూడాల్సిందే. అర్ణబ్ కు బీజేపీ ఢిల్లీ పెద్దల అండదండలు ఉన్నా? మేము చూడండి. ఎలా అరెస్టు చేశామో! అనే సంకేతాన్ని, మహారాష్ట్ర ప్రభుత్వం దేశానికి ఇవ్వడం కోసమే ఈ అరెస్టు తంతు, అని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పుడు అర్ణబ్ అరెస్టు అయ్యింది ఒక జర్నలిస్ట్ గా కాదు. 2018లో అన్వయనాయక్, అనే ఇంటీరియర్ డిజైనర్, అతని తల్లి ఆత్మహత్యకు కారణం అర్ణబ్ గోస్వామి మరికొందరు, అనే అంశంలో. సూసైడ్ నోట్ లో అర్ణబ్ పేరు ఉండడం వల్ల, దాన్ని మూలంగా తీసుకొని, మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ప్రస్తుతం, కోర్టు 14రోజుల జ్యుడిషల్ కస్టడీ విధించింది. కరోనా నేపథ్యంలో, 14రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచాలని పోలీసులకు సూచించింది. తమ కస్టడీకి అప్పజెప్పాలంటూ, పోలీసులు చేసిన అభ్యర్ధనను కోర్టు తిరస్కరించింది. మహారాష్ట్ర రాయ్‌గడ్ జిల్లాలోని ఆలీబాగ్ కోర్టులో అర్ణబ్ ను ప్రవేశపెట్టారు. ఈ క్వారంటైన్‌లో, లేదా, ఆ తర్వాత ఎటువంటి పరిణామాలు జరుగుతాయో వేచి చూద్దాం. ప్రస్తుతం అర్ణబ్ అరెస్టుకు కారణమైన అన్వయ నాయక్ కేసు గత బీజేపీ ప్రభుత్వంలో, పోలీసులు క్లోజ్ చేశారు. ప్రస్తుత శివసేన ప్రభుత్వం తిరిగి బయటకు తీసింది. రాజకీయ ప్రాబల్యాలు, ప్రాధాన్యతలను బట్టి, రాజకీయాల కోసం ఇలా కేసులను మూస్తుంటారు, తిరిగి తెరుస్తుంటారు, లేదా, కొత్త కొత్త కేసులు బుక్ చేస్తుంటారు, అనే విషయం , ఈ అరెస్టుతో సామాన్యుడికి కూడా మరోమారు అర్ధమయ్యేట్టు చేసింది. అదే విధంగా, రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా ఒక్కొక్కసారి, ఒక్కొక్కరి మీద, ఒక్కొక్కరకంగా వ్యాఖ్యలు చేస్తుంటాయని, మామూలు మనిషికి కూడా ఇంకోసారి బోధపడింది. తమకు

నచ్చినవారినో, మద్దతుదారునో, కావాల్సినవాడినో ఏదైనా ప్రభుత్వం అరెస్టు చేస్తే, అది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అంటారు. ఎవరైనా జర్నలిస్ట్ లేదా, నాలుగు స్తంభాల్లో ఏదో స్థంభానికి చెందిన వ్యక్తి అయితే, రాజ్యాంగకల్పిత హక్కుల స్వేచ్ఛకు, వాక్ స్వాతంత్ర్యానికి సంకెళ్ళు పడ్డాయనే విమర్శలు వెల్లువెత్తుతాయి. తమ ప్రభుత్వంలో, ఇవే రంగాలకు చెందినవారు అరెస్టు అయితే, మౌనముద్రను ఆశ్రయిస్తారు. ఈ వైఖరి రాష్ట్రాలలో, దేశంలో యధేచ్ఛగా సాగుతోన్న సంస్కృతి, అని, మేధావులు మండిపడుతున్నారు. ఇన్ని వ్యవస్థల మధ్య,న్యాయ వ్యవస్థ భూమిక ఎంతో కీలకమైందని నిపుణులు అంటున్నారు. న్యాయవ్యవస్థ సంపూర్ణంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా తన పాత్ర పోషించిననాడు న్యాయం, ధర్మం రాజ్యమేలుతాయని న్యాయశాస్త్ర పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. చట్టానికి ఎవ్వరూ అతీతం కాకపోయినా, ఇన్ని వ్యవస్థల మధ్య న్యాయ వ్యవస్థ ఉనికి, నిర్వహణల పాత్రలు ప్రశ్నార్థకాలుగా మారకూడదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో, నిజమైన జర్నలిజం, నిజమైన జర్నలిస్టుల రక్షణ కూడా కీలకమే. అన్ని రంగాల్లో కల్తీ, కాలుష్యం కొంతకాలంగా పెరిగిపోతోందనే వాదనలను ఏకీభవించక తప్పదు. మొత్తంగా, ఈ పరిణామాలకు ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు. ఉదాహరణలు ఇవ్వకపోయినా, అర్థంకావాల్సిన వారందరికీ అర్థమవుతూనే ఉంటాయి. అర్థమవుతోన్నా.. ఏమీ చేయలేని పరిస్థితిలో సామాన్యుడు మిగిలిపోతున్నాడు. జవాబులు తెలిసినా, సమాధానాలు చెప్పకపోతే, తల వేయిముక్కలవుతాయి, అనే మాటలు, పాత చందమామ పుస్తకాల్లో వెతుక్కోవాలి. అర్ణబ్ గోస్వామి కథ కొన్ని రూపకాల ప్రతిరూపమే.

Ooooo

గురజాడ “ప్రకాశిక” మళ్ళీ వెలుగులోకి...

కొలివి సుందరరావు, లెక్చరర్

మహాకవి గురజాడ అప్పారావు 105 వ వర్ధంతి. 1915లో 53ఏళ్ళ నడిప్రాయంలో, భౌతికంగా ఈ లోకాన్ని వీడి వెళ్ళిపోయాడు. సమాజం కోసం, సమాజానికి ఉపయోగపడే సాహిత్యం కోసం తను జీవించిన ప్రతిక్షణాన్ని సద్వినియోగం చేసుకున్న ధన్యకవి. రససిద్ధుడైన కవీశ్వరుడికి మరణం ఎందుకుంటుంది? ప్రజల నాలుకలపై ఎప్పుడూ జీవించివుండే ‘సుకవి’ గురజాడ. అహరహం సాంఘిక పరివర్తనకు, ప్రగతి గతికి శ్రమించాడు. అందరికీ అర్థమయ్యే జీవభాషలో రచనలు చేశాడు. ఇందులో విస్మయం కలిగించేది, ఇప్పటి వరకూ పెద్దగా ఎవ్వరికీ తెలియని వారి కృషి ఒకటుంది. అదేంటంటే, గురజాడ కొంతకాలం పత్రిక కూడా నడిపాడు. దానిపేరు “ప్రకాశిక”. మనకు అందుతున్న సమాచారం మేరకు 1886లో ఈ పత్రికను స్థాపించాడు. ముద్రణ రూపంలో కాకుండా, రాతప్రతులుగా దీన్ని తీసుకువచ్చాడు. పేరుకు తగ్గట్టుగా కొంతకాలం అది ప్రకాశించింది. తర్వాత కనుమరుగై పోయింది. గురజాడ సాహిత్య, జీవిత విశేషాలలోనూ ఈ పత్రిక గురించి పెద్దగా ప్రస్తావనలోకి రాలేదు. ఇది పక్ష పత్రిక. ఈ పత్రిక గురించి 1911లో ఒక స్నేహితుడికి గురజాడ ఉత్తరం రాశారు. 25ఏళ్ళ క్రితం ప్రకాశిక అనే పత్రిక స్థాపించినట్లుగా ఆ ఉదంతాన్ని అందులో స్పృశించారు. డాక్టర్ కామిశెట్టి సత్యనారాయణ గురజాడపై చేసిన పరిశోధనా గ్రంథం ద్వారా “ప్రకాశిక” విషయం వెలుగులోకి వచ్చింది. అప్పారావుగారింట్లో పెద్ద దొంగతనం జరిగింది. వచ్చిన దొంగలు బోలెడు సాహిత్య సంపదను కూడా పట్టుకుపోయారు. అందులో, ఈ పత్రిక రాతప్రతులు కూడా ఉన్నాయి. ఇన్నేళ్లకు, ఇన్నాళ్లకు గురజాడ కుటుంబ సభ్యులు, బంధువులు మళ్ళీ ఈ పత్రికను బయటకు తెస్తున్నారు. గురజాడ వర్ధంతి సందర్భంగా నవంబర్ 30వ తేదీ 2020 నుండి “ప్రకాశిక” అందుబాటులోకి వస్తోంది. గురజాడ ఫౌండేషన్ (అమెరికా) వారు ఈ బాధ్యతలు చేపట్టారు. గురజాడ అప్పారావు మునిమనుమరాలు అరుణ, డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ ఇందులో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. గురజాడ ముని మనుమడు రవీంద్రుడు సమాచారం, సహకారం అందిస్తూ పునీతులవుతున్నారు. ప్రస్తుతం అంతర్జాలంలో త్రైమాసిక పత్రికగా వెలువడనుంది. సమీప భవిష్యత్తులో కరోనా హడావిడి తగ్గిన తర్వాత ముద్రణా రూపంలోనూ తెచ్చే ఆలోచనలో ఈ పత్రిక యాజమాన్యం ఉంది. గురజాడ రచనలు, ఆయన చెప్పిన రసగుళికల్లాంటి మాటలు ఇందులో పొందుపరుస్తున్నారు. ఈ కాలంలో లబ్ధప్రతిష్ఠులైన సారస్వతమూర్తులు, జర్నలిస్టులు వ్యాసాలు అందిస్తున్నారు. మమత, సమత,మానవతకు ప్రకాశిక పత్రిక వేదికవుతుంది. ఈ మూడింటినీ చాటి చెప్పే అక్షరాలకు ఇది భూమిక అవుతుంది. నూతన ఆవిష్కరణలు, ఆధునిక ఆలోచనలు, ప్రాపంచిక దృక్పథం, దార్శనికత, దేశభక్తి, విశాల దృక్పథం, అభ్యుదయ భావాలు, సమాజ శ్రేయస్సు, సాంప్రదాయ నిరతి చుట్టూ ఈ పత్రిక తిరుగనుంది. గురజాడ ఆలోచనలన్నీ ఇవే. ఈ పత్రిక కూడా వాటికే అంకితమైతే, సామాజిక హితానికి సాహిత్యం ఊతమవుతుంది. నేడు, భాష మారుతోంది. కవితల, రచనల వేషాలు మారుతున్నాయి. అప్పారావు ఎప్పుడో 1886లో, 134ఏళ్ళ క్రితం ఈ పత్రిక తెచ్చారు. ఆనాటి సమస్యలను, సమాజాన్ని అప్పటి పత్రికలో గుదిగుచ్చి చెప్పారు. ఇప్పుడు కూడా దాదాపుగా అవే సమస్యలు ఉన్నాయి. వాటికి తోడు కొత్త సమస్యలు కూడా వచ్చి చేరాయి. అప్పటి రచయితలు, పాఠకుల తీరు వేరు, ఇప్పటి రూపం వేరు. ఏది చెప్పినా, వాడుకభాషలోనే చెప్పమని ఆయన ఉద్దేశ్యం. అది ఎట్లాగూ సాగుతుంది. ఇప్పటి పత్రికలు వాడుకభాషలోనే సంగతులన్నీ చెబుతున్నాయి. అక్కడక్కడా, అప్పుడప్పుడూ కాస్త కవిత్వం తొంగి చూస్తున్నా, ఎక్కువ శాతం అందరికీ అర్థమయ్యే భాషలోనే నేటి పత్రికలు వస్తున్నాయి. అక్షరాస్యత బాగా పెరిగింది. ఆధునిక సాంకేతికత మరింతగా అందుబాటులోకి వచ్చింది. మనుషుల దృక్పథాలు, రుచులు, అభిరుచుల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. మీడియా, సోషల్ మీడియా విస్తృత రూపం దాల్చింది. సాహిత్యానికి కూడా ప్రత్యేకంగా కొన్ని పత్రికలు అక్కడక్కడా ఉన్నాయి. శాటిలైట్, యుట్యూబ్ చానెల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇన్నిటి మధ్య “ప్రకాశిక” వికసించాలి. విస్తృతంగా విశ్వరూపం ఎత్తాలి. అరచేతిలో సాంకేతికత ఉన్న నేపథ్యంలో, ప్రపంచంలో ఎక్కడ నుంచైనా పత్రికను చదువుకోవచ్చు. చేరవెయ్యవచ్చు. వ్యాసాలు తెప్పించుకోవచ్చు. ఇది నేటి ప్రకాశికకు దొరికిన వెసులుబాటు. అప్పుడు రాత ప్రతిగా వస్తే, ఇప్పుడు అంతర్జాలంలో వస్తోంది. ఇక్కడా గురజాడ వారసత్వ విలక్షణత్వం కొనసాగుతోంది. కందుకూరి వీరేశలింగం వివేకవర్ధిని వంటి పత్రికలు నడిపాడు. కాళ్ళకూరి నారాయణరావు మనోరంజని అనే పత్రికను స్థాపించాడు. ఆ కాలంలో కవులు, సాహిత్యవేత్తలు ఎందరో పత్రికలు నడిపారు. ఇది కొత్త విషయం కాదు. సారస్వతవేత్తలు పత్రికలు నడిపే పరిస్థితులు నేటికాలంలో లేవు. ఎక్కడో చెదురుమొదురుగా ఉంటే ఉండవచ్చు. ఇటువంటి వాతావరణంలో, గురజాడ వర్ధంతినాడు గురజాడ ఎప్పుడో స్థాపించిన పత్రికను పునఃప్రకాశం చెయ్యాలనే ఆలోచన వచ్చిన వారి బంధుగణానికి , ఈ యజ్ఞానికి సహకరిస్తున్న అందరికీ అభినందనలు, అభివందనలు తెలుపుదాం. ప్రకాశిక ప్రకాశమానం, సామాజిక వికాసయానం.

మెహిదీపట్నంలో స్కైవాక్ నిర్మాణం

ప్రజామీడియా నెట్‌వర్క్ సౌజన్యంతో

పాదచారుల భద్రతకు భరోసా ఇస్తూ.. సకల సౌకర్యాలతో హెచ్‌ఎండీఏ స్కైవాక్‌ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఉప్పల్‌లో ఒకటి నిర్మిస్తుండగా, మెహిదీపట్నంలోనూ ఆకాశమార్గం రానున్నది. రూ. 34.28 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. పాదచారుల భద్రతకు భరోసా కల్పించే చర్యల్లో భాగంగా అత్యంత రద్దీ ప్రాంతమైన మెహిదీపట్నంలోనూ స్కైవాక్ నిర్మించనున్నది హెచ్‌ఎండీఏ. ఇప్పటికే ఉప్పల్ జంక్షన్‌లో సుమారు రూ. 36.50కోట్లతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సర్కిల్ ఆకారంలో ఆకాశమార్గం నిర్మాణాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. తాజాగా మెహిదీపట్నం జంక్షన్‌లోనూ రూ. 34. 28 కోట్ల అంచనాతో స్కైవాక్ పనులకు టెండర్లు ఆహ్వానించారు. దీంతోపాటు 2000 స్కేర్ మీటర్ల విస్తీర్ణంలో కమర్షియల్ భవనాన్ని నిర్మించనున్నారు. అంతేకాదు ప్రస్తుతం ఉన్న బస్‌బేను మరింత ఆధునీకరిస్తారు. ఈ ప్రాజెక్టు పనులను పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. పాదచారుల సౌకర్యార్థం రోడ్డుకు 6.15 మీటర్ల ఎత్తులో ఐఆర్‌సీ నిబంధనల ప్రకారం స్కైవాక్/బోర్డు వాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీంతో జంక్షన్‌లో రోడ్డు దాటడం సులభతరం కావడంతోపాటు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది. అన్నింటి కంటే ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు.

సులువుగా రోడ్డు దాటేయవచ్చు...

మెహిదీపట్నం రైతుబజార్ దగ్గర రెండువైపులా ఉన్న రోడ్డును దాటడం కష్టసాధ్యంగా మారింది. రోజూ మెహిదీపట్నం రైతుబజార్ నుంచి 7,900 బస్సులు వివిధ ప్రాంతాలకు తిరుగుతుంటాయి. ఈ ఇబ్బందులు తప్పించేందుకు ఇరువైపులా బస్టాండ్‌తోపాటు మధ్యలో ఉన్న పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే కిందగా అనుసంధానం చేస్తూ ఆకాశమార్గాన్ని నిర్మించనున్నారు. అసిఫ్‌నగర్, రైతుబజార్, లక్డీకపూల్, రేతిబౌలి వైపునకు వెళ్లే పాదచారులకు నడక సులువు కానుంది.

స్కైవాక్/బోర్డు వాక్ ప్రత్యేకతలు

మెహిదీపట్నం రైతుబజార్ నుంచి అవతల రోడ్డు మిలిటరీ వైపునకు వెళ్లేందుకు వీలుగా ఈ నిర్మాణం జరగనుంది. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే ఫ్లై ఓవర్ కింద నుంచి రోడ్డుకు ఇరువైపులా ఈ నిర్మాణం జరగనుంది. రోడ్డు మీదకు వెళ్లే వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ఈ స్కైవాక్/బోర్డువాక్ నిర్మాణం చేపట్టనున్నారు. 6.15 మీటర్ల ఎత్తులో, వర్టికల్ ఆకారంలో 380 మీటర్ల పొడవు , 3.6 వెడల్పుతో పాదచారులకు వీలుగా ఈ స్కైవే/వాక్ వే నిర్మాణం జరుగనున్నది. 50 మీటర్ల వెడల్పుతో దుర్గం చెరువు తరహాలో తీగలతో కూడిన స్టీల్ సస్పెన్షన్ బ్రిడ్జి ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నది. ఆసిఫ్‌నగర్‌కు వచ్చే వారంతా మెహిదీపట్నం రైతుబజార్‌లో దిగొచ్చు లేదంటే మిలిటరీ సైడ్ దిగొచ్చు. దీనికి సమాంతరంగా గుడి మల్కాపూర్ వైపు రైతుబజార్‌కు వెళ్లొచ్చు. ఇలా ఆరు వైపులా పాదచారులకు సౌలత్ కల్పించారు. ప్రత్యేక ఆకర్షణగా టూర్ ఆకారంలో వాక్ వే ఉంటుంది. 36 ప్యాసింజర్ సామర్థ్యం గల 10 లిఫ్టులు, 15 మంది సామర్థ్యం గల లిఫ్టులు ఆరు అందుబాటులో ఉండనున్నాయి. వాక్‌వేలో నడిచే పాదచారుల సౌలభ్యం కోసం షాపులు, కియోస్కులు, లిఫ్ట్, ఎస్కలేటర్స్, మెట్ల సౌకర్యం ఉంటుంది. మెట్రో తరహాలో ఈ వాక్‌వే/బోర్డు వాక్ నిర్మాణం చేపట్టి అన్ని వర్గాల వారికీ అందుబాటులోకి తీసుకురానున్నారు.

అభివృద్ధితో అంతర్జాతీయ ఖ్యాతి

సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి పనులతో హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ ఖ్యాతి పెరిగింది. మెహిదీపట్నంలో స్కైవాక్ నిర్మాణంతో ఈ ఖ్యాతి ద్విగుణీకృతం అవుతుంది.



అమెరికాకు డబ్ల్యూటీఓలో చుక్కెదురు

కె.వెంకట్, పి.మెచ్‌డి



ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) డైరెక్టర్ జనరల్‌గా అమెరికా బలపరిచిన కొరియాకు చెందిన యో మెయింగ హీ ఓటమి చెందారు. నైజీరియాకు చెందిన డాక్టర్ నోజీ ఒకాంన్‌జోం ఐవీలా గెలుపొం దారు. పోటీపడ్డ ఇద్దరూ మహిళలే. ప్రపంచంలో నయా ఉదారవాద విధానాల అమలుకు ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ మూడూ సాధనాలుగా ఉన్నాయి. ప్రారంభం నుంచి తన గుప్పెట్లోని అంత ర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడికి లాభాలు సమకూర్చి ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకో వడానికి ఈ మూడు సంస్థలను అమెరికా వాడుకుంటున్నది. ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలో అమెరికా బలపరిచిన అభ్యర్థి ఓటమిపాలవటం ఇదే మొదటిసారి. ఈ ఓటమిని అమెరికా చాలా తీవ్రంగా పరిగణిస్తున్నది. అక్టోబరు 28న జనరల్ కౌన్సిల్ సమావేశంలో 164 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఏకాభిప్రాయ సాధనలో వచ్చిన ఫలితాలను జనరల్ కౌన్సిల్ చైర్మెన్ న్యూజిలాండ్‌కు చెందిన డేవిడ్ వాకర్ ప్రకటించారు. కాగా, దాన్ని అమెరికా ప్రతినిధి డేవిస్ షియా అంగీకరించమని ఎదురు తిరిగారు. పారదర్శకత లేకుండా ఏ విధంగా ఈ నిర్ణయానికి వస్తారని గొడవ చేశారు. నవంబరు 9న జరిగే సమావేశంలో ఏమి జరుగుతుందనేది కూడా అమెరికా ఎన్నికల ఫలితాలపై ఆధారపడి వుండచ్చని అంటున్నారు. ఇప్పుడు పదవీ బాధ్యత చేపడితే 2024 ఆగష్టు వరకూ కొనసాగిస్తారు. గత డైరెక్టర్ జనరల్ అయిన రోబెలటో అమెరికా గొంతుకలా వ్యవహరించేవారు. ఆయన పదవీ కాలం 2013-2020 వరకు ఉన్నా మధ్యలో డబ్ల్యూటీఓను వదిలి పెప్సీకో సంస్థ సీఈఓగా ఆయన వెళ్ళిపోయినందున ఖాళీ ఏర్పడింది. ఈ సంఘటన ద్వారా ప్రపంచ సంస్థలకు నాయకత్వం వహించే వ్యక్తులకు బహుళజాతి సంస్థలకు ఎటువంటి బంధం ఉంటుందో స్పష్టంగా బట్టబయలు అయింది.

ప్రపంచవాణిజ్య సంస్థ ఉనికే ఈ మధ్య ప్రశ్నార్థకంగా మారింది. అమెరికా ఆధిపత్య ధోరణి, ఏకపక్ష నిర్ణయాలే దీనికి ప్రధాన కారణం. తీర్పులను కూడా అమెరికా అమలు జరపటంలేదు. అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య పరమైన వివాదాలు తలెత్తినప్పుడు రెండు దేశాల పరిష్కార విధానం అమలులో ఉన్నది. దాన్ని అమెరికా నిర్వీర్యం చేసి వివాదాలు పరిష్కారం కాకుండా అడ్డుకుంటున్నది. 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ పురుడుపోసుకున్నది. గాట్ (జనరల్ అగ్రిమెంట్ ఆఫ్ టారిఫ్స్ అండ్ ట్రేడ్) (జీఏటీటీ) డబ్ల్యూటీఓగా పరిణామం చెందిందని మనకు తెలుసు. "గాట్" ఒప్పందం ఉన్న కాలంలో ఆటవిక రాజ్యం నడుస్తున్నదని, అందుకని ప్రపంచ వాణిజ్యంలో క్రమశిక్షణ తేవాలనే లక్ష్యాన్ని బయటకు ప్రకటించినా, ప్రపంచంలో జరిగే వాణిజ్యం నేపథ్యంలో ఏర్పడే వివాదాల పరిష్కార సాధనంగా దీన్ని ఏర్పాటు చేశారు. వ్యవసాయరంగంలో అభివృద్ధి చెందుతున్న దేశాలపై అమెరికా ఆధిపత్యం ఏర్పర్చడం దీని లక్ష్యాలలో ప్రధానమైనది. వ్యవసాయంలో ఏ విత్తనాలు వాడాలి. వాణిజ్యం ఎలా జరగాలని కూడా అమెరికానే నిర్ణయించే దశకు చేరుకుంది. అమెరికాకు చెందిన విత్తన ఉత్పత్తి బహుళజాతి సంస్థల విత్తనాలనే వాడాలని గట్టి ఒత్తిడి పెట్టి వాటి లాభాలు విపరీతంగా పెంచుకున్నది. అప్పటి వరకు అమెరికా సంతోషంగానే ఉన్నది.

భారత్, చైనా, దక్షిణ ఆఫ్రికా, ఇండొనేషియా, అర్జెంటీనా లాంటి దేశాలకు డబ్ల్యూటీఓలో ప్రత్యేక స్థాయి కల్పించడం కూడా అమెరికాకు నచ్చడం లేదు. ఏకాభిప్రాయ సేకరణ ద్వారా నిర్ణయాలు చేయడం అనేది డబ్ల్యూటీఓ విధానం. అలాకాకుండా అమెరికా చెప్పిందే వేదంగా ఉండాలని అమెరికా ఆలోచన. అమెరికా తన దేశంలోని చెత్తను ఇతర దేశాలలో డంపింగ్ చేస్తుంటుంది. డబ్ల్యూటీఓ నిబంధనలకు ఇది విరుద్ధంగా ఉండటంతో కొన్ని సమస్యలు ముందుకు వచ్చాయి. దానితో అమెరికా డబ్ల్యూటీఓ వివాద పరిష్కార కమిటీ సభ్యుల నియామకాన్ని ఆలస్యం చేస్తూ వస్తున్నది. ఏడుగురు సభ్యులు ఉండాల్సినది ఒక్కరే ఉన్నారు. కనీసం ముగ్గురు ఉంటేనే కమిటీ కూర్చుని సమస్యలపై తీర్పు ఇవ్వాలి. అందుకే ఈ వివాద పరిష్కార వ్యవస్థను డిసెంబర్ 2019 నుంచి నిర్వీర్యం చేస్తూ వస్తున్నది.

ట్రంప్ అభిప్రాయం ప్రకారం ప్రపంచ వాణిజ్య ఒప్పందం అనేది ప్రపంచం అంతటికి జరిగిన వాణిజ్య ఒప్పందాలలో "చెత్త ఒప్పందం" కాబట్టే ఆయన పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు. అమెరికా గత రెండు సంవత్సరాల నుంచి చైనా స్టీల్, అల్యూమినియంపై టారిఫ్స్ విధిస్తున్నది. కాబట్టి దానికి స్వేచ్ఛ అవసరం. ఎవరూ దాన్ని ఎత్తి చూపకూడదు. ఇది రాజకీయాలతో సంబంధించిన వాణిజ్య యుద్ధం. కాబట్టి తన ఆధిపత్యం కోసం ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నా ఎవ్వరూ ప్రశ్నించకూడదు. అందుకే అమెరికా అడ్డంకులు సృష్టిస్తున్నది.

2001లో చైనా డబ్ల్యూటీఓలో చేరినప్పటి నుంచి ప్రపంచ వాణిజ్యంలో పెద్ద ఎత్తున తన స్థానాన్ని పెంచుకుంటున్నది. ఇది కూడా అమెరికాకు మింగుడు పడటం లేదు. అలా అన్ని కోణాల నుండి అమెరికాకు ఇబ్బందులు రావడం, ఇప్పుడు తను ప్రతిపాదించిన అభ్యర్థిపై ఏకాభిప్రాయం కుదరక పోవడంతో అమెరికా ఎదురు తిరుగుతున్నది. అమెరికాలోని బహుళజాతి సంస్థలకు లాభాలు సమకూర్చటమే అక్కడి పాలకుల ఏకైక లక్ష్యం. దానికోసం వారు ఎంతకైనా సిద్ధపడతారు అనేది దీనితో తేటతెల్లమైంది.

☺☺☺☺☺



డా॥ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ

నవ భారత నిర్మాత, ఆధునిక భారత పితామహుడు, ప్రపంచ మేధావి, భారతరత్న బాబాసాహెబ్ డా॥ బి.ఆర్.అంబేద్కర్ 64వ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం జిల్లా, ఆనందపురం మం॥, పెద్దిపాలెం గ్రామంలో తేది. 06-12-2020న అంబేద్కర్ విగ్రహాము విశాఖపట్నం రేంజ్ డి.ఐ.జి గౌ॥ శ్రీ ఎల్.కె.వి.రంగారావు గారు , ఐపిఎస్., ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌ॥ శ్రీ పి.అనీల్ కుమార్, డి.ఎస్.పి., విజయనగరం, గౌ॥ శ్రీ ఎన్.కాళీదాస్, డి.ఎస్.పి, సి.ఐ.డి, విశాఖపటనం గౌ॥ శ్రీ ఎమ్.కల్యాణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్, రణస్థలం, గౌ॥ శ్రీమతి సి.హెచ్. రాజేశ్వరి,ఇన్‌స్పెక్టర్, ఎస్.ఇ.బి -3, విశాఖపట్నం, విశాఖపట్నం, ఎస్.సి., ఎస్.టి. పోలీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధికారులు, గౌ॥ శ్రీ కె.వెంకటప్పారావు, ఎడిటర్, ప్రజామణిపూస, దళిత నాయకులు మరియు పెద్దిపాలెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గౌ॥ శ్రీ ఎల్.కె.వి.రంగారావు గారు , ఐపిఎస్.,

పి.అనీల్‌కుమార్, డి.ఎస్.పి



దాల్ సరస్సు

వాసుశ్రీ, సీనియర్ జర్నలిస్ట్

కార్పొరేట్ల గుప్పెట్లో కాశ్మీర్

చల్లని తెల్లని మంచులోయలో వెచ్చని ఎర్రని రక్తం ఏరులై పారింది ఇన్నేళ్ళూ. ఇక ఇప్పుడు కాశ్మీర్ లోయలో దేశంలోని ఇతర ప్రాంతాల వారెవరైనా భూములతో సహా స్థిరాస్తులు కొనుగోలు చేసుకోవచ్చునంటూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌తో కార్పొరేట్ భూ రాబందులు సుందర కాశ్మీరాన్ని కారుమబ్బుల్లా కమ్ముకోవడానికి తెర లేచింది. సంఘపరివార్ కాశ్మీర్ ఎజెండా వెనుక దాగున్న కార్పొరేట్ ప్రయోజనాలు ఇప్పుడు బహిర్గతం అయ్యాయి. భూతల స్వర్గంగా ఖ్యాతిగాంచిన సుందర కాశ్మీర్‌పై ఇన్నేళ్లూ సంఘపరివార్ చేసిన విష ప్రచారం ఇంతా అంతా కాదు. **370**వ అధికరణం, అసెంబ్లీకి ప్రత్యేక హోదాలను సాకుగా చూపుతూ విషం చిమ్మింది. వాటిని రద్దు చేస్తే కానీ, దేశంలో పూర్తిగా అంతర్భాగం కాదని **70**ఏండ్లుగా చెప్పిందే చెప్పింది. తమ చెప్పుచేతుల్లో నడిచే పార్టీ పార్లమెంటులో పూర్తి మెజార్టీ సాధించగానే అన్నంత పని చేసి, పూర్తి స్థాయిలో అంతర్భాగం అయిపోయిందని ప్రకటించింది. నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం ఏడాది క్రితం ఈ పని చేయడానికి ముందు, చేసిన తరువాత కూడా కాశ్మీర్ భారతదేశంలో భాగమే. మరి కొత్తగా ఏం తేడా వచ్చింది? సంఘ పరివారీయులు ఏండ్ల తరబడి కాశ్మీర్‌ను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? ఎవరికి లబ్ధి చేకూర్చడానికి దశాబ్దాల తరబడి దేశ ప్రజల్లో విద్వేషాన్ని నూరిపోశారు? ఇంతకాలం అర్థం కాని వారికి కూడా ఇప్పుడు అర్థమయ్యే రోజు వచ్చింది! కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి, ప్రత్యేక హోదాలకు పూచీపడిన **370, 35(1)** అధికరణాలు ఉన్నంతకాలం అక్కడి భూమిని స్థానికేతరులు కొనడానికి వీలులేదు. ఏడాది క్రితం వాటిని రద్దు చేసినప్పటికీ కార్పొరేట్ల కలలు నెరవేరడానికి అనేక చిన్నా, చితక చట్టాలు అడ్డంకిగా నిలిచాయి. దీనికోసమే మోడీ ప్రభుత్వం ఏకంగా **26** చట్టాలను మార్చివేసింది. జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (కేంద్ర చట్టాల వర్తింపు) పేరిట కొత్త చట్టాన్ని ఎవరినీ సంప్రదించకుండా, నామ మాత్రపు చర్చ లేకుండా హడావిడిగా, ఏకపక్షంగా అమలులోకి తీసుకు వచ్చింది. అంబానీలు, ఆదానీలకు కాశ్మీర్‌లోని ప్రకృతి సంపదను సొంతం చేసుకునే వీలు కల్పించింది. కరోనా కష్టకాలంలో దేశ సంపదను ఒకవైపు దోచిపెడుతూనే, జమ్మూ, కాశ్మీర్‌లోని భూ యాజమాన్య చట్టాలను మోడీ పరివారం చెత్తబుట్టలోకి విసిరింది. ఈ చర్యతో సుందర కాశ్మీరాన్ని కబళించాలన్న కార్పొరేట్ల చిరకాల స్వప్నం నెరవేరింది. ఏ విధంగా చూసినా కాశ్మీర్ భారత యూనియన్‌లో విలీనం కావడానికి ముందు అంగీకరించిన షరతులను భారత ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. ఇది కాశ్మీరీయుల్లో అపనమ్మకానికి దారితీసింది. దానిలోనుంచి వేర్పాటువాదం, ఉగ్రవాదం పుట్టుకొచ్చింది. వాటిని అణచివేసే పేరిట కేంద్రం మరిన్ని అధికారాలను చేజిక్కించుకుంటూ వచ్చింది. ఇదంతా చరిత్ర! ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ఇంకా ముందుకు పోయింది. **370** అధికరణాన్ని, ప్రత్యేకహోదాను రద్దు చేసింది. మున్సిపాల్టీలు నిర్ణయించే ఆస్తిపన్నును కూడా కేంద్రమే విధిస్తోంది. నిజానికి కాశ్మీర్‌లో ఆనాటి షేక్ అబ్దుల్లా ప్రభుత్వం పేదలందరికి భూమిని పంచడంతో పాటు, అవి అన్యాక్రాంతం కాకుండా ఉండటానికి అనేక చట్టాలను రూపొందించింది. ఇప్పుడు ఆ చట్టాలన్నింటిని మోడీ ప్రభుత్వం ఒక్క కలం పోటుతో రద్దు చేసింది. ఏకపక్షంగా భూ చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరచిన మోడీ ప్రభుత్వం అంతటితో ఆగకుండా కాశ్మీర్ వ్యాప్తంగా ప్రజాస్వామ్య వాదులు, హక్కుల కార్యకర్తలు, పాత్రికేయులపై దాడులకు దిగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది ఘోరం! బాధతో వచ్చే మూలుగును కూడా భరించలేని తనం!! తరతరాలుగా నమ్ముకున్న నేలతల్లి దూరం అయితే, సొంత గడ్డ మీద కాశ్మీరీయులు పరాయివారుగా మారిపోయే ప్రమాదం ఉంది. ఈ దుర్మార్గాన్ని ప్రతిఘటించడానికి సిద్ధపడుతున్న కాశ్మీరీయులకు అండగా దేశ ప్రజలు నిలవాల్సిన సమయమిది!



ధన్వంతరి

దానిమ్మతో

ప్రజామీడియా నెట్‌వర్క్ సౌజన్యంతో

దానిమ్మ రసానికి ప్రధానమైన తొమ్మిది రకాల అనారోగ్యాలను నివారించే గుణం ఉంది. ప్రతిరోజూ ఒక గ్లాసు దానిమ్మరసం తాగినట్లయితే.. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఫ్రీరాడికల్స్‌ను నియంత్రించి ఆరోగ్యాన్ని కాపాడడానికి సహకరిస్తాయి.

క్యాన్సర్ వంటి రోగాలను నివారిస్తాయి. రక్తనాళాలు, గుండె గదులు పటిష్టమవుతాయి. గుండె సంబంధిత రోగుల మీద చేసిన పరిశోధనలో ఈ విషయం స్పష్టమైంది.

కరోన హార్ట్ డిసీజ్ పేషెంటు మూడు నెలలపాటు రోజుకు 250 మి.లీ. దానిమ్మ రసం ఇచ్చినప్పుడు వారిలో రక్తనాళాల పనితీరు, రక్తప్రసరణ 17 శాతం వృద్ధి చెందినట్లు ఇటలీలోని హెల్త్ యూనివర్సిటీ నిర్ధారించింది.

కీళ్ల మధ్య ఉండే జిగురు వయసు పై బడేకొద్దీ తగ్గుతుంటుంది. దాంతో ఆస్టియో ఆర్థరైటిస్ వంటి వ్యాధులు వస్తుంటాయి.

దానిమ్మ రసం తీసుకుంటే జిగురు తగ్గకుండా ఉంటుంది. ప్రోస్టేట్ క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది. ఇందులో ఉండే శరీరానికి అవసరమైన రసాయనాలు క్యాన్సర్ నివారిణిగా పనిచేస్తాయి. దానిమ్మతో లాభాలు 1. లైంగిక కోరికలను పెంచే సహజపదార్థం

దానిమ్మ గింజలలో రక్తపోటు, మరియు మూడ్ పై సానుకూల ప్రభావాలు చూపే లక్షణాలు ఉంటాయి. ఈ గింజలు రక్తప్రసరణను పెంచి అంగస్థంభన సమస్యలను నయం చేస్తాయి. ఇవి టెస్టోస్టిరాన్ హార్మోన్ స్థాయిని కూడా పెంచి తద్వారా లైంగిక కోరికలను పెంచుతాయి.

2. ఆర్థరైటిస్‌ను తగ్గిస్తుంది

దానిమ్మ గింజలు కీళ్లవాతాన్ని మరియు ఆర్థరైటిస్ జబ్బును నయం చేస్తాయి. ఎందుకంటే వీటిల్లో ఫ్లేవనాల్స్ అనే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వాపులను తగ్గించటానికి పనిచేస్తాయి. మీకు కీళ్ల నొప్పులు ఉంటే తరచుగా దానిమ్మలను తింటూ ఉండండి

3. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది

దానిమ్మ గింజలు గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ఆంటీయాక్సిడెంట్లు మంచి కొలెస్ట్రాల్ పనితీరును మెరుగుపర్చి, హానికారక ఆక్సీకరణం చెందిన లిపిడ్లను విచ్ఛిన్నం చేస్తాయి, అలా ఆర్థిరోస్క్లెరోసిస్ రిస్క్ ను తగ్గిస్తాయి. 4. క్యాన్సర్ ను నివారిస్తుంది

దానిమ్మ గింజల వలన ప్రొస్టేట్ క్యాన్సర్ రిస్క్ నివారించబడుతుంది. ఈ గింజలలో వుండే క్యాన్సర్ వ్యతిరేక లక్షణాలు కాన్సర్ కణాలు పాకకుండా, ఎక్కువగా పెరగకుండా, మరియు క్యాన్సర్ సోకిన కణాలు చనిపోయేలాగా పురిగొల్పుతాయి.



సౌర, పవన శక్తి వినియోగం

డా॥ సుమశ్రీ

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడిప్పుడే సాంప్రదాయేతర ఇంధన వనరుల వాడ కంపై అవగాహన పెరుగుతున్నది.

దశాబ్దకాలం ముందు ప్రపంచం మేల్కొని ఉంటే ప్రస్తుతం నెలకొంటున్న అవాంఛనీయ పరిణామాలకు ఆస్కారం ఉండేది కాదు.

పర్యావరణ సంబంధిత సమస్యలే కాకుండా తరిగిపోతున్న సాంప్రదాయ ఇంధన నిక్షేపాలను కాపాడుకుని ఉండేవారం.

ఏ దేశమైనా అభివృద్ధి బాటలో పయనించాలన్నా, అందరికీ ఉపాధి అవకాశాలు కావాలన్నా మనకు ఆయా దేశాల్లో పారిశ్రామిక, సాంకేతిక, రవాణా, వ్యవసాయ, సేవా రంగాలలో విప్లవాత్మక మార్పులు రావాలి.

ఈ రోజుల్లో ప్రతిరంగం ఒకదానితో మరొకటి ముడిపడి ఉంది. ప్రతి రంగాన్ని ముందుకు నడిపించడానికి ఉపయోగపడేది 'శక్తి మండటం వలన శక్తినిచ్చే ఇంధనంపైనే మన అవసరాలన్నీ ఆధారపడి ఉన్నాయి.

ఈ అవసరాలను గుర్తించే మన శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు జరిపి మనకు విభిన్న రకాలైన ఇంధన వనరులను వినియోగంలోకి తెచ్చారు.

వారి పరిశోధనల పర్యవసానమే అన్ని రంగాలు ముందంజలో దూసుకుపోతున్నాయి. పెరుగుతున్న ప్రపంచ జనాభాకు కొంతవరకైనా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

రవాణారంగం రకరకాలుగా మార్పులు చెంది, వస్తు రవాణా చేస్తూ. ప్రజలకు చేరువైంది

ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, లారీలు, బస్సులు, రైల్వేలు, వైమానిక, నావికా రంగం ఒకటేమిటి సర్వ వ్యవస్థలు ఇంధనం మీదనే నడుస్తు న్నాయి. ఇంధన వనరులు లేకపోతే ప్రపంచం ఏమైపోతుందో ఊహకందని విషయం.

అయితే క్రమేపీ మనం వాడుతున్న ఇంధన వనరులు తరిగి పోవడమే కాకుండా పలురకాల పర్యావరణ సమస్యలను తెచ్చిపెట్టాయి.

వాతావరణ సమతుల్యం దెబ్బతిన్నది. కలుషిత ఉద్గారాలవల్ల గాలి కాలుష్యం, జలకాలుష్యం జరిగి మానవుడు రోగాల పాలవుతున్నాడు. భూతాపం విపరీతంగా పెరిగిపోయింది.

ప్రపంచమంతా గ్లోబల్ వార్మింగ్‌పై గగ్గోలు పెడుతున్నది. చెట్లను నరికి, వాటిని కూడా ఇంధనంగా వాడడం వలన గాలిలో అవాంఛనీయ వాయువులు పెరిగిపోయాయి. మనం పీల్చే గాలి స్వచ్ఛతను కోల్పోయింది.

ప్రాణాధార ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోయింది. జలకాలుష్యం వలన తలెత్తిన ఇబ్బందులను పరిష్కరించడానికి తాగునీటిని శుద్ధి చేసే యంత్రాలొచ్చాయి.

మన అవసరాలను ఆధారం చేసుకుని, తాగునీరు కొంత మందికి ప్రధాన ఆదాయ వనరుగా వ్యాపారాత్మకమైన అంగడి సరుకుగా మారిపోయింది.

ఇక మున్ముందు నీటి వలే గాలి కూడా పెద్ద వ్యాపారంగా మారు తుందనడంలో సందేహం లేదు.

కలుషిత గాలికి ప్రత్యామ్నాయంగా కొన్ని దేశాలలో స్వచ్ఛమైన గాలిని బంధించి విక్రయించడం కూడా జరుగుతున్నది.

అయితే ఈ విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. అయితే సమీప భవిష్యత్తులో నీటి శుద్ధి యంత్రాల వలే గాలి శుద్ధి ప్లాంట్లు కూడా ఆవిర్భవించక తప్పదు.

భవిష్యత్తులోఎదురయ్యే ఇంధన వనరుల సమస్యను అధిగమించడానికి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వాడకం తప్పనిసరి.



నార్వే లాంటి దేశాలు ఇప్పటికే పునరుత్పాదక వినియోగ ఇంధనాలను ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తిని చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది.

ఆస్ట్రేలియా లాంటి దేశాలు విద్యుత్‌తో నడిచే వాహనాలను పూర్తిగా వినియోగంలోకి తెచ్చి, శిలాజ ఇంధనాలైన పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా నడిచే వాహనాలను అరికట్టి, కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్ లాంటి ఉద్గారాల విడుదలకు కొంతవరకు అడ్డుకట్ట వేయడం జరిగింది.

సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగంలో దూకుడుమీదున్న అమెరికా కూడా బయో ఇంధనాల వాడకంపై దృష్టి పెట్టడం ముదావహం.

భూతాపం అనేది మిథ్యగా భావించిన అమెరికా కూడా వాస్తవ పరిస్థితులను గమనించడం హర్షదాయకం. శిలాజ ఇంధనాలు కూడా ప్రకృతి సిద్ధంగా ఏర్పడినవే. ఇవి ఏర్పడడానికి లక్షలాది సంవత్సరాలు పట్టింది.

ఇవి తరిగిపోవడానికి ఎంతో సమయం అవసరం లేదు. బొగ్గు, పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాలపై ఆధారపడి మనుగడ సాగిస్తున్న ప్రపంచం ఈ రకమైన ఇంధన వనరులు పరిసమాప్తమైన తర్వాత కుప్పకూలిపోకతప్పదు.

ప్రపంచ అభివృద్ధి రథచక్రాల నడక ఆగిపోక తప్పదు. ప్రపంచం దారుణమైన అస్తవ్యస్త పరిస్థితులను ఎదుర్కోక తప్పదు. అందుకే అన్ని దేశాలు మొద్దునిద్ర వీడుతున్నాయి.

రాబోవు విపత్కర పరిణామాలపై దృష్టిపెడుతున్నాయి. అయితే ఈ కృషి సరిపోదు.

ఒకసారి వినియోగానికే తప్ప పునరుత్పత్తికి, పునర్వినియోగానికి పనికిరాని సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగాన్ని తగ్గించి సౌరశక్తి, పవన శక్తి, తరంగశక్తి వంటి కాలుష్య రహితమైన సాంప్రదాయేతర పునరుత్పాదక ఇంధనాలపై దృష్టి సారించాలి.

బయో ఇంధనాల వాడకం వలన కూడా చాలావరకు హానికారక ఉద్గారాల శాతాన్ని తగ్గించవచ్చు.

చైనా, ఆస్ట్రేలియా, ఇండియా వంటి దేశాల్లో బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉన్నాయి. ఖతార్, ఇరాన్, అమెరికా, రష్యా దేశాల్లో సహజ వాయు నిక్షేపాలు అధికం.

గల్ఫ్ దేశాలు ఆర్థికంగా ముందంజలో ఉండటానికి ప్రధానమైన కారణం అక్కడ ఇబ్బడి ముబ్బడిగా ఉన్న చమురు నిక్షేపాలే కారణం.

అయితే భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలను ఊహించి, తరిగిపోయే ఇంధన వనరులను త్యజించి కాలుష్యరహితమైన ఇంధన వనరులపై దృష్టి సారించాలి.

భారతదేశంలో అపారమైన బొగ్గు నిక్షేపాలు, చమురు నిక్షేపాలున్నాయి. అయితే వీటిని వెలికితీసి, ఉత్పత్తి చేయడం తలకుమించిన భారం. వ్యయంతో కూడుకున్న వ్యవహారం.

జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాలలో బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉండగా గుజరాత్, అస్సాం, త్రిపుర వంటి రాష్ట్రాల్లో సహజవాయు నిక్షేపాలు అపారంగా ఉన్నాయి.

అయినప్పటికీ మనదేశం సౌరశక్తి, వాయుశక్తి ఆధారిత విద్యుత్‌పై దృష్టి కేంద్రీకరించడం శుభపరిణామం. సాంప్రదాయ ఇంధనవనరులకు స్వస్తిచెప్పి సాంప్రదాయేతర ఇంధన వనరులపై దృష్టి సారించాలి.

అన్నింటికంటే సౌరశక్తిని విద్యుత్‌గా మార్చడం శ్రేయస్కరం.

ఇది కాలుష్యరహితం. పర్యావరణ పరిరక్షణకు ఉత్తమమైన ఇంధన వనరు 'సౌరశక్తి, పవనశక్తిని కూడా వినియోగంలోకి తీసుకురావాలి.

గురజాడ వర్ధంతి సందర్భంగా

బతుకు జాడ

పి . లక్ష్మణ్ రావ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, (సహకార శాఖ), విజయనగరం, 9441215989

ప్రజల భాషకు మూలపురుషుడైన
గురజాడ నామం జపిస్తే
శ్వాసకోశాలు చైతన్యమై
ఉద్యమ కెరటాలౌతాయి !

మూఢవిశ్వాసాలపై
గురజాడ నామ మంత్రం పఠిస్తే
జ్ఞానకిరణాలు ఉత్తేజమై
చీకటిపొరలు తొలగిపోతాయి !

రాయిరప్పలకు సాగి
మొక్కుతున్నప్పుడు
గురజాడ పేరు గుర్తొస్తే
నరాల్లో మానవత్వం ఉప్పొంగి
మనసు మనిషివాదాన్ని
నినదిస్తుంది !

మగువులపై
ఆధిపత్యం చేస్తున్నప్పుడు
మన గురజాడ యాదకొస్తే
స్నేహితులుగా మారిపోయి
అతివలకు ఆకాశంలో సగం
చోటిస్తాం !

ఆర్థికప్రణాళికలు రచిస్తున్నప్పుడు
గురజాడ దేశభక్తి గీతాన్ని
అనుసరిస్తే
ప్రగతిరథ చక్రాలు
చక చకా పరుగులెడతాయి !

ఒట్టి మాటలు గట్టిగా
చెబుతున్నపుడు
గురజాడను ఆవాహనం
చేసుకుంటే
గిరీశం గుర్తొచ్చి
సిగ్గుతో చావాలనుకుంటాం !

సొంతలాభం కోసం
దగా చేస్తున్నప్పుడు
గురజాడ పేరు జ్ఞాపకమొస్తే
లుబ్ధావధాన్లు గుర్తొచ్చి
ఒళ్ళంతా సిగ్గుతో
చచ్చుబడిపోతుంది !

గురజాడ కలం
అక్షర కిరణాలు నింపుకొని
దుష్టపాలకులపై
నిప్పురవ్వలు చెరిగింది !

గురజాడ అక్షరం
ప్రగతిదారులు చూపించి
నవ్యపథికులపై
వెలుగు చినుకులు కురిపించింది. !

గురజాడ నామం గురువుజాడ
గురజాడ కలం వెలుగుజాడ
గురజాడ అక్షరం బతుకుజాడ !

విశ్లేషణ

జమిలి ఎన్నికలకు శంఖారావం

బుకర్



దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు, లోక్‌సభకు ఏక కాలంలో ఎన్నికలు జరపాలనే నినాదాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి వినిపించారు. రాజ్యాంగ వార్షికోత్సవం సందర్భంగా గుజరాత్ లో జరిగిన శాసన వ్యవహారాల ప్రిసైడింగ్ ఆఫీసర్స్ సదస్సు దీనికి వేదిక అయ్యింది. ఇది మొదటిసారి కాదు, మొదటి నుంచీ జమిలి ఎన్నికల నిర్వహణపై మోదీ పట్టుదలగానే ఉన్నారు. 2019లో రెండవసారి అధికారంలోకి వచ్చిన వెనువెంటనే అన్ని పార్టీలను ఆహ్వానించి దీనిపై చర్చ జరిపారు. దేశ వ్యాప్తంగా మొత్తం నలభై రాజకీయ పార్టీలను ఈ సమాలోచనకు ఆహ్వానించారు. అప్పుడు, 21పార్టీలు మాత్రమే హాజరయ్యాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ పార్టీలు జమిలి ఎన్నికలకు జై కొట్టాయి. వచ్చిన మిగిలిన పార్టీలు విభిన్న స్వరాలను వినిపించాయి. కాంగ్రెస్ పార్టీ దీనికి వ్యతిరేకంగానే ఉంది. లోక్‌సభకు, శాసన సభలకు సమాంతరంగా ఏకకాలంలో జరపడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధానంగా ఖర్చు కలిసివస్తుంది. వివిధ ఎన్నికల కోడ్ పేరుతో జరగాల్సిన కార్యక్రమాలు జరగకుండా, పనులు ఆగిపోవడం, సమయం వృధా అవ్వడం మొదలైన వాటికి అడ్డుగోడ పడుతుంది. తద్వారా పనిరోజులు పెరుగుతాయి. ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. కనీసం, రెండు, మూడు రాష్ట్రాలలో ఎన్నికలు తప్పనిసరిగా వస్తుంటాయి. ఈ నేపథ్యంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోడానికి వెనుకాడే పరిస్థితి వస్తుంది. అదే అన్ని చోట్ల సమాంతర ఎన్నికల విధానం అందుబాటులో ఉంటే, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి మరింతగా పరిపాలనపై దృష్టి సారించే వెసులుబాటు ఉంటుంది. ఐదేళ్లకొకసారి అన్ని వ్యవస్థలకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల రాజకీయ సుస్థిరత నెలకొనే అవకాశం ఉంది. బీజేపీ పెద్దలు ప్రతిపాదిస్తున్న " జమిలి ఎన్నికల" పై కొందరు అనేక అనుమానాలు, సందేహాలు, అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రతిపాదన వల్ల ఎటుచూసినా, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకే ఎక్కువ మేలుజరుగుతుందనీ, అందుకే, దీనిపై బలంగా ప్రచారం చేస్తోందనే భావంలో ప్రతిపక్షాలు ఉన్నాయి. కేంద్రంలో అధికారంలో ఉండే పార్టీకి సంపూర్ణమైన బలం లేకపోతే, వివిధ ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వం నడపాల్సిన పరిస్థితి వస్తుందనీ, దీని వల్ల కేంద్రంలో పాలనకు అవరోధాలు ఏర్పడతాయనే అనుమానాలు బీజేపీతో సహా కాంగ్రెస్‌కు కూడా ఉన్నాయి. ప్రస్తుతం, బీజేపీ చాలా బలంగా ఉంది. ఈ తరుణంలో, జమిలి ఎన్నికలు జరిగితే, ఐదేళ్లపాటు యథేచ్ఛగా తమ విధానాలను అమలుపరిచే స్వేచ్ఛ మరింత బలంగా ఉంటుందనే అభిప్రాయంలో బీజేపీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో,కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సహజంగా ఆధిక్యత వస్తుందనీ, దాని వల్ల ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగుతుందనే భయంలో కొన్ని ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. దీని వల్ల, వారు అనుసరించే విధానాల వల్ల దేశ సమగ్రతకు జమిలి ఎన్నికల వల్ల భంగం కలిగే ప్రమాదం ఉందనీ కొందరు విమర్శిస్తున్నారు. పరోక్షంగా, అధ్యక్ష వ్యవస్థకు నిర్మాణం చేపట్టే ప్రతిపాదనలు దీని వెనకాల దాగి ఉన్నాయనే భయాలు కొందరిలో అలుముకుంటున్నాయి. ఈ భయాలన్నీ ప్రధానంగా జాతీయ పార్టీ కాంగ్రెస్ కు, దాన్ని అనుసరిస్తున్న ప్రాంతీయ పార్టీలకు ఉన్నాయి. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే, కొన్ని శాసనసభల పదవీ కాలాన్ని కుదించాలి, కొన్నింటికి పొడిగించాలి. ఇటువంటి కీలకమైన చర్యలకు రాజ్యాంగ సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనికి సరిపడా బలం ఉభయ సభల్లోనూ బీజేపీకి ఉందనే చెప్పాలి. తాజా పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ చాలా బలహీనమైపోయింది. ప్రస్తుతం, బీజేపీకి ఎదురులేదనే చెప్పాలి. "సమాంతర ఎన్నికల"పై, 2018 ఆగస్టులో లా కమీషన్ ఒక ముసాయిదా నివేదిక సమర్పించింది. చట్ట సవరణ జరిగిన తర్వాత, దేశంలోని సగం రాష్ట్రాల శాసనసభలు ఆమోదం తెలపాల్సిన అవసరం ఉంది. ఇక్కడ కూడా బీజేపీకి వాతావరణం అనుకూలంగానే ఉంది. లోక్‌సభ, శాసనసభలకు ఎన్నికలు జరిగినప్పుడు కొన్నిచోట్ల క్రాస్ ఓటింగ్ జరుగుతూ ఉంటుంది. శాసనసభకు స్థానిక పార్టీకి వేసి, లోక్ సభకు జాతీయ పార్టీకి వేసే మైండ్ సెట్ కొందరు ఓటర్లలో ఉంటుంది. ఫలితాలు తదనుగుణంగా వచ్చిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఎల్లవేళలా, అధికారంలో ఉండే పార్టీలకు సంపూర్ణమైన మెజారిటీ ఉండకపోవచ్చు. సంకీర్ణంగా ప్రభుత్వాలు నడిపే క్రమంలో, విభేదాల వల్ల ప్రభుత్వం పడిపోయినప్పుడు, ఎన్నికలు మళ్ళీ నిర్వహించాల్సి వస్తుంది. ఇటువంటి సందర్భాల్లో ఏమి చేయాలి? అనే సందేహాలు ఉన్నాయి. ఇలా "జమిలి ఎన్నికల" అంశంలో అనేక అనుకూల, ప్రతికూల అంశాలు, సందేహాలు, అనుమానాలు ఉన్నాయి. వీటన్నింటిపై దేశ వ్యాప్తంగా సమగ్రమైన చర్చ జరగాలి. ప్రజామోదాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి. చర్చల్లో అన్ని పార్టీలు పాల్గొనాలి. మంచిచెడు, లాభనష్టాలు బేరీజువేసుకోవాలి. "కేవలం ఇది చర్చించే విషయం కాదని, భారత్‌కు ఎంతో అవసరం", అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాజాగా పునరుద్ఘాటించారు. కొన్ని నెలల వ్యవధిలోనే ఎన్నికలు నిర్వహించడం వల్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. మొత్తంమీద,నరేంద్రమోదీ మాటలబట్టి, జమిలి ఎన్నికలు తప్పకుండా వచ్చే వాతావరణం కనిపిస్తోంది. అది ఎప్పుడన్నది సమీప భవిష్యత్తులో తేలిపోతుంది. తాజాగా బీహార్, మధ్యప్రదేశ్ ఎన్నికల గెలుపుతో బీజేపీ మంచి ఊపులో ఉంది. పార్టీల రాజకీయ స్వార్థాలు ఎట్లా ఉన్నా, దేశ ప్రజల మంచికి, దేశ ప్రగతికి పట్టంకట్టే విధానాలను స్వాగతించవచ్చు.

కాంగ్రెస్ వీరవిధేయుడు అహ్మద్ పటేల్

డా॥ యల్లయ్య

ఎవరైనా మరణిస్తే... ఆయన మరణం తీరని లోటు అని సంతాప ప్రకటన చేస్తుంటారు కదా... చాలా మరణాల విషయంలో అది మర్యాదపూర్వకమైన సంతాపం కావచ్చు గాక... కానీ ఈరోజు మరణించిన కాంగ్రెస్ లీడర్ అహ్మద్ పటేల్ మరణం మాత్రం కాంగ్రెస్ పార్టీకి నిజంగానే తీరనిలోటు... అసలే అనేక కష్టాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఆయన మరణం మరింత నష్టదాయకమే... కాంగ్రెస్ పార్టీకి నిజంగానే ఆయన కీలకమైన లీడర్.

ట్రబుల్ షూటర్... స్ట్రాటజిస్టు... సైలెంట్ ఆపరేటర్... తను పెద్దగా తెరమీద కనిపించడు... వార్తల్లో ఉండడు... వివాదాల్లోకి రాడు... అసలు తనను కలవడమే గగనం... కానీ కాంగ్రెస్ కీలక వ్యవహారాలన్నింటికీ సూత్రధారి తనే... వ్యవహారాలు చక్కబెట్టే చక్రధారి... కాంగ్రెస్ పెద్దలకు తెలుసు అహ్మద్ పటేల్ పార్టీలో ఎంతటి కీలకమో... ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడు, సోనియాగాంధీ రాజకీయ కార్యదర్శి, పార్టీ కోశాధికారి... ఇదంతా అధికారికం.

ఎప్పుడో సెవెంటీస్‌లో గుజరాత్, భరూచా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడం దగ్గరైన మొదలైన తన పొలిటికల్ కెరీర్... కాంగ్రెస్ కీలక పోస్టుల దాకా సాగింది... మూడుసార్లు లోకసభ సభ్యుడు... తరువాత ప్రత్యక్ష ఎన్నికల నుంచి వైదొలగి 1993 నుంచి అయిదుసార్లు రాజ్యసభ సభ్యుడే... మొన్నటికిమొన్న గుజరాత్ నుంచి తను రాజ్యసభకు ఎన్నిక గాకుండా బీజేపీ సర్వవిధాలా ప్రయత్నించింది... ఎందుకంటే..? అహ్మద్ పటేల్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీని నైతికంగా దెబ్బ కొట్టాలని.

కానీ కర్నాటక డీకే శివకుమార్ డబ్బులు ఖర్చు పెట్టి, పార్టీ ఎమ్మెల్యేలను క్యాంపుకి తరలించి, అహ్మద్ పటేల్‌ను గెలిపించాడు... అహ్మద్ పటేల్ స్థానమేమిటో అర్థమయిందిగా...! ప్రతి పార్టీకి తెరవెనుక చేయాల్సిన కార్యక్రమాలు కొన్ని ఉంటయ్... విరాళాలు, ప్రతిసాయాలు, నియామకాలు, తొలగింపులు, ఎత్తుగడలు, సర్దుబాట్లు, బుజ్జగింపులు... ఒక్కటీ బయటికి రావద్దు... అహ్మద్ పటేల్ అందులో ఆరితేరిన వ్యక్తి... అందుకే తన మరణం ఇప్పటి స్థితిలో కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటే... 2004, 2009 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఫలితాల వెనుక అహ్మద్ పటేల్ బుర్ర పాత్ర కూడా తీసిపారేయలేనిది.

తను కొద్దిరోజులుగా ఐసీయూలో ఉన్నాడు... కోవిడ్‌తో హాస్పిటల్‌లో చేరినా, తరువాత అన్ని అవయవాలూ పనిచేయడం ఆపేశాయి,,, ఇప్పటి ఆయుప్రమాణాల్లో 70 ఏళ్లు మరణించే వయస్సేమీ కాదు... కానీ ముంచుకొచ్చింది తప్పలేదు... అటు సోనియా అనారోగ్యం, ఇటు వారసత్వ సమస్యలు... సీనియర్ల తిరుగుబాట్లు... ప్రత్యర్థి పార్టీ దూకుడు... ఎక్కడ నెగ్గాలో కాదు... ఎక్కడ తగ్గాలో సరిగ్గా తెలిసి, ఎదిగి... చివరకు.

1980-81... ఓ శీతాకాలం సాయంత్రం... పార్లమెంటు సభ్యుల నడుమ ఓ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది... గుజరాత్, భరూచ్ నుంచి వచ్చిన యువ ఎంపీ అహ్మద్ పటేల్ బ్యాటింగులో ఇరగదీసేస్తున్నాడు... సెంచరీకి దగ్గరయ్యాడు... మరోవైపు మాధవరావు సింధియా... అహ్మద్ పటేల్ బ్యాటింగు చేస్తుంటే ఇక వేరే ప్లేయర్లకు ఆడటానికి ఏమీ ఉండదు... సింధియా సరదాగా నవ్వుతూ మొత్తం నువ్వే ఆడితే మరి మేమేం చేయాలి భయ్యా అన్నాడు... ఆ తరువాత బంతికే పటేల్ బౌల్డ్ అయ్యాడు... కావాలనే... సింధియాకు 'ఇక ఆట నీదే భయ్యా' అంటూ సైగ చేసి క్రీజు వదిలాడు.



అంతేమరి... రాజకీయాల్లో ఎక్కడ నెగ్గాలో కాదు, ఎక్కడ తగ్గాలో తెలిసినవాడే ఎదుగుతాడు... ప్రత్యేకించి కాంగ్రెస్ రాజకీయాల్లో... ఆమధ్య ఓ పాత్రికేయుడు తనకు ఆ క్రికెట్ మ్యాచ్ గుర్తుచేసి, ఎందుకలా కావాలనే ఔటయ్యారు, ఆ సెంచరీ పూర్తిచేసి, వదిలేస్తే బాగుండేదిగా అనడిగాడు... 'అది అంతే... అసలు ఢిల్లీలో సింధియా మహారాజ్ ప్రభ ఎక్కడ..? అప్పట్లో నేను ఎక్కడ..? సెంచరీది ఏముంది..? సింధియా చెప్పడం, నేను కాదనడమా..? ఏదేమైనా ఆయన మాటను మన్నించడమే అప్పుడు నాకు ముఖ్యం' అని బదులిచ్చాడు నవ్వుతూ.

అదే అహ్మద్ పటేల్... పక్కాగా నేల మీద నడిచే మనిషి... కృత్రిమ హైపులతో మబ్బుల్లో ప్రయాణం చేసే వ్యక్తి కాదు తను... ఎవరితో ఎలా మెలగాలో బాగా తెలుసు... ఎవరినీ నొప్పించడు, అందరినీ కలుపుకుపోతాడు... అంతిమంగా తనకు కావల్సిన రిజల్ట్ పట్టేస్తాడు... అందుకే మరి సోనియా కాంగ్రెస్‌కు రాజకీయ కార్యదర్శి అయ్యాడు, కోశాధికారి అయ్యాడు... క్రైసిస్ మేనేజర్‌గా తనే సెంటర్ పాయింట్ అయ్యాడు... మంచి వ్యూహకర్త... 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్‌కు తెర వెనుక అన్నీ తానే.

ఏఐసీసీ, సీడబ్ల్యూసీ, యూపీయే నిర్ణయాలు ఏమైనా ఉండనీ... ప్రభుత్వ నిర్ణయాలు ఏవైనా జరగనీ... అంతిమంగా అహ్మద్ పటేల్ ఓ మాట చెబితేనే సోనియాగాంధీ ఆమోదముద్ర పడేది... చివరకు ఆమె ఎవరిని కలవాలో, ఏం చెప్పాలో కూడా బ్రీఫ్ చేసేవాడు... రాజీవ్ గాంధీకి, తరువాత సోనియా గాంధీకి నమ్మినబంటు... ఇంత కీలకమైన బోల్టో అయినా సరే... ఎక్కడా తను కనిపించేవాడు కాదు... ఇరకడు, దొరకడు, కొరుకుడుపడడు... యూపీయే హయాంలో అనేక అవినీతి బాగోతాలు చోటుచేసుకున్నా సరే, ఆ మకిలి సోనియా కుటుంబం మీద పడకుండా చూసేవాడు.

కాంగ్రెస్ నాయకులు తనను హోమియో డాక్టర్ అనేవాళ్లు... ఢిల్లీలోని 23, మదర్ థెరిసా క్రెసెంట్ తన నివాసం... పెద్ద అట్టహాసాలేమీ ఉండవు...

మొన్నమొన్నటివరకూ ఓ పాత మారుతి ఎస్టీమ్‌లోనే తిరిగేవాడు... కాకపోతే చీకటైందంటే చాలు... ఆ ఇంటికి వచ్చే కేబినెట్ మంత్రులు, ముఖ్యమంత్రులు, బడా లీడర్లతో బోలెడన్ని చర్చలు... రాత్రి పొద్దుపోయేదాకా సందడే... పగటిపూట అంతా సైలెన్స్... ఎవరు ఏ సమస్యను తీసుకుపోయినా సరే, నవ్వుతూ ఆ ఇంటి నుంచి బయటికి రావల్సిందే... అందరికీ హోమియో డాక్టర్లాగే స్వీట్ పిల్స్ ఇచ్చేవాడు... వెయిట్ చేయాలి, సమస్య సాల్వ్ అవుతుంది అనేవాడు. ఆశావాదాన్ని వదిలేవాడు కాదు... ఓ జర్నలిస్టు కష్టమ్మీద తన అపాయింట్‌మెంట్ సంపాదించి, ఈ అవినీతి యవ్వారాలు ప్రభుత్వాన్ని ఏమైనా చేస్తాయా అనడిగాడు సగం ఆఫ్‌దిరికార్డు, సగం ఆన్‌రికార్డు... అంతకుముందే ఎవరో ఇండస్ట్రియలిస్టు తనకు ఇచ్చి వెళ్లిన తిరుపతి ప్రసాదాన్ని ఆ జర్నలిస్టుకు ఇచ్చి, వీడ్కోలు చెబుతూ... "ప్రభుత్వానికి ఏమీ కాదు, పార్టీకి ఏమీకాదు... అన్నిచోట్లా ప్రార్థనలు జరుగుతూనే ఉన్నయ్, ఇదుగో ప్రసాదాలు అందుతూనే ఉన్నయ్" అన్నాడు చిరు మందహాసంతో.

నెవ్వర్... టెన్షన్ పడటం తన స్టయిల్ కానేకాదు... తెర వెనుక జరిగే అనేకానేక పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలు సజావుగా సాగేలా చూడటం, అప్పుడప్పుడూ తలెత్తే సంక్షోభాల్ని టాకిల్ చేయడం తన పని... తను ఏది చెబితే అదే దాదాపు ఫైనల్... కానీ రాహుల్ గాంధీ హయాం వచ్చాక... అహ్మద్ పటేల్ తిరోగమనం ఆరంభమైంది... సీనియర్లందరినీ ఇంటికి పంపించడమే కాంగ్రెస్ రోగానికి చికిత్స అనే మూఢనమ్మకంలో పడ్డ రాహుల్ ఈయన్ని కూడా ఇగ్నోర్ చేయడం స్టార్టయింది.

తను పక్కకు తప్పుకోవాల్సిన సమయం వచ్చిందని భావించిన పటేల్ ఎక్కువగా గుజరాత్‌లోని తన సొంత నియోజకవర్గానికే పరిమితం కాసాగాడు... పార్లమెంటు సమావేశాలప్పుడు మాత్రమే ఢిల్లీలో కనిపించేవాడు... కానీ రోజురోజుకూ కాంగ్రెస్ భవనం శిథిలం అవుతూ ఉండటంతో సోనియా తిరిగి అహ్మద్ పటేల్‌ను యాక్టివేట్ చేసింది... కోశాధికారిని చేసింది... కాంగ్రెస్ పడవ పూర్తిగా మునిగిపోకుండా కాపాడాలని ఆమె కోరిన సీనియర్లలో పటేల్ కూడా ఉన్నాడు.

కానీ పరిస్థితులు వేగంగా మారిపోయినయ్... సోనియా అనారోగ్యం, రాహుల్ కోటరీ పెత్తనం, సీనియర్లపై అకారణ ద్వేషం పార్టీని ఇంకా ఇంకా పతనం చేయసాగాయి... ఆ అసంతృప్తిని కూడా తను ఎప్పుడూ ఇతర సీనియర్లలాగా మాటమాత్రంగానైనా బయటపెట్టలేదు... ఎందుకంటే... తను కొన్ని దశాబ్దాలుగా ఆ కుటుంబానికి పరమవిధేయుడు... ఎటొచ్చీ ఆ విధేయత పనికిరాకుండా పోయింది తన చివరిరోజుల్లో...!!నెహ్రూ కుటుంబానికి ఏదో కష్టకాలం... సరిగ్గా ఈ కష్టకాలంలోనే ఈ విధేయుడు తను ఏమీ చేయలేకపోతున్నానే అనే అసంతృప్తితోనే ఈ లోకం వదిలివెళ్లాడు కావచ్చు...! సారీ సర్, వుయ్ మిస్ యు.

❖ ❖ ❖

కొత్త జిల్లాలతో పరిపాలన, ప్రగతిలో వేగం పెరిగేనా..

విశ్లేషణ

- డా॥గంగాధర్

ఆంధ్రప్రదేశ్ లో కొత్త జిల్లాల ఏర్పాటు దిశగా చర్యలు ఊపందుకుంటున్నాయి.కొత్త సంవత్సరం ఆరంభంలోనే కార్యరూపం దాలుస్తుందనే కథనాలు వెల్లువెత్తుతున్నాయి.దీని వల్ల ఆశించిన ఫలాలు అందరికీ దక్కుతాయా,దీని వెనక రాజకీయ ప్రయోజనాలే ఉన్నాయా అన్నది నేడు విస్తృతంగా చర్చ జరుగుతోంది. పరిపాలనా సౌలభ్యం, ప్రజల సౌకర్యం, మానవ వనరుల సద్వినియగం పేరుతో జిల్లాల సంఖ్య పెంచాలనే ఆలోచనతో ఈ బృహత్ కార్యాచరణ చేపట్టామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ఈ దిశగా కమిటీలు, ఉపసంఘాలు కూడా ఏర్పడ్డాయి.కమిటీలు సమగ్రంగా అధ్యయనం చేసి, సమర్పించిన నివేదికల ఆధారంగా ఆచరణ బాటపట్టాల్సి వుంది. 2014లో ఉమ్మడి రాష్ట్రం రెండుగా విడిపోయిన తర్వాత, ముందుగా తెలంగాణ ప్రభుత్వం కొత్తజిల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా, కె.చంద్రశేఖర్ రావు ప్రభుత్వం 2016లో తెలంగాణలో కొత్త జిల్లాలను ఏర్పాటుచేసి, జిల్లాల సంఖ్యను గణనీయంగా పెంచింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా జిల్లాల సంఖ్య పెంచే దిశగా చర్యలు చేపడుతోంది.రాష్ట్రంలో జిల్లాలు పెంచడం కొత్తగా వచ్చింది కాదు.గతంలోనూ కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు.ఆంధ్రప్రదేశ్ లో కొత్త జిల్లాలు వచ్చి ఇప్పటికి చాలా కాలమయ్యింది.చివరగా ఏర్పడ్డ జిల్లాలు ఉత్తరాంధ్రలోని విజయనగరం,కోస్తా ప్రాంతంలోని ప్రకాశం. గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాలలోని వెనుకబడిన ప్రాంతాలను కొన్నింటిని కలిపి, ప్రకాశం జిల్లాగా ఏర్పాటుచేశారు.ఒంగోలును అధికార కేంద్రంగా చేస్తూ, ఫిబ్రవరి,2 వ తేది ,1970లో ప్రకాశం జిల్లా ఏర్పడింది. ఈ జిల్లా ఏర్పడి ఇప్పటికి 50ఏళ్ళు దాటింది. విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని ప్రాంతాలను కలిపి, జూన్ 1వ తేదీ,1979లో విజయనగరం జిల్లా ఏర్పడింది. ఇది ఏర్పడి కూడా 40ఏళ్ళు పూర్తయింది.ఆంధ్ర ప్రాంతంలో చిట్టచివరగా ఏర్పడిన జిల్లా విజయనగరం.ఆ తర్వాత, కొత్తగా ఏ జిల్లా ఏర్పడలేదు.ఇన్ని దశాబ్దాల తర్వాత, మళ్ళీ ఈ ప్రక్రియ ప్రారంభమైంది. చివరగా ఏర్పడిన విజయనగరం, ప్రకాశం జిల్లాలు ఇప్పటికీ వెనుకబడిన జిల్లాల ముద్రలోనే ఉన్నాయి.జిల్లా కేంద్రాలైన ఒంగోలు, విజయనగరం తప్ప మిగిలిన ప్రాంతాలన్నీ చాలా వెనుకబడే ఉన్నాయి.రియల్ ఎస్టేట్, చీమకుర్తి గనులు, రాష్ట్ర విభజన మొదలైన అనేక అంశాల ప్రభావంతో స్థానికంగా ఒంగోలు పట్టణం, చుట్టుపక్కలా భూముల ధరలు వేలం వెర్రిలాగా పెరిగాయి.ఆస్తులు ఉన్న వారికి ఆనందమే కానీ, కొత్తగా కొనుక్కోవాలనుకునేవారికి అందని ద్రాక్షగానే మారిపోయాయి.జిల్లాలోని కొన్ని పట్టణాల్లోనూ ఇదే తీరు నడిచింది.ఇది తప్ప, జిల్లాలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదు. ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లాల సంఖ్యను పెంచాలనే కృత నిశ్చయంతోనే ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం, ఆంధ్రప్రదేశ్ లో 13 జిల్లాలు ఉన్నాయి. లోక్ సభ స్థానాల ప్రాతిపదికతో 25 జిల్లాలు ఏర్పాటు చెయ్యాలనేది పాలకుల ప్రధానమైన ఆలోచన . గిరిజన ప్రాంతాల భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఇంకొక జిల్లా అదనంగా ఏర్పాటు చెయ్యాలనే ప్రతిపాదనలు వచ్చాయి. ఈ ప్రాతిపదికన 26వ జిల్లా ఏర్పాటు అంశం కూడా తెరపైకి వచ్చింది. భౌగోళికపరంగా కొన్ని జిల్లాలు పెద్దవిగా ఉన్నాయి.ప్రస్తుతం అనంతపురం, గుంటూరు,కృష్ణ,తూర్పు గోదావరి,విశాఖపట్నం పెద్ద జిల్లాలు. ఇందులో అనంతపురం, తూర్పు గోదావరి బాగా పెద్ద జిల్లాలు. అరకు గిరిజన ప్రాంతం. ప్రతి 7 అసెంబ్లీ నియోజకవర్గాలను ఒక జిల్లాగా పునర్ వ్యవస్థీకరించే ఆలోచనలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఉన్నట్లుగా అర్ధమవుతోంది. తెలంగాణ ప్రభుత్వం రెండు దశల్లో, 22జిల్లాలను కొత్తగా ఏర్పాటుచేసింది. గతంలో ఉన్న 10జిల్లాలు, కొత్తగా ఏర్పడిన 22జిల్లాలు కలిసి, ప్రస్తుతం మొత్తం 32 జిల్లాలు తెలంగాణలో ఏర్పడ్డాయి.ఈ రాష్ట్ర లోక్‌సభ స్థానాల సంఖ్య 17. ఈ లెక్కన తీసుకుంటే లోక్‌సభ స్థానాలకు

రెట్టింపు సంఖ్యలో తెలంగాణలో జిల్లాలు ఏర్పడ్డాయి. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ప్రజలు, నిపుణులు, పరిశీలకుల్లో భిన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ప్రభుత్వం ఉద్దేశించిన ప్రయోజనాలు ఏ మేరకు ఫలితాలను ఇచ్చాయో ఇంకా సమగ్రంగా అధ్యయనం చెయ్యాల్సిన అవసరం ఉంది.ఇన్ని జిల్లాలు ఏర్పాటు చెయ్యాల్సిన అవసరం లేదని ఎక్కువమంది నిపుణుల అభిప్రాయం.నిర్వహణా ఖర్చు బాగా పెరిగిందనేది మరో అభిప్రాయం. అధికార పార్టీ రాజకీయంగా తన బలాన్ని మరింత పెంచుకోవడం కోసం పన్నిన ఎత్తులో భాగమే జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనే విమర్శలూ వచ్చాయి. అనుయాయులకు పదవుల కల్పన చేస్తూ, కేడర్ ను పెంచుకోవడం కోసం వేసిన వ్యూహంగానూ కొందరు అభివర్ణించారు.అదే సమయంలో,జిల్లాలలో అధికారులపై రాజకీయ వర్గాల ఆధిపత్యం ఎక్కువై పోతోందన్నది ఇంకో అభిప్రాయం.ఇలా అనేక వ్యతిరేక విమర్శలు తెలంగాణలో వెల్లువెత్తాయి.నేడు, ఇటువంటి విమర్శలకు తావివ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆంధ్రప్రదేశ్ లోని అధికార వైఎస్ఆర్ పార్టీ, ప్రభుత్వ పెద్దలపై ఉంది.ప్రజలకు వేగంగా సేవలు అందించడానికి, ప్రజల వద్దకే పాలన తేవడానికి, మానవవనరులను సద్వినియోగం చేసుకోడానికి ప్రభుత్వ పెద్దలు చేసుకున్న సంకల్పం మంచిదే కావచ్చు, ఆచరణ చిత్తశుద్ధిగా జరిగి, ఫలితాలు రాబడితేనే నిజమైన ప్రయోజనం నెరవేరుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటులో, నిర్వహణలో తెలంగాణ అనుభవాల నుంచి మంచి చెడులను గ్రహించవచ్చు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేసింది.దేశంలోనే ఇది మొట్టమొదటగా చేపట్టిన విప్లవాత్మకమైన నిర్ణయం. దీని ద్వారా ఇప్పటి వరకూ సాధించిన ఫలితాలను పునఃసమీక్ష చేసుకోవాలి.ఇప్పుడు జిల్లాల సంఖ్యను పెంచే దిశలోనూ ఈ అనుభవాలను జతచేసుకోవచ్చు.రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాలు జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్నాయి. కొన్ని జిల్లాలు వైశాల్యంలో, జనసాంద్రతలో పెద్దవిగా ఉన్నాయి. పునర్వ్యవస్థీకరణ వల్ల ఇటువంటి చోట ఆశించిన ఫలితాలు రాబట్టవచ్చు. అన్ని లోక్‌సభ స్థానాలనూ జిల్లాలుగా మార్చాల్సిన అవసరం ఉందా అన్నది కొందరి ప్రశ్న. ముఖ్యంగా అనంతపురం, గుంటూరు, కృష్ణ,తూర్పు గోదావరి, విశాఖపట్నంలో జిల్లాల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది.పరిపాలనా వికేంద్రీకరణ జరగాల్సిన అవసరమూ ఉంది. ఇది ఎప్పటి నుండో చర్చలో ఉన్న అంశమే.జిల్లాల పరిపాలన రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్నప్పటికీ, ఈ అంశంపై జాతీయస్థాయిలోనూ చర్చ జరగాల్సిన అవసరం ఉందని మేధావుల అభిప్రాయం. జిల్లాలు పెరిగినంత మాత్రాన రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులు ఏమీ పెరుగవన్నది ఒక అంశం. జిల్లాల సంఖ్య పెరగడం వల్ల పరిపాలనా వికేంద్రీకరణ పెరుగుతుంది.అదే సమయంలో, నిర్వహణా ఖర్చు కూడా పెరుగుతుంది.జిల్లాల సంఖ్యతో పాటు అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగినప్పుడే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ వల్ల ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయి.కొత్తగా ఏర్పడిన జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా చాలా అవసరం.కొత్త పరిశ్రమలు , సంస్థల ఏర్పాటు, మౌలిక సదుపాయాల పెంపు, నిధుల తోడ్పాటులో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు చేయూతనివ్వడం చాలా అవసరం.రాష్ట్రాల్లో జిల్లాల సంఖ్య పెంపు రాజకీయ అవసరం కాకూడదు.దీనిపై జాతీయ విధానం (నేషనల్ పాలసీ) రూపకల్పన చెయ్యాలి.జాతీయస్థాయిలో కమిటీ కూడా ఏర్పాటవ్వాలి.రిటైర్డ్ న్యాయమూర్తులు, రిటైర్డ్ ప్రధానకార్యదర్శి స్థాయి అధికారులు , ఆర్థిక, సామాజిక రంగ నిపుణులు జాతీయస్థాయి కమిటీలో సభ్యులుగా ఉండాలి.తద్వారా జిల్లాలు, రాష్ట్రాలు, మొత్తంగా దేశ ప్రగతికి కొత్త నిర్మాణం జరిగేలా జిల్లాల పునర్ వ్యవస్థీకరణ రూపొందుకోవాలి.ఆంధ్రప్రదేశ్ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం.ఆర్థికంగా, పరిపాలనా పరంగా ఎంతో పుంజుకోవాల్సిన అవసరం ఉంది.కరోనా ప్రభావంతో కష్టాలు ఇంకా పెరిగాయి.రాష్ట్ర నవ నిర్మాణం వేగం ఇంకా ఎంతో పుంజుకోవాలి.ఒకప్పుడు కాగితాలమీదే పరిపాలన సాగేది.ఇప్పుడు ఆధునిక సాంకేతికత, ఆన్‌లైన్ కమ్యూనికేషన్ బాగా పెరిగాయి.వీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చు.పాలనా వేగం పెంచుకోవచ్చు. రవాణా సదుపాయాలు కూడా పెరిగాయి.ఇదీ కలిసివచ్చే అంశమే. రాష్ట్రంలో చాలా చోట్ల రోడ్లు అధ్వాన్న స్థితిలో ఉన్నాయి.కొత్త జిల్లాల రూప కల్పనలో భాగంగా,రోడ్ల మరమ్మత్తులు జరగాలి.పరిపాలనా వికేంద్రీకరణలో స్థానిక నాయకుల ప్రాముఖ్యత కూడా పెరగాలి.ప్రాముఖ్యత అంటే పెత్తనం కాదు. ప్రజల ప్రయోజనాలతో పాటు అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి పరిపాలనలో తగినంత స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కూడా ఉండాలి.ప్రజాప్రతినిధులు-అధికారగణాల మధ్య సమన్వయంతో, సంయుక్తంగా ప్రజలకు సుపరిపాలన అందాలి.కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ కు కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా ప్రత్యేక సహాయం అందించాలి.కొత్త జిల్లాల రూపకల్పనతో కొత్త రక్తం ఎక్కించుకొని, ఆంధ్రప్రదేశ్ సరికొత్త చరిత్ర సృష్టించాలి.అసలే, అనేక సవాళ్ల మధ్య సాగుతున్న పరిపాలనా వ్యవస్థకు , కొత్త జిల్లాల రూపకల్పన కొత్త తలనొప్పి కాకూడదు.రాబోయే సవాళ్ళను ముందుగానే ఊహించి, యంత్రాంగం ఆ మేరకు సిద్ధమవ్వాలి.ఆంధ్రప్రదేశ్ ప్రగతి ప్రయాణంలో ఇంకా తొలి అడుగులే పడుతున్నాయి.చెయ్యాల్సిన ప్రయాణం చాలా వుంది. పరిపాలన-అభివృద్ధి వికేంద్రీకరణలకు కొత్త జిల్లాలు కొత్త ఊతం ఇవ్వాలి. రెండిటికీ సమన్యాయం జరగాలి.సమన్వయం సాధించాలి



గెలిచి ఓడారు.. ఓడి గెలిచారు....

ఎవరిది గెలుపు..ఎవరిది ఓటమి?

ప్రజామీడియా నెట్‌వర్క్ సౌజన్యంతో

దాదాపు పది రోజులకు పైగా సాగిన హడావుడి ముగిసింది. హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. గెలిచి ఓడిన కారు. ఓడి గెలిచిన కమలం. దాదాపు ఓ అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా సాగిన ఈ బ్యాలెట్ పోరు దాదాపు కీలకమైన మూడు ప్రధాన పార్టీలకు సంతృప్తికరమైన ఫలితాలనే అందించింది.

స్వంతగా బల్దియా పీఠాన్ని మరోసారి సాధించడం అన్నది తెరాసకు సంతృప్తి కరమైన పాయింట్. దాదాపు నాలుగు డజన్ల సీట్లకు పైగా గెల్చుకోవడం అన్నది భాజపాకు సంతోషకరమైన విషయం. పాత బస్తీలో తన పట్టునిలబెట్టుకోవడం మజ్లిస్ కు మజా అయిన సంగతి. కానీ కాంగ్రెస్ పార్టీ రాను రాను చరిత్ర పుటల్లోకి జారుకుంటోంది అన్నది మరోసారి మరి కాస్త రుజువైన సత్యం. తెలుగుదేశం పార్టీ తెలంగాణ గడ్డ మీద కాలగర్భంలో కలిసిపోయే తరుణం వచ్చేసింది అన్నది క్లారిటీగా తెలిసిన వైనం.

నా హైదరాబాద్ ..నేనే కట్టా అనే చంద్రబాబు కనీసం ప్రచారానికి రాకుండా, ఓ స్టేట్‌మెంట్ కూడా ఇవ్వకుండా, నిర్లిప్తంగా వుండిపోయిన గొప్ప సంగతి ఈ ఎన్నికల్లో చూడగలిగాం.

హడావుడీ.. హోరా హోరీ

హైదరాబాద్ నగర ఎన్నికలు హడావుడిగా ముంచుకువచ్చాయి. నిజానికి ఎన్నికలకు తగినంత సమయం వుంది. కానీ ముందస్తు ఎన్నికలతో వైరి వర్గానికి ఊపిరి సలపకుండా చేయడం అనే ఎత్తుగడను చిరకాలంగా కేసీఆర్ నమ్ముకుంటూ వస్తున్నారు. ఈసారి కూడా హైదరాబాద్ ఎన్నిక విషయంలో అదే చేస్తారని అంతా అనుకుంటూనే వున్నారు. అలాంటి టైమ్ లో దుబ్బాక ఉపఎన్నిక వచ్చి కేసీఆర్ ను మరింత కంగారు పెట్టింది. ఇలా దుబ్బాక ఫలితం రావడం ఏమిటి, కేసీఆర్ అలా కిందా మీదా అయిపోయారు.

అందరూ ఆశ్చర్యపోయేలా స్టేట్ ఎన్నికల కమిషన్ అస్సలు పెద్దగా గ్యాప్ ఇవ్వకుండానే ఎన్నికల షెడ్యూలును ప్రకటించింది. వైరి


ప్రమాద ఘంటికలు

జీహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాలు ప్రమాద ఘంటికలు మోగించాయి. ఓటర్లలో, హైదరాబాద్ ప్రజానీకంలో మత ఆధారిత పోలరైజేషన్‌కు బీజేపీ నాయకులు, ప్రత్యేకంగా అందుకు సిద్ధహస్తులైన నేతలు విద్వేష భావజాలాన్ని మూకుమ్మడిగా నింపితే, దానికి ఎంఐఎం నేతల స్పందన అదే స్థాయిలో ఉంది. ఈ ఎన్నికల ఫలితాలన్నింటిలో అత్యంత ప్రమాదకరమైన అంశమిది. బీజేపీ, ఎంఐఎంలు ప్రజాసమస్యలు, పౌర సమస్యలు చర్చనీయాంశం కాకుండా చూడగలిగాయి. ఇప్పుడు హంగ్ ఏర్పడింది. దుబ్బాక విజయం తర్వాత బీజేపీ సర్వశక్తులూ 'గ్రేటర్'పై ఒడ్డింది. జీహెచ్ఎంసీ ద్వారా తెలంగాణలో పాగ వెయ్యాలనే ప్రణాళికతో రంగంలోకి దిగింది. అనేక మంది కేంద్ర మంత్రులు ఎన్నికల క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు. యోగి ఆధిత్యనాథ్, అమిత్‌షాలు చివరి రెండు రోజులు మైనారిటీలపై విద్వేష జ్వాలలు చిమ్మారు. పాతనగరంపై సర్జికల్ స్ట్రైక్ చేస్తామన్నారు. రోహింగ్యాలు న్నారన్నారు. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులున్నారన్నారు. దీనికి ప్రతిగా ఎంఐఎం నేతలూ స్పందించారు. బీజేపీ, ఎంఐఎంల మధ్య గొడవ హిందూ, ముస్లిం పోలరైజేషన్‌కు దారితీసింది. నిరుద్యోగం, కనీస వేతనాలు, మహిళల రక్షణ మొదలైన రోజువారీ ప్రజా సమస్యలు వెనక్కి పోయి మతాల చుట్టూ ఎన్నికలు తిరిగాయి సరిగ్గా ఇదే బీజేపీకి కావల్సింది. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల దెబ్బతినే పరిశ్రమలు, ప్రైవేటీకరించబడే ప్రభుత్వరంగం, చితికిపోతున్న చిన్న పరిశ్రమలు వంటి ప్రజల దైనందిన సమస్యలు చర్చనీయాంశమైతే బీజేపీ అసలు సంగతి ప్రజలకర్థమౌతుంది. అందుకే భావోద్వేగ అంశాలపైనే బీజేపీ ఆధారపడుతుంది. గణనీయంగా ముస్లిం జనాభా ఉన్న హైదరాబాద్‌లో ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టడం ద్వారా హిందూ ఓట్లను వాల్చుకోవచ్చనే బీజేపీ ఆశ నెరవేరినట్టే కనపడుతోంది. ఇప్పటికే తమ సోషల్ ఇంజనీరింగ్ ద్వారా కొన్ని ప్రధాన కులాలను ఆకర్షించింది బీజేపీ.

దీనికి ప్రభుత్వంపై గూడుకట్టుకుని ఉన్న అసంతృప్తి బీజేపీకి బాగా ఉపయోగపడింది. "చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా!" అనే సామెత ఊరికే రాలే! టీఆర్ఎస్ నేతల ఏకపక్ష ధోరణి, రాజకీయ అవకాశవాదమే ఈ ఫలితాలకు దారితీసింది. 2018 జూలై నుంచి పీఆర్‌సీ ప్రకటించలేదు. కొందరు నాయకుల్ని మచ్చిక చేసుకుంటే పబ్బంగడుపుకో వచ్చనుకున్న అధినాయకుడి ఆలోచన పోస్టల్ బ్యాలెట్స్ హోల్‌సేల్‌గా బీజేపీకి మళ్ళడానికి తోడ్పడింది. ఆర్టీసీ కార్మికుల ఉసురు తీసిందీ ప్రభుత్వం. కనీస వేతన జీవోలు వర్తించే వాళ్లు హైదరాబాద్ చుట్టుపక్కల పారిశ్రామిక వాడల్లో లక్షల్లో ఉన్నారు. ఈ కార్మికుల అసంతృప్తి కూడా బీజేపీకి ఉపయోగపడింది. ఇదే పరిస్థితి అనేక ఇతర రంగాల్లో కూడా ఉంది. మోడీ సర్కార్ 2016లో నోట్లరద్దు ప్రకటించినప్పుడూ, 2017లో జీఎస్‌టీని ప్రకటించినప్పుడు కూడా అందరికంటే ముందు ఎదురేగి మద్దతిచ్చింది టీఆర్ఎస్. నేడు మన రాష్ట్రానికి ఆ జీఎస్‌టీ బకాయిల్ని కూడా ఇవ్వకుండా ఎగనామం పెట్టింది మోడీ సర్కార్. ప్రతి ఏటా బడ్జెట్‌లో ఇవ్వాల్సిన కేంద్ర నిధులకు ఇప్పటిదాకా అమల్లో ఉన్న 1971 జనాభా లెక్కల ప్రాతిపదిక కాకుండా తాజా జనాభా లెక్కలే ప్రాతిపదికని కేంద్రం చెప్పింది. దక్షిణాది రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పద్ధతులు బాగా అమలు జరపడం వల్ల ఆ నిధుల్లో నష్టపోతారు. అందుకే దీనిపై కలిసి కేంద్రంపై పోరాడదామన్న కేరళ ప్రతిపాదనపై స్పందించలేదానాడు. దీనికి తోడు మతాన్ని, రాజకీయాలతో కలగాపులగం చేసే పనిలో బీజేపీతో పోటీ పడింది కేసీఆర్ ప్రభుత్వం. మేధావుల అభిప్రాయాన్నీ, ప్రజాభిప్రాయాన్నీ పరిగణనలోకి తీసుకోకుండా సెక్రటేరియట్ కూల్చివేయడం, వాస్తుకోసం మార్పులు, మహాచండీయాగం చేసిన నేనే పెద్ద హిందువునని చెప్పుకోవడం వంటివి బీజేపీకి ఉపయోగపడేవే. కేంద్ర విధానాలపై నిరంతరం పోరాడకుండా, రాష్ట్రంలోని ప్రజల్లో బీజేపీ వ్యతిరేక భావాల్ని ప్రోదిచేయలేరని టీఆర్ఎస్ నాయకత్వం ఇప్పటికైనా గుర్తిస్తే మంచిది.

ఏమైనా జీహెచ్ఎంసీ ఫలితాలు రాష్ట్రానికి ప్రమాద ఘంటికలు.

పక్షాలు అభ్యర్థులను ఎంపిక చేయడానికి గట్టిగా మూడు రోజులు కూడా సమయం దొరకలేదు. అలా ప్రారంభమైంది బల్దియా ఎన్నిక.



తట్టుకున్న భాజపా

ఇంత హడావుడి ని భాజపా తట్టుకుంది. తెరాస ఎలాగూ ముందుగానే సర్వ సన్నద్ధంగా వుంది. అందుకే చకచకా అభ్యర్థులను ప్రకటించి ప్రచారం బరిలోకి దిగిపోయింది. అయితే భాజపా కూడా ఈ హడావుడిని తట్టుకుంది. పెద్దగా ఇబ్బంది పడకుండానే చకచకా రంగంలోకి దిగిపోయింది. అంతే కాదు అంత తక్కువ టైమ్ లో ప్రచారాన్ని గట్టిగా ప్లాన్ చేసింది.

కేంద్రం నుంచి హేమా హేమీలను రంగంలోకి దింపిది. ఎక్కడి నుంచి తెస్తేనేం, ఎలా తెస్తేనేం అధికార పార్టీతో సమానంగా నిధులు ఖర్చు చేసింది. కొన్ని చోట్ల అయితే అధికార పార్టీ కన్నా కాస్త ఎక్కువే ఖర్చు చేసిందన్న వార్తలు కూడా వినిపించాయి.

అదే విధంగా వ్యూహాత్మకంగా జనసేనను బరిలోంచి తప్పించింది. కానీ అది ప్లస్ అయిందా మైనస్ అయిందా అంటే మైనస్ అయిందనే అనుకోవాలి. ఎందుకంటే ఆంధ్ర జనాలు వున్న చాలా ఏరియాల్లో కారు జోరే కనిపించింది. దీని వెనుక వైకాపా పార్టీ అభిమానులు వున్నారన్న టాక్ వుంది.

ఎమ్ఐఎమ్‌కు జీవం

గత కొద్ది కాలంగా మజ్లిస్ పార్టీ పరిస్థితి స్తబ్దతగా వుంది. పాతబస్తీలో ఆ పార్టీ పట్టు సడలుతోంది అనే అనుమానాలు వున్నాయి. ఇటీవల బీహార్ ఎన్నికల్లో కాస్త ప్రభావం కనబర్చిందన్న వార్తలు వున్నాయి. ఇలాంటి సమయంలో బల్దియా ఎన్నికలు వచ్చాయి.

ఎదురీదుతుంది అనుకున్నారు అంతా. కానీ భాజపా కావాలని చేసిందో, తెలియక చేసిందో, దీని వెనుక ఏమైన వ్యూహం వుందో కానీ మొత్తానికి ఎమ్ఐఎమ్ కు ఊపిరిపోసింది. పాత బస్తీ మీద ఘాటు ఘాటు ప్రకటనలు భాజపా జనాలు కురిపించారు. తాము అధికారంలోకి వస్తే పాత బస్తీని ఓ పట్టుపడతామనే విధంగా మాటల తూటలు విసిరారు.

మిగిలిన హైదరాబాద్ జనాల దృష్టిలో పాత బస్తీ జనాలను పన్నులు కట్టని, నియమాలు పట్టించుకోని దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేసారు. ఓ సమయంలో మరింత ముందుకు వెళ్లి పాత బస్తీ మీద సర్జికల్ స్ట్రయిక్ అనే ఘాటైన పదజాలం వాడారు. దాంతో పాత బస్తీ జనాలు తమకు అండ దండ ఇక మజ్లిస్ అనే ముమ్మాటికీ నమ్మారు. ప్రచారం టైమ్ లోనే అది బయటపడింది. ఆ మేరకు క్లారిటీ వచ్చింది. ఫలితాలు కూడా దానినే ప్రతిబింబించాయి.

కాంగ్రెస్/తెలుగుదేశం

ఇక ఇప్పటికే దాదాపు కుదేలయిపోయిన కాంగ్రెస్ ఈ హడావుడిని తట్టుకోలేకపోయింది. ఏదో మొత్తం మీద అభ్యర్థులను నిలబెట్టామనిపించింది. ఇక జాతీయ పార్టీ అనే లేబుల్ తగిలించుకున్న తెలుగుదేశం పార్టీ చాలా దారుణమైన దుస్థితిని ఎదుర్కోంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు కనీసం ఓ ప్రెస్‌మీట్ కూడా పెట్టలేని దుస్థితి. ఆయన హైదరాబాద్ లో నివాసం వుంటున్న ఏరియాలో అయినా కనీసం ఓ సభ పెట్టలేని దీన స్థితి.

చిత్రమేమిటంటే కాంగ్రెస్ అన్నా కొన్ని డివిజన్లు గెలుచుకుని పరువు దక్కించుకుంది కానీ తెలుగుదేశం ఒక్కటంటే ఒక్క డివిజన్ ను గెలుచుకోలేదు. సైబరాబాద్ కర్త, కర్మ, క్రియ తానే అని, అసలు హైదరాబాద్‌లో కొత్తగా కట్టిన ప్రతీదీ తన ఘనతే అని చెప్పుకునే చంద్రబాబు ఒక్క సీటు గెల్చుకోలేక పోయారు. హైటెక్ సిటీ, గచ్చిబౌలి ఏరియాలోనే ఆయన పార్టీ కలికంలోకి లేకుండా పోయింది.

తెరాస వ్యూహంలో భాజపా

నిజానికి తెలిసి జరిగిందో, తెలియక జరిగిందో కానీ భాజపా తెరాస వ్యూహంలో చిక్కుకుంది. హైదరాబాద్ డెవలప్‌మెంట్, సమస్యల పరిష్కారం అనే అజెండా నుంచి హిందుత్వ అజెండాకు ఫిక్స్ అయిపోయింది. హైదరాబాద్ లోకల్ ఎన్నికల్లో లోకల్ ఇష్యూలను పక్కన పెట్టి, రాష్ట్రీయ, జాతీయ అంశాలను ఎక్కువగా ప్రస్తావించింది.

కాంగ్రెస్ పార్టీ అయితే రాష్ట్రానికి అన్యాయం చేసింది అనేయడం మామూలే. తెలుగుదేశం అయితే ఆంధ్రోళ్ల పార్టీ అని ముద్ర వేయడం మామూలే. కానీ భాజపాను ఏం చేయాలి? ఎలా టార్గెట్ చేయాలి. మైనారిటీలు కాస్త అధికంగానే వున్న నగరం కావడంతో మతతత్వ పార్టీ అని, డెభైలు ఎనభైల నాటి అల్లర్లు మళ్లీ స్టార్ట్ అవుతాయని ముద్రవేయడం ప్రారంభించింది తెరాస. నిజానికి భాజపా దీన్ని ఖండించాల్సి వుంది కానీ వ్యూహాత్మికమో, తప్పిదమో దానికే కట్టుబడి ముందుకు సాగింది.

ఎవరిది గెలుపు..ఎవరిది ఓటమి?

సరే, పార్టీలు, ప్రచారం, బలా బలాలు, ఫలితాలు సంగతి అలా వుంచితే ఈ ఎన్నికలు ఎవరికి లాభం? ఎవరికి నష్టం. ఎవరికి గుణపాఠం? ఎవరికి ఆశాజనకం అన్నది చూడాల్సి వుంది. నలభైకి పైగా స్థానాలు గెల్చుకుంది కాబట్టి కచ్చితంగా భాజపాకు లాభం అని మెడమీద తలకాయ వున్నవాడు ఎవడైనా అంటాడు.

అలాగే దాదాపు పాతిక స్థానాల వరకు నష్టపోయింది కాబట్టి తెరాసకు నష్టం అనీ అనేయడం కామన్. అయితే తెరాసకు నష్టం అనే చిన్న ముక్క అనేసి సరిపెట్టే పరిస్థితి లేదు. నిజానికి ఇంతకు ముందు ఇదే ఎన్నికల్లో 99 సీట్లు గెల్చుకోవడానికి ముందు ఇదే బల్దియాలో తెరాసకు అంత గొప్ప అనుకూల మైన పరిస్థితులు లేవు. అప్పట్లో 99 సీట్లు గెల్చుకుంటుందని ముందుగా ఎవ్వరూ ఊహించలేదు.

మొత్తం బాధ్యతను తన మీద వేసుకున్న కేటీఆర్ ఆ 99 సీట్ల ఫీట్‌ను సాధించి శహభాష్ అనిపించుకున్నారు. అదే విధంగా గత అయిదేళ్ల కాలంలో హైధరాబాద్ లో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి గట్టిగానే కృషి చేసారు. అదే సమయంలో మంచినీటి సమస్య కూడా. ఈ రెండింటి పరిస్థితులు చాలా వరకు మారాయి అన్నది వాస్తవం.

ఇదే తీరుగా ఇలాగే ఎన్నికలకు వెళ్లిపోతాం అనుకునే టైమ్ లో అనుకోని విపత్తుగా వరదలు వచ్చి పడ్డాయి. తెరాస విజయావకాశాలను చాలా వరకు దెబ్బతీస్తాయి అనుకున్నారు అంతా. కానీ అంత దెబ్బ తీసిన పరిస్థితి అయితే కనిపించడం లేదు. అలా దెబ్బతీసి వుంటే నగరం అంతా ఈ సమస్యను ఎదుర్కోన్నారు. నగరం అంతా ఒకేలాంటి ఫలితం కనిపంచాల్సి వుంది. కానీ అలా జరగలేదు. అంటే వరదల సమస్య కన్నా అతీతమైనది కొంత వర్క్ చేసింది అనుకోవాలి. ముఖ్యంగా బస్తీల్లో పరిస్థితి తెరాసకు అనుకూలంగా వుంటుంది అనుకుంటే చాలా బస్తీల్లో ఎదురుదెబ్బ తగిలింది. అలాగే ఆంధ్ర జనాలు ఎక్కువగా వున్న ఏరియాల్లో తెరాసకు దెబ్బ తగులుతుంది ఈ సారి, భాజపాకు అనుకూలంగా వుంటుంది అనుకుంటే రివర్స్ అయింది.

ఆంధ్ర జనాలు అంతా తెరాసకే అనుకూలంగా ఓటేసినట్లు కనిపిస్తోంది. కూకట్‌పల్లి లాంటి ఏరియాలో తెరాస క్లీన్ స్వీప్ చేయడం విశేషం. ఆంధ్రలో భాజపాను కట్టడి చేయడం అన్నది తెలంగాణ నుంచే ప్రారంభం కావాలన్న ఆలోచన ఏదయినా దీని వెనుక వుందా అన్నది తెలియాల్సి వుంది.

మున్సిపల్ ఎన్నికల్లో అందరూ భావించినట్లు స్థానిక సమస్యలో? వరద సమస్యలో? అంతగా ప్రాధాన్యత వహించినట్లు లేదు. కుటుంబ పాలన, వరుసగా రెండు పర్యాయాలు అధికారంలో వుండడం వల్ల వచ్చిన యాంటీ ఓటు వంటివి ఎక్కువగా కీ రోల్ ప్లే చేసినట్లు కనిపిస్తోంది. నిజానికి ఓటింగ్ ఎక్కువ జరిగి వుంటే భాజపాకు పరిస్థితి మరింత అనుకూలంగా వుండి వుండేది. ముఖ్యంగా యువత, ఎగువ మధ్యతరగతి ఓట్లు ఎక్కువగా పోల్ కాలేదు. ఈ ఓట్లు అన్నీ భాజపాకు అనుకూలంగా వుండి వుండేవి. ఆ విధంగా జరిగి వుంటే భాజపా యాభై సీట్ల మార్కు దాటి వుండేది.

సరైన ప్రతిపక్షం

భాజపా తాను సరైన ప్రతిపక్షం అని జనాలకు నమ్మిక కలిగించడంలో చాలా వరకు సక్సెస్ అయింది. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలను నిర్వీర్యం చేయడం ద్వారా తెరాస చేసుకున్న తప్పిదం ఇది. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు ఓటు వేసినా మళ్లీ వాళ్లు తెరాసలోకి వెళ్లిపోతారనే భావన జనాల్లో ఫిక్స్ అయినట్లు కనిపిస్తోంది. అందుకే ఇక వాళ్లని దాదాపు పక్కన పెట్టారు. ఎవరైతే తెరాస పట్ల, దాని కుటుంబ పాలన పట్ల వ్యతిరేకత పెంచుకున్నారో వారికి భాజపా ఓ అసలైన ఆల్టర్ నేటివ్ మాదిరిగా కనిపించింది. అయితే దుబ్బాక ఎన్నిక తరువాత మరికొంత కాలం ఆగి వుంటే ఈ నెగిటివ్ ఓటు మరింత పెరిగి వుండేదేమో? బహుశా ఆ ఆలోచనతోనే తెరాస తొందరపడిందేమో? అని అనుకోవాలి. ఆ వ్యూహమే కాస్తయినా పరువు దక్కించింది.

ఇది ఓటమే

నిజానికి తెరాసకు ఇది ఓటమి కిందే లెక్క. 70 సీట్ల మేరకు అంటే సగం కన్నా తక్కువకు జనాలు ఆ పార్టీని కట్టడి చేసారు అంటే ఏమనుకోవాలి? అలాగే దాదాపు ఓ పాతిక సీట్ల తేడా అయినా, ఈ మేరకు భాజపాను పెంచారు అంటే ఏమనుకోవాలి? కచ్చితంగా యాంటీ ఓటు పెరుగుతోంది అనడానికి ఇది సంకేతమే. ఇక్కడ ప్లస్ పాయింట్ ఏమిటంటే తెరాసకు ఇంకా మూడేళ్లకు పైగా అధికారం వుంది. అందువల్ల పొరపాట్లు సర్దుకునే అవకాశం వుంది. కుటుంబ పాలన ముద్ర ఎలాగూ చెరుపుకోలేరు. కనీసం మంచి పాలన అనిపించుకోవాలి.

ముఖ్యంగా ఉద్యోగుల విషయంలో తెరాస వైఖరి మారాల్సి వుంది. వారి పట్ల విమర్శనాత్మకంగా వ్యవహరించడం, కొన్ని సంస్కరణలు, వారికి ఇవ్వాల్సినవి సకాలంలో ఇవ్వకపోవడం వంటివి కాస్త గట్టిగానే వర్క్ చేసినట్లు కనిపిస్తోంది. పోస్టల్ బ్యాలట్ ను శాంపిల్ సర్వేగా తీసుకుంటే ఈ విషయం అర్థం అవుతుంది. 99 సీట్ల నుంచి 70 సీట్ల వరకు దిగిపోవడం అంటే తెరాసకు కచ్చితంగా ఓటమే. అందులో ఏమాత్రం సందేహం లేదు.

ఏ మజ్లిస్ తో అయితే తనకు పొత్తు లేదు, అండర్ స్టాండింగ్ లేదు అని చెబుతూ వచ్చిందో ఇప్పుడు అదే పార్టీ సాయం తీసుకోక తప్పని సరి పరిస్థితి. అంతే కాదు, ఇప్పటి వరకు రూరల్ లో పార్టీ పరిస్థితి ఎలా వుందో తెలియదు. దుబ్బాక ఓ శాంపిల్ అనుకుంటే హైదరాబాద్ సందేశం మరింతగా కిందకు వెళ్తే పరిస్థితి మరింత మారుతుంది. ప్రతిపక్షాలు ఎక్కువ వుంటే బెటర్ అనే కాన్సెప్ట్ ను ఎందుకు తెరాస పట్టించుకోవడం లేదో అర్థం కాదు. వైకాపాను వదిలేసుకుంది. తెదేపాను లేకుండా చేసింది. కాంగ్రెస్ ను తొక్కి పెట్టింది. దీని వల్ల వన్ టు వన్..హ్యాండ్ టు హ్యాండ్ ఫైట్ అయింది. ఇదే పరిస్థితి భవిష్యత్ లో రూరల్ లో కూడా వుంటే ఏమిటి కర్తవ్యం?

భాజపా ఉత్సాహం

ఈ ఫలితాలు భాజపాకు మరింత ఉత్సాహాన్ని ఇవ్వవచ్చు. కానీ ఆ ఉత్సాహం అత్యుత్సాహం కాకూడదు. హైదరాబాద్ ఎన్నికల వేళ మాట్లాడినట్లు తమ చిత్తానికి మాట్లాడడం తగ్గించాలి. వ్యూహాత్మకంగా ముందుకు కదలాల్సి వుంది. ఇక్కడ ఎన్నికల ఫలితాలు వస్తుంటేనే ఆంధ్రలో భాజపా శ్రేణులు అక్కడ ప్రభుత్వంపై కదం తొక్కడం ప్రారంభించేసాయి. ఇలాంటి అత్యుత్సాహం రాజకీయాలకు అంతగా పొసగదు. వ్యూహాత్మకంగా స్టడీగా ముందుకు వెళ్లడమే అవసరం. హైదరాబాద్ ఎన్నిక తరువాత ఆంధ్రలోని తిరుపతి ఉప ఎన్నికను జనసేనకు వదిలిపెడుతుందా భాజపా అన్న అనుమానం కూడా వుంది. ఇప్పుడు ఈ దూకుడు ఇలాగే మరి కొంత కాలం అయితే సాగుతుంది. అందులో అనుమానం లేదు. కానీ ఆంధ్రలో తెదేపా కనుమరుగైపోలేదు. అందువల్ల ఇక్కడి మాదిరిగా హ్యాండ్ టు హ్యాండ్ పోటీ అక్కడ వుండదు.

ఇదిలా వుంటే తరువాత మజిలీ తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నల్గొండ కూడా కావచ్చు. కార్పొరేషన్ ఎన్నికలు రావాల్సి వుంది కూడా. పైగా వరంగల్ అంటే భాజపా అడ్డానే. కానీ ఖమ్మం, నల్గొండ అంటే కమ్యూనిస్ట్ లు, కాంగ్రెస్ కు అనుకూలమైనవి. ఇక్కడ కూడా భాజపా తన హవా చూపించగలిగితే రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి భాజపా సర్వ సన్నద్ధం అవుతుంది.

కాంగ్రెస్ కింకర్తవ్యం?

తెలంగాణ విషయంలో, జగన్ వ్యవహారంలో కాంగ్రెస్ ఘోర తప్పిదం చేసింది అన్నది ఇప్పుడు ఆ పార్టీకి క్లారిటీ వచ్చేసింది. కేసీఆర్ ను నమ్మి తెలంగాణ ఇచ్చి మునిగిపోయింది. తెలుగుదేశం లాబీయింగ్ కు లొంగి జగన్ ను దూరం పెట్టి ఆంధ్రలో గాయబ్ అయిపోయింది. ఇప్పుడు కాదు సరికదా, మరో మూడేళ్లకు కూడా ఆ పార్టీ ఇక తెలుగు రాష్ట్రాల్లో కోలుకోవడం కష్టం. మిగిలిన చోటా మోటా నాయకులు కూడా తలో దారి చూసుకోవాల్సిందే. అలాగే తెలంగాణలో తెలుగుదేశం పరిస్థితి కూడా.

జగన్ జాగ్రత్త పడాలి...

భాజపా దూకుడును, నెగిటివ్ ఓటు వచ్చే ప్రమాదాన్ని ఆంధ్రలో జగన్ ఓ కంట కనిపెట్టాల్సిందే. తిరుపతి ఎన్నిక కావచ్చు, రాబోయే స్థానిక ఎన్నికలు కావచ్చు. జగన్ కు కీలకమే. పైగా అక్కడ పార్టీల కన్నా మీడియానే పెద్ద అపోజిషన్. తెలంగాణలో కేసీఆర్ మీడియా మొత్తాన్ని అణిచి పెట్టి వుంచగలిగారు. కానీ జనం తమ పని తాము చేసారు. ఆంధ్రలో అలా కాదు. మీడియా విచ్చలవిడితనం వుంది. ప్రతిపక్షాలు వున్నాయి. వీటన్నింటికి అనుగుణంగా ఇప్పటి నుంచే వ్యూహరచన కావాలి.

దుబ్బాకలో "కమలనందనం"...

శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్



యాదృశ్చికమో ఏమోగానీ ఐపీఎల్ 20 ఫైనల్ దుబ్బాక ఉపఎన్నిక ఫలితాలు ఒకే రోజు జరిగాయి. ఆటలో రంజు లేకపోయినా ఓట్ల వేట అదిరింది. ఆఖరి రౌండ్ వరకూ ఉత్కంఠత రేపింది.దుబ్బాక ఉప ఎన్నికలో బీజేపీ జయకేతనం ఎగురువేసింది. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు దుబ్బాకలో చరిత్ర సృష్టించారు. ఎంతో ఉత్కంఠను రేకెత్తించిన కౌంటింగ్ లో చివరి మూడు రౌండ్లలో బీజేపీ ఆధిక్యత సాధించడంతో... బీజేపీ చివరకు విజయనాదం చేసింది. 1,470 ఓట్ల మెజార్టీతో రఘునందన్‌రావు గెలుపొందారు. గతంలో దుబ్బాక నుంచి రెండు సార్లు పోటీ చేసిన రఘునందన్‌రావు.. మూడో ప్రయత్నంలో ఘన విజయం అందుకున్నారు. రఘునందన్ గెలిచాడా? గెలిపించారా?

దుబ్బాకలో భాజపా గెలిచింది. దుబ్బాకలో జనం భాజపాను గెలిపించారు. దుబ్బాకలో రఘునందన్ గెలిచారు. దుబ్బాకలో భాజపా అభ్యర్థి గెలిచారు

అన్నీ ఒకటేగా..ఏమిటి తేడా? దూరంగా చూస్తే తేడా అనిపించకపోవచ్చు. కానీ గెలవడానికి, గెలిపించడానికి కొంతయినా తేడా వుంది. 2019లో ఆంధ్రలో జగన్ పార్టీ గెలవలేదు. జనం గెలిపించారు. గెలిచినట్లయితే అంత భారీ స్థానాలు రావు. జనం అవతలి పార్టీ మీద కసితో గెలిపించారు కాబట్టే అన్ని స్థానాలు వచ్చాయి. ఇప్పుడు దుబ్బాక ఫలితం వెనుక అంత కసి అయితే లేదు కానీ భాజపాను జనమే గెలిపించినట్లు స్పష్టమవుతోంది.

పత్రికలు, సోషల్ మీడియా, స్టేట్‌మెంట్‌లు సంగతి పక్కన పెడితే, కింది స్థాయిలో భాజపాకు ఏ మాత్రం కేడర్ వుంది అన్నది అందరికీ తెలిసిందే. అధికారంలో వున్న తెరాస కు వున్న అడ్వాంటేజ్ లు ఏమిటన్నవీ తెలిసిందే. సాధారణంగా ఉపఎన్నికల్లో అధికార పార్టీకి ఎడ్జ్ వుంటుంది. అది అందరికీ తెలిసిన విషయం. ఆ ఎడ్జ్ సరిపోదని అధికార తెరాస కిందా మీదా పడింది. కేసీఆర్, కేటిఆర్ లాంటి వాళ్లు అక్కడి వెళ్లి ప్రచారం చేయకపోవచ్చు కానీ వారు తెరవెనుక చేసిన కృషి తక్కువ అయి వుంటుంది అని అనుకోవడానికి లేదు. అలాగే ఎన్నికల వ్యవహారాన్ని తన భుజాలపై వేసుకున్న హరీష్‌రావు సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేయడానికీ లేదు.

ఇన్ని ప్లస్ పాయింట్లు వున్న తెరాస ఓడి పోతుందని ఏ రాజకీయ పరిశీలకులు అంచనాలు వేసేయలేదు. ఎన్నికల ప్రచారం పీక్స్ కు చేరుకున్నపుడు కూడా దుబ్బాక వెళ్లి వచ్చిన జర్నలిస్ట్ మిత్రులంతా తెరాసనే గెలుస్తుందని చెప్పుకుంటూ వచ్చారు. రాజకీయ పండితులు అదే పలికారు. హరీష్‌రావు సామర్థ్యం మీద నమ్మకం, భాజపాకు వున్న కేడర్ బలహీనత మీద వున్న అంచనాలు, ఇంకా ఇంకా చాలా కలిసి ఇలా ఆలోచించేలా చేసి వుంటాయి.

అయితే ఇలాంటి పరిస్థితి మారుతూ వస్తోంది అని గమనించింది ఎవరైనా వున్నారు అంటే అది తెరాస అధినేతలు మాత్రమే. అందుకే భాజపాను ఎక్కడికక్కడ కట్టడి చేసే ప్రయత్నం చేసారు. కాంగ్రెస్ తో ప్రమాదం లేదని తెరాస పెద్దలు అనుకున్నంత వరకు అది నిజమే అయింది. భాజపాతో ప్రమాదం అని అనుకున్నదీ కరెక్ట్ నే అయింది. కానీ భాజపాను డీల్ చేసిన విధానమే సరిగ్గా లేదు. భాజపాను అడ్డదారిలో కట్టడి చేద్దాం అనుకున్నారు.

అలా కాకుండా భాజపా రాష్ట్రానికి చేయని సాయాన్ని,చేస్తున్న అన్యాయాన్ని మొదటి నుంచి హైలైట్ చేసి వుండాల్సింది. తెలుగుదేశం అయివుంటే లోకల్..నాన్ లోకల్ ఫీల్ తెచ్చి వుండేవారు. కానీ రఘునందన్ రావు కేండిడేట్, భాజపా పార్టీ కావడంతో అలాంటి వ్యూహం అమలు చేయలేదు. రఘునందన్ రావును టార్గెట్ చేసేలోగానే, తాన్ను శాసనసభలో అడుగుపెడితే ఇక తెరాస నేతలకు నిద్ర వుండదనే వ్యవహారాన్ని ముందుగా రఘునందన్ ప్రొజెక్ట్ చేయడం ప్రారంభించేసారు. భాజపాకు కు వున్న కేడర్ కన్నా లీడర్లే కాస్త ఎక్కువ. వారంతా దుబ్బాక మీద మోహరించారు.

సహజంగా మాటకారి, యువకుడు అయిన రఘునందన్ రావు వైపు జనం మొగ్గడం ప్రారంభించారు. తెరాస మహిళా అభ్యర్థికి ఆ తరహా క్రేజ్ కరువైంది. ఇటు తెరాస నే రఘునందన్ రావు తమ బలమైన ప్రత్యర్థిగా గుర్తించి, అతన్ని అడ్డుకునే దిశగా అడ్డదారులు తొక్కడం, అటు రఘునందన్ రావు కూడా ఆ స్థాయిని నిలబెట్టుకునే ప్రయత్నం చేయడం రెండూ మొత్తం

తరువాయి 53వ పేజీలో

బుల్లెట్ అంటే బుల్లెట్టే...

జి.విజయ్ కుమార్

ప్రపంచంలోని అతిపెద్ద మోటార్ సైకిల్ మార్కెట్‌లోకి అడుగుపెట్టే ఉద్దేశంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బ్రాండ్‌ను శరవేగంగా విస్తరిస్తోంది.

ప్రపంచంలో అత్యంత పురాతన మోటార్ సైకిల్ బ్రాండ్లలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఒకటి. ఇప్పటికీ దానిని చాలా మంది ఇష్టపడుతున్నారు.

భారత మార్కెట్లో మంచి అమ్మకాలు నమోదు చేసిన ఈ కంపెనీ యాజమాన్య హక్కులు 1994 నుంచి భారత్‌లో ఐషర్ గ్రూప్ దగ్గరే ఉన్నాయి. ఈ కంపెనీ ఇప్పుడు ఆసియాలో తన అమ్మకాలను పెంచుకోవాలని అనుకుంటోంది. ఇటీవల థాయ్‌లాండ్‌లో కూడా ఒక కొత్త ఫ్యాక్టరీ నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. భారత వినియోగదారులు ఈ మోటార్ సైకిల్ స్టైల్, దాని వారసత్వాన్ని ఇష్టపడుతున్నారని రాయల్ ఎన్‌ఫీల్డ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వినోద్ దాసరి అన్నారు. "మేం మెరుగైన మోటార్ సైకిళ్లు తయారుచేస్తాం. వాటి ధర కూడా ఎక్కువ ఉండదు. దానితోపాటూ మేం కేవలం భారత్ కోసమ కాకుండా, మొత్తం ప్రపంచం కోసం మోటార్ సైకిళ్లను తయారుచేస్తున్నాం" అన్నారు. థాయ్‌లాండ్‌లో నిర్మించబోయే ఫ్యాక్టరీలో 12 నెలల్లోపే పనులు ప్రారంభమవుతాయని కంపెనీ ఆశిస్తోంది. భారత్ తర్వాత ఈ కంపెనీ అతిపెద్ద ఫ్యాక్టరీ ఇదేనని భావిస్తున్నారు. వియత్నాం, మలేసియా, చైనా లాంటి ఆగ్నేయాసియా దేశాలకు తమ మోటార్ సైకిళ్లను ఎగుమతి చేయడానికి ఈ ఫ్యాక్టరీని కంపెనీ ఒక ఎక్స్‌పోర్ట్ హబ్‌గా మార్చాలనుకుంటోంది దానికి చాలా పెద్ద ప్రణాళికలు రూపొందించామని, మరో మూడు నుంచి ఐదేళ్లలో ప్రతి త్రైమాసికానికి ఒక కొత్త మోటార్ సైకిల్ లాంచ్ చేయాలని అనుకుంటున్నామని వినోద్ దాసరి చెప్పారు "మాకు ఆసియా పసిఫిక్ చాలా ముఖ్యమైన మార్కెట్. మాకు మా వినియోగదారులు చాలా ముఖ్యం. వారు మా నుంచి కాస్త మెరుగైనదే కోరుకుంటారు" అన్నారు.

బుల్లెట్‌లా దూసుకెళ్లేందుకు

మోటార్ సైకిల్ రైడింగ్ ఆసియాలో ఒక గట్టి సంప్రదాయం. మోటార్ సైకిల్ అమ్మకాల విషయంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద మార్కెట్‌గా నిలిచింది. ఆ తర్వాత స్థానంలో థాయ్‌లాండ్, ఇండోనేసియా, వియత్నాం ఉన్నాయి. ఈ దేశాల్లో కిక్కిరిసిన రోడ్లపై, ముఖ్యంగా పెద్ద పెద్ద నగరాల్లో కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్ నుంచి తప్పించుకుని వేగంగా ముందుకు దూసుకెళ్లాలంటే మోటార్ సైకిల్ చాలా సౌకర్యంగా ఉంటుంది. మోటార్ సైకిల్ విక్రయాల గత ఏడాది గణాంకాలను చూస్తే రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు ఈ దేశాల్లో 88 శాతం ఉన్నాయి. ఈ కంపెనీ 250-750 సీసీ క్లాస్ మిడ్-సెగ్మెంట్ మోటార్ సైకిళ్లను మాత్రమే తయారు చేస్తుంది. కానీ, ఆసియాలోని అన్ని మోటార సైకిల్ కంపెనీలు ఈ స్థాయిలో విజయవంతం కావడం లేదు. ఒకవైపు రాయల్ ఎన్‌ఫీల్డ్ తమ మోటార్ సైకిళ్లను ఆసియా అంతటా విస్తరించేందుకు ప్రణాళికలు వేస్తుంటే, మరోవైపు హార్లీ డేవిడ్‌సన్ లాంటి కంపెనీలు ఈ ప్రాంతాల్లో తమ అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

"హార్లీ-డేవిడ్‌సన్ మోటార్ సైకిళ్లను భారత్‌లో ఖరీదైనవిగా భావిస్తారు. దేశంలో రోడ్లు, ప్రభుత్వ ట్రాఫిక్ నిబంధనలు లాంటివి మోటార్ సైకిల్‌ను ఎక్కువ వేగంతో నడపడానికి అనుకూలంగా ఉండవ"ని ఫ్రాస్ట్ అండ్ సులివన్ ట్రాన్స్ పోర్ట్ నిపుణుడు వివేద్ వైద్య చెప్పారు.

"హార్లీ డేవిడ్‌సన్ తక్కువ శక్తి ఇంజన్ కూడా తయారుచేయడం ప్రారంభించింది. కానీ అది దానిలో కూడా ఎక్కువ సక్సెస్ కాలేకపోయింది. ఈ సెగ్మెంట్‌లో రాయల్ ఎన్‌ఫీల్డుతో పోటీపడడం అంత సులభం కాదు" అన్నారు. హార్లీ డేవిడ్‌సన్‌తో పోలిస్తే, రాయల్ ఎన్‌ఫీల్డ్ ఉత్పత్తులు మోటార్ సైకిల్ వినియోగదారులకు మెరుగ్గా ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు.

"నడపడం సులభంగా ఉండడంతోపాటూ, దాని సింపుల్ డిజైన్, క్లాసిక్ వింటేజ్ స్టైల్ కోసం రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్‌ను వినియోగదారులు ఎక్కువ ఇష్టపడతారా"ని మోటార స్పోర్ట్



కన్సల్టెంట్ స్కాట్ లుకైటిస్ అంటున్నారు. "రాయల్ ఎన్‌ఫీల్డ్ తక్కువ ఖర్చులో తమ వినియోగదారులకు స్పోర్ట్స్ బైక్ కొనుగోలు చేసే అవకాశం అందిస్తోంది. అంతేకాదు, వినియోగదారులకు ఆ మోటార్ సైకిళ్ల గురించి పెద్దగా సాంకేతిక సమాచారం అవసరం ఉండదు. వారికి మెయింటనెన్స్ ఖర్చు కూడా ఎక్కువ రాదు" అన్నారు. "రాయల్ ఎన్‌ఫీల్డ్ వారసత్వం వినియోదారులను ఆకర్షిస్తోంది. కంపెనీ తన ఉత్పత్తిని మాత్రమే అమ్మడం లేదు. ఆ ఉత్పత్తితోపాటూ దాని ఎన్నో ఏళ్ల అనుభవాన్ని కూడా అందిస్తోంద"ని వినోద్ దాసరి చెప్పారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 500 పెగాసస్ మోటార్ సైకిల్‌ను రెండో ప్రపంచ యుద్ధం ప్రత్యేక గ్లైడర్ 'ఫ్లయింగ్ ఫ్లీ'కి గుర్తుగా 2018లో తయారుచేశారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ చరిత్ర

1893- సైకిల్ తయారు చేసే ఈ కంపెనీ మొదట ఎన్‌ఫీల్డులోని రాయల్ స్మాల్ ఆర్మ్స్ ఫ్యాక్టరీ కోసం విడిభాగాలు తయారుచేసేది. తర్వాత అది తన పేరును రాయల్ ఎన్‌ఫీల్డ్ అని పెట్టుకుంది.

1901- ఈ కంపెనీ బ్రిటన్‌లో మోటార్‌తో నడిచే తన మొదటి సైకిల్ తయారుచేసింది.

1914-18 - మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బ్రిటన్, బెల్జియం, ఫ్రాన్స్, అమెరికా, రష్యా సైన్యం కోసం మోటార్ సైకిళ్లు సప్లై చేసింది.

1932 - కంపెనీ తన మొదటి బుల్లెట్ మోటార్ సైకిల్ తయారుచేసింది. దానిలో ప్రత్యేకంగా స్లోపర్ ఇంజన్ ఉపయోగించారు. ఈ మోడల్ చాలామందికి నచ్చింది.

1939-1945 - రెండో ప్రపంచ యుద్ధ సమయంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ సైన్యం కోసం మోటార్ సైకిల్‌తోపాటూ సైకిల్ జనరేటర్, యాంటీ-ఎయిర్ క్రాఫ్ట్ గన్ తయారీ కూడా ప్రారంభించింది. పారాచూట్, గ్లైడర్ ఉపయోగించే సైనికుల కోసం 'ఫ్లయింగ్ ఫ్లీ' పేరుతో గ్లైడర్ కూడా ఉత్పత్తి చేసింది.

1960 - అది సంప్రదాయ మోటార సైకిళ్ల కాలం. ఆ సమయంలో చాల కంపెనీలు మోటార్ సైకిళ్ల మార్కెట్లో అడుగుపెట్టాయి. వాటిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా ఒకటి.


1970 - కంపెనీ బ్రిటన్‌లో తన ఉత్పత్తి నిలిపివేసింది. భారత్‌లోని దాని సహచర కంపెనీ ఎన్‌ఫీల్డ్ ఇండియా ఉత్పాదనను తమ చేతుల్లోకితీసుకుంది.

1994 - భారత్‌లోని ఐషర్ మోటార్స్ ఎన్‌ఫీల్డ్ ఇండియాను కొనుగోలు చేసింది. దాంతో, కంపెనీ పేరు మళ్లీ మార్చి రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్స్ లిమిటెడ్ అని పెట్టారు.

2020 - రాయల్ ఎన్‌ఫీల్డ్ కు బ్రిటన్ ఇప్పటికీ ప్రతిష్ఠాత్మక మార్కెట్‌గా నిలిచింది. మిడిల్ వెయిట్ మోటార్ సైకిల్ కేటగిరీలో కంపెనీకి చెందిన 'ఇంటర్‌సెప్టర్ 650' ఇక్కడ అత్యధికంగా అమ్ముడవుతోంది.

వచ్చే ఏడాదికి రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్ 120 ఏళ్లు పూర్తి కాబోతోంది. కరోనా మహమ్మారి గుప్పిట్లో ఉన్న భారత్‌లో ఈ సందర్భంగా ఏదైనా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కంపెనీ ఇప్పటివరకూ ఏ ప్రకటనా చేయలేదు. కరోనా తర్వాత ఆసియా మోటార్ సైకిల్ మార్కెట్ మరోసారి అభివృద్ధి పథంలో దూసుకువెళ్తుందని నిపుణులు భావిస్తున్నారు.

"కలిసి తిరగడం వల్ల కరోనా వ్యాపిస్తుందనే భయంతో జనం ప్రజా రవాణాలో తిరగడానికి బదులు ప్రైవేటు వాహనాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో చౌక రవాణా సాధనంగా మోటార్ సైకిల్ మార్కెట్ భవిష్యత్ ఉజ్వలంగా కనిపిస్తోంద"ని వివేక్ వైద్య అంటున్నారు.



51వ పేజీ తరువాయి

ఎన్నికల సీన్ ను సైలంట్ గా మార్చేసాయి. రఘునందన్ కాకుండా మరెవరు అయినా ఫలితం ఎలా వుండేది అన్న అనుమానాలు ఇప్పుడు వినిపిస్తున్నాయంటే కారణం అదే.

ఎన్నికల ఓటింగ్ ఫలితాలు ఎప్పుడు సర్వేయర్ల నాడికి అందుతాయి అంటే, పార్టీల బలం బట్టే, దాన్ని బట్టే సర్వేలు అంచనా వుంటుంది. కానీ జనం డిసైడ్ అయితే అది సర్వేలకు అంతగా అందదు. 2019లో ఆంధ్రలో జరిగింది అదే. అక్కడ ఓ చాన్స్ జగన్ కు ఇవ్వాలని జనం డిసైడ్ అయ్యారు. ఇప్పుడు దుబ్బాకలో కూడా రఘునందన్ రావును గెలిపించాలని డిసైడ్ అయ్యారు. అందువల్లే తెరాసకు అన్ని ప్లస్ పాయింట్లు వుండడంతో, హోరాహోరీగా మారి కొద్ది పాటి మెజార్టీతో భాజపా నెగ్గింది.

అందువల్లే జనం భాజపాను గెలిపించారా? లేక భాజపా కష్టపడి గెలవగలిగిందా? అన్న అనుమానం తలెత్తుతోంది. అంతే కాదు, ఈ విజయం భాజపా దా? రఘునందన్ దా? అన్న మరో సప్లిమెంటరీ పరీక్ష కూడా వుండనే వుంది. ఏది ఏమైనా తెరాస పట్ల జనం కాస్త విముఖతతో వున్నారన్న క్లారిటీ వచ్చేసింది. మీడియా మొత్తం కంట్రోల్ లో వున్నా, జనం మన కంట్రోల్ లో వుంటారనుకుంటే పొరపాటే. రెండు పర్యాయాల పాలన అంటే యాంటీ ఓటు కొంతయినా జనరేట్ కాకతప్పదు. హైదరాబాద్ ను పట్టించుకున్నంతగా తెలంగాణ మిగిలిన ఏరియాలను పట్టించుకోవడం లేదన్న విమర్శ ఒకటి వుంది. అలాగే పాలన అంతా ఓ దగ్గరకే కేంద్రీకృతమైపోయిందన్న విమర్శ కూడా వుంది.

కేసీఆర్ పాలన ఎంత బాగుందో? ఎంత బాగాలేదో? అన్న దానిపైన జనాల్లో రకరకాల డిస్కషన్లు వున్నాయి. ఇప్పుడు ఈ డిస్కషన్లు మరింతగా చెలరేగుతాయి. ఎందుకంటే ఏం జరుగుతుందో ఊహించడం కన్నా, జరిగిందానిని పోస్ట్ మార్టమ్ చేయడం అంటే హుషారే కదా? ముఖ్యంగా జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఈ ఓటమి ప్రభావం ఏమేరకు వుంటుంది అన్నది కూడా తెగ వినిపించే పాయింట్ అవుతుంది.

నిజానికి జిహెచ్ఎంసి లో భాజపా ప్రభావం చూపించాలంటే దుబ్బాక తరహా స్కీము రిపీట్ కావాల్సి వుంటుంది. అంటే సరైన, బలమైన అభ్యర్థులు, బలమైన ప్రచారం. కానీ ఇక్కడ తెరాసకే ఎక్కువ అనుకూలతలు వుంటాయి. ఎందుకంటే హైదరాబాద్ వరదల వ్యవహారం పక్కన పెడితే నగర అభివృద్ధి విషయంలో తెరాస తక్కువేమీ చేయలేదు. అది క్లారిటీగా కనిపిస్తూనే వుంది. అందువల్ల భాజపాకు దుబ్బాక ఎన్నిక తాత్కాలిక రెడ్ బుల్ డ్రింక్ లా పని చేస్తే చేయొచ్చు కానీ, అంత మాత్రం చేత తెరాస కౌంట్ డౌన్ స్టార్ట్ అయిపోయిందనే అనేసుకోవడానికి వీల్లేదు. కానీ ప్రజలు ఇచ్చిన ఆరంభాన్ని కొనసాగించుకునే ప్రయత్నం మాత్రం భాజపా చేతుల్లో వుంది. అది ఏమేరకు కొనసాగిస్తుందో చూడాలి.



నల్లధనం

శ్రీరామ శర్మ

నాలుగేండ్ల క్రితం మోడీ సర్కార్ తీసుకున్న నోట్లరద్దు నిర్ణయంతో ఈ దేశానికి ఏమైనా ప్రయోజనం దక్కిందా? అని ఆలోచిస్తే...సమాధానం దొరకదు. దేశంలో నల్లధనం పెద్ద ఎత్తున ఉంది, దాన్ని తాము వెలికితీస్తామని ప్రధాని మోడీ జాతినుద్దేశించి ఆనాడు ప్రసంగించారు. ప్రజల్ని నమ్మించారు. రూ.500, రూ.1000 నోట్లను రద్దుచేశారు. ఇక ఏ మూలన ఉన్నా...నల్లధనం దానంతటదే బయటకు కక్కుకుంటూ వస్తుందని పాలకులు ప్రజల్లో భ్రమలు కల్పించారు. ప్రజలకు షాక్‌ల మీద షాకులిచ్చారు. ఈనేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రజలంతా నానా కష్టాలు పడ్డారు. గంటల తరబడి బ్యాంకుల ముందు, ఇతర కార్యాలయాల ముందు నిలబడేట్టు చేశారు. నోట్లరద్దుతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సైతం మూతపడ్డాయి. లక్షలాదిమంది కార్మికులు రోడ్డునపడ్డారు. ఇంత జరిగినా...మోడీ సర్కార్ చెప్పిన నల్లడబ్బు మాత్రం రాలేదు. పెద్ద నోట్ల వల్ల అవినీతి పెరుగుతున్నదని రూ. 500, రూ. 1000 నోట్లను రద్దు చేసి దాని స్థానంలో మరింత పెద్ద నోటు రూ. 2000 ప్రవేశపెట్టారు. అయితే నోట్ల రద్దుతో పాలకుల రాజకీయ ప్రయోజనం మాత్రం నెరవేరిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మోడీ సర్కార్ ప్రజలకు చెప్పిందేంటి?

బ్లాక్‌మనీని వెలికితీయటం, దొంగనోట్లు వెలికితీయటం వంటి నాలుగు ఆర్థిక లక్ష్యాల్ని అందుకోవటం కోసం నోట్లరద్దు నిర్ణయాన్ని తీసుకున్నామని ప్రధాని మోడీ ప్రజలకు వెల్లడించారు. మరి ఈ లక్ష్యాల్ని మనదేశం అందుకుందా? అని ఒకసారి పరిశీలిస్తే.. ఆర్థిక వ్యవస్థలో అధికారికంగా చలామణి కాని నగదు అంతా కూడా నల్లధనం కిందే లెక్క. నోట్లరద్దుతో సుమారు 3 నుంచి 4 లక్షల కోట్లు నల్లధనం బ్యాంకులకు రాదని గొప్పలు చెప్పారు. కానీ అనంతరం ఆర్బీఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 8 నవంబరు 2016 నాటికి చెలామణిలో ఉన్న రూ.15.41 లక్షల కోట్ల నగదులో 99శాతం(రూ.15.31లక్షల కోట్లు) బ్యాంకులకు చేరిందని ఆర్బీఐ ప్రకటించింది. మరి మోడీ సర్కార్ చెప్పిన నల్లధనం ఎటుపోయిందో? ఇప్పటికీ ప్రజలకు అర్థం కావటం లేదు. దేశంలో ఉన్న నల్లధనం తెల్లధనంగా మారడానికి నోట్లరద్దు నిర్ణయం దోహదపడిందని రాజకీయ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. నోట్లరద్దు నిర్ణయాన్ని పాలకులు పక్కా వ్యూహం ప్రకారమే అమలుజేశారని వారు విమర్శించారు.

దొంగనోట్లు

నోట్లరద్దు ప్రకటించాం...నోట్లన్నీ బ్యాంకుల వద్దకు రావాల్సిందే, దొంగనోట్లన్నీ పట్టుకుంటామని పాలకులు ఘనంగా నమ్మబలికారు. అయితే ఊహించిన స్థాయిలో దొంగనోట్ల పట్టివేత జరగలేదు. కేవలం 6.32లక్షల దొంగ నోట్లు మాత్రమే అధికారులు సీజ్ చేశారు. ఇందులో వంద నోట్ల విలువైనవి 1.7 లక్షలు. మొత్తం చెలామణిలో ఉన్న నోట్ల సంఖ్యలో (2019-20 ఆర్థిక సంవత్సరం నాటికి) బ్యాంకింగ్ వ్యవస్థ సీజ్ చేసిన దొంగనోట్లు 4.6శాతం మాత్రమే.

నగదు రహిత లావాదేవీలు

నోట్లరద్దు తర్వాత సామాన్యుడి కష్టాలు అన్నీఇన్నీ కావు. దీనిపై ప్రజల్లో పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమవుతున్న తరుణంలో మోడీ సర్కార్ తెరమీద తీసుకొచ్చిన ప్రకటన 'నగదు రహిత లావాదేవీలు'. నోట్లరద్దు నిర్ణయం ప్రజల ఉపాధిని తీవ్రంగా ప్రభావితం చేయటంతో, ఆదాయాలు పడిపోయాయి. ఈనేపథ్యంలో ఏ చిన్న మొత్తం చేతుల్లో ఉన్నా అదొక పెద్ద విషయంగా మారింది. ప్రజల అసంతృప్తిని దారిమళ్లించడానికి 'డిజిటల్ మనీ' అనేది తెరమీదకు తీసుకొచ్చారని ఆరోపణలున్నాయి. ఆర్బీఐ లెక్క ప్రకారం, నోట్లరద్దు నిర్ణయం తీసుకునేనాటికి దేశంలో నగదు చెలామణి విలువ రూ.16.4లక్షల కోట్లు. ఆ తర్వాత నగదు రహిత లావాదేవీలను నిజంగానే అమలుజేసి ఉన్నట్టయితే, క్రమంగా నగదు చెలామణి విలువ తగ్గుతూ రావాలి. కానీ దీనికి విరుద్ధంగా మార్చి 2020 నాటికి నగదు లావాదేవీల విలువ రూ.24.2 లక్షల కోట్లకు పెరిగింది.

- నోట్లరద్దు మనదేశంలో ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపింది.
- అనేక సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయి.
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దాదాపు చిన్నాభిన్నమైంది. అక్కడి ప్రజల ఆదాయాలు అనూహ్యంగా పడిపోయాయి. వృద్ధి గణాంకాల్లో అది బయటపడింది.
- నోట్లరద్దు నిర్ణయం మోడీ సర్కార్ ఏకపక్షంగా తీసుకుందని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ సహా పలువురు ఆర్థిక వేత్తలు తప్పుబట్టారు.

రెండు వేల నోటు, ఐదు వందల నోటు, రెండు వందల నోటు, వంద నోటు, యాభై నోటు, రూ.20 నోటు, రూ.10 నోటు..ఒక్కొక్క నోటు ఒక్కో రంగులో నేడు మనకు కనపడుతోంది. అన్ని రంగులూ వచ్చాయి. మరి..ఆ బ్లాక్‌మనీ రాలేదేంటి. ఎటు పోయింది? అదే అర్థం కావటం లేదు..

దళితుల రక్షణ



ఎన్.ముక్కంటి

మనదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 74 ఏళ్ళు దాటాయి. రాజ్యాంగం అమలులోకి వచ్చి 71 ఏళ్ళు నిండాయి. కానీ దళితుల రక్షణ విషయంలో ఎటువంటి ప్రగతి లేదు. సమాజం ఆధునిక ఆలోచనలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతి సాధిస్తుందని భావి స్తున్నాం. కానీ దళితులపైన జరుగుతున్న దాడులను చూస్తే ఈ దేశంలో దళితులనే వారిని మనుషులుగా చూస్తున్నారా? అనే అను మానం కలగకమానదు. అందుకే అంబేద్కర్‌పైన ఉటంకించిన అభిప్రాయం, ప్రతిపాదించిన పరిష్కారం మళ్ళీ చర్చలోకి తీసుకురాక తప్పలేదు. అంబేద్కర్ రచనలు, ప్రసంగాలు 9వ భాగంలో ప్రత్యేక నివాసాలు అనే చాప్టర్ ఉంది. అందులో ఆయన పేర్కొన్న ఒక అంశాన్ని ఇక్కడ పేర్కొనడం సబబుగా ఉంటుంది. 'పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థ రెండూ హిందువుల వైపే ఉంటాయి. అందుచేత హిందువులతో పోరాడితే వారికి పోలీసుల నుంచి రక్షణ గానీ, న్యాయమూర్తుల నుండి న్యాయం గానీ లభించదు. వాళ్ళు ఆధిపత్య కులాల పక్షాన్నే ఉంటారు. ఆధిపత్య కులాలకు ఉన్న సామాజిక అండదండలు, ఆర్థిక బలం దళితులకు ఉండవు. అందువల్ల వాళ్ళు ఈ వ్యవస్థ ఫలితాలను అందుకోలేరు' అన్న అంబేద్కర్ మాటలు నేటి ప్రభుత్వ వ్యవస్థల పనితీరుకి అద్దంపడుతున్నాయి.

అక్షర సత్యాలుగా నిలుస్తున్నాయి. పోలీస్ స్టేషన్‌లలో నమోదౌతున్న కేసుల సంఖ్య రోజు రోజుకీ తరిగిపోతోంది. ఇటీవల ఎస్సీ, ఎస్టీ చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నిందితులకు అండగా నిలిచింది. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడానికి ముందు విచారణ జరపాలనేది అటువంటి నిబంధన. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దానితో చాలా కేసుల్లో పోలీసులే బాధితులను బెదిరించి, కేసులే లేకుండా చేసి, నిందితుల కొమ్ముకాస్తున్న పరిస్థితిని మనం చూస్తూనే ఉన్నాం. అయితే కోర్టుల దాకా వెళ్ళిన కేసులలో కూడా శిక్షలు పడుతున్నవి అత్యంత అరుదనే చెప్పొచ్చు. 2017-18 కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 16.3 శాతం కేసుల్లోనే శిక్షలు పడుతున్నాయి. ఇవన్నీ కింది కోర్టులే. పై కోర్టుల్లో వీటిని కొట్టేస్తున్నారు.. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ చుండూరు కేసు. జిల్లా కోర్టు శిక్షలు విధిస్తే, హైకోర్టు న్యాయమూర్తి దానిని కొట్టివేశారు. ఇంతకన్నా వేరే ఉదాహరణ అక్కర్లేదు. ఇంతేకాకుండా దళితులపైన భౌతిక దాడులే కాకుండా, ఉద్యోగులపై, అధికారులపై వివక్ష, వేధింపులు నిత్యకృత్యంగా మారిపోయాయి. రాజకీయ నాయకులైన దళితులు కూడా రెండవ శ్రేణి నాయకులుగానే చూడబడుతున్నారు. పార్టీ నాయకత్వాలకు అడుగులకు మడుగులొత్తకపోతే, ఏ నాయకుడికైనా పుట్టగతుల్లేవు. ఇది ప్రస్తుత దళితుల పరిస్థితి.

అందుకే బాబాసాహెబ్ అంబేద్కర్ లాంటి వాళ్ళు, కనీసం ప్రత్యేక నివాసాల ద్వారానైనా దళితులు భౌతిక హింసకు దూరమవు తారని భావించారు. నాగ్‌పూర్‌లో 1942, జూలై, 19 తేదీల్లో జరిగిన అఖిల భారత షెడ్యూల్డ్ కులాల సదస్సులో ఆయన ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'హిందువులకు సంబంధం లేకుండా ప్రత్యేకంగా షెడ్యూల్డ్ కులాల నివాసాలను ఏర్పాటు చేయాలి. కొత్త గ్రామాల నిర్మాణం కోసం సెటిల్‌మెంట్ కమిషన్‌ని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వానికి సంబంధించిన అనాక్రమిత వ్యవసాయ భూముల్ని కమిషన్‌కు అప్పగించాలి' ఇట్లా తన ప్రతిపాదనలను అంబేద్కర్ రాజ్యాంగ సభ ముందుంచారు. కానీ ఇవేవీ రాజ్యాంగంలోకి రాలేదు.

ఇప్పుడైనా అటువంటి ప్రతిపాదనను ప్రభుత్వాలు ఆలోచించాలి. ఆధిపత్య కులాలు మెజారిటీగా ఉన్న చోట, దళితులు చాలా తక్కువ జనాభా ఉన్నచోట ఈ దారుణాలు మరింతగా పెరుగుతున్నాయి. కారంచేడు, చుండూరులో

దాడిచేసిన సామాజిక వర్గాల జనాభా అధికం. అదేవిధంగా బులాన్‌గర్ గ్రామంలో అత్యాచారం జరిగిన చోటా కులం బలం ఎక్కువ. అక్కడ దళితుల ఇళ్ళు కేవలం పదిహేను మాత్రమే. అంతే కాకుండా చాలాచోట్ల ఏ కులం వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటారో ఆ కులం వాళ్ళు దాడులకు సిద్ధమౌతున్నారు.

“దళితులకు ప్రత్యేక నివాసాలను ఏర్పాటు చేయడం, ఎవరి హక్కులనూ, అధికారాలనూ, అతిక్రమించడం కాదు. వేల ఎకరాల వ్యవసాయ యోగ్యమైన భూమి ఉపయోగం లేకుండా ఉంది. అటువంటి భూములలో దళితులకు ప్రత్యేక నివాసాలను, ప్రత్యేక ట్రస్టును ఏర్పాటు చేసి, నిధులను కేటాయించాలి. దక్షిణాఫ్రికాలోని ‘బంటు’ తెగ లాంటి గిరిజన జాతి పరిస్థితికి, షెడ్యూల్డ్ కులాల జీవన పరిస్థితులకు చాలా దగ్గరి పోలిక ఉంది. దక్షిణాఫ్రికా రాజ్యాంగంలో బంటు తెగకు ప్రత్యేక ప్రాంతాల ఏర్పాటు అవకాశాన్ని కల్పించారు. కానీ భారత రాజ్యాంగం ముసాయిదాలో అటువంటి ప్రతిపాదన లేకపోవడం ఎందుకో అర్థం కావడం లేదు” అని 1946, ఏప్రిల్ 23వ తేదీన బాబాసాహెబ్ అంబేడ్కర్ ‘ది టైమ్స్ ఆఫ్ ఇండియా’కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ఈ ప్రతిపాదన చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుండొచ్చు. చాలా మందికి మింగుడు పడకపోవచ్చు. ఫర్వాలేదు. కానీ, ఎందుకు అంబేడ్కర్ అటువంటి ప్రతిపాదన చేశాడో ఆలోచించాలి? అదే విధంగా ఇప్పుడు 70 ఏళ్ళ తర్వాత మళ్ళీ దానిని ఎందుకు లేవనెత్త వలసి వచ్చిందో కూడా మనం గుర్తించాలి. గతనెల రోజులుగా ఉత్తరప్రదేశ్ లోని హాథ్రస్ జిల్లా బుల్‌బరి గ్రామంలో 19 ఏళ్ళ దళిత బాలికపై నలుగురు ఆధిపత్య కులానికి చెందిన యువకులు అత్యాచారం చేసి, చంపడానికి ప్రయత్నించారు. సెప్టెంబర్ 14, 2020 తేదీన పొలంలోకి గడ్డికోసం వెళ్ళిన యువతిని సందీప్, రాము, లవకుశ్, రవి అనే నలు గురు యువకులు ఆమె దుపట్టాను మెడకు బిగించి లాక్కొని వెళ్ళి, సామూహికంగా అత్యాచారానికి పాల్పడినట్లు ఆ దళిత యువతి సోదరుడు పోలీసులకు తెలిపారు.


ఈ దాడిలో ఆ యువతి వెన్నెముక పూర్తిగా విరిగిపోయింది. అమ్మాయి అరుస్తుంటే నాలుకను సైతం పీకే సిందా నరహంతక ముఠా. అయినా ఆమె అరుస్తుంటే తల్లి పరిగెత్తు కొని వచ్చింది. అప్పటికే ఆమె పడిపోయి ఉన్నది. ఆమెపై అత్యాచారం చేయబోతుంటే అడ్డుకున్నందుకు దళిత యువతిని క్రూరంగా చిత్ర హింసలకు గురిచేసినట్లు కూడా వైద్యులు నిర్ధారించారు. చివరకు ఆమె చికిత్స పొందుతూ ఢిల్లీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచింది. తమ బిడ్డ చివరి చూపుకూడా దక్కకుండా, అర్ధరాత్రి ఆ యువతి శవాన్ని పోలీసులే దహనం చేశారు.

ఈ ఘటన జరిగిపోయిన తర్వాత పోలీసులు మరో సంచలన అబద్ధాన్ని ప్రకటించారు. పోస్ట్‌మార్టం రిపోర్టులో ఆమెపైన అత్యా చారం జరగలేదని తేల్చారు. ‘అత్యాచారం జరగకపోతే, ఆమెపైన ఇంతటి క్రూరమైన హింస ఎందుకు జరిగిందనే విషయానికి పోలీసుల దగ్గర సమాధానం లేదు. పోలీసులు ప్రవర్తించిన తీరు ఒక కులం పెంచుకుంటున్న కాపలాదారులు వ్యవహరించిన విధంగానే ఉంది. కానీ ‘రూల్ ఆఫ్ లా’కు కట్టుబడిన యంత్రాంగం విధంగా కనిపించడం లేదు. ఈ ఒక్క ఘటనతో ఆగిపోలేదు. ఆ తర్వాత జరిగిన ఘటనలు కూడా చూస్తే, భారత దేశంలో షెడ్యూల్డ్ కులాలుగా పిలువ బడుతున్న దళితులకు ఎంతటి రక్షణ ఉందో మనకు అర్థం కాగలదు. సెప్టెంబర్ 29న, ఉత్తరప్రదేశ్‌లోని అజ్మీర్ జిల్లా రామ్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో దౌరాయి గ్రామంలో ఒక యువతిపై అత్యాచారం జరిగింది. అదే రాష్ట్రంలో బలరాంపూర్‌లో 22 ఏళ్ళ దళిత యువతిపై ఇద్దరు ఆధిపత్య కులానికి చెందిన యువకులు అత్యాచారం జరిపారు. భదోయి జిల్లాలో 14 ఏళ్ళ దళిత బాలికపై అత్యాచారం జరిపి, హత్య చేశారు. ఆమె తలను ఇటుకలతో కొట్టి ముక్కలు ముక్కలు చేశారు.

అంతేగాకుండా గ్యాన్‌పూర్ ఏరియాలో 44 ఏళ్ళ దళిత వివాహితపై నలుగురు వ్యక్తులు అత్యాచారం జరిపారు. మధ్యప్రదేశ్, బీహార్, రాజస్తాన్ ఇంకా దేశంలోని చాలా రాష్ట్రాల్లో అత్యాచారాలు సర్వసాధారణంగా మారిపోయాయి. ఇక దళిత యువతుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. దళిత స్త్రీలపై జరుగుతోన్న అత్యాచారాలు నేరాలుగానే పరిగణించని స్థితి. గత నాలుగేళ్ళలో దళిత మహిళలపై జరిగిన అత్యాచారాలను పరిశీలిస్తే, దళితుల జీవితాలు ఎంతటి భయంకరమైన స్థితిలో ఉన్నాయో అర్థం అవుతుంది. దేశం మొత్తంలో 2015లో 2,332 మంది, 2016లో 2,540, 2017లో 2,770, 2018లో 2956 మంది దళిత మహిళలు ఆధిపత్య కులాల పురుష దురహంకారానికి బలైపోయారు. కనీసం ముందు ఒక ప్రయత్నం చేయవచ్చు. ఎక్కడైతే దళితులు చాలా తక్కువ జనాభాగా ఉన్నారో, వారిని దళితులు అధికంగా ఉన్న చోటుకు మార్చితే కనీసం జన బలంతోనైనా కొంత భద్రత వస్తుందేమో చూడాలి.

ఏది ఏమైనా హాథ్రస్ ఘటన తర్వాత దళితుల్లో ఒకరకమైన ఆవేదన, ఆవేశం బయట పడుతున్నాయి. ఇది ప్రత్యక్ష కార్యాచరణగా ఇప్పుడు బయటపడకపోవచ్చు. కానీ ఇది ఇంతటితో ఆగదు. ఎవరైనా ఈ దేశ సమగ్రత, సమైక్యత గురించి ఆలోచించే ముందు దళితుల రక్షణ, భద్రత గురించి తప్పనిసరిగా ఆలోచించాల్సి ఉంటుంది. అంబేడ్కర్ చేసిన ప్రతిపాదన గురించి ఆలోచించాలి. ఒకవేళ ఆ ప్రతిపాదన సరైంది కాదనుకుంటే, ప్రత్యామ్నాయం ఏంటో చెప్పాల్సి ఉంటుంది. లేదంటే దేశ సమగ్రత, సమైక్యత కేవలం హుళక్కిగానే మిగిలిపోతుంది. హిందూ సమాజం ఏకత్వం గురించి హిందూ మతం ఐక్యత గురించి సంఘాలు, సంస్థలు, పీఠాలు, మఠాలు, ట్రస్టులు ఈ విషయాన్ని ఇప్పటికైనా నోరు తెరిచి మాట్లాడితే వినాలని ఉంది.

ఈ ప్రపంచం చెడ్డవారి వల్ల చెడిపోలేదు
చెడుని ప్రశ్నించకుండా చెతులుకట్టుకున్న
మంచివారి వల్ల చెడిపోయింది,
ధైర్యంగా అడగలేని భయస్తుల వల్ల
మనకెందుకులే అనుకునే స్వార్థపరుల
వల్ల చెడిపోయింది.



కరోనా కంటే డేంజర్.. కాలుష్యం....



సి.విజయ్‌బాబు

గాలి కాలుష్యంలేని ప్రాంతాలతో పోల్చితే గాలి కాలుష్య ప్రాంతాల్లో కోవిడ్-19 కారణ మరణాలు అధికంగా ఉన్నాయని హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రజారోగ్య విభాగం చేసిన పరిశోధనల్లో బయట పడింది. కార్లు, శిలాజ ఇంధన వాహనాలు, రిఫైనరీలు, పవర్ ప్లాంట్లు విడుదల చేసే దుమ్ము, ధూళితో పాటు పియం-2.5 ఘన, ద్రవ రేణువుల గాలి కాలుష్యం కోవిడ్-19 రోగులకు అతి ప్రమాదకరంగా మారుతున్నదని తెలియ జేసింది. అమెరికాలోని 3,089 కౌంటీల్లో (ఆవాసాల్లో) జరిగిన అతి పెద్ద పరిశోధనల్లో పియం-2.5 గాలి కాలుష్యానికి, కోవిడ్-19 మరణాలకు సంబంధాన్ని స్పష్టం చేశారు. పియం-2.5 కలుషిత గాలిని పీల్చిన కరోనా బాధితుల్లో అధిక మరణాలు నమోదు కావడం నేడు న్యూఢిల్లీ నగరవాసులకు ప్రమాద హెచ్చరికలను చేసినట్టయ్యింది. పియం-2.5 పార్టిక్యులేట్ మ్యాటర్ కాలుష్యానికి గురైన కోవిడ్-19 రోగుల్లో 8శాతం అధిక మరణాలు జరిగాయని నిర్ధారించారు. పియం-2.5 గాలి కాలుష్యం వల్ల గుండె జబ్బులు, శ్వాసకోశ సంబంధ వ్యాధుల ప్రమాదం పెరిగిందని వెల్లడించారు. పియం-2.5 కాలుష్యం స్వల్పంగా (1మైక్రోగ్రామ్/క్యూబిక్ మీటర్) పెరిగినా కోవిడ్-19 రోగుల మరణాలు 11శాతం పెరుగుతున్నాయని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలం గాలి కాలుష్య వాతావరణంలో జీవించిన వారిలో 15శాతం మరణాలు అదనంగా జరిగాయని తేల్చారు. 5 నవంబర్ 2020 రోజున న్యూఢిల్లీలో పియం-2.5 కణాల కాలుష్యం ఘనపు మీటరుకు 370 ఉందని, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సురక్షిత విలువ 25 కన్న 12 రెట్లు ఎక్కువగా ఉంది. దీనిని బట్టి ఢిల్లీవాసులు ఎంత ప్రమాదకరమైన స్థితిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఢిల్లీలో 4.17లక్షల కరోనా కేసులు ఉండగా, 2 కోట్ల మహానగర జనాభా కోవిడ్-19 అంచున ఉన్నారని హెచ్చరిస్తున్నారు. ఢిల్లీ మహానగరం నేడు గాలి కాలుష్య కోరల్లో చిక్కుకొని ఉంది. గత కొన్ని మాసాలుగా లాక్‌డౌన్, కరోనా నియమాలతో తేట గాలి పీల్చిన ఢిల్లీ వాసులు నేడు విష గాలిని పీల్చుతున్నారు. ప్రస్తుతం కోవిడ్-19 సోకిన వారిలో అధిక మరణాలు నమోదు కావడం కరోనా అగ్నికి గాలి కాలుష్య ఆజ్యం పోసినట్టయ్యింది. కరోనా కట్టడిలో గాలి కాలుష్యం ప్రతిబంధకంగా నిలుస్తున్నదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ప్రపంచ కరోనా కేసుల్లో 2వ స్థానం (8.4 మిలియన్లు), కోవిడ్-19 మరణాల్లో 3వ స్థానంలో (1.24 లక్షలు) ఉన్న భారత్‌లో నేడు ఉత్తర భారతంలో పియం-2.5 గాలి కాలుష్యం పంజాలో చిక్కిన కారణంగా భవిష్యత్తు భయానకంగా తోస్తున్నది. దేశంలో ఇప్పటికే అధిక కరోనా కేసులతో ముందున్న ఢిల్లీలో శీతాకాలం నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు గాలి కాలుష్యం అపరిమితంగా పెరగడం జరిగి, కరోనా వ్యాప్తి, కోవిడ్-19 మరణాలు పెరుగుతాయని తెలియజేస్తున్నారు. కరోనాకు గాలి కాలుష్యం తోడైతే కోవిడ్-19 మరణాలు అధికం అవడం అనివార్యమని వైద్యులు సూచిస్తున్నారు. ఢిల్లీ కాలుష్యాన్ని నియంత్రించని యెడల ఈ శీతాకాలం ప్రజారోగ్యం గాలిలో దీపం కావడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. ప్రపంచంలోనే 20 అతి కాలుష్య నగరాల్లో భారత్‌లోని ఢిల్లీతో పాటు దేశంలోని మరో 13మహానగరాలు ఉండడంతో కోవిడ్-19 రోగులకు ప్రాణాపాయం ఉందని గమనించాలి. అధిక ఓజోన్ కాలుష్యంగల 10ప్రపంచ దేశాల్లో ఇండియా కూడా ఉన్నది. ఢిల్లీలో గాలి కాలుష్యాన్ని అదుపు చేయని యెడల, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన దాని కన్న 20రెట్లు అధిక గాలి కాలుష్యం పెరగవచ్చని భయపడుతున్నారు. ఢిల్లీతో పాటు భారత్‌లోని అనేక నగరాలు కాలుష్య కోరల్లో చిక్కి సతమతం అవుతున్నాయి. దేశ ప్రజలు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచుకొని, కాలుష్య ప్రభావాన్ని తగ్గించే జాగ్రత్తల పట్ల, ఆరోగ్య భారతాన్ని నిర్మించటం పట్ల మన ప్రభుత్వాలకు ఏమాత్రం చిత్తశుద్ధి లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తున్నది.



పలక

కరిగిపోయిన విద్యాకాలం..

ఐ.స్టాలిన్

ఇది కేవలం ఒక విద్యా సంవత్సర కాలానికి, ఆ కాలంలో చదువుకోవాల్సిన పాఠాలకు మాత్రమే సంబంధించిన విషయం కాదు. మన భవిష్యత్తుకు సంబంధించిన మేధో ఆలోచనా పంట దిగుబడికి, దానిపై మనకున్న శ్రద్ధాసక్తులకి సంబంధించిన సమస్య. మనం, ప్రతిరోజూ అవసరమై, మన బతుకు మనుగడకు ముఖ్యావసరమైన ఆహారం పండించే వారిపట్ల, పంటపట్ల ఎలాంటి వైఖరిని కలిగి ఉన్నామో, ఎంత శ్రద్ధను కనబరుస్తున్నామో, విద్యా ఫలాలపై కూడా అదే వైఖరి కలిగి ఉన్నాము. ఈ రెండూ నిర్లక్ష్యానికి గురై దేశ సౌభాగ్యం హీనమైపోతున్నది కోవిడ్ మొదలయి ఎనిమిది నెలలు దాటుతున్నది. ప్రజల పట్ల బాధ్యత వహించిన దేశాలు ప్రాంతాలు కుదుటపడి సాధారణ జీవనాన్ని కొనసాగిస్తున్నాయి. కానీ మన పాలకులు ఇప్పటికీ ఆ బాధ్యతలను తీసుకోలేదు. ప్రభుత్వాలు ఆవైపుగా కూడా ఆలోచించడం లేదు. ముఖ్యంగా విద్యా వ్యవస్థకు సంబంధించి పూర్తి నిర్లక్ష్యం కనపడుతున్నది. మరో నాలుగు నెలల్లో విద్యా సంవత్సరం ముగుస్తుంది. విద్యాభ్యాసన క్రమాన్ని ఏవిధంగా ఈ సంవత్సరానికి ముగించనున్నారో ప్రభుత్వం ఇంతవరకు చర్చించనేలేదు. భావిపౌరుల విజ్ఞానాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలూ కనిపించడం లేదు.

కరోనా ప్రారంభ రోజుల్లో అన్నీ బందు పెట్టిన ప్రభుత్వం విజృంభిస్తున్న తరుణంలో ఒక్కొక్కటీ తెరుస్తూపోతున్నది. ఇప్పుడసలే చలికాలం. వైరస్ విస్తరిస్తూ పోతున్న కాలం. ఉపాధ్యాయులను పాఠశాలలకు వంతుల వారీగా హాజరుకమ్మన్నారు. ఆన్‌లైన్‌లో పాఠాల బోధనకు పూనుకున్నారు. కానీ చాలా పాఠశాలలకు అవసరమైన సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాక విద్యార్థులు కూడా ఆరంభంలో కొంత ఆసక్తి కనబరచినా ఇప్పుడు నిరాసక్తంగానే ఉన్నారు. అందుకుతోడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వినగలిగే సౌకర్యాల లేమికూడా వేధిస్తూనే ఉన్నది. పల్లెల్లో నెట్ సౌకర్యం ఉన్న విద్యార్థులు చాలా తక్కువగా ఉంటారు.

కోవిడ్ కారణంగా విపరీతమైన ఉపాధి సంక్షోభం ఏర్పడింది. చాలావరకు ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు అనేక జీవన ఇక్కట్లకు గురవుతున్నారు. వీరంతా రెక్కాడితేగాని డొక్కాడని అసంఘటితరంగ కార్మికులు లేదా వ్యవసాయ కూలీలు. బడులు తెరచినప్పుడు దొరికే మధ్యాహ్న భోజనమూ పిల్లలకు ఇప్పుడు అందుబాటులో లేకుండాపోయింది. ప్రభుత్వాల దగ్గర ఈ రకమైన సవాళ్ళను ఎలా ఎదుర్కొవాలన్న ప్రణాళిక లేకుండా పోయింది. పరిస్థితులు ఇంత విషమంగా ఉన్నా ప్రభుత్వం వైపు నుంచి కనీస చర్చా లేదు, శ్రద్ధ అంతకంటే కానరాదు..! తొమ్మిది, పది తరగతుల విద్యార్థులను బడులకు ఆహ్వానించిన ఫలితంగా వందలమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు కరోనా బారినపడి ఇబ్బంది పడుతున్న సంఘటనలను పొరుగు తెలుగు రాష్ట్రంలో చూస్తున్నాము. మన తెలంగాణలోనూ అనేక మంది ఉపాధ్యాయులు కరోనాకు గురవుతూనే ఉన్నారు. పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించకుండా, పరిశుభ్రతకు కృషి చేయకుండా బడుల వాతావరణాన్ని నిర్లక్ష్యం చేసి కదలకుండా కూర్చున్నది ప్రభుత్వం. ఇది క్షమించరాని నేరం. ఇక యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఇటీవల విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో భౌతిక తరగతుల నిర్వహణకు కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసినప్పటికీ ఏ రకమైన సౌకర్యాలూ, ప్రణాళికలూ ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్తలకు కావలసిన ఏర్పాట్లు కల్పించలేదు. ఏరకమైన సౌకర్యాలు కల్పించకుండా పిల్లల ఆరోగ్యాల పట్ల భరోసా ఇవ్వకుండా పాఠశాలల్లో కానీ, కళాశాలల్లో కానీ తరగతులు ప్రారంభించడం వల్ల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యావ్యవస్థ స్థితిగతులపట్ల ప్రభుత్వాలకున్న అశ్రద్ధ నిరాసక్తతలే ఈ సంక్షోభాలకు కారణాలు. కేవలం ఆందోళన చెందితే సరిపోదు. ప్రభుత్వ విధానాల పట్ల తల్లిదండ్రులు చైతన్యయుతంగా స్పందించాల్సిన అవసరం ఉంది. మన పిల్లల భవిష్యత్తు కోసం పోరాడాలి. లేదంటే రాబోయే తరాలు తీవ్రంగా నష్టపోతాయి.

టర్కీలోని ఇజ్మీర్ ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. ఆ భూకంప ధాటికి ఆ ప్రాంతంలోని అనేక బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. అయితే బిల్డింగ్‌ల శిథిలాల కింద ఓ నాలుగేళ్ల బాలిక ప్రాణాలతో సజీవంగా ఉన్నది. అయిదా గెజ్‌గిన్ అనే అమ్మాయిని రెస్క్యూ సిబ్బంది రక్షించింది. బిల్డింగ్ కూలిన 91 గంటల తర్వాత ఆ చిన్నారిని శిథిలాల కింద నుంచి రక్షించడం అద్భుతం. ఇజ్మీర్‌లోని బైరాక్లి జిల్లాలో వచ్చిన 7.0 తీవ్రత భూకంపం వల్ల అక్కడ బిల్డింగ్‌లు కూలాయి. పశ్చిమ టర్కీలో సంభవించిన భూకంపానికి మృతులు వందకు పెరిగిందని ఆ దేశ విపత్తు అథారిటీ తెలిపింది. 7.0 తీవ్రతతో సంభవించిన శక్తివంతమైన ప్రకంపనలకు 994 మంది గాయపడ్డారని టర్కీకి ఏజెన్సీ తెలిపింది. ఇజ్మీర్ ప్రావిన్స్‌లోని రెస్క్యూ సిబ్బంది జాడలేకుండా పోయిన వ్యక్తుల కోసం ఐదు భవనాల్లో ఇంకా శోధిస్తున్నాయి. శిథిలాల నుంచి ఇద్దరు బాలికలను రక్షించారు. అక్టోబర్ 30న టర్కీలో భారీ భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.0గా నమోదయ్యింది. దీంతో టర్కీ తీరానికి, గ్రీకు దీవి సామోసుకు మధ్యలో ఏజియన్ సముద్రంలో 196 సార్లు భూమి కంపించిందని అధికారులు గుర్తించారు. దీని ప్రభావంతో సామోస్, ఏజియన్ సముద్రంలో చిన్నపాటి సమావేశం సునామీ వచ్చింది.



91 గంటలు.. భూకంప శిథిలాల కింద నాలుగేళ్ల బాలిక





అవినీతి నిర్మూలన సాధ్యమా?

ఆర్.వి.శ్రీనివాసరావు

ప్రజలతో నిత్యసంబంధాలు కలిగిన ప్రభుత్వ శాఖలలో చాలావరకు మానవ ప్రమేయాన్ని తగ్గించాలి. ఎప్పటికప్పుడు అప్‌డేట్ టెక్నాలజీని పెంచాలి. దాంతోపాటు ఎప్పటికప్పుడు అవినీతిపరులను పసిగట్టడం చేయాలి. అవినీతి తిమింగలాలను పట్టుకోవడమే కాకుండా వారి కేసులను త్వరితగతిన విచారణ జరపాలి. అంతిమంగా అవినీతిపరుల ఆస్తులను జప్తు చేసి ప్రజలపరం చేయాలి. అన్నింటికంటే ముఖ్యమైనది రాజకీయ అవినీతి అధికారుల, ఉద్యోగుల అవినీతికి కారణం అవుతుంది. పోస్టింగులు నుండి బదిలీల వరకు రాజకీయ అవినీతితో అధికారులు చెలరేగిపోతున్నారు. రాజకీయ నాయకులతోపాటు అవినీతి అధికారులు కూడా అవినీతి సామ్రాజ్యాలను ఏలుతున్నారు. ఈ అవినీతి సామ్రాజ్యాలు కులాలంటే ముందు రాజకీయ అవినీతి నిర్మూలన కావాలి. లేకపోతే అవినీతి నాగరాజులు ఇలా ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉంటారు. అభివృద్ధి సామ్రాజ్యాలు ఇంకా అభివృద్ధి చెందుతాయి. రెవెన్యూశాఖలో అవినీతి సొమ్ము కోటి రూపాయలు దాటిన లంచం తీసు కున్న కేసులో గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కాల్సిన కేసుగా కీసర మాజీ ఎమ్మార్వో నాగరాజు కేసు మొదటిది. జ్యూడిషియల్ కస్టడీలో ఉన్న చంచల్‌గూడా జైలులోనే ఆయన ఉరి వేసుకోవడంతో నాగరాజు అవినీతి కథ విషాదాంతమైంది. ఇందులో రెండు కోణాలు ఉన్నాయి. పాపభీతి ఉన్నవాళ్లు స్వర్గం నరకం ఎక్కడో లేదని అది ఇక్కడే ఉందని ఆయనకు తగిన శాస్తి జరిగిందని అనుకుంటారు. కానీ సమాజంలో అవినీతి కూకటివేళ్లతో తొలగాలి అనుకునేవాళ్లు, మానవీయ కోణంలో ఆలోచించే వాళ్లు న్యాయనిర్బంధంలో ఉన్న నాగరాజుకు అన్యాయం జరిగిందని అంటారు. ఇప్పటికే ఆయన మృతిపై అనేక సందేహాలు వ్యక్త మవుతున్నాయి. అనుమానాలు ముసురుకుంటున్నాయి. న్యాయ నిర్బంధంలో ఉన్న వారికి సరైన రక్షణ లేదు అని అనేదానికి ఇది ఒక మంచి ఉదాహరణ. పోనీ ఆయన ఉన్న జైలులోని మంజీరా బ్యారక్‌లో ఆయన ఒక్కరే ఉన్నారా అంటే కాదు. ఆయనతోపాటు ఇంకా నలుగురైదుగురు ఖైదీలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. బయట జైలు అధికారులు హోంగార్డుల పర్యవేక్షణ నిరంతరం ఉంటుంది. మరి అలాంటప్పుడు బ్యారక్ ఇనుపగ్రిల్‌కు ఆయన ఎలా ఉరి వేసుకున్నారు అనేది చిదంబర రహస్యంకాదు. కన్ను తెరిస్తే జననం, కన్నుమూస్తే మరణం రెప్పపాటు జీవితం అని ఒక కవి అన్నారు. అలాగే మనిషి ఆత్మహత్య చేసుకోవడానికి చావుకీ బతుక్కీ మధ్య ఒక్క బలహీన క్షణం చాలు. ఇలా చాలా మంది తమ జీవితాలను ఎన్నో కారణాలతో అర్థంతరంగా ముగించుకుంటున్నారు.


మనిషి అవినీతితో సంపాదించిన ఆస్తిలో ఆ సంపాదన సక్రమమా లేక అక్రమమా అని చూడకుండా భాగం పంచుకునే కుటుంబ సభ్యులు, మిత్రులు స్నేహితులను తమ అవినీతి పాపంలో భాగం పంచుకుంటారా అని అడిగితే సొంత భార్యాపిల్లలతో సహా ఎవరు ముందుకురారు. ఈ నగ్నసత్యాన్ని తెలుసుకున్న రోజు అవినీతి నాగరాజులు, లావణ్యలు అవినీతి నగేష్‌లు ఇలా బరితెగించి లంచాలు తీసుకోరు. ఆ మధ్య వచ్చిన 'లీడర్ అనే తెలుగు సినిమాలో హీరో రాణా అసెంబ్లీ సీన్‌లో ఒక మాట అంటారు. 'ఏం అవినీతికి అంతం లేదా పది ఎకరాల ఇరవై ఎకరాలు చాలవా? పది కోట్లు ఇరవై కోట్లు చాలవా? అవినీతితో వందల వేల కోట్లు సంపాదించి ఏం చేసుకుంటారు? అని బహిరంగంగా అడుగుతారు. ఇలాంటి ప్రశ్నలు అవినీతిపరులు తమకు తామే వేసుకుంటే బతకడానికి ఎంత కావాలి అని ఆలోచిస్తారు. చచ్చాక అరడుగుల నేల చాలు అన్న నిజం తెలుసుకుంటారు. అవినీతి ఒక జూదం లాంటిది అందుకే ఎంత సంపాదించినా మరింత సంపాదించాలనే యావ పెరుగుతోంది. సంపాదించిన కొద్దీ ఇంకా అత్యాశకు పురిగొల్పు తుంది. అవినీతి ఒక పులి మీద స్వారీ లాంటిది. ఆ పులి మీద స్వారీ చేస్తున్న అవినీతిపరులు ఒకవేళ తాము స్వారీ చేస్తున్న అవినీతి పులి మీద నుండి దిగితే ఆ పులి తమను తినేస్తుంది అన్నభయంతోనే వాళ్లు తమ పదవుల నుండి రిటైర్ అయ్యేదాకా దాని మీద స్వారీ చేస్తూనే ఉంటారు. పోనీ రిటైర్ అయిన తర్వాత కూడా ప్రశాంతంగా బతుకుతారా అంటే ఆ తర్వాత భయంభయంగా చచ్చేదాకా బతుకుతూ ఉంటారు. ఇది జీవన వేదాంతం కాదు జరుగుతున్న అవినీతి జీవన ప్రస్థానం. దీనికి నాగరాజు కేసు ఒక ప్రత్యేక్ష ఉదాహరణ. అవినీతికి మొదటి మెట్టుగా మారిన వీఆర్వో వ్యవస్థ రద్దు చేయడంతోనే ఈ అవినీతికి మంగళం పాడినట్లు కాదు. అలాగే కొంత మంది ఎమ్మార్వోలను మరికొంత మంది ఉన్నత అధికారులను అరెస్టు చేసి కేసులు పెడితే కూడా ఈ అవినీతి పోదు. రెవెన్యూ శాఖ లో వీఆర్వో లాగానే ఎమ్మార్వోలు కూడా మరొక మొదటి మెట్టుగా ఇప్పుడు అవినీతి కేసుల్లో బలవుతున్నారు. వారికంటే పై అధికారుల లంచగొండితనం కింది స్థాయి అధికారులను లంచాలు తీసుకోవడానికి తప్పనిసరి అవసరంగా పురిగొల్పుతుంది. ఇది ఒక విషవలయం. వ్యవస్థాగతమైన మార్పులతోనే అవినీతిని అంతం చేయగలం. ప్రభుత్వంలో పారదర్శకత జవాబుదారీతనం విధానాలు ప్రవేశపెట్టడంతోనే అవినీతి నిర్మూలన జరుగుతుంది. అవినీతి వ్యక్తిగతం కాదు.సామాజికం. సామాజికంగా కొన్ని పాలనా సంస్కరణలు వస్తేనే అవినీతి రూపుమాపడానికి వీలవుతుంది. లేకపోతే 'దొరికితే దొంగ దొరకకపోతే దొరలాగా తయారవుతుంది. ఇలాంటి అవినీతి తిమింగలాలు ఒక్క రెవెన్యూశాఖలోనే కాదు ప్రజలలో నిత్య సంబంధాలు గల అనేక ప్రభుత్వ శాఖల్లో ఉన్నాయి. ఎటొచ్చి అందరు అవినీతిపరులు ఏసీబీకి చిక్కడం లేదు. అవినీతిపరులు దొరికినా కూడా వారి కేసులు విచారణ జరిగి శిక్షలు పడే కల్లా వారు రిటైర్ అవుతున్నారు. అంతకుముందు ప్రమోషన్ల మీద పెద్ద పెద్ద పదవులలో ఉంటున్నారు. వారి అక్రమ ఆస్తులకు ఎలాంటి భంగం కలగడం లేదు. కనుక ప్రభుత్వం ఇటీవల రెవెన్యూ డిపార్ట్మెంట్ నుంచి మొదలుకొని రిజిస్ట్రేషన్ శాఖలలో అధికారుల విచక్షణ అధికారాన్ని తొలగించింది. పోలీసుశాఖలో ఇటీవల పట్టుబడిన ఏసీపీ నరసింహారెడ్డి ఉదంతం ఇంకా మన జ్ఞాపకాల్లోనే ఉంది. అలాగే మున్సిపాలిటీలలో పట్టుబడుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇతర అధికారులు కేసులు ఒకసారి పరిశీలిస్తే ఆయా శాఖలలో మానవ ప్రమేయం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అవినీతి నిర్మూలనకు చాలా మార్గాలు న్నాయి. ప్రజలతో నిత్యసంబంధాలు కలిగిన ప్రభుత్వ శాఖలలో చాలా వరకు మానవ ప్రమేయాన్ని తగ్గించాలి. ఎప్పటికప్పుడు అప్‌డేట్ టెక్నాలజీని పెంచాలి. దాంతోపాటు ఎప్పటికప్పుడు అవినీతిపరులను పసిగట్టడం చేయాలి. అవినీతి తిమింగలాలను పట్టుకోవడమే కాకుండా వారి కేసులను త్వరితగతిన విచారణ జరపాలి. అంతిమంగా అవినీతిపరుల ఆస్తులను జప్తు చేసి ప్రజలపరం చేయాలి. అన్నింటికంటే ముఖ్యమైనది రాజకీయ అవినీతి అధికారుల, ఉద్యోగుల అవినీతికి కారణం అవుతుంది. పోస్టింగులు నుండి బదిలీల వరకు రాజకీయ అవినీతితో అధికారులు చెలరేగిపోతున్నారు. రాజకీయ నాయకులతోపాటు అవినీతి అధికారులు కూడా అవినీతి సామ్రాజ్యాలను ఏలుతున్నారు. ఈ అవినీతి సామ్రాజ్యాలు కులాలంటే ముందు రాజకీయ అవినీతి నిర్మూలన కావాలి. లేకపోతే అవినీతి నాగరాజులు ఇలా ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉంటారు. అభివృద్ధి సామ్రాజ్యాలు ఇంకా అభివృద్ధి చెందుతాయి. అప్పుడుమనం ఇలా చూస్తూనే ఉంటాం.

విశ్లేషణ

సుశాన్ బాబు @ 4వ సారి ముఖ్యమంత్రి

శ్రీ

నితీశ్ కుమార్‌ను బీహారీయులు “సుశాన్ బాబు” అనే ముద్దుపేరుతో పిలుచుకుంటారు. రాముడు మంచి బాలుడు లాగా, మంచి పాలకుడు అనే ఉద్దేశ్యంతో నితీశ్‌కు ఈ పేరు దక్కింది. పదవిని కాపాడుకోవడానికి, ఎదగడానికి రాజకీయ రణక్షేత్రంలో వ్యూహ ప్రతి వ్యూహాలు చేసినా, వ్యక్తిగతంగా నిజాయితీ పరుడుగా, మంచిపాలకుడుగానే ఆయన పేరు తెచ్చుకున్నారు. ఈ ప్రవర్తన, ఈ పాలనే ఇన్నేళ్లు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చో పెట్టింది. మరోసారి ముఖ్యమంత్రి స్థానం దక్కించింది.పదవులేమీ అతనికి కొత్త కాదు. కేంద్ర మంత్రిగానూ పదవులు అనుభవించారు. 2020 ఎన్నికల్లో ఎన్డీఏ ఆధిక్యం సాధించినా, నేడు మళ్ళీ ముఖ్యమంత్రి పదవి దక్కినా, నైతికంగా నితీశ్ కుమార్ ఓడిపోయినట్లే లెక్క. గత ఎన్నికల్లో 71 సీట్లు దక్కించుకున్న తన పార్టీ జేడీయు ఈసారి 43సీట్లు తెచ్చుకొని, సగానికి పడిపోయింది. కన్నులొట్టపోయి,అద్దెసరు మార్కులతో, బీజేపీ సహకారంతో ఎట్టకేలకు నితీశ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇంతకంటే ఓటమి ఏమి ఉంటుంది? ఈ ఎన్నికల్లో ఆర్‌జేడీ, బీజేపీ బాగా లాభపడ్డాయి. బీజేపీకి గత ఎన్నికల్లో 53సీట్లు వచ్చాయి. ఈసారి 74 సీట్లు కైవసం చేసుకొని, గతంలో కంటే 21సీట్లు అధికంగా గెలుచుకొని లాభపడింది. గత ఎన్నికల్లో 81సీట్లతో సింగల్ లార్జెస్ట్ పార్టీగా ముద్ర వేసుకున్న ఆర్‌జేడీ, నేటి ఎన్నికల్లో కూడా 75 సీట్లు పొంది, అదే స్థానం దక్కించుకుంది. కాంగ్రెస్ మాటలకు తల ఒగ్గి, సగం సీట్లు కేటాయించడం వల్ల ఆర్‌జేడీ భారీగా నష్టపోయింది. సీట్ల షేర్ కాంగ్రెస్ కు తగ్గించి వుంటే, ఇంకా ఎక్కువ సీట్లు ఆర్‌జేడీకి దక్కేవి. సీన్ (దృశ్యం) వేరే విధంగా ఉండేది. ఈరోజు నితీశ్ స్థానంలో తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు లేకపోలేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నడ్డా వంటి అగ్రనేతలు, రాష్ట్ర రాజకీయాల్లో పండిపోయిన నితీశ్ కుమార్, సుశీల్ మోదీ వంటి పెద్ద నాయకులను తట్టుకొని, కురువృద్ధుడైన లాలూ ప్రసాద్ యాదవ్ రణక్షేత్రంలో తోడుగా లేకపోయినా, ఇన్ని సీట్లు గెలుచుకొని, ఇంత దృఢమైన పోటీ ఇచ్చిన 31ఏళ్ళ యువకుడు తేజస్వీ యాదవ్‌దే నిజమైన గెలుపుగా విశ్లేషకులందరూ భావిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ పెద్దలు మాట ఇచ్చినట్లుగా నితీశ్ కుమార్ ను కొత్త ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు.నిజంగా, పాలన తన పగ్గాల్లో ఉంటుందా, చూడాల్సిందే. ఉప ముఖ్యమంత్రులుగా ఇద్దరూ బీజేపీ సభ్యులే ఎన్నికయ్యారు. వివిధ శాఖల మంత్రులుగానూ మెజారిటీ సభ్యులు బీజేపీకి చెందినవారే ఉండే అవకాశం ఉంది. కీలకమైన పోర్ట్‌ఫోలియోస్ కూడా బీజేపీ దక్కించుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నిజంగా,ఐదేళ్ల పాటు నితీశ్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారా, కొనసాగనిస్తారా, తానే స్వచ్ఛందంగా పదవి నుండి దిగిపోతారా కాలంలోనే తేలిపోతుంది. ఇప్పటికే 3సార్లు, దాదాపు 15 ఏళ్ళ పాటు బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసి రికార్డు సృష్టించిన నితీశ్ వరుసగా నాల్గవసారి కూడా సింహాసనం అధిరోహించి చరిత్ర సృష్టించారు. చాలా వరకూ మంచి పాలనే అందించారు. యాదవ్, రాజ్‌పుత్ మొదలు అనేక కులాల అధిపత్యాల మధ్య నిత్యమూ కురుక్షేత్రంగా ఉండే బీహార్ రాజకీయ క్షేత్రంలో అల్ప సంఖ్యాతో , సామాజికంగా పెత్తనంలో లేని కుర్మీ సామాజిక వర్గం నుండి వచ్చిన నితీశ్ కుమార్ బీహార్ రాజకీయాల్లో ఇన్నేళ్లపాటు ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా గొప్ప చరిత్ర సృష్టించారు. అందులో సందేహమే లేదు. జయప్రకాష్ నారాయణ్, రామ్‌మనోహర్‌లోహియా వంటి హేమాహేమీల ప్రభావంతో సోషలిస్ట్ మార్గంలో నడచి, నేటి నయా రాజకీయ భావజాలానికీ ఒదిగి, ఎదిగిన నాయకుడు నితీశ్. బీహార్‌లో నితీశ్ ఎన్నో మార్పులు తీసుకువచ్చారు. అభివృద్ధి పథంలో నడిపించారు. బీహార్ లో పరిపాలన చెయ్యడం ఆషామాషీ కాదు.తనదైన పద్ధతిలో కథ నడిపించారు.చేతనైనంత వరకూ అవినీతిని అరికట్టగలిగారు. హింసను కొంతైనా తగ్గించగలిగారు. ఉపాధ్యాయులు, వైద్యులను అసంఖ్యాకంగా నియమించి, పల్లెల్లో వెలుగులు పూయించారు. విద్యుత్, రోడ్ల సౌకర్యాలు కలిపించడంలో పురోగతి సాధించారు. మహిళలలో అక్షరాస్యతను పెంచడంలో కీలక భూమిక పోషించారు. బీహారీల సగటు ఆదాయాన్ని రెట్టింపు చెయ్యడంలో కృతకృత్యులయ్యారు. ఒకప్పటి రౌడీ రాజ్యాన్ని అణగదొక్కి,శాంతియుత పాలన అందించడానికి తన స్థాయిలో సాధ్యమైనంత మేరకు కృషి చేశారు. ఇవన్నీ నితీశ్ విజయగాథలు, సుపరిపాలనా పార్శ్వాలు. అధికారం నిలబెట్టుకోడానికి తరచూ సంబంధాలు మార్చుకొని, నైతికతకు మైనస్ మార్కులు తెచ్చుకున్నారు. సుదీర్ఘంగా 15 ఏళ్ళు పాలించి, ప్రజలకు ముఖం మొత్తేట్టు చేసుకున్నారు. పరిపాలనపై వ్యతిరేకత తెచ్చుకున్నారు. కరోనా కాలంలో వలస కార్మికుల విషయంలో ఘోరంగా విఫలమై చెడ్డపేరు మూట గట్టుకున్నారు. లక్షలాది మంది ఉపాధి నేడు ప్రశ్నార్థకంగా మారింది. 10లక్షల ఉద్యోగాల కల్పన అంటూ, తాజా ఎన్నికల్లో ఎదుర్కొన్న సవాల్ ను స్వీకరించి, ఆచరణలో నియామకాలు సాగిస్తేనే ప్రజల్లో మళ్ళీ విశ్వాసం పెరుగుతుంది. ప్రస్తుతం జేడీయు తెచ్చుకున్న ఫలితాలను చూస్తే, ముఖ్యమంత్రి పదవిలో నితీశ్ ఉన్నప్పటికీ, బీజేపీ ఆధిక్యమే రాజ్యమేలే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే యువత, మహిళల్లో నితీశ్ ప్రాముఖ్యత కోల్పోయారు. అదే సమయంలో, తేజస్వీ యాదవ్ కు ఈ వర్గాల నుండి మంచి మద్దతు వచ్చింది. నితీశ్ కు ప్రతిపక్షమైన ఆర్‌జేడీ తో పాటు, బీజేపీ కూడా పక్కలో బల్లెంగానే ఉన్నాయి. జేడీయు సభ్యులంతా అదే పార్టీలో కొనసాగుతారా, బీజేపీలోకి జంప్ అవుతారా చెప్పలేం. అలాగే, కాంగ్రెస్ అభ్యర్థులు కూడా బీజేపీ వైపు గోడ దూకే అవకాశాలు లేకపోలేదు.



రాజకీయపరమైన సవాళ్లతో పాటు, రాష్ట్ర అభివృద్ధిలోనూ అనేక సవాళ్లు ఎదురుగా కనిపిస్తున్నాయి. కరోనా ప్రభావంతో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై పోయింది. రైతాంగం, కార్మికుల సమస్యలతో పాటు పరిశ్రమల పునర్నిర్మాణ అంశాలు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయి. యువతకు ఉద్యోగ కల్పన కూడా పెద్ద సవాలే. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది కాబట్టి, ఢిల్లీ నుండి ప్రోత్సాహం ఆశించిన స్థాయిలో ఉండవచ్చు. అదే సమయంలో, బలాన్ని పెంచుకున్న బీజేపీకి, రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకోవాలనే ఆలోచన కూడా బలంగా ఉంటుంది. పదవి కోసం సంకీర్ణాలను పలు రకాలుగా మార్చుకున్న నితీశ్ పై బీజేపీ అధిష్ఠానానికి ఏ మేరకు విశ్వాసం ఉంటుందన్న విషయం కూడా ఆలోచించాల్సిన అంశమే.ఏది ఏమైనా, నితీశ్ కుమార్ మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యారు.ఐదు సంవత్సరాల పాటు సంపూర్ణంగా పదవిలో కొనసాగితే అద్భుతమేనని చెప్పాలి.ఒక వేళ, ఈలోపే ముఖ్యమంత్రి పదవి నుండి దిగిపోతే, కేంద్ర మంత్రి పదవిని కేటాయించి, బీజేపీ నైతికతను చాటుకునే అంశాన్ని కొట్టిపారేయలేం. సమర్ధవంతమైన, సుపరిపాలన అందించి, నితీశ్ కుమార్ తను దక్కించుకున్న “సుశాన్ బాబు” అనే పేరును నిలబెట్టుకుంటారని ఆశిద్దాం.

❖ ❖ ❖

ఎవరు గుణపాఠం నేర్చుకోవాలి

రాంబాబు బంటుమిల్లి, M.A(Eng),M.A(Edn),M.A(Eco),M.Ed.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్ (EVM) ల టాంపరింగ్ బీజేపీని గెలిపించిందా?

లేక ఒకే భావాజాలం కల్గిన బహుజన విపక్ష పార్టీల అనైక్యతే బీజేపీని గెలిపించిందా? మీరే చెప్పండి. ఎవరు గుణపాఠం నేర్చుకోవాలి.

శూద్ర, బహుజనపార్టీలైన ఆర్‌జేడీ, ఎల్‌జేపీ, బీఎస్‌పి, ఎస్‌పీ లో అనైక్యతే బీజేపీ గెలుపుకు కారణం. ఈ నాలుగు పార్టీలు యాదవ్,చమార్ నాయకుల ఆద్యక్షుల చేతిలో నడుస్తున్నప్పటికీ, బీజేపీ కూటమి కంటే 10శాతం అధిక ఓట్లు సాధించినా అధికారం చేపట్టలేకపోయాయి. దీనినుండి రాబోయే రోజుల్లో ఎంతో నేర్చుకోవాలి. విచిత్రం ఏంటంటే ఇవన్నీ బీజేపీకి వ్యతిరేకంగానే పోటీ చేసాయి. కానీ వేరువేరుగా ఉండటం వలన అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయాయి.

10 నవంబర్2020 న వెలువడిన బీహార్ అసెంబ్లీ ఎలక్షన్ ఫలితాలు,మరియు దేశవ్యాప్తంగా ఉప ఎన్నికల ఫలితాలు గమనిస్తే బీజేపీ దాని మిత్ర పక్షాలు పొందిన ఓట్లు కేవలం ఎన్డీఏ 36.1

బీజేపీ-15.64 బ్రాహ్మణ పార్టీ

జేడీయు -20.46 బ్రాహ్మణ పార్టీ

మొత్తం-36.1శాతం.

1. ఆర్‌జేడీ -23.45% యాదవ్ పార్టీ
2. ఎల్‌జేపీ - 11.09% చమార్ పార్టీ
3. బీఎస్‌పీ- 4.17% చమార్ పార్టీ
4. ఎస్‌పీ - 2.52% యాదవ్ పార్టీ

మొత్తం- 41.23%

ఇవిగాక మిగతా పార్టీలు గెలుచుకున్న ఓట్ల శాతం

సిపిఐ -2.08 %

సిపిఐ ఎం -2.37%

ఐఎన్‌సి-6.09%

MIM- 1.57%

Indp -10.26

22.36%

మొత్తం బీజేపీ యేతర పార్టీలు గెలుచుకున్న ఓట్ల శాతం 62.1%.

ఇక నాలుగు బహుజన పార్టీలు ఆర్‌జేడీ, ఎల్‌జేపీ, బీఎస్‌పి, ఎస్‌పీ ఒకే భావాజాలం కల్గిన పార్టీలు. ఈ నాలుగు పార్టీలు ఏకం అయితే BJP,CONGRESS,JDU వంటి బ్రాహ్మణ పార్టీలను అతి సునాయాసంగా ఓడించగలవు, విజయం నల్లేరు మీద నడకే అయిఉండేది. కానీ ఈ నాలుగు పార్టీలు నాలుగు దిక్కులా నిలిచాయి. అందుకే తక్కువ ఓట్లు వచ్చినా బీజేపీ గెలిచింది, ఎక్కువ ఓట్లు వచ్చినా మిగతా పార్టీలవారు ఓట్లచీలికతో అపజయం పాలయ్యారు.

దేశంలో బీజేపీ గెలిచిన కొన్ని నియోజకవర్గాల్లో చూస్తే కేవలం ఓట్లు చీలిక వలనే తక్కువ ఓట్లు వచ్చినా బీజేపీ గెలిచింది. బీజేపీ గెలిచినా కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితి సమీక్షిద్దాం.

1. ఉత్తర ప్రదేశ్ బులంద్ షహార్

మొత్తం ఓట్లు-2,02,353

బీజేపీ - 86879

మిగతా బహుజన పార్టీలు పొందిన ఓట్లు - 1,15,474

అందులో BSP-62984,AZADPARTY-13402,RLD-7132

2. దుబ్బాక

మొత్తం ఓట్లు-164669

BJP- 62984

మిగతా పార్టీల ఓట్లు-101685

TRS- 61553

CONG-22054

INDP-3510

3. మధ్యప్రదేశ్, ఫోహారి

మొత్తం ఓట్లు- 169147

BJP-66001

మిగతావారు-1,03,146

BSP-043747

CONGRESS-42435

4. బీహార్-ఆలంనగర్

మొత్తం ఓట్లు-2,12,829

బీజేపీ - 1,02,335

మిగతా పార్టీలు-1,10,494

RJD -73240

LJP -9263

JAP -8457

RLS -4595

JJP -3053

5. బీహార్,ఆరా

మొత్తం ఓట్లు- 1,59,332

BJP - 70355

మిగతా పార్టీలు-88977

CPM -67250

LJP -4280

IND-2983

6. బీహార్,బచ్చ్వారా

మొత్తం ఓట్లు-1,81,192

బీజేపీ - 54545

మిగతా పార్టీలు- 1,26,647

CPI-53808

INDP -39648

BSP -1086

ఇలా ప్రతీ చోటా బీజేపీ దాని మిత్రపక్షాల ఓట్లకంటే మిగతా పార్టీలు పొందిన ఓట్లే అధికంగా ఉన్నాయి.

రామ్ విలాస్ పాశ్వాన్ పార్టీ LJP మొత్తం 137సీట్లలో పోటి చేసి ఒకచోట గెలిచి ,ఇంట్లో చీలికతేవటంతో మొత్తం 76మంది RJD, కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కారణం అయ్యింది. ఇది బీజేపీకి బాగా కలిసి రాగా, RJD కి తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఒకవిధంగా చెప్పాలంటే RJD కూటమి పరాజయానికి ప్రత్యక్షంగా కారణం, ఇది షెడ్యూల్ కులాల ఓట్లు చీల్చడానికి బీజేపీ ఎత్తుగడలో భాగమేనని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం

ఈ ఎన్నికల్లో నాలుగు బహుజన పార్టీలు వాటిమధ్య సయోధ్య లేకనే అధిక ఓట్లు సాధించి కూడా అధికారానికి దూరమైనాయి.

నితీష్ కుమార్ పై, విపరీతమైన వ్యతిరేకత ఉన్నప్పటికీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో దానిని మిగతా పార్టీలు వేరువేరు కుంపట్లు వలన ఓట్లు చీలిపోయి తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నంలో చతికిలపడ్డాయి.

ఇక రాబోయే రోజుల్లో అయినా బావసారుప్యం కలిగిన బహుజన పార్టీలు ఒకటై విజయం సాధించాలని ఆశిద్దాం.

వీరనారి "మణికర్ణిక".. లక్ష్మీభాయి...

ఎన్. విజయలక్ష్మి

ఆమె ఓ గొప్ప స్వాతంత్ర్య సమరయోధురాలు. శత్రుసైనికులకు ఎదురొడ్డి వెళ్లిన యోధురాలు. యుద్ధ యోధురాలిగా దుష్ట దౌర్జన్య, దురాగత, ఆంగ్లేయుల పాలనకు చరమగీతం పాడిన వీర నారీమణి. ఆమె అబల కాదు సబల అని నిరూపించిన అద్భుత శక్తియుక్తులు కలిగిన వీరనారీమణి. కోట్లాదిమంది భారత జనుల గుండెల్లో ప్రేరణజ్వాలలు ప్రసరింపజేసిన ఒక దివ్యజ్యోతి. కొవొత్తిలాతాను కరిగిపోయన్నాకుడ తన మీద అధారపడిన ప్రజల మనసుల్లో జ్యోతులు ప్రసరింపజేసిన ఓ గొప్ప వజ్రపుతునక. నేటి తరం మహిళలకు ఓ గొప్ప రోల్‌మోడల్. 1928 నవంబరు 19న మహారాష్ట్రలోని వారణాసి పట్టణంలోని సతరాలో మోరోసంత్‌తాంబె, భగీరథీబాయి ఆదర్శదంపతులు ఇంట భారతమాత ముద్దుబిడ్డగా జన్మించింది. ఆమె అసలుపేరు మణికర్ణిక. తండ్రి ప్రేమగా మను అని పిలిచుకొనేవారు. మణికర్ణిక 4సం. వయస్సులో తల్లి చనిపోయింది. ఇలాంటి కష్ట సమయంలో వీరి దూరపు బంధువు వీరిద్దరికి ఆ శ్రమమిచ్చి ఆదుకున్నారు.

చిన్నతనంనుంచి రకరకాల విద్యలమీద ఆశక్తి కనబరిచేది. దాంతో తండ్రి కత్తి సాము, గుర్రపుస్వారి, తుపాకి పేల్చడం లాంటి విద్యలన్నింటిని నేర్పించాడు. ఆమెకు 13 ఏళ్లకే ఝాన్సీ పట్టణానికి చెందిన, గంగధరరావు నెవల్కశతో 1942లో వివాహం జరిగింది. తరువాత ఝాన్సీలక్ష్మిబాయిగా మారిపోయింది. వీరికి కుమారుడు పుట్టి చనిపోవడంతో దామోదరరావును దత్తత తీసుకున్నారు.

కొద్దిరోజులకే గంగాధరరావు చనిపోయారు.

దీంతో లక్ష్మిబాయి బాధల్ని దిగమింగు కొని విలువిద్యాల్లో మరింత ప్రావీణ్యం సంపాదించి ఆ విద్యాలన్ని తన సన్నిహితు లకినేర్పించి పటిష్టమైన స్త్రీ, పురుష దళాల్ని తయారు చేసింది.

కొడుకు రాజవ్వాలని కోర్టులో దావావేసింది.

కాని కోర్టు కేసుకొట్టివేసింది. లక్ష్మి బాయి కోర్టుకు వెళ్లిందనే కక్షతో బ్రిటిష్‌వారు ఆమె ఆస్తులన్నీ స్వాధీన పరచుకున్నారు. అంతే కాకుండా ఆమెను ఝాన్సీ విడిచివెళ్లమని ఆదేశాలు జారీచేశారు. ఆమె తన ప్రజలకోసం భారతభూమి కోసం బ్రిటీష్ వారి సుంకలాల నుంచి భారతమాతను రక్షించడంకోసం ఝాన్సీని విడిచివెళ్లేదీలేదని వారితో యుద్ధానికి సిద్ధపడింది. ఆమె తన బలగాలను చుట్టు ఏర్పచుకొని బ్రిటిష్‌వారితో చాలా భయంకరంగా యుద్ధం చేసింది. ఈ వీరనారికి సహాయంగా తాంత్యతోపే 20000ల మంది సైన్యంతో వచ్చి యుద్ధానికి తలపడ్డాడు. కాని బ్రిటిష్ సైన్యం ముందు ఝాన్సీరాణి లక్ష్మీ బాయి బలగాలు బలహీనమవ్వడంతో నగరాన్ని చేజిక్కించుకున్నారు. బ్రిటిష్‌వారు కోటగడలను బద్దలుకొట్టి నగరాన్ని చేజిక్కించుకున్నారు. కాని రాణిఝాన్సీ దత్తపుత్రుణ్ణి వీపునకు కట్టుకొని గుర్రపుస్వారీ చేస్తూ గ్వాలియర్ చేరుకొని అక్కడ అపార చండిలా గ్వాలియర్ మహారాజుతో యుద్ధం ఏసి గ్వాలియర్‌ను స్వాధీనం చేసుకొంది.

ఈ సంతోషంలో వుంగానే మళ్లీ బ్రిటీష్ సేలు వచ్చి గ్వాలియర్‌ను ముట్టడించారు. లక్ష్మీబాయి వారితో కాళీమాతలా తలపడి యుద్ధం చేసింది. కాని 17, జూన్ 1858న యుద్ధంలో వీరమరణం పొందింది. ఇలా అతి చిన్న వయసు లో తన బుద్ధికాశలతతో వీరసాహసంతో ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నమై జాతికి వన్నెతెచ్చింది. భారతదేశ రక్షణకోసం తన జీవితాని బలిదానం చేసి మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచిన పవిత్రమూర్తి భారతరత్నం ఝాన్సీరాణి లక్ష్మీబాయి.



ఎర్రెర్రని జెండాకు "వంద"నం...

డా॥ మైథిలి

చరిత్ర నిరూపించిన సత్యానికి అక్షరరూపమిది. ప్రపంచ చరిత్రలో ఎందరెందరో మహారాజులూ, సామ్రాట్టులూ హంగు దర్పాలతో అలరారుతున్న అధునాతన పాలకవర్గ నేతలూ ఎవరూ ఇవ్వని విశ్వాసమిచ్చిన, చైతన్యం నింపిన మహత్తర సిద్ధాంతం ఆచరణల సమతా సమరానికి ప్రతీకగా నిలిచిన వందేండ్ల ప్రస్థానం సంస్మరించుకుంటోంది భారతదేశం. ఇలాంటి సమయంలో కూడా కమ్యూనిస్టు ఉద్యమ ఔన్నత్యానికి జేజేలు పలికేబదులు శాపనార్థాలు పెట్టేందుకు, దీనాలాపనలు చేసేందుకు కొందరు సిద్ధమవుతున్నారు. "వందేండ్ల వర్గ పోరాట వక్రీభవనం"గా తేల్చిపారేస్తున్నారు. వేల సంవత్సరాలలో ఘనీభవించిన దోపిడీ వర్గాల శక్తియుక్తులనూ అపారంగా వారికి అందుబాటులో ఉన్న భౌతిక బౌద్ధిక వనరులనూ ప్రత్యక్ష ప్రభుత్వ యంత్రాంగాన్నీ ప్రచార యంత్రాన్నీ గమనించకుండా భారతదేశంలోని కమ్యూనిస్టు పార్టీలూ బృందాలూ అన్నీ విఫలమైపోయాయని తేల్చిపారేస్తున్నారు. మరో వంక సామ్రాజ్యవాద ప్రపంచనేతగా ఉన్న అమెరికా అధ్యక్షుల వారికి తన ఎన్నికల ప్రత్యర్థి కమలాహారిస్ కమ్యూనిస్టుగా కనిపిస్తున్నది. భారతీయ ట్రంప్ లాంటి నరేంద్ర మోడీకి జేఎన్‌యూలో, హెచ్‌సీయూలో, కరోనాతో కదలిన వలస కార్మికుల అలజడిలో, సీఏఏపై ఎలుగెత్తిన షహీన్‌బాగ్, నిరసనలో ప్రతిచోటా కమ్యూనిస్టులే కనిపిస్తున్నారు. మార్క్సిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నుంచి మావోయిస్టుల వరకూ అందరూ జాతి ద్రోహులుగా అగుపిస్తున్నారు. వందేండ్లనాడు భారత కమ్యూనిస్టు ఉద్యమ బీజోపవాసన చేసిన తొట్టతొలితరం యోధులపై మీరట్, కాన్పూర్ కుట్రకేసులు పెడితే ఇప్పుడు కూడా షహీన్‌బాగ్ భీమా కొరెగావ్ ఆఖరుకు హత్రాస్ ప్రతిచోట ప్రతీఘాత శక్తులకు ఇదే ప్రత్యామ్నాయ చైతన్యం భయం గొల్పుతున్నది. ఈనాడు యూరప్‌ను ఒక భూతం భయపెడుతున్నది అన్న కమ్యూనిస్టు ప్రణాళికలోని ప్రారంభ వాక్యాలు ఇప్పటి పాలకవర్గాలకూ అచ్చుగుద్దినట్టు సరిపోతున్నాయి. ముప్పై ఏండ్ల కిందట సోవియట్ విచ్ఛిన్నం తర్వాత ప్రతికూల పరిణామాలు ఉద్యమాభిమానులకు ఎంత బాధాకరమైనప్పటికీ భూతాన్ని సీసాలో బంధించడం మాత్రం జాతీయ అంతర్జాతీయ పాలకవర్గాల తరం కాలేదు. వడలని సంకల్పంతో సమరం సాగుతూనే ఉంది. వాస్తవాలను ఆకళింపు చేసుకుంటూ తప్పొప్పులు దిద్దుకుంటూ పునఃప్రస్థానం చేస్తూనే ఉంది.

> ఎరుపులోనె మెరుపుంది
> పోరాడే శక్తుంది
> శ్రమజీవుల హక్కులకై
> ఎలుగెత్తే బలముంది!

పాక్షికత్వంతో పరాచకాలు

వామపక్ష పదజాలం వల్లించే కొందరు విమర్శకులు ఈ మొత్తం పరిస్థితి గమనిస్తున్నారా అని సందేహం కలుగుతుంది. అధ్యయనంతో రచనలతో తలపండిన రచయితలకు రచయిత్రులకు కూడా కమ్యూనిస్టుల వైఫల్యాలే కనిపిస్తున్నాయి. మార్క్స్, ఏంగెల్సులు అంత సూటిగా రాస్తే ఈ పార్టీల నాయకులు ఎందుకు పట్టుకోలేకపోయారని పడకకుర్చీలలో కూచుని లేదా ఇంటర్‌నెట్‌లో శోధిస్తూ కొందరు తెగ ఇదై పోతున్నారు. ఇంతా చేసి ఈ వందేండ్లలో పాలకవర్గాల పన్నాగాలనూ. కమ్యూనిస్టులు ఎదుర్కొన్న ఘోర నిర్బంధాన్నీ చేసిన బలిదానాలనూ అవగాహనలో ఆచరణలో సైద్ధాంతిక నిర్మాణ సమస్యలనూ లోతుగా పరిశీలించే ఓపిక ఉంటుందా అదీ నాస్తి. ఈ వందేండ్లలోనూ కమ్యూనిస్టులు ముళ్లదారిలో నడిచారే గాని పూలబాటలో పయనించలేదని గుర్తించలేకపోవడం, పూల పొదల మాటునుంచి కాలసర్పాలు వారిని ఎన్నిసార్లు కాటేశాయో ఇంకా వేస్తూనే ఉన్నాయో అర్థం కాకపోవడం ఈ ఆరోపణలకూ ఆవేదనలకూ అసలు కారణం. విజ్ఞానశాస్త్రంలో ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారం వక్రీభవనం అంటే ఏంటో తెలుసు. ఒక వాహకం లోంచి మరోదానిలోకి మారినప్పుడు అంటే గాలిలోంచి నీటిలోకి మారినప్పుడు కాంతి గమనం నెమ్మదించి వంగినట్టుగా కనిపిస్తుంది. అంతేగాని ఆగదు. అలాగే దేశంలో ప్రపంచంలో పరిస్థితులు, వర్గశక్తుల బలాబలాల పొందికలు మారినప్పుడు రాజకీయ గమనంలో హెచ్చుతగ్గులుంటాయి. సామాజిక శాస్త్రం కూడా అయిన మార్క్సిజాన్ని ఆచరణలో అమలు చేసి అపూర్వమైన మార్పులు తెచ్చిన కమ్యూనిస్టుల పాత్రనూ దృష్టి దోషాలతో చూస్తే అలాగే వుంటుంది. వందేండ్లలో ప్రపంచమంతా మార్చలేకపోగా బలహీనమవడం కమ్యూనిస్టుల స్వయం కృతాపరాధమైనట్టు గోచరిస్తుంటుంది. చరిత్రను సరిగా చూడకపోబట్టి చారిత్రిక తప్పిదాలు అన్న మాట పరాచకంగా మారిపోతుంటుంది. అలాంటి వారు శత్రుశిబిరానికి చెందినవారైతే ముఖం వాచేలా సమాధానం చెప్పడం, మిత్రబృందంలో వారైతే సహనంతో తెలియజెప్పడం మాత్రమే మార్గం.

యథాస్థితికి కంచుకోటలే!

కమ్యూనిస్టేతర శక్తులేవీ సైద్ధాంతికంగా ఈ వ్యవస్థను మార్చే లక్ష్యం ఉన్నవి కావు. అంటే దానితో ముడిపడిన అసమానతలూ వివక్షతలూ దోపిడీ పీడన కొత్త రూపాలలో కొనసాగించేవే గాని తుదముట్టించేవి కావు. మహా అయితే కొన్ని సంక్షేమ పథకాలతో సరిపెట్టి అంతకు పదింతల సంపదలు శతసహస్ర కోటీశ్వరులకు ధారాదత్తం చేస్తూనే ఉంటాయి. ఆరేండ్ల మోడీ పాలనలో అయిదురెట్లు పెరిగిన ముఖేష్ అంబానీ ఆస్తి, మూడు రెట్లు పెరిగిన గౌతం అదానీ ఆస్తులూ, వంద రెట్లు పెరిగిన మత విద్వేషాలూ కులాల వివక్షలూ, ట్రంప్ కంపు వ్యవహారాలూ కనిపిస్తూనే ఉన్నాయి. వీటిపై నికరంగా నిశ్చలంగా విమర్శ చేస్తున్నదీ వీరోచితంగా పోరాడుతున్నదీ ప్రగతిశీల శక్తులు తప్ప గొప్పలు పోయే పాలకవర్గాలు కాదు. అయితే లెనిన్ అన్నట్టు కార్మికవర్గ పోరాటంలో అతి భీకరమైన భాగం సైద్ధాంతిక రంగంలో జరుగుతుంది. సోషల్ మీడియా వ్యాప్తి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్), బీజేపీలు దాన్ని విషప్రచార సాధనంగా మార్చుకోవడం జరిగాక అనుక్షణం అసంఖ్యాక కథనాలు చెలరేగిపోతున్నాయి. ప్రత్యక్ష అణచివేతలూ చెలరేగిపోతున్నాయి. భారతీయ సమర క్షేత్రంలో అరుణపతాకానికి వందేండ్ల వందనం సమర్పించేప్పుడు ఈ శక్తులను పసిగట్టి పనిపట్టడానికి పటిష్టమైన యోచనలూ ఆచరణా తప్పనిసరి. ఉద్యమంలో కదం తొక్కే అరుణసైన్యానికి అండగా అశేషమైన అభిమానులూ శ్రేయోభిలాషులూ వాటిని గమనిస్తూనే ఉన్నారు గనక నిరంతర తోడ్పాటు కొనసాగిస్తున్నారు. ఎర్రజండా అండనే పోరాటాలు సాధ్యమని శ్రమజీవులూ నిరుపేదలూ నమ్ముతున్నారు. ఎవరో కవి అన్నట్టు 'పీడితులు తాడితులు కార్మికులు కర్షకులు నీ నీడనే నేడు నిలిచివున్నారే.. నిన్ను నమ్ముకున్న వారు బతుకుతున్నారే.. నీకు సాటెవ్వరే సమతా పతాకా'అని పాడుతూనే ఉన్నారు. మరింత గట్టిగా పోరాడాలని కమ్యూనిస్టులపై వీరుచేసే ఫిర్యాదు వాస్తవానికి వారి గౌరవాన్ని నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగం, దాన్ని కాపాడటానికి మత మార్కెట్ శక్తులు కలసి తీసుకొచ్చిన జాతి మత చాందసశక్తుల స్వైరవిహారం

ఆందోళనకరమే. కాని కమ్యూనిస్టులు ఈ పరిస్థితికి దీటుగా తమను తాము మల్చుకోవడం మార్చుకోవడం క్షణాల మీద జరిగిపోదు. వర్గ సమరం సాగిస్తూ అంతర్గత దిద్దుబాట్లు చేసుకోవడానికి ఈ శతవార్షిక సందర్భమే సరైంది. వర్గపోరాటంలో సిద్ధాంతాన్ని మించిన ఆయుధం లేదన్నట్టే ఐక్యతను మించిన పునాది కూడా ఉండదు. ఈ రెంటినీ మేళవించే నవయుగ సైనికుల పతాకమే అరుణ పతాకం.

సీపీఐ(ఎం) విలక్షణ పాత్ర

ప్రపంచంలో చాలా దేశాలతో పోలిస్తే భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర చాలా సుదీర్ఘమైనది. ప్రభావశీలమైనది కూడా. అనేకసార్లు సరైన దిశానిర్దేశం చేసింది. ప్రజాచైతన్యం పెంచింది. కేవలం గతం ఘనతనే కీర్తించే ఈ పుణ్యభూమిలో నవచైతన్యాంకురాలు నాటింది. ప్రత్యామ్నాయ ప్రజాసాహిత్య సంస్కృతులను సృజించడమే కాదు. ఉద్యమాలలో, పాలనలో కూడా ఆ శక్తుల నమూనాను చూపించింది. వామపక్ష శిబిరంలో అన్ని స్రవంతులనూ విచక్షణా రహితంగా ఈసడించే సిద్ధాంత కోవిదుల మాట ఎలా ఉన్నా ఆ మౌలిక భావనలను సజీవంగా ఉంచడానికి ప్రధానమైన వామపక్షంగా సీపీఐ(ఎం) చొరవ చూపింది. 1998లో మార్క్స్ 125వ వర్ధంతిని దేశ దేశాల కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల సమ్మేళనంతో జరిపి చెల్లాచెదురుగా ఉన్న... విప్లవకర శక్తులకు కొత్త ఊపిరిలూదింది. పదవులలోకి రావడమే విజయమనుకుంటే సీపీఐ(ఎం) నేత పాతికేండ్ల కిందటే భారత ప్రధాని అయివుండేవారని మర్చిపోరాదు. సరళీకరణ గరళీకరణగా మారుతున్న తీరును చెప్పి దేశవ్యాపితంగా కోట్లాది మంది కార్మికులను సమరపథంలో నడిపిస్తున్న తీరుకు రేపు నవంబర్‌లో జరిగే సమ్మె కూడా సంకేతం కానుంది. ఇటీవల వక్రమార్గాలతో పార్లమెంటులో ఆమోదించుకున్న రైతు వ్యతిరేక బిల్లులపై పోరాటం జరుగుతూనేవుంది. హత్రాస్‌లో అమానుషంగా బలైన యువతి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన సీపీఐ(ఎం), ఐద్వా బృందంతో ఆ గృహస్తుడు తాను కార్మిక సంఘంలో పనిచేశాననీ కమ్యూనిస్టులే ప్రజల కోసం నిలబడతారనీ చెప్పడం ఈ దేశంలో కమ్యూనిస్టులు విత్తిన చైతన్యానికి ఒక నిదర్శనం.

ఎర్రబావుటా నిగనిగలు

పిడుక్కు బియ్యానికి ఒకటే మంత్రం అన్నట్టు తీరి కూర్చుని తిట్టేవాళ్లు తిట్టవచ్చుగాక. తిన్నది అరగని పాలకవర్గ ప్రవక్తలు శాపనార్థాలు పెట్టవచ్చుగాక. ఎక్కడికీ తృప్తిలేక ఇంకా ఇంకా సంపదల కోసం వెంపర్లాడే ధనస్వామ్య భూస్వామ్య అభివృద్ధి నిరోధక శక్తులు సామదానభేద దండోపాయాలను ప్రయోగించవచ్చుగాక. ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ మతాన్ని గతాన్ని కూడా తోడు తెచ్చుకుని నిలవాలని పాచికలు వేయొచ్చుగాక... ఇవన్నీ ఎన్నో చూసిన తర్వాత కూడా ఎర్రజెండా పైపైకి ఎగురుతూనే ఉంది. ఉంటుంది. కనబడలేదా మరో ప్రపంచపు అగ్నికిరీటపు ధగధగలు ఎర్రబావుటా నిగనిగలు అని ప్రశ్నిస్తూనే ఉంది. ముళ్లూ రాళ్లూ అవాంతరాలు ఎన్ని ఉన్నా ముందుదారి మాదే మాదే అనిప్రకటిస్తోంది. వక్రీభవనం కాంతి మార్గాన్ని తప్పుగా చూపిస్తుందేగాని గమనాన్ని ఆపలేదన్న శాస్త్రీయ సూత్రాన్ని పునరుద్ఘాటిస్తోంది.

❖ ❖ ❖

సంపన్నుల పెళ్లిళ్లతో స్టార్ హోటళ్లు బిజీ!

ప్రజామీడియా నెట్‌వర్క్ సౌజన్యంతో

సీత కష్టాలు సీతవి. పీత కష్టాలు పీతవి. కరోనా కొట్టిన దెబ్బ, భాషలో చెప్పలేనంత పెద్దది. విషపు ముళ్ల బంతి కరోనా చేసిన ఈ గాయం ఎప్పటికి మానుతుందో కూడా తెలియడం లేదు. భారతదేశంలో అత్యంత సంపన్నులు కొద్ది మందే ఉంటారు. కానీ వారిదగ్గర పోగయిన సంపద పది పదిహేను దేశాల వార్షిక బడ్జెట్ కంటే ఎక్కువగా ఉంటుంది. అది వారి కష్టార్జితం. తినీ తినక, ఎండనక వాననక రిక్షాలు తొక్కి తొక్కి రెండు మూడు లక్షల కోట్లు వెనకేసుకుని ఉంటారు. అది వారి చెమటలో నుండి పుట్టిన స్వేదజనిత సంపద. దానికి మనం అసూయపడితే వారి పూచీ ఏమీ ఉండదు. దానికి మనం బాధపడితే మన ఆరోగ్యాలే పాడవుతాయి. అప్పుడు కూడా వారి పూచీ ఏమీ ఉండదు. అదే వారి సంపదకు మనం పొంగిపోతే వారికి మనకు ఉభయారోగ్యం. ఆరోగ్యమే మనకు మహాభాగ్యం!

మొదటి నుండి లక్ష్మీదేవి డబ్బున్నవారి దగ్గరే ఎక్కువ కంఫర్టబుల్ గా ఉండి, అక్కడే ఎక్కువ టైమ్ ఉండిపోతున్నట్లుంది. అది ఆ మహా తల్లి సర్వం సహా అధికారం. మనం ప్రశ్నించడానికి వీల్లేనిది. సాధారణంగా బాగా డబ్బున్నవారు విదేశీ వాచి పెట్టుకోవాలి. విదేశీ కారు వాడాలి. విదేశీ సెంటు కొట్టుకోవాలి. విదేశీ కళ్లజోడుతోనే స్వదేశాన్ని చూడాలి. దేశీయ భాషలను విదేశీ యాసతోనే మాట్లాడాలి. విదేశీ తిండి తినాలి. మొత్తంగా విధిలేక స్వదేశంలో ఉంటూ- ఎప్పుడూ విదేహంగా దేశంతో డిటాచ్ అయి ఉండాలి. పెళ్లికి పేరంటానికి లండన్, దుబాయ్, మారిషస్, ఇటలీ, స్విట్జర్లాండ్ లాంటి దూర దూర దేశాలకు సొంత విమానాల రెక్కలు కట్టుకుని ఎగిరిపోవాలి. మన ఊరి అవుటర్ రింగ్ రోడ్డు పక్కన ఫంక్షన్ హాల్లో పెళ్లి చేస్తే- వారు రాకూడదని మనసులో కోరుకునేవారందరు రానే వస్తారు.

అదే స్విస్ ఆల్ఫ్స్ పర్వతం మంచు కొండమీద ఎముకలు కొరికే చలిలో



మంటల నెగళ్ల మధ్య మూడు ముళ్ల డెస్టినేషన్ వేడుక చేస్తే- వారు ఎవరు రావాలనుకుంటారో వారు మాత్రమే వస్తారు. ఎవరి అభిరుచులు వారివి. వారి జేబులో డబ్బు వారిష్టం. కనీసం ఆ పెద్ద పెళ్లేదో ఇక్కడ చేస్తే మేళతాళాలు, పూల డెకరేషన్ వాళ్లు, వంటలవాళ్లు, ఇంకెన్నో ఈవెంట్ల వాళ్లు వేల, లక్షల మందికి పట్టెడన్నం దొరుకుతుంది కదా? అన్నది సమసమాజ నిర్మాణ ఆదర్శమే కానీ- తప్పనిసరి కాదు.

కరోనావల్ల దేశంలో అత్యంత సంపన్నులు విదేశాలకు వెళ్లి డెస్టినేషన్ వెడ్డింగ్ లు చేసుకునే అవకాశం లేక- విధిలేక, బరువెక్కిన గుండెతో ఇండియాలోనే సెవెన్ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లలో పెళ్లిళ్లు చేసుకోవాల్సివస్తోంది. దాంతో ఢిల్లీ, బాంబే, కలకత్తా, చెన్నయ్, హైదరాబాద్, గోవాతో పాటు అన్ని స్టార్ హోటళ్లు అడ్వాన్సుగా బుక్ అయి ఉన్నాయి.

అయ్యా! బడాబాబులూ!
జరగాలి మీ ఇళ్లల్లో పెళ్లి మళ్లీ మళ్లీ!
ఆ పెళ్లిళ్లు చూసి లోకం కళ్లింత చేసుకోవాలి కుళ్లి కుళ్లి!

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు పెరుగుతున్న ఆదరణ

ఎన్.హేమంత్

కోవిడ్-19 విజృంభనతో విశ్వమానవాళి జీవనశైలిలో అవాంఛనీయ విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. లాక్‌డౌన్‌లు, సామాజిక దూరాలు, గృహ నిర్బంధాలు లాంటి కరోనా నియమాలను పాటించాల్సిన అగత్యం ఏర్పడింది. ప్రభుత్వ ఆదేశాలతో వర్తక వ్యాపారాలు, సినిమా షూటింగులు, సినిమాహాల్‌లు మూతపడ్డాయి. నిర్మాణంలో ఉన్న సినిమాలు, నూతన సినిమాల షూటింగులు ఆగిపోయాయి. సామాజిక దూరాలను పాటిస్తూ సినిమా హాల్స్ వెంటనే తెరిచే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ఇంట్లోనే కూర్చొని టీవీల్లో ఆన్‌లైన్ ఓటీటీ (ఓవర్ ది టాప్) డిజిటల్ వేదికల్లో సినిమాలు చూడటానికి ప్రజలు అలవాటు పడుతున్నారు. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్, ఆహా, డిజిటల్ మీడియాల్లో (సోషల్ మీడియా) వీడియోలు, సినిమాలు చూడాల్సి వస్తున్నది. ఓటీటీకి లభిస్తున్న ప్రజాదరణను గమనించిన కేంద్రప్రభుత్వ ఐ అండ్ బి మంత్రిత్వశాఖ నవంబర్ 9న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తూ సినిమాలు, దృశ్య శ్రవణ ప్రోగ్రామ్‌లు, వార్తలు, సమకాలీన విశేషాలు లాంటి ఆన్‌లైన్ వీడియో నిర్మాతలకు మార్గదర్శకాలు విడుదల చేసింది. డిజిటల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల రూపకర్తలు పాటించాల్సిన విధి విధానాలను నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. ఇందులో భాగంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 26శాతం వరకు పొందవచ్చునని తెలిపారు. డిజిటల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అవరోధాలు కలిగించదని, స్వేచ్ఛను హరించదని మంత్రిత్వశాఖ తెలియజేసింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్ చిత్రాలకు సెన్సార్ బోర్డ్ సర్టిఫికేట్లు విధిగా తీసుకునేలా విధివిధానాలను (పాలసీ) రూపొందిస్తున్నామని వివరిస్తున్నారు. ప్రింట్, టీవీ, రేడియో ప్రసారాలకు వర్తించే విధానాలే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు వర్తించేలా పాలసీని రూపొందిస్తున్నారు. ఇప్పటికే పలు ఓటీటీ సినిమాలు పలు వివాదాలకు దారితీస్తున్నాయని గుర్తు చేస్తున్నారు. ఇందులో కొంత నిజమున్నా.. ఈ నియంత్రణ పేరుతో కేంద్రం డిజిటల్ మీడియాను తన కనుసన్నలలో బంధించే ప్రయత్నం చేస్తోందంటూ వెల్లువెత్తుతున్న విమర్శలనూ తోసిపుచ్చలేం. ఇదిలా ఉండగా ప్రపంచవ్యాప్తంగా ఓటీటీ మార్కెట్ పెట్టుబడులు 2024 నాటికి 2.9బిలియన్ డాలర్లకు చేరతాయని అంచనా వేస్తున్నారు. గత ఐదేండ్లలో ఓటీటీ వీడియోల వినియోగదారులు 300శాతం పెరగడం జరిగింది. 2019లో ఇండియాలో 10మిలియన్ల వినియోగదారులు 21మిలియన్ వీడియోలకు చందాదారులుగా చేరారు. నేడు భారత్‌లో 40కి పైగా వీడియో ఓటీటీ ప్లేయర్లు ఉన్నారు. 2019లో ఇండియాలో 1,600 గంటల నిడివిగల ఓటీటీ ప్లాట్‌ఫామ్ వీడియోలు నిర్మించారు. జూన్ 2018లో 260 మిలియన్ల వీక్షకులు (20 మిలియన్ నిమిషాలు) ఉండగా జూలై 2019లో 282 మిలియన్ల వీక్షకులకు (90మిలియన్ నిమిషాలు) పెరగడంతో ఓటీటీ వేదికల ప్రాముఖ్యతను గుర్తించవచ్చు. రాబోయే రోజుల్లో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు ఆదరణ



పెరుగుతున్నదని, సినిమా హాల్‌లకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అంటున్నారు. కోవిడ్-19 మేఘాలు తొలగిన తరువాత కూడా ఓటీటీ వినియోగదారులు తగ్గరని, సినిమా హాల్‌కు వెళ్లే వారి సంఖ్య పడిపోవచ్చని అంచనా వేస్తున్నారు. వెంటనే సినిమా హాల్స్ తెరిచినా కరోనా 2వ దశ వ్యాప్తి పెరుగుతుందనే భయంతో ప్రేక్షకుల సంఖ్య పడిపోతుందని సినీవర్గాలు వెల్లడిస్తున్నాయి. కరోనాతో మూతబడిన సినీ థియేటర్లకు ఇంట్లో కూర్చొని చూసే ఓటీటీ ప్లాట్‌ఫామ్ సినిమాలు చక్కటి ప్రత్యామ్నాయం కావడం వీక్షకులకు కొంత ఊరటనిస్తున్నది.



పోలవరం కేంద్రం బాధ్యతే

డి.రాజ్‌కుమార్

గోదావరి, కృష్ణా నదులను అనుసంధానిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఈ ప్రాజెక్ట్ బహుళార్ధ సాధక నీటి పారుదల పథకం. ఇది ఆంధ్రప్రదేశ్ లోని కోట్లాది ప్రజల జీవనాడి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర పునర్విభజనలో భాగంగా చట్టం చేసింది. ఇప్పుడు డబ్బులు లేవంటూ యూ టర్న్ తీసుకుంది. ఇది ఏ మాత్రం న్యాయం కాదు. ఆంధ్రప్రదేశ్ విడిపోయినప్పుడు తెలంగాణ ప్రాంతానికి హైదరాబాద్ వంటి సర్వ వసతులు, ఆదాయ వనరులు కలిగివున్న రాజధాని దక్కింది. ఆంధ్రప్రదేశ్ కు రాజధాని లేదు. ఆదాయం పెద్దగా లేదు. పైగా అప్పులమయం. ఇవ్వన్నీ గుర్తెరిగి పార్లమెంట్ లో అప్పుడు చట్టం చేశారు. ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్ర పెద్దలు మాట ఇచ్చారు. తదనంతర పరిణామాల్లో, ప్రత్యేక ప్యాకేజి పేరుతో ప్రత్యేక హోదా అంశాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకుంది. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజికి తలవగ్గడం వల్లనే కేంద్రం మాట మార్చిందనే విమర్శలు వైసీపీ చేస్తోంది. తాజాగా, ఆర్థిక మంత్రిత్వ శాఖ పోలవరం ప్రాజెక్టు వ్యయాన్ని 20వేల కోట్ల రూపాయలకే కుదిస్తూ, ఆర్థిక సాయం చేయలేమని చేతులెత్తేసింది. ఇది చాలా అన్యాయం. కరోనా వ్యాక్సిన్లు, తదితర అంశాల పేరు చెప్పి, తమ దగ్గర డబ్బులు లేవని కేంద్ర ప్రభుత్వమే చెబితే, ఇక రాష్ట్రాల పరిస్థితి ఏమని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం, ఆదాయ వనరులు అంతంత మాత్రమే ఉన్న రాష్ట్రం. దానికి తోడు, కరోనా, వరదలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. ఇటువంటి తరుణంలో తలపైన పెద్ద కొండవంటి బండను పెడితే, రాష్ట్రం ఏమై పోవాలి. పార్టీల రాజకీయాలు, నేతల అవినీతి ఆరోపణలు అలా ఉంచగా, సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి? రాష్ట్రంలో డబ్బులు లేనేలేవు. ఈ ప్రాజెక్టును భరించే శక్తి అస్సలు లేదు. పోలవరం ప్రాజెక్టులో ఖర్చు స్థూలంగా రెండు రకాలు. (1) ప్రాజెక్టు నిర్మాణ వ్యయం (2)భూసేకరణ, పునరావాస ప్యాకేజిలు మొదలైనవి. ఈ రెండూ కలిపి మొత్తంప్రాజెక్టు ఖర్చుగా అంచనా వెయ్యాలి. ఎప్పుడో 1930–40లోనే సర్ ఆర్థర్ కాటన్ నదుల అనుసంధానం చెయ్యమని సూచించారు. 1941లో అప్పటి ప్రభుత్వ ప్రధాన ఇంజనీర్ దివాన్ బహుద్దర్ ఎల్.వెంకటకృష్ణయ్య అయ్యర్ గోదావరిపై పోలవరం వద్ద జలాశయాన్ని నిర్మించాలని ప్రతిపాదించాడు. 1946–47లో ప్రఖ్యాత ఇంజనీర్ కె ఎల్ రావు "రామ పాద సాగరం" పేరుతో ప్రాజెక్టు నివేదిక ఇచ్చారు. తర్వాత చాలా ఏళ్ళ తర్వాత, అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారు. 2004లో, వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఈ ప్రాజెక్టు పురోగతి ప్రారంభమైంది. 2015లో జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం గుర్తించింది. మెల్లగా ప్రాజెక్టు ప్రారంభమై ప్రస్తుతానికి సుమారు 25–30శాతం పని జరిగింది. డబ్బులు సంపూర్ణంగా అందుబాటులో వుంటే? ఒక సంవత్సర కాలంలో ప్రాజెక్టు సంపూర్ణమవుతుందని ఇంజనీరింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు అంచనాలు వివిధ దశల్లో మార్పులకు

గురయ్యాయి. ప్రారంభంలో 16,716 కోట్లగా ఉంది. 2017-2018 సమయానికి ప్రాజెక్టు వ్యయం 55వేల కోట్లకు పైగా చేరింది

ఇది సవరించిన అంచనా. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర జలసంఘం, టారిఫ్ నిర్ణయించే ఇంజనీరింగ్ కమిటీ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అందరూ ఈ వ్యయాన్ని అంగీకరించారు. తదనుగుణంగా అనుమతులు కూడా వచ్చాయి. ప్రాజెక్టు ప్రారంభంలో అంచనా ఒక రకంగా ఉన్నా, నిర్మాణ క్రమంలో ఖర్చులు మారుతుంటాయి. ఇది చాలా సాధారణమైన అంశం. దీన్ని కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది కాబట్టి, సంపూర్ణంగా కేంద్రం బాధ్యత తీసుకోవాల్సిందే.గత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమయంలో అంచనాలు భారీగా పెంచారని, అనునాయులకే ప్రాజెక్టులు కట్టబెట్టారని, కోట్లాది రూపాయలు చేతులు మారాయని, పెద్ద స్థాయిలో అవినీతి జరిగిందని వై సి పి ఆరోపణలు చేస్తోంది. ఎత్తిపోతల పేరుతోనూ ఇదే తంతు నడిచిందనే విమర్శలు చంద్రబాబు ప్రభుత్వంపైన ఉన్నాయి.అనవసరంగా ఎత్తిపోతల పేరుతో కోట్లాది రూపాయలు వృధా చేశారని, అసలు ఆ డబ్బుతోనే ప్రాజెక్టు పూర్తి చేయవచ్చనే విమర్శలూ ఉన్నాయి.వై సి పి ప్రభుత్వం వచ్చిన తర్వాత, వాళ్ళ అనునాయులకే ప్రాజెక్టులు కేటాయించారని తెలుగుదేశం విమర్శిస్తోంది.ఈ విమర్శలు, రాజకీయాలు పక్కనే పెడితే, పోలవరం ప్రాజెక్టు సత్వరమే పూర్తి కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.గతం ప్రభుత్వం తప్పులు, ఇప్పటి ప్రభుత్వం తప్పులు, కేంద్ర ప్రభుత్వం తప్పులు అంటూ... ఒకరినొకరు తిట్టిపోసుకోవడం వల్ల కాలయాపన తప్ప ప్రజలకు ఎటువంటి ప్రయోజనం వనకూరదు.అవినీతి జరిగివుంటే, విచారణ నిజాయితీగా జరిగితే, దోషులకు తగిన సమయంలో పడాల్సిన శిక్షలు పడతాయి.పడాలి కూడా.అందులో సందేహమే లేదు.ప్రస్తుత అంశం, ప్రాజెక్టు పూర్తి చెయ్యడమే.కేంద్ర ప్రభుత్వం డబ్బులు లేవంటోంది,రాష్ట్ర ప్రభుత్వం దగ్గర అస్సలు డబ్బులే లేవు.కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకొని,

ప్రపంచ బ్యాంకు నుంచో, ఆసియ డెవలప్ మెంట్ బ్యాంకు నుంచో, ఏవో బ్యాంకుల నుంచి కేంద్ర ప్రభుత్వం హామీగా ఉండి ప్రాజెక్టుకు నిధులు సమకూర్చడమే ముందున్న ప్రధాన కర్తవ్యం.ఇంతవరకూ ఎంత శాతం పని పూర్తయింది, ఎంత ఖర్చు అయింది, కేంద్ర ప్రభుత్వం ఎంత ఇచ్చింది,ఆ డబ్బు ఏ విధంగా ఇప్పటి వరకూ ఖర్చు పెట్టారు, ఇంకా జరగాల్సిన పని ఎంత, ఎంత ఖర్చు అవుతుంది, ఎంత సమయం పడుతుంది అనే అంశాలపై కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సమీక్ష నిర్వహించాలి.తొలిగా కేంద్ర, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రులు, అధికారులు సమావేశం అవ్వాలి.తర్వాత ప్రధాన మంత్రితో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి భేటీ అవ్వాలి.ప్రస్తుతానికి కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల మధ్య, బీజేపీ- వైసీపీ మధ్య, ప్రధానమంత్రి నరేంద్రమోదీ- వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి మధ్య పెద్దగా వివాదాలు ఏమీలేవు.సంబంధ బాంధవ్యాలు బాగానే ఉన్నాయని భావించాలి.ఈ తరుణంలో ఇద్దరూ కలిసి ముందుకు సాగాలి.పోలవరం ప్రాజెక్టు నేడు ఈ పరిస్థితికి రావడానికి కారణం గత చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, చేసుకున్న ఒప్పందాలే ప్రధాన కారణమని, ఈ ప్రాజెక్ట్ విషయంలో మేము కేవలం సమన్వయ కర్తలుగానే ఉంటామని రాష్ట్ర నీటి పారుదల శాఖా మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తాజా మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు.ఈ దిశగా ప్రధాన మంత్రికి లేఖ కూడా రాశారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా కేంద్రానికి అప్పచెప్పడమే సరియైన పద్ధతి.వారు ఏ కాంట్రాక్టర్ కు ఈ ప్రాజెక్టును కేటాయించినా, బడ్జెట్ విషయం ఎంతైనా, పూర్తిగా కేంద్ర నిర్ణయానికి వదిలివెయ్యడమే వివేకమైన చర్య. ఇది తప్ప ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి ఇంకొక మార్గం లేదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ తన బలాన్ని పెంచుకోవాలనే ఆలోచనలో ఉంది.ప్రత్యేక హోదా ఇవ్వలేదనే కోపం ఆంధ్రప్రదేశ్ ప్రజలకూ ఉంది. 2019ఎన్నికల్లో బీజేపీకి ఘోరమైన ఫలితాలు రావడానికి ప్రత్యేక హోదా కూడా ఒక ప్రధానమైన కారణమే.ఇప్పుడు, రాష్ట్రంలో ఏ పార్టీ కూడా ప్రత్యేక హోదా కోసం బీజేపీ ప్రభుత్వంపై బలంగా యుద్ధం చేసే పరిస్థితిలో లేదనే చెప్పాలి.బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో బలపడటానికి పోలవరం ప్రాజెక్టును ఒక బలమైన ఆయుధంగా ఉపయోగించుకోవచ్చని కొందరు రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.ఈ అంశంలో అధికారంలో ఉన్న వై సి పి, బీజేపీ రాష్ట్ర నాయకులు వ్యూహాత్మకంగా ముందుకు సాగి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసుకోవడమే శరణ్యం.ఇది అనుకున్నట్లుగా పూర్తయితే కోట్లాది మంది ప్రజలతో పాటు, వై సి పి కి, బీజేపీకి కూడా ఆయా స్థాయిలలో రాజకీయమైన ప్రయోజనం (పొలిటికల్ మైలేజ్) నెరవేరుతుంది.అటు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ -ఇటు రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి చరిత్రలో మిగిలిపోతారు.

❖ ❖ ❖

మణిపూసలు

అడవితల్లికి దండాలు
చెట్టు నరికి పిండాలు
పర్యావరణ ఖూనీతో
ఎత్తెఎండల జెండాలు

నేడు రేపటికి నిన్నగ
రేపు నేటికి మిన్నగ
ఉంటుందని నమ్మడం
మనిషి తత్వం బెన్నగ

మనుజులను విభజిస్తారు
గోవులను పూజిస్తారు
పరమ హంసలమని చెప్పి
పరమ హింసలు చేస్తారు

ఈరోజు నీదని బతుకు
శ్రమచేసి తినుము మెతుకు
ఆనందో బ్రహ్మంటే
పగిలిన గుండెను అతుకు

రాతికి పూజ చేస్తారు
పాముకు పాలు పోస్తారు
ఆకలై అన్నమడిగితే
దూరం తరిమి వేస్తారు.

✦✦✦✦✦

1. జనపదము సిరి సుందరం
జానపదులమే అందరం
ఆ తత్వం మది చిగురిస్తే
పట్నం దరికిపోమెవ్వరం.

2. పల్లె ముంగిట కులవృత్తులు
సన్నగిల్లెనులె జన శక్తులు
ప్రపంచీకరణ దయవల్ల
వలసెళ్ళిరి నిపుణ వ్యక్తులు

3. పిల్లి పండె కమ్మరి కొలిమిన
బొగ్గు నిండె కుమ్మరావమున
కుప్పలాయె జాలరీ వలలు
రంగువెలిసి సాలెల మగ్గం.

4. చెప్పును మింగింది బాటా
ఉప్పును కోసింది వాటి
చర్మకారుల బతుకుముందు
చీకటి అలిమింది కోటా.

5. హృదయాన్ని తాకే పాట
నవనాడుల్ని మీటె మాట
కుదిపేసి పరుగులెట్టును
అల వరసలు కలిసే చోట.

డా॥ వూటుకూరి వరప్రసాద్,
ఫోన్:9912131327

చురకత్తులు- పూలగుత్తులు

చిత్తలూరి

క్షమించండి
నేనొక మంచి పిఆర్వోను కాను
కాలేను కూడా

నాకు కవిత్వం రాయటమొక్కటే
చేతనవుతుంది
కన్నీళ్లకు కరిగిపోవటమొక్కటే
చేతవుతుంది
కవిత్వ మాలలల్లి
పాఠక ప్రియుల మెడలో వేసి
గౌరవించుకోవటమే చేతనవుతుంది

పేదవాడి కన్నీళ్లకి దోసిలి పట్టటం
దగాపడిన తమ్ముళ్లను కౌగిలించుకోవటం
చరిత్ర మరిచిన యోధులను
నా వాక్యాల్లో దట్టించి
చరిత్ర ద్రోహుల మీద
మర ఫిరంగిలా పేలటం

ఇవి మాత్రమే చేతనవుతాయి

క్షమించండి
నేనొక మంచి పిఆర్వానో కాను
కాలేను కూడా

వంగి వంగి దండాలు పెట్టటం
లేని ప్రేమలను నటించటం
మోసపూరిత మాటలతో
బుట్టలో వేయటం
కుక్కలా వెంటపడుతూ
విశ్వాసం ప్రదర్శించటం
నాకు చేత కాదు

కొన్ని ప్రశ్నలను తయారు చేసి
చెమట చుక్కల శ్రామికులకు
మోసపోయిన చెల్లెళ్లకు
దగాపడిన తమ్ముళ్లకు

ఆయుధాలుగా అందించి
యుద్ధ విద్యలు నేర్పటం
పదునైన వాక్యాలతో పేని
పౌరుషాన్ని అల్లివ్వటం
బాంబుల వంటి పదాలను కూరి
ఆత్మగౌరవ యుద్ధాలను
ప్రేరేపించటం

మొత్తంగా
గాయపడిన దేశాన్ని
పొక్కిలయిన దేహాన్ని
ఆత్మీయాలింగనం చేసుకుని
తెగిన కలలకు కట్టు కట్టటం
కూలిన ఆశలకు
కొత్త నిర్మాణాలు చేపట్టటం
ఇవి మాత్రమే చేతనవుతాయి

నా వాక్యం ఏ పరిచయాన్నీ
దేబిరించదు
నా వాక్యం ప్రజల పక్షం
నా వాక్యం పేదల హృదయ
గవాక్షం
క్షమించండి
నేనొక మంచి పిఆర్వోను కాను
కాలేను కూడా

నా వాక్యాలు
అన్యాయాన్ని చీల్చేసే
చురకత్తులుజి
గాయపడిన బతుకులను
అక్కున చేర్చుకునే
పూల గుత్తులు

నేనొక మంచి పిఆర్వోను కాను
కాలేను కూడా
క్షమించండి!

లోతుల్లోకి పోతేగాని..

గుడిపల్లి నిరంజన్, నాగర్ కర్నూల్ జిల్లా, తెలంగాణా,9493319878

1
లోతుల్లోకి పోతే గాని..
ఒక పాము తన పిల్లను తానే
మింగేస్తున్న దృశ్యం ఎదురౌతుంది.

2
లోతుల్లోకి పోతే గాని..
చీకట్లు ఎప్పుడూ వెలుగును నిందిస్తూ
కొత్తగా అక్రమ దారులేవో నిర్మిస్తున్న
కుట్రల పుట్టలు బయట పడుతాయ్.

3
లోతుల్లోకి పోతేగాని..
ఐక్యతా రాగం ఎత్తుతూనే
ఆలోచనల సరం తెంపుతున్న
రక్తం అంటిన కత్తి కణేలున
మండుతున్న దృశ్యం మెరుస్తుంది

4
లోతుల్లోకి పోతే గానీ..
పైకి నురుగులా నవ్వుతు
లోపల ద్వేషపు
ఆకాశాలు ఎగరేస్తూన్న
నల్లటి మనిషి దర్శనమిస్తాడు.

5
లోతుల్లోకి పోతే గానీ..
అంతః కరున శుద్ధిని కోరుతున్న వాడు
చెదలు పట్టిన ఆలోచనలు
మొలకలా చల్లుతున్న
దృశ్యం ఎదురౌతుంది.

6.
లోతుల్లోకి పోతే గానీ..
ఒకరికి న్యాయం చేయాలంటే
నలుగురికి అన్యాయం చేయాలనే
కురూపి దర్శనం ఇస్తుంటాడు.

7
లోతుల్లోకి పోతేగానీ..
సువ్యక్తమైన మనిషిగా
ప్రకటించుకున్న మనిషే
నల్లని పొగను పీలస్తున్నా
దృశ్యం ఎదురొస్తుంది.

8
లోతుల్లోకి పోతే గానీ..
మైదానంలో గడ్డి మొలువాలని కోరుతూ...
ఎదలనిండా ఎడారులు సృష్టిస్తున్న
మనిషి ఎదురౌతాడు.

9.
లోతుల్లోకి పోతే గానీ..
మాటొకట్టే నిలుస్తూంటాది అంటూనే
వేయి నాలుకలతో బాసించే
మాటల వీరుడు దర్శనమిస్తుంటాడు.

10
లోతుల్లోకి పోతేగానీ..
ఇక్కడ మాట్లాడుతున్నవాడు
అక్కడ పొగుడుతూ ఉంటున్న
దృశ్యం ఎదురౌతుంది..

ఎప్పటికైనా
ప్రశాంతతను స్వప్నించే వాళ్ళమే
ఎన్నటికైనా
ప్రకాశితను హత్తుకునే వాళ్ళమే.

ఎన్ని కపట దృశ్యాలు ఎదురైనా
నేను మాత్రం
మకిల అంటని మనిషికై
వెతుకుతూనే ఉంటా.

మనమూ స్పందించుదాం

పల్లె నుండి ఢిల్లీ దాక
చిరిగిపోయిన. చీలిపోయిన
నిర్జయ దేహాల నుండి
చిమ్మిన నెత్తుటి వెల్లువలో
హృదయాలు తడిసిపోతుంటే

చారాధామ్ యాత్రలోన
కూలిన మంచుపెళ్ళల కింద
నలిగిపోయిన శవాల మళ్లీ
ముక్కలుగా కోసి సంపదలను దోచుకుంటే
రాబందులే బిత్తరపోయి తిరిగి పారిపోతుంటే!

ప్రళయపు విలయనృత్యంలో
పొంగి పొరలిన వరదల్లో
కుళ్ళిన శరీరాల, మునిగిన పంటల
దొరలిన కన్నీటి ధారల
ఎదలు పొగిలి పగిలిపోతుంటే !

భగ్గున మండిన బస్సులోన
కాష్టంలా కాలిపోయి, బొగ్గుల్లా మాడిపోయి
కారణాలు చెప్పక కబళించిన మృత్యువు
కనులముందు కన్పించక ప్రశ్నించే ప్రాణాలు
మరిగి కరిగి చెరగిపోతుంటే

బాంబుల విస్ఫోటనాల
బద్దలై పెంకుల్లా చెల్లా చెదరైన
దేహపు ముక్కలెవరియో తెలియక వెదకే
తల్లుల వేదనలే రోదనలై మిన్నంటి
కరిగిన మేఘాలు రక్త కన్నీరు కార్చుతుంటే

ఆపన్నుల బాధల్లో సగమైపోదాం రండి !
చేయి చేయి కలిపి వారినాదుకుందాం పదండి!

మహిళల్లారా లేవండి

పిడికిళ్ళు బిగించండి
గళములను ఎత్తండి
కలముల కదిలించండి
మహిళలారా! మీరు మేలుకోండికను,
వనితలారా ! లోకమేలుకోండికను.

అంగవివక్షలపైన
భూణ హత్యలపైన
పురుషాధిక్యతల మీద

మాతృమూర్తుల్లారా ! ప్రశ్నించరండి,
కన్న తల్లుల్లారా! కాళికలై రండి.
చదువులందూమీరే
నినదమందూమీరే
కదనమందూమీరే
కవయిత్రి మొల్లలై కదం తొక్కండి
రాణి రుద్రమ్మలై కరవాల మెత్తండి

మోసంపుప్రేమికుల
దురాశా రాకాసులను
వరకట్నపు పిశాచాల చెల్లెలారా!
కాస్త తెలిసిమసులుకోండి తల్లులారా!
ఎదురునిల్చిపోరాడండి.

తమస్సులను తరమ
ఉషస్సులై ఉరిమి
యశస్సులై రంజిల్ల

అమ్మలారా! అడుగు ముందుకేయండి,
వీరనారులారా ! పిడుగులై కురవండి.

ఎల్లవేళల పొంచి
యువతులను వేధించి
మానప్రాణాల హరియించు

మానవ మృగాలనే వేటాడగా లెండి
ఆత్మరక్షణ స్త్రీల హక్కంటూ చాటండి

అబలలము కాదింక
సబలలమని చాటి
దుష్టులను దునుమాడ
పుడమి పులకించగా ఊదండి (శంఖాలు)
కవనాలు
ఝాన్సీ మహారాణులై దూకండి కదనాన.

– ఎస్. సంపత్ కుమార్ శ్రీవత్స
భగత్‌నగర్, కరీంనగర్ 505001
సెల్ : 9346435123

గర్భంలో శిశువు గావుకేక

అమ్మా! అమ్మా!
నాకిక్కడే వెచ్చగా ఉందమ్మా,
నా ఆకలి నాదాహం నాశ్వాస
అన్నీ నీవైన అమ్మా!
నాకిక్కడే సుఖంగా ఉందమ్మా,

నాన్నా! ఓ నాన్నా!
పుట్టక ముందే చంపేస్తారని భయంగా ఉంది
ఎప్పుడూ ఇలాగే అమ్మలో దాక్కోనా నాన్నా?

అమ్మా! నాన్నా!
అడ శిశువుల్ని ఈడనే అంతం చేస్తారట
కాబోయే అమ్మను కతం చేస్తే మరొకతరం
ఎలా?

నాన్నా! ఓ నాన్నా!
నేనొస్తే భయమెందుకు నాన్నా!
కట్నమివ్వలేకనా? కాపాడగలేకనా?

అమ్మా! అమ్మా!
రాకాసుల లోకానికి రావద్దంటావా అమ్మా!
ఎన్నాళ్లైనా నీ బొజ్జలోనే బజ్జుంటానమ్మా!

ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమా?

కె.వి.రమణ, ఎం.ఎ. బి.ఇడి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాజాగా ఒక ఇంగ్లీష్ పత్రికకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ భారతదేశ ప్రగతి ఎంతో ఉజ్వలమని వ్యాఖ్యానించారు. కరోనా వైరస్ ను కట్టడి చెయ్యడంలో మన పాత్ర అద్భుతం అని సమాధానం చెప్పారు. 2024 కల్లా భారతదేశం 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా బలోపేతమవుతుందని, చాలా బలమైన విశ్వాసాన్ని ప్రకటించారు. కేంద్రం-రాష్ట్రాల మధ్య ఫెడరల్ వ్యవస్థ ఆదర్శవంతంగా సాగుతోందని కితాబు ఇచ్చారు. వ్యవసాయంలోనూ, కార్మిక రంగంలోనూ తీసుకువచ్చిన సంస్కరణలు గతంలో ఎన్నడూ లేనంత ప్రభావాన్ని చూపిస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కరోనా వంటి కష్టకాలంలో, విపత్తుల్లో పేదవాడికి ప్రభుత్వం అందించిన చేయూత అద్భుతమైనదని, ఆత్మ తృప్తిని వ్యక్తం చేశారు. ఉత్పత్తి, తయారీ రంగంలో ప్రపంచం మొత్తానికి సరఫరా చేయగలిగిన మార్కెట్ కేంద్రంగా సమీప భవిష్యత్తులో భారత్ నిలుస్తుందనే విశ్వాసాన్ని ప్రకటించారు. సంస్కరణల పరంపర నిరాఘాటంగా కొనసాగుతూనే ఉంటుందని సమాధానం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా, దానికి తగ్గట్టుగా రాష్ట్రాలు స్పందించక పోతే, ఆశించిన అభివృద్ధి జరగదని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్రాలు తమ వంతు పాత్ర పోషించడం కీలకమని సూచించారు. చేయాలనుకున్న మేలు, చిట్ట చివరి మైలు వరకూ చేరుకునే డెలివరీ వ్యవస్థ మనల్ని కాపాడిందని, ఈ యంత్రాంగాన్ని అధికారంలోకి తెచ్చిన తొలినాళ్ళల్లోనే నిర్మించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికే చెల్లిందని తమ పాలన పట్ల అత్యంత ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించారు. లక్షలాది మంది ప్రజలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే నగదును బదిలీ చేయగలిగామనే ఆత్మ తృప్తి తనకు ఎంతో ఉత్సాహాన్ని, శక్తిని ఇచ్చిందని వ్యాఖ్యానించారు. ఇది తమ ప్రభుత్వం మాత్రమే చేసిన చారిత్రక చర్య అని తెలిపారు. ఇలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను, అనుభవాలను, ఆలోచనలను, ఆశయాలను, సంకల్పాలను ఈ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఈ ఇంటర్వ్యూలో, ఇంకా సంధించాల్సిన చాలా ప్రశ్నలు సంధించలేదని చెప్పాలి. ప్రధాని చెప్పిన జవాబుల్లోనూ ఇంకా విస్తృతి వుంటే బాగుండేది. త్వరలో మరికొన్ని ఇంటర్వ్యూల పరంపర జరుగవచ్చని భావిద్దాం. ప్రధానమంత్రి చెప్పిన మాటలు, చేసిన వ్యాఖ్యలను సమీక్ష చేసుకుంటే, కొన్ని వాస్తవానికి దగ్గరగానూ, కొన్ని దూరంగానూ ఉన్నాయి. సుమారు 139కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ వల్ల, కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంలోనూ, మరణాల సంఖ్యను అదుపులో ఉంచడంలోనూ, పరీక్షలు జరపడంలోనూ మంచి ఫలితాలే వచ్చాయి. ముందు జాగ్రత్త చర్యలు, హెచ్చరికలు చేపట్టకుండా, ఉన్నపళంగా లాక్ డౌన్ విధించడం వల్ల ఎన్నో అనర్థాలు జరిగాయి. ముఖ్యంగా వలసకార్మికులు పడిన కష్టాలు, పోగొట్టుకున్న ప్రాణాలు, కోల్పోయిన ఉపాధి వర్ణనాతీతం. లాక్‌డౌన్ వల్ల ఆరోగ్య పరంగా కొంత రక్షణ పొందాం. సమాంతరంగా ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై పోయింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ ఇప్పటి వరకూ ఇంత ఘోరమైన ఆర్థిక పరిస్థితులు ఎప్పుడూ ఎదురుకాలేదు. గతంలో ఆర్థిక మాంద్యం వచ్చిన దశ కంటే, నేటి దశ చాలా ఘోరమైనదిగా విశ్లేషకులు భావిస్తున్నారు. 2020-21ఆర్థిక సంవత్సరాన్ని పరిశీలిస్తే, ఇప్పటి వరకూ రెండు క్వార్టర్లు ముగిసాయి. మూడవ క్వార్టర్ లో ఇప్పుడే అడుగుపెట్టాం. జీడీపీలో ఇప్పటి వరకూ సగటుగా దాదాపు 25శాతం నష్టపోయాం. అన్‌లాక్ ప్రారంభమైనప్పటి నుండీ కొంత ప్రగతి నమోదవుతూ వస్తోంది. మొదటి క్వార్టర్ (త్రైమాసికం) కంటే రెండవ క్వార్టర్ లో అభివృద్ధి ప్రారంభమైంది. ఇది కొంత మంచి పరిణామమే. నిర్మాణం, ఉత్పత్తి రంగాలు ఘోరంగా దెబ్బతిన్నాయి. ఆర్థిక లావాదేవీలు ఇంకా ఎంతో ఊపందుకోవాల్సిన అవసరం ఉంది. డిమాండ్-సప్లై మధ్య ఉన్న బంధం ఇంకా ఆరోగ్యదాయకంగా లేదు. కరోనా ప్రభావంతో తోటి దేశాల్లో వచ్చిన ఆర్థిక కష్టాల ప్రభావం మన దేశంపైనా పడింది. దెబ్బతిన్న దేశాల్లో అమెరికా, చైనా రెండూ ఉన్నాయి. అమెరికా బాగా దెబ్బతింది. చైనా ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ఐనప్పటికీ, చైనాకు -భారత్ కు మధ్య ఉన్న వాణిజ్య, వ్యాపార బంధాలు తెగిపోతూ ఉండడం వల్ల, దీని ప్రభావం మన ఉత్పత్తి రంగం, తద్వారా మన ఆర్థిక రంగంపై పడింది. ఫార్మా మొదలు అనేక తయారీల్లో మనం చైనాపైనే ఆధారపడ్డాం. అదే విధంగా "మేక్ ఇన్ ఇండియా" ను ఆచరణలో ఆశించిన స్థాయిలో సాధించలేదు. కాబట్టి, ఈ పరిణామాల వల్ల మూల్యం చెల్లించుకుంటున్నాం. ఇంత గడ్డు పరిస్థితుల్లోనూ మన దేశాన్ని కాపాడింది వ్యవసాయ రంగం. అది ఎంతో కొంత పచ్చగా ఉండడం వల్ల, కొంత ఆర్థిక రక్షణ జరిగింది. యత్ర నార్యంతు పూజ్యతే... అన్నట్లుగా, ఎక్కడైతే వ్యవసాయ రంగం బాగుంటుందో, ఆ క్షేత్రం సుభిక్షంగా ఉంటుంది. వ్యవసాయ రంగంపై పాలకులకు ఇంకా శ్రద్ధాభక్తులు పెరగాలి. వ్యవసాయం కోసం ఉపయోగించుకోకుండా ఉన్న భూమి ఇంకా చాలా ఉంది. దాన్ని గుర్తించి, వ్యవసాయాన్ని విస్తరించాలి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వ్యవసాయ బిల్లులపై దేశ వ్యాప్తంగా చాలా వ్యతిరేకత వస్తోంది. నిపుణులతో చర్చలు జరిపి, దీన్ని పునః సమీక్షించుకోవాలి. ఆహార రక్షణపై (ఫుడ్ సెక్యూరిటీ) శాస్త్రవేత్తలు ఎప్పటి నుండో హెచ్చరిస్తున్నారు. ఈ అంశంపై ఏలినవారు ఎంత వరకూ దృష్టి పెట్టారన్నది పెద్ద ప్రశ్న. స్వామినాథన్ వంటి నిపుణులు చేసిన సూచనలు ఆచరణలో అంతంతమాత్రంగానే ఉన్నాయి. రాష్ట్రాలకు రావాల్సిన జిఎస్‌టి బకాయిలపై కేంద్రం చెప్పేవి మాటల గారడీ మాత్రమేనని కొందరు పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఋణాల వసతి కల్పించినా, వాడుకునే పరిస్థితి రాష్ట్రాలకు ఏమాత్రం ఉందన్నది సందేహమే. థామస్ రాబర్ట్ మాల్థస్ అనే ఆర్థిక పండితుడు ఎప్పుడో 200ఏళ్ళ క్రితం చెప్పిన మాటలను దేశాధినేతలు పెడచెవిన పెట్టినట్లు కనిపిస్తోంది. జనాభా పెరుగుదల సంఖ్య ఆధారంగా, ప్రతి 25సంవత్సరాలకు ఒకసారి ప్రపంచంలో అనేక మార్పులు వస్తాయని, వాటికి అనుగుణంగా మనం సిద్ధమై ఉండాలని ఆయన హెచ్చరించారు. ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక మాంద్యాలు, కరోనా వైరస్ వంటి ముప్పులు, అనారోగ్యాలు ఎన్నో వస్తూ వుంటాయని, వీటిని గుర్తెరిగి, మనం నడచుకోవాలని ఆయన సూచించాడు. ముందు జాగ్రత్త చర్యలు పాటించక పోవడం వల్ల, ఆర్థికంగా, మౌలికంగా సంసిద్ధమై ఉండక పోవడం వల్ల, ఇటువంటి విపత్తులు వచ్చినప్పుడు కుదేలైపోతున్నాం. మాల్థస్ మహనీయుని మాటలు ఇప్పటికీ ప్రత్యక్ష సత్యాలుగా నిలుస్తున్నాయి. భారతదేశాన్ని పునర్నిర్మించాలనే సత్ సంకల్పం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఉండడం ఎంతో అభినందనీయం, పూజనీయం. 2024 కల్లా 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్నది ప్రధాని మహదాశయం. కరోనా వ్యాప్తిని, మరణాలను నివారించాలన్నది దేశాధినేత సంకల్పం. కరోనా దుష్ప్రభావాలు, కష్టాల నుండి భారత్ ను అత్యంత త్వరగా బయటపడవేయాలన్నది ప్రధాని ప్రధాన ఎజెండా. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, ప్రపంచ పరిణామాలను గమనిస్తే, 2024 కల్లా 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థకు భారత్ చేరుకుంటే? అది గొప్ప ప్రగతి, సందర్భమని ఆర్థిక శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్నారు. ప్రధాని సంకల్పిస్తున్నట్లుగా 5ట్రిలియన్ల వ్యవస్థ నిర్మాణం కావడానికి ఇంకాస్త సమయం పడుతుంది. నిజంగా అది సాధిస్తే చరిత్రే...

డబ్బు చేసే దుర్మార్గం

ఎన్. భాను



రూపాయి నువ్వేం చేయగలవు? అంటే మానవత్వం హత్య చేస్తా.. మనిషిని మృగంగా మారుస్తా.. బంధాలకు సమాధి కడతా.. ఎంత అకృత్య నీచ పనులైనా చేయిస్తా "అందట. డబ్బు మనిషితో ఏపనినైనా చేయిస్తుంది. దాని దుష్టత్వాన్ని గురించి, మహత్యాన్ని గురించి మార్క్స్ 1844లోనే షేక్స్పియర్ మాటలతో ఎంతో అద్భుతంగా వర్ణించాడు. డబ్బు కుండే లక్షణాల్లో ఒకటి ఏమిటంటే, అది మానవ సహజమైన మానవీయ లక్షణాలన్నింటినీ వ్యతిరేకమైన లక్షణాలుగా మార్చివేస్తుంది. మనిషిని ఎంతకైనా దిగజారుస్తుంది. ఎంతటి నీచానికైనా వొడిగట్టేలా చేస్తుంది. సర్వసాధారణ గందరగోళం దాని లక్షణం. మనిషిని అత్యంత క్రూరునిగా, నేరగానిగా మార్చగలిగిన శక్తి డబ్బుకుంది. అందుకు తాజాగా మహబూబాబాద్‌లో జరిగిన సంఘటన ఉదాహరణగా నిలుస్తుంది. రంజిత్ రెడ్డి, వసంతల కుమారుడు కుసుమ దీక్షిత్‌రెడ్డి (9)ని అత్యంత క్రూరంగా డబ్బుల కోసం కిడ్నాప్ చేసి, తెలిసిన మనిషిగా దొరికిపోతాననే భయంతో కిడ్నాప్ చేసిన రెండు గంటల్లోపే గొంతు నులిమి చంపేసాడు మందసాగర్ అనే ఇరవై మూడేండ్ల యువకుడు. ఇది మొదటి సంఘటన కాదు. చివరిదీ కాబోదు! ఇలాంటి సంఘటనలు అనేకం జరిగిన విషయం మనకు తెలుసు. కొన్ని సుఖాంతంగా ముగిస్తే, అంటే బతికి బయటపడితే.. చాలా వరకు దుఃఖాంతమే అయ్యాయి. తొమ్మిదేండ్ల పసిప్రాయంలో దీక్షిత్ ఏం తెలుసుకోగలుగుతాడు. తెలిసిన వ్యక్తే, అన్నయ్య అని పిలిచాడు. ఇక్కడికే పోదాం రా.. అని బండిపై కూర్చోపెట్టుకుని మృత్యుకొండకు తీసుకు పోయాడు. తమ్ముడూ అని పిలిచిన అన్నయ్య తన చేతులతో శాశ్వతంగా తుదముట్టిస్తాడని, గొంతునులిమి, పెట్రోలు పోసి తగలేస్తాడని ఏ బాలుడైనా ఊహిస్తాడా! అంతేకాదు, మందసాగర్ కూడా తాను అంత క్రూరంగా మారతానని బహుశా ఊహించి ఉండడు. ఇవన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా జరిగే పర్యవసానపు ఫలితాలు. యువకుడు ఏదో మెకానిక్‌గా షెడ్ నడుపుతూ బతుకు వెళ్ళదీస్తున్నాడు. కండ్ల ముందు ప్రపంచం రంగు రంగులుగా కనపడింది. చూస్తూ చూస్తూనే కొందరు సంపన్నులుగా మారడాన్ని, సకల సౌకర్యాలను అనుభవించడాన్ని గమనించాడు. త్వరగా డబ్బు ఎలా సంపాదించవచ్చో పెడమార్గంలో ఆలోచించడంతో సమాజంలో జరుగుతున్న ఈ దుష్ట సంస్కృతీ విన్యాసం అతని కళ్ళల్లో మెరిసింది. ఒకేసారి లక్షలు డిమాండ్‌చేసి ధనవంతుణ్ణి అయిపోవచ్చుని అనుకున్న అతనికి, పని మొదలు పెట్టినాక పర్యవసానం అర్థమవటం, ఆ తర్వాత రాక్షసంగా వ్యవహరించడం మనం చూస్తున్నాం. ఇది సాగర్‌లో ఉన్న క్రౌర్యం, దుర్మార్గం మాత్రమే కాదు. ఈ సమాజంలో మానవ సంబంధాలలో తిష్టవేస్తున్న దుష్టత్వానికి ప్రాతిపదికను నిర్మిస్తున్న సమాజపు పోకడ. ఈ దుర్మార్గానికి అదే అసలు కారణం. "మనీ" చుట్టూ తిరుగుతూ మనిషి మాయమవుతున్న కాలాన్ని మనం కండ్లారా చూస్తున్నాం. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారిన పరిస్థితుల పర్యవసానమిది. ఇందుకు తప్పుపట్టాల్సింది కేవలం వ్యక్తులను మాత్రమే కాదు, వ్యవస్థను కూడా. అందుకే ఈ వ్యవస్థలో నేరస్తులను ఎందరినైనా ఏరివేయండి, లేదా ఎన్‌కౌంటర్ చేయండి కాక తిరిగి తిరిగి పుట్టుకొస్తూనే ఉంటారు. దుష్టత్వం కొనసాగుతూనే ఉంటుంది. అలా అని నేరస్తులను వదిలేయటం కాదు. నేరాలను అరికడతూనే, వ్యవస్థ గమనాన్నీ మార్చలేకపోతే, మార్చేందుకు ప్రయత్నాలు జరగకపోతే ఇలాంటి ఘటనలు మరిన్ని పునరాగమిస్తూనే ఉంటాయి. ఏ రకమైన సంస్కృతిని ఈ వ్యవస్థ సృష్టిస్తున్నదో కనీసం చదువుకున్న మేథోవర్గం, పౌర సమాజం అవగాహన చేసుకుని ప్రతిస్పందించాల్సి ఉంది. ఆ తల్లి శోకం తీరేది కాదు. చూసిన, విన్న వాళ్ళకే గుండె బరువెక్కుతున్నది. ఆ నష్టాన్ని పూడ్చడం ఎవరివల్లా కాదు. సాగర్‌ను వెంటనే శిక్షకు గురిచేసినా తల్లిదండ్రుల దుఃఖాన్ని ఆపలేము. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవడమే మనం చేయాల్సింది. నేరమయ సమాజపు లక్షణాన్ని చూస్తూ మౌనంగా ఉండటం మరింత నేరం. ప్రతి ఒక్కరూ ఈ దుష్ట సంస్కృతిపై పోరాడేందుకు ముందుకు రావాలి. ఇందుకు వ్యక్తుల్లోనే కాదు, వ్యవస్థలోని లోపాన్నీ గుర్తించాలి. దాన్ని సరిచేయడం కోసం పోరాడాలి. మనిషి తనం పరిఢవిల్లే మానవీయ సమాజానికి పాదులు వేయాలి.



విపక్షం లేకుంటే రాజకీయ శూన్యత!!!

బి.వెంకటేశ్వరరావు

బీహార్ ఎన్నికల తరువాత దేశంలో బీజేపీకి కనుచూపు మేరలో తిరుగులేదని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో కళ్లు తెలేయడంతో, దేశం లో ప్రతిపక్షమేలేనిరాజకీయశూన్యం ఏర్పడబోతుందా అని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులలో పార్టీ నాయకత్వం తీరుపై అనేక మంది సీనియర్లు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలోని అనేక మంది యువనాయకులతో, సీనియర్లకు పొసగడం లేదని, రాహుల్‌గాంధీ, ప్రియాంకల తీరు పట్ల కూడా అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని అంచనావేయడంలో అతిగా ప్రవర్తించ డంతోనే 70 సీట్లలో పోటీ చేసి 19 సీట్లను గెలిచి, పరోక్షంగా ఎన్డీయే గెలుపునకు కారణమైందనే విమర్శలు ఉన్నాయి. బీజేపీ వ్యూహా త్మకంగా హిందూఓటర్లను తనవైపునకు తిప్పుకోవడంలో విజయ వంతం అవుతుంది. అదీకాకుండా గత ఆరుసంవత్సరాలలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తన పథకాలతో, పేద, మధ్యతరగతి లోని కొంత మందికి నేరుగా నగదు ప్రోత్సాహకాలను అందిం చడంతో కూడా బీజేపీ పట్ల కొంత సానుకూలత వస్తుంది. ఉత్తర భారతంలో బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు ఇతరరాష్ట్రాలలో కూడా పేదలకు మరుగుదొడ్ల నిర్మాణానికి, సొంత ఇంటిని నిర్మించుకోవ డానికి ఇస్తున్న లక్షాయాభైవేల ఆర్థిక సహాయం కూడా ఎంతో ప్రభావితంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే సమయం లో ప్రతిపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్ కానీ, ఇతర స్థానిక పార్టీలు కానీ క్షేత్రస్థాయిలో ప్రజలను ఆకర్షించడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. జాతీయ అంశాలను లేవనెత్తడంలో కానీ, స్థానిక సమస్యల విషయంలో కూడా ప్రతిపక్షాలు అధికారంలోని పార్టీకి దీటుగా స్పందించడంలో విఫలం అవుతున్నారు. వందయేళ్ల చరిత్ర ఉన్నదని చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీలో జాతీయస్థాయిలో కానీ, రాష్ట్రాల్లో కానీ సమర్థవంతంగా నాయకత్వం వహించగలవారు లేకపోవడం, అరవై, డెబ్బై ఏళ్లు పైబడిన వారే ఇంకా పార్టీ నాయకత్వం కావాలని ఆశించడంతో, యువనాయకులకు అంతగా రుచించడం లేదు. అందులో భాగంగానే,పెద్దల తీరునచ్చని మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో యువనాయకులు తిరుగుబాటు చేయడంతో రాజస్థాన్‌లో సమస్య సద్దుమణిగినా, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ 15 నెలలోనే అధికారం కోల్పోవడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ దేశంలోని రెండు,మూడు రాష్ట్రాలలో తప్ప ఎక్కడ కూడా ఒంటరిగా పోటీ చేసే స్థితిలో లేదు. కర్ణాటకలోతప్ప మరే దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఉనికే కరవవుతుంది. ఆంధ్రప్రదేశ్,తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ ఉన్నా, జిల్లాల్లో నాయకులంతా అధికార పార్టీ వైసిపి, టిఆర్ఎస్‌వైపే చూస్తున్నారు. తెలంగాణలో బీజేపీ కొంత బలం పుంజుకోవడానికి కూడా కాంగ్రెస్ నాయకుల ఒంటెద్దుపోకడలే కారణం అని భావిస్తున్నారు. ప్రతి రెండు,మూడు నెలలకొక సారి పార్టీ నాయకత్వాన్ని మరుస్తున్నారు. దీంతో రాష్ట్రనాయకత్వాన్ని ఎదిరించే వారిని నియంత్రించడంలో అధినాయకత్వం విఫలం కావడం కూడా కార్యకర్తల మనోధైర్యాన్ని నీరుగారుస్తుంది. రాహుల్‌గాంధీ అధ్యక్షపదవికి రాజీనామా చేసిన తర్వాత మళ్లీ అనారోగ్యంతో ఉన్నసోనియాగాంధీ తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉన్నా పార్టీని బలోపేతం చేయడంలో విఫలం అయ్యారనే ప్రచారం జోరుగా సాగుతుంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో జరిగిన తిరుగుబాటుకు ప్రధాన కారణం సీనియర్‌నాయకుల తీరే కారణ మని విమర్శిస్తూ తిరుగుబాటు చేసిన మాధవరావు సిందియా, రాజేష్‌పైలెట్‌ల ఆరోపణలకు ఇప్పటికీ కాంగ్రెస్ అధినాయకత్వం జవాబు చెప్పలేకపోయింది. మొన్నటి బీహార్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీని అన్నివేళలలో కంటికి రెప్పలా చూసుకొనే నాయకుల్లో ఒకరైన కపిల్‌సిబాల్ కూడా బహిరంగ విమర్శలు చేశారు. గతంలో 23 మంది సీనియర్ నాయకులు అధినాయకత్వానికి రాసిన లేఖ బహిరంగంకావడం టీకప్పులోని తుఫానులా సద్దు మణిగినా,మళ్లీ మళ్లీ తెరపైకి వస్తుంది. అంతా సద్దుమణిగిందని భావిస్తున్నా, లోన ఉన్న ఆలోచనల వైరుధ్యాలను, అసంతృప్తిని కానీ పరిష్కరించే దిశలో కాంగ్రెస్ నాయకత్వం ప్రయత్నించకపోవడంతో, ఇక కాంగ్రెస్ చరిత్ర ముగిసినట్లేనా అని పరిశీలకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి తమ రాష్ట్రాలలో ఏమాత్రం బలం లేకున్నా, రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలు ఇంకా కాంగ్రెస్ పార్టీతో జట్టుకట్టడానికి ప్రధాన కారణం, కాంగ్రెస్‌పార్టీలో ఉన్న సుప్రీం కోర్టు న్యాయవాదుల సహాయం, వారికి కావాల్సిరావడమే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఎందుకంటే అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ వేసే ఎత్తులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాన్ని ఇబ్బందులపాలు చేసే చట్టాలు చేసిన సమయంలో వాటికి కావాల్సిన న్యాయసహాయాన్ని కాంగ్రెస్ పార్టీలోని పెద్దలే అందించాల్సివస్తుంది. రెండేళ్ల క్రితం కర్ణాటకలో అక్రమమార్గంలో అక్కడి గవర్నర్ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడుకానీ, మొన్న మహారాష్ట్రలో బీజేపీని కాదని కాంగ్రెస్, ఎన్సీపిలతో పొత్తుగట్టిన శివసేనకు అండగాఉండి,మూడు రోజుల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపడంలో ప్రధాన పాత్ర వహించినవారు కాంగ్రెస్‌లోని ప్రముఖ నాయకులు, సుప్రీంకోర్టులోని న్యాయవాదులే అన్న విషయం అందరికీ తెలిసినదే. కపిల్ సిబాల్, అభిషేక్ సింఘ్వీ లాంటి అనేకమంది ప్రముఖ న్యాయవాదులు ఇంకా కాంగ్రెస్‌పార్టీని అంటిపెట్టుకొని ఉన్నారు. కాంగ్రెస్ నాయకులకు అవసరం అయినప్పుడు కూడా కోర్టులో ఆదుకొనేది వీరే. మధ్య ప్రదేశ్‌లో 28మంది కాంగ్రెస్‌నాయకులు పార్టీని వీడినా, వారందరి శాసనసభా స్థానాలకు రాజీనామా చేయించడంలో బీజేపీపై ఒత్తిడి తేగలిగింది వీరే. అలాగే రాజస్థాన్‌లో సచిన్‌పైలెట్ తిరుగుబాటును అడ్డుకోవడంలో సుప్రీంకోర్టులోబలంగా వాదించి, అక్కడకాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలిపింది కూడా ఈ న్యాయవాదులే.

కోర్టులను నమ్ముకొని మాత్రమే రాజకీయ పార్టీలు తమ బలాన్ని పెంచుకోలేవని అనేకరాష్ట్రాలలో ఎన్నికలు నిరూపించాయి. దేశమంతా హిందువుల ఓట్లతోనే దేశాన్ని పాలించగలమని నమ్ముతున్నా బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్ వద్ద ఎలాంటి ప్రణాళికలు లేవని ఈ ఆరేళ్ల కాలంలోని ఎన్నికలునిరూపించాయి. గత 70 సంవత్సరాలలో ఇతర అవకాశాలు లేకపోవడంతోనే మైనార్టీలు కాంగ్రెస్‌తో జత కట్టారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది, బహుజన సమాజ్ పార్టీలతో జతకట్టిన మైనార్టీలు ఇప్పుడు వారిని వీడిపోయారు. అలాగే కాంగ్రెస్, ఆర్జేడీలతో ఉన్న మైనార్టీలు కూడా వారిని నమ్మే పరిస్థితిలో లేరని గతఎన్నికలు రుజువుచేశాయి. సీట్లు ఎన్ని గెలుచుకొన్నారనే విషయాన్ని పక్కనపెట్టి ఆలోచిస్తే, మైనార్టీముస్లింలు, మెజార్టీ హిందువుల పార్టీగా మాత్రమే ఉన్న బీజేపీకి వ్యతిరేకంగా, ప్రస్తుతం ఉన్న సంప్రదాయ పార్టీలను కాదని,తామే సొంత నాయకులను, పార్టీలను తయారు చేసుకో వాలనే దిశలో ప్రయత్నాలు ప్రారంభించాయని చెప్పుకోవచ్చు. అంతకు ముందు మహారాష్ట్ర, కర్ణాటకలో కూడా ఎంఐఎం పోటీ చేసి తన స్థానాన్ని పటిష్టం చేసుకొంటుంది. ఇక మిగిలింది రేపటి బెంగాల్, తమిళనాడు, ఎన్నికల్లో కూడా పోటీచేసి తన ఉనికిని చాటుకోవడానికి మైనార్టీ నాయకులు కూడా ఏకీకృతం అవుతున్నారు. దళితులు, మైనార్టీల పార్టీగా ఉన్న కాంగ్రెస్ ఇకముందు అలా ఉండలేదు. ఎందుకంటే దళితులలో చాలా వర్గాలు, మైనార్టీలు ఇతర పార్టీలలో చేరిపోయారు. కమ్యూనిస్టులు కూడా కార్యకర్తలు లేని పార్టీగా మిగిలిపోయింది. ఒకరకంగా దేశంలో రాజకీయ శూన్యత ఏర్పడింది. ఏక పార్టీ దిశగా రాజకీయాలు వెలుతున్న దశలో జాతీయ, సెక్యులర్ భావాలను సమభాగాలలో నింపుకొని, పేద, మధ్యతరగతినే కాకుండా కొత్తగా ఏర్పడుతున్న ఉన్నత మధ్యతరగతి ప్రజల మనసులో స్థానం గెలువగల సత్తా రాజకీయ వ్యవస్థకు శ్రీకారం చుట్టగల జాతీయ నాయకుని కోసం దేశం ఎదురుచూస్తుంది.



పొగతో ఊపిరి "చిత్తు"....

డాక్టర్ కె. శ్రీకాంత్, సీనియర్ సర్జికల్,ఆంకాలజిస్ట్

"పొగత్రాగడం ఆరోగ్యానికి హానికరం...' సినిమాకి ముందు వచ్చే హెచ్చరిక కన్నా, సినిమాలో పొగతాగే హీరోనే యువతకు స్ఫూర్తి. అందుకే, ఊపిరిపోసే ఊపిరితిత్తుల కంటే రెండు వేళ్ల మధ్య కదిలే సిగరెట్టుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫలితంగా, రోజురోజుకూ ఊపిరితిత్తుల క్యాన్సర్లు పెరుగుతున్నాయి. దేశంలో ఏటా 7.2 శాతం మంది ఊపిరితిత్తుల క్యాన్సర్ల బారిన పడుతున్నారు. 10 శాతం మంది దీనివల్లే చనిపోతున్నారు. ముదిరితే తప్ప బయటపడని ఊపిరితిత్తుల క్యాన్సర్ పట్ల అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. 'నాకు అసలు పొగత్రాగే అలవాటే లేదు. వాసన కూడా పడదు. అయినా నాకు ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చింది' అని బాధపడేవాళ్లను చూస్తుంటాం. ఇందుకు కారణం పాసివ్ స్మోకింగ్. బహిరంగంగా పొగతాగడం నిషేధం.. అన్నమాట పేరుకే గానీ, అమలు మాత్రం జరగడం లేదు. నిజానికి పొగత్రాగే వాళ్ల కన్నా తాగని వాళ్లే ఎక్కువగా ఉంటారు. అయినా లంగ్ క్యాన్సర్ మొదటి స్థానంలో ఉండటానికి కారణం పాసివ్ స్మోకింగే. పొగత్రాగేవాళ్లకు దగ్గరగా మసలడం వల్ల, వాళ్లు వదిలిన పొగను పీల్చడం వల్ల కూడా క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. ఈ పొగ ద్వారా కార్బన్ మోనాక్సైడ్, ఆర్సెనిక్, బెంజీన్, కాడ్మియం, బెరీలియం లాంటి దాదాపు 76 రసాయనాలు విడుదలవుతాయి. అన్నీ హానికరమైనవే. ఎంత ఫిల్టర్ చేసినా ఇవి బయటకు వస్తాయి. అందుకే, చాలామంది చిన్న వయసులోనే ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ క్యాన్సర్ బాధితుల్లో 30 శాతం పొగతాగేవాళ్లే ఉంటారు. మిగిలిన 70 శాతం మందికి అస్సలు అలవాటు ఉండకపోవచ్చు. కానీ పాసివ్ స్మోకింగ్, ఇతర కారణాల వల్ల క్యాన్సర్‌కు గురవుతున్నారు.

మరిన్ని కాంణాలు : ఇప్పుడంటే గ్యాస్ స్టౌలు వచ్చాయి కానీ, అప్పట్లో కట్టెల పొయ్యే వాడేవాళ్లు. కొన్నిచోట్ల, ఇప్పటికీ వాడుతున్నారు కూడా. పొయ్యిలో వాడే కట్టె కూడా పెద్దసైజు సిగరెట్ లాంటిదే. కట్టె కాలిన తరువాత వచ్చే కర్బన సమ్మేళనాల వాయువులూ క్యాన్సర్‌కు మూలమే. ఆడవాళ్లలో లంగ్ క్యాన్సర్‌కు ఈ పొగే ఎక్కువగా కారణమవుతుంది. పైగా గ్రామాల్లో కిటికీలు తక్కువ. చిమ్నీలు ఉండవు. దాంతో వంటింటి పొగలోనే

రోజంతా గడుపుతారు. : గ్రామీణ మహిళల్లో లంగ్ క్యాన్సర్‌కు కారణం ఇది. అంతేగాక ఎండిపోయిన పంటను కాల్చడం వల్ల వచ్చే పొగ కూడా క్యాన్సర్ కారకమే. గాలి ఏ రకంగా కలుషితం అయినా అది క్యాన్సర్‌కు దారితీస్తుంది. ఆస్‌బెస్టాస్, మైనింగ్ పరిశ్రమల్లో పనిచేసేవాళ్లు రేడియో ధార్మిక వాయువుల తాకిడితో ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదముంది. వాహనాలు, పరిశ్రమల వల్ల పెరుగుతున్న వాయు కాలుష్యం కూడా లంగ్ క్యాన్సర్ కేసులను పెంచుతున్నది.

టీబీనా.. క్యాన్సరా..? : పొడిదగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, కళ్లె రావడం ఇవన్నీ టీబీలోనే కాదు.. క్యాన్సర్‌లోనూ ఉంటాయి. క్యాన్సర్ వల్ల మాటలో మార్పు వచ్చి బొంగురు గొంతు కూడా రావచ్చు. టీబీ, లంగ్ క్యాన్సర్ లక్షణాలు దగ్గరగా ఉండటం వల్ల చాలాసార్లు టీబీ అని పొరబడి చికిత్స మొదలుపెడతారు. కానీ లక్షణాలు కనిపిస్తే సీటీ స్కాన్ చేయించడం మంచిది. క్షయ వ్యాధే అయితే మందులు వాడుతుంటే నెలరోజుల్లో మార్పు రావాలి. ఎప్పటిలా చురుకుదనం రావాలి. అయినా కూడా మార్పు రాకపోతే క్యాన్సరేమోనని అనుమానించాలి. లక్షణాలు కనిపించినప్పుడు అటు టీబీ పరీక్షలు, ఇటు క్యాన్సర్ పరీక్షలు చేయించాలి. క్యాన్సర్ కాదని నిర్ధారణ అయితేనే టీబీ చికిత్స మొదలుపెట్టాలి. ఇందుకోసం మాంటెక్ టెస్ట్, సీటీ టెస్ట్, స్పూటమ్ అనాలిసిస్ లాంటివి చేయించాలి. కేవలం ఎక్స్‌రే తీసి, టీబీ చికిత్స మొదలుపెట్ట కూడదు. ఈ లోగా క్యాన్సర్ పెరిగిపోయి, పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉంటుంది. నివారణ ఎలా? పొగ అలవాటుకు దూరంగా ఉండటమే ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకునే ఏకైక మార్గం. గాలి కాలుష్యాన్ని పూర్తిగా తగ్గించడం మన చేతుల్లో లేదు. కానీ, పొగతాగకుండా ఉండటం, త్రాగేవాళ్లకు దూరంగా ఉండటం సాధ్యమవుతుంది. పొగతాగడం ఎంత హానికరమో, పొగ త్రాగేవాళ్లకు దగ్గరగా ఉండటం కూడా అంతే హాని చేస్తుంది. తాజా పండ్లు, కూరగాయలు, పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఊపిరితిత్తుల సామర్థ్యం పెంచే వ్యాయామాలు చేయాలి. బ్రీతింగ్ వ్యాయామాలు, ప్రాణాయామం రెగ్యులర్‌గా చేయాలి. అన్నింటికన్నా ముఖ్య విషయం.. ప్రభుత్వాలు పొగ నిషేధంలో కఠినమైన చర్యలు చేపట్టాలి. ఆఫీసులు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టాపులు, మాల్స్, రెస్టారెంట్లలో పొగత్రాగేవాళ్ల కోసం ప్రత్యేక స్మోకింగ్ చాంబర్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. బహిరంగ ధూమపానంపై కట్టడి చేయాలి. పబ్లిక్ టాయిలెట్స్ పెట్టినట్టుగా స్మోకింగ్ చాంబర్లు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పొగ తాగడానికి అలవాటు పడినవాళ్లు ఇప్పటికైనా ఆ వ్యసనం నుంచి బయటపడేందుకు సంకల్పించాలి. ఇందుకోసం డీ-అడిక్షన్ సెంటర్లు కూడా సహాయపడుతాయి.

ఊపిరితిత్తులకు శత్రువు : శరీరంలో మిలియన్ల కణాలుంటాయి. కణాన్ని, కణ విభజనను కంట్రోల్ చేసేది డీఎన్ఏ. దీంట్లో జన్యువులు ఉంటాయి. ఒక కణాన్ని రెండుగా చేయాలన్నా, ఆపాలన్నా ఆపని జన్యువులే చేయగలవు. కొన్ని కణాలు కొన్ని రోజుల తర్వాత నాశనం అవుతాయి. కొత్త కణాలు పుడుతూ వాటిని రీప్లేస్ చేస్తాయి. ఎన్ని చనిపోతాయో, అన్ని పుడుతూ ఉంటాయి. ఈ బ్యాలెన్స్ అంతా జన్యువుల నియంత్రణలో ఉంటుంది. పొగ వల్ల ఊపిరితిత్తుల్లో, ట్రాకియా, బ్రాంకస్.. అన్నీ ప్రభావితం అవుతాయి. వాయుగోణుల పలుచని పొర మనం పీల్చుకున్న గాలిని ఫిల్టర్ చేస్తుంది. ఇక్కడే ఆక్సిజన్ రక్తంలోకి చేరడం, కార్బన్ డై ఆక్సైడ్ బయటికి రావడం జరుగుతుంది. పొగతాగడం వల్ల ఆక్సిజన్‌తో పాటు హానికరమైన ఇతర వాయువులు కూడా ఈ శ్వాసమార్గాలన్నింటి గుండా వాయుగోణులకు చేరి.. అక్కడి నుంచి రక్తంలోకి చేరుతాయి. దీర్ఘకాలం ఇలా జరగడం వల్ల ఆ కణాలు ఇబ్బందికి గురి అవుతాయి. దాన్ని తట్టుకోవడానికి జన్యువులు సహాయపడుతుంటాయి.జన్యువు కూడా దెబ్బతినడంతో కణాలకు పెరగాలా వద్దా అనే సంకేతాలు అందవు. దాంతో అవి పెరుగుతూపోయి, గడ్డలాగా తయారవుతాయి. క్యాన్సర్ కణాలు కొన్ని ద్రవాలను విడుదల చేస్తాయి. దీనివల్ల పక్కన కణాలకు చేరడంతో, అవీ దెబ్బతింటాయి. ఆ దారిలో వచ్చే రక్తనాళాలు, లింఫ్ నాళాలను కూడా దెబ్బతీస్తాయి. వాటి ద్వారా దూరంగా ఉన్న అవయవాలనూ చేరుతాయి. ఎక్కడో ఓ చోట ఇరుక్కుపోయి అక్కడ కూడా క్యాన్సర్ ఏర్పడుతుంది. అందుకే పొగతాగడం వల్ల కేవలం ఊపిరితిత్తులు మాత్రమే కాదు, శరీరంలో ఏ అవయవమైనా దెబ్బతినవచ్చు.

గొంతులో భా"స్వరం"..ఈశ్వరీయం

- కొడుకుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్



ఎల్.ఆర్. ఈశ్వరి ఎక్కువగా జ్యోతిలక్ష్మి, జయమాలిని, సిల్క్ స్మిత మొదలైన నాట్యకత్తెలకు పాడింది. వీరే కాకుండా విజయలలిత, లక్ష్మి, సరిత వంటి యువ నటీమణులకు కూడా తన గళాన్ని దానం చేసింది. ఈమె మొత్తం 14 భాషలలో పాడింది. తమిళం, తెలుగు, కన్నడం, మళయాళం, హిందీ, తుళు మరియు ఆంగ్ల భాషలలో కొన్ని వేల పాటల్ని పాడింది.

ఎల్. ఆర్. ఈశ్వరి ప్రముఖ నేపథ్య గాయని. ఈమె మద్రాసులో ఒక రోమన్ కాథలిక్ కుటుంబంలో డిసెంబరు 8వ తేదీన జన్మించింది. ఈమె తండ్రి మద్రాసులో స్పెన్సర్స్ కంపెనీలో పెద్ద ఉద్యోగం చేసేవాడు. ఈమె ఐదేళ్ళ వయసులో తండ్రి మరణించాడు. ఈమె తల్లి నిర్మల కుటుంబభారాన్ని మోసింది. ఆమె మంచి గాయని కావడంతో సినిమాలలో అవకాశం లభించినప్పుడల్లా కోరస్ బృందాలకు పాడింది. ఆ సమయంలో తల్లితో పాటు ఈమె కూడా రికార్డు స్టూడియోలకు వెళ్ళేది. ఆ సమయంలోనే ఈమెకు కూడా కొన్ని చిత్రాలకు కోరస్ బృందంలో పాడే అవకాశం వచ్చింది. ఈమె పూర్తి పేరు "లూర్ద్ మేరీ". ఈమె బామ్మ హిందూ కావడంతో "రాజేశ్వరి" అని పిలిచే వారు. ఈమె తన తల్లి, తండ్రి ఇరువైపుల బంధువులను తృప్తి పరచడానికి తన పేరును లూర్ద్ రాజేశ్వరిగా మార్చుకుంది. అప్పటికే తమిళ సినీరంగంలో ఒక రాజేశ్వరి గాయినిగా చలామణీలో ఉన్నందుకు తమిళ చిత్ర నిర్మాత ఎ.పి.నటరాజన్ ఈమె పేరును సినిమాల కోసం టూకీగా ఎల్. ఆర్. ఈశ్వరిగా మార్చాడు. ఈమె తమిళం, తెలుగు, కన్నడం, మళయాళం, హిందీ, తుళు మరియు ఆంగ్ల భాషలలో కొన్ని వేల పాటల్ని పాడింది.

ఈమెను మొదటగా కె.వి.మహదేవన్ గుర్తించి, "నల్ల ఇడత్తు సంబంధం" (1958) అనే తమిళ సినిమాలో మొదటి సారిగా సోలోగా పాడే అవకాశాన్ని ఇచ్చాడు. అయితే ఆ చిత్రం విఫలం కావడంతో ఆమెకు గుర్తింపు రాలేదు. కాని "పాశమలార్" (1961) సినిమాతో ఆమెకు మంచి గాయనిగా పేరొచ్చింది. తర్వాత కాలంలో ఆమె ఎక్కువగా చెళ్ళపిళ్ళ సత్యం దర్శకత్వంలో తయారైన ఎన్నో క్లబ్ సాంగ్స్ మరియు ఐటమ్ నంబర్లకు పాడింది. ఈమె ఎక్కువగా జ్యోతిలక్ష్మి, జయమాలిని, సిల్క్ స్మిత మొదలైన నాట్యకత్తెలకు పాడింది. వీరే కాకుండా విజయలలిత, లక్ష్మి, సరిత వంటి యువ నటీమణులకు కూడా తన గళాన్ని దానం చేసింది. ఈమె మొత్తం 14 భాషలలో పాడింది.

'నే పాడితే లోకమే పాడదా...' అనే పాట ఇప్పుడంటే వచ్చింది కానీ, ఒకప్పుడు ఎల్ ఆర్ ఈశ్వరి పాటల్ని లోకం అలాగే పాడుకునేది. స్వరంలో భాస్వరం ఉన్న గాయనిగా పేరు పొందిన ఆమె ఏ పాట పాడినా దానికో వేడిని, వేగాన్ని కలిగించేవారు.

అప్పట్లో ప్రముఖ సంగీత దర్శకులు అందరి సారథ్యంలో పాటలు పాడారామె. తెలుగులో ఆమె పాడిన ఎన్నో పాటలు ఇప్పటికీ ఆకట్టుకుంటాయి. 'మసక మసక చీకటిలో...' (దేవుడు చేసిన మనుషులు), 'మాయదారి సిన్నోడు...' (అమ్మమాట), 'భలేభలే మగాడివోయ్...' (మరోచరిత్ర), 'అరె ఏమిటి లోకం...' (అంతులేని కథ), 'లే లే లే నా రాజా...' (ప్రేమ్నగర్), 'తీస్కో కోకోకోలా... ఏస్కో రమ్ము సోడా...', 'మల్లెపూవులు పిల్లగాలులు...', 'నూకాలమ్మను నేనే నీ పీకను నొక్కేత్తానే...', 'నందామయా గురుడ నందామయా...', లాంటి ఓన్నో పాటలు అభిమానులను అలరిస్తూనే ఉన్నాయి. సినీ గీతాలతో పాటు ప్రైవేటుగా భక్తిగీతాలను కూడా ఆలపించారు.

ఈమె వ్యక్తిగత జీవితం మాత్రం విషాదమే. పేదరికంలో జీవించిన ఈమె కుటుంబం కోసం తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసింది. అవివాహితగానే ఉండిపోయి, సమాజం నుండి అంతగా గుర్తింపుకు నోచుకోలేదు.

ఈమెకు తమిళనాడు ప్రభుత్వం 1984లో కళైమామణి అవార్డు ప్రదానం చేసింది.

సినిమాలు-పాటలు

- దొంగలున్నారు జాగ్రత్త (1958) (తొలి తెలుగు సినిమా)
- జగన్నాటకం (1960)
- అగ్గిపిడుగు (1964)
- నవగ్రహ పూజామహిమ (1964) : నవ్వర నవ్వర నా రాజా నవ్వుల నివ్వర ఓ రాజా
- పాండవ వనవాసం (1965) : మొగలి రేకుల సిగదానా (హేమమాలిని అభినయించిన పాట)
- ప్రేమించి చూడు (1965)
- శ్రీ సింహాచల క్షేత్ర మహిమ (1965)
- అగ్గిబరాట (1966)
- ఉమ్మడి కుటుంబం (1967)
- కంచుకోట (1967)
- గోపాలుడు భూపాలుడు (1967)
- శ్రీకృష్ణావతారం (1967) : చిలుకల కొలికిని చూడు నీ కళలకు సరిపడు జోడు
- అమాయకుడు (1968) : పట్నంలో శాలిబండ పేరైన గోలకొండ
- ఉమా చండీ గౌరీ శంకరుల కథ (1968)

- పాలమనసులు (1968)
- బంగారు గాజులు (1968) : జాజిరి జాజిరి జక్కల మావా
- బందిపోటు దొంగలు (1968) : గండరగండా షోగ్గాడివంటా
- బాగ్దాద్ గజదొంగ (1968)
- గండికోట రహస్యం (1969)
- నిండు హృదయాలు (1969)
- బందిపోటు భీమన్న (1969)
- కథానాయిక మొల్ల (1970) : నానే చెలువే అందరికి (ఐదు భాషలలో పాడిన పాట)
- జన్మభూమి (1970)
- లక్ష్మీ కటాక్షం (1970) : అందాల బొమ్మను నేను చెలికాడ
- జగత్ జెంత్రీలు (1971)
- జేమ్స్ బాండ్ 777 (1971)
- బస్తీ బుల్ బుల్ (1971) : ఏ ఎండకా గొడుగు పట్టు రాజా నువ్వు పట్టకుంటే నీ నోట మట్టి రాజా
- దెబ్బకు తా దొంగల ముఠా (1971)
- నమ్మకద్రోహులు (1971) : ఏమా కోపమా నేను వేచింది నీకోసమే పాన్పు వేసింది
- బంగారుతల్లి (1971)
- ప్రేమనగర్ (1971) : లేలేలే లేలేలే నా రాజా... లేవనంటావా నన్ను లేపమంటావా
- రౌడీలకు రౌడీలు (1971) : తీస్కో కోకో కోలా వేస్కో రమ్ము సోడా
- పిల్లా-పిడుగు (1972)
- బాలభారతము (1972) : బలె బలె బలె బలె పెదబావ భళిర భళిర ఓ చినబావా
- భార్యాబిడ్డలు (1972) : ఆకులు పోకలు ఇవ్వద్దూ నా నోరు ఎర్రగ చెయ్యొద్దూ
- మంచి రోజులొచ్చాయి (1972)
- మావూరి మొనగాళ్ళు (1972)
- రైతుకుటుంబం (1972)
- ఎర్రకోట వీరుడు (1973)
- జీవన తరంగాలు (1973) : నందామయా గరుడ నందామయా
- తాతా మనవడు (1973) : రాయంటీ నా మొగుడు రంగామెల్లీ తిరిగి రాలేదు
- దేవుడు చేసిన మనుషులు (1973) : మసక మసక చీకటిలో మల్లెతోట వెనకాల మాపటేల కలుసుకో
- దేశోద్ధారకులు (1973)
- ధనమా దైవమా (1973)
- పుట్టినిల్లు మెట్టినిల్లు (1973) : బోల్తా పడ్డావు బుజ్జి నాయనా
- అల్లూరి సీతారామరాజు (1974)
- నిజరూపాలు (1974)
- నిప్పులాంటి మనిషి (1974) : వెల్ కం స్వాగతం చేస్తా నిన్నే పరవశం
- చిన్ననాటి కలలు (1975)
- అంతులేని కథ (1976) : అరె ఏమిటి ఈ లోకం... పలుగాకుల లోకం
- పాడిపంటలు (1976)
- మన్మధ లీల (1976) : హలో మై డియర్ రాంగ్ నంబర్
- దొంగల దోపిడీ (1978)
- దొంగల వేట (1978)
- మరో చరిత్ర (1978) : భలె భలే మగాడివోయ్ బంగారు నా సామివోయ్
- సింహబలుడు (1978) : సన్నజాజులోయ్ కన్నెమోజులోయ్
- అందమైన అనుభవం (1979) : ఆనంద తాండవమే ఆడేనుగా ఆ శివుడు
- చూసొద్దాం రండి (2000) (చివరిగా పాడిన సినిమా)

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ పరిపాలించిన కులాలు, రెడ్డి కులస్తులు.. ముఖ్యమంత్రులుగా పనిచేసిన రోజులు..

ప్రజామీడియా నెట్‌వర్క్ సౌజన్యంతో

రెడ్డి ముఖ్యమంత్రులు

1) నీలం సంజీవరెడ్డి
2) కాసు బ్రహ్మానంద రెడ్డి
3) మర్రి చెన్నారెడ్డి
4) టంగుటూరి అంజయ్య రెడ్డి
5) భవనం వెంకట్రామ్ రెడ్డి
6) కోట్ల విజయభాస్కర్ రెడ్డి
7) నేదురుమల్లజనార్దన్ రెడ్డి
8) వైయస్ రాజశేఖర్ రెడ్డి
9)నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి

కమ్మ ముఖ్యమంత్రులు

నందమూరి తారక రామారావు
నాదెండ్ల భాస్కర్ రావు
నారా చంద్రబాబు నాయుడు

వెలమ ముఖ్యమంత్రులు

జలగం వెంగల్ రావు
కల్వకుంట్ల చంద్రశేఖర రావు

బ్రాహ్మణ ముఖ్యమంత్రులు

పీవీ నరసింహారావు
బూర్గుల రామ కృష్ణ రావు

కోమటి ముఖ్యమంత్రి

కె రోశయ్య

35 సంవత్సరాలకుపైగా రెడ్లు
17 సంవత్సరాలకు పైగా కమ్మలు
11 సంవత్సరాలకు పైగా వెలమలు
1 సంవత్సరంకు పైగా బ్రాహ్మణులు.
1 సంవత్సరం పైగా కోమట్లు
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పాలించారు.

85 శాతం ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ కాపు మైనార్టీ సమాజం ముఖ్యమంత్రి పీఠానికి దూరంగా ఉంది ఎందుకనో కళ్ళు తెరవండి మనలో మనకి విభేదాలు సృష్టించి వాళ్లు వాళ్లు అంతర్గతంగా పరస్పర సహకారంతో రాజ్యాధికారం చలాయిస్తున్నారు.

మావిచిగురు తినగానే కోయిల పలికేనా

టి.రామచంద్ర ప్రసాద్



నవనవోన్మేషమైన నడకలతో నవవసంతం వచ్చింది. ఆరు రుతువుల కాలచక్రంలో తొలి రుతువు వసంతంలో, తొలుత వచ్చే చైత్ర మాసపు పాడ్యమి ఘడియల్లో, ఉషోదయపు కాంతితో నడిచి వచ్చే సంవత్సరారంభ సంరంభమే ఉగాది. అందుకే “ఉగాది అదిగో అరుదెంచె - జగాన శోభలు వ్యాపించే” అన్నారు గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ. అంతేనా, ఆ కొత్త సంవత్సరం తనతో తెచ్చే, “ఉగాది పచ్చడి, చేదు తీపులు జీవన సత్యాన్నెరి గించే” అని జీవన మాధుర్యంలోని రుచుల గురించి చక్కగా సెలవిచ్చారు.

నిజమే మరి, ఉగాది పర్వదినం ప్రకృతితో మమేకమైన పండగ. అందుకేనేమో, ఉగాది రాకను పంచాంగం కన్నా ముందే పూలరెమ్మలు, కోయిలమ్మలు, నిండు కొమ్మలు, గండు తుమ్మెదలు ఎలుగెత్తి చాటుతాయి. ప్రకృతి కాంతలోని పులకింతలను, వనమంతటా కలిగే గిలిగింతలు అచ్చంగా పొదువుకున్నదే ఈ వసంత రుతువు. అందుకే దీన్ని వర్ణిస్తూ తమ అక్షరాల్లో మధుమాస సుధల్ని ఒలికించిన కవులు అరుదు.

భారతావనిలోని పండగలు కేవలం వేడుకలు కావు. ప్రకృతి ధర్మాన్ని, అందుకు అనుగుణంగా సాగాల్సిన మానవుడి ధార్మిక విలువలని వివరించే పర్వదినాలు. ముఖ్యంగా తెలుగువారి జీవితాల్లో వచ్చే పండగలు ఎన్నున్నా, వాటి గురించిన ఆటపాటలు సరదాలు ఎంత వర్ణించినా, ఈ ఉగాదిని మాత్రం ఎక్కువగా ‘ప్రేయసితో, పరువం’తోనే పోల్చారు కవులు. అందుకే “ప్రేయసి నవ్వే ఆశీస్సు - ప్రేమకు పోసే ఆయుష్షు - ఉగాదిలా సాగే వయస్సు” అంటూ వలపు సోయగాలను వసంత రుతువున వచ్చే ఉగాదితో జతకూర్చి సాగించారు కవులు.

ఉగాది పండగ వేళ వనరాణిలో వెలిగే కళలన్నింటినీ, మావిచిగురును, కోకిల కబురును, మల్లియ గుబురును, గ్రీష్మపు గాలి తెమ్మెరను మొత్తంగా ఆమని రుతువును అతి సుందరంగా, సుమనోహరంగా వర్ణించారు మన సినీగేయ రచయితలు. ఉగాది అంటే పంచవన్నెల ప్రకృతిపై కవిత్వం, పరమాన్నాన్ని తలదన్నే షడ్రుచుల పచ్చడి, పరుగెత్తే కాలం తనతోపాటు మోసుకొచ్చే పంచాంగపు వైభవం... ఇలా చాలా ఉన్నాయి. కానీ, వాటన్నింటి కంటే వసంత శోభను వర్ణించే పాటలు, ఆమని తోడ్కొని వచ్చే వలపు గీతాలు, మల్లెపూల మంటలు రగిలించే విరహ గీతాలే మిన్నగా సినీ కవులు, ఈ రుతువు చుట్టూ తమ పదబంధాల్ని, అల్లిబిల్లి కలల్ని అల్లి పులకించారు- పాటల్లో పలికించారు. ఇక విషయానికొస్తే సీతామహాలక్ష్మి సినిమాలో “మావిచిగురు తినగానే” పాట మదిలో మెదిలింది.

మావిచిగురు తినగానే కోయిల పలికేనా

కోయిల గొంతు వినగానే..మావిచిగురు తొడిగేనా

ఏమో..ఏమనునో గానీ.. ఆమని.. ఈవని!! తెమ్మెరతో తారాటలా..తుమ్మెదతో సయ్యాటల..

తారాటల..సయ్యాటల..సయ్యాటల..తారాటల..

వన్నెలే కాదు, వగలే కాదు,

ఎన్ని నేర్చినది మొన్నటి పువ్వు?? పొంకాలు..పోడుములు..

ఏమో..ఎవ్వరిదోగానీ ఈ విరి?? గడసరి!! ఒకరి ఒళ్ళు ఉయ్యాల.. వేరొకరి గుండె జంపాల..

ఉయ్యాల..జంపాల..జంపాల..ఉయ్యాల.

ఒకరి పెదవి పగడాలో..

వేరొకరి కనుల దివిటీలో..పలకరింతలో.. పులకరింతలో

ఏమో..ఏమగునోగానీ ఈ కథ.. మన కథ!!.. ఇది పాట ఇందులో అర్థం కాని పదమే లేదు. విరి అంటే పువ్వు. ఎం హాయిగా ఉంటుంది వినడానికి. రాసింది ఆంధ్రా షెల్లి.. దేవులపల్లి.

మనసున మల్లెలమాలలూగితే రేయంతా హాయి నిండుతుందా? మావిచిగురు తింటే కోయిల ఎలా పాడుతుంది? అచ్చంగావచ్చే వసంతరాత్రిలో శృంగార గరిమ ఎలాగుంటుంది? గగనసీమలో స్వేచ్ఛగా విహరించే మేఘం ప్రేమ సందేశాన్ని ఎలా మోసుకొస్తుంది? ప్రియుని జాడ ఎలా తెలుసుకుంటుంది? మనసు తెలిసిన ఆ మేఘమాలది జాలిగుండె కాదా? సఖియ రాకుంటే వసంతమాసం ఆగుతుందా? మోయలేని హాయిని ఒక్క క్షణం మోయలేదా? ఆకాశపందిరిలో పెళ్లిజరిగితే దేవతలు పురోహితులుగా, అప్సరసలు పేరంటాళ్లుగ రావడం సాధ్యమా?... వీటన్నిటికీ సమాధానాలు దేవులపల్లి కృష్ణ శాస్త్రి భావ కవితలే. మీగడ తరకల్లాంటి జుబ్బా, పంచెకట్టు, ఉత్తరీయం, బంగారు రంగు శరీరం, వెండి గిరజాల జుట్టుతో భావకవితా ప్రపంచానికి చక్రవర్తిలా, తన కవిత్వంలాగే అందంగా భాసిల్లిన పదనిర్దేశకుడు. వర్షం వచ్చేముందు వీచే చల్లనిగాలి తెమ్మెర తనువును తాకితే ఎంత పులకరిస్తామో, కృష్ణశాస్త్రి కవిత వింటుంటే అదే పులకరింత వీనుల విందుగా వస్తుంది. భావ కవిత్వానికి సినిమా పాటల ద్వారా ఒక శాశ్వత స్థానాన్ని ఏర్పాటు చేసి, దిశానిర్దేశం చేసిన అతి కొద్ది మంది కవులలో కృష్ణశాస్త్రి ముందుంటారు. సినిమాలకు ప్రత్యేకించి అయన రాసిన పాటలు తేనెలూరే తెలుగుదనంతో పరిమళాలు వెదజల్లుతాయి. శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం కవితా సంపుటికి చలం యోగ్యతాపత్రం రాస్తూ ‘కృష్ణశాస్త్రి తన బాధని అందరిలో పలికిస్తే శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు. కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ... ప్రపంచపు బాధంతా శ్రీశ్రీ బాధ’ అని రాశాడు. అయితే శ్రీశ్రీ తను కృష్ణశాస్త్రి కవితా శైలినే అనుకరించేవాడిని అని చెప్పుకున్నాడు. ‘తెలుగు దేశపు నిలువుటద్దం బద్దలైంది. షెల్లీ మళ్లీ మరణించాడు’ అంటూ కృష్ణశాస్త్రి చనిపోయిన రోజున శ్రీశ్రీ రోదించాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ స్పందిస్తూ ‘ఒక్క షెల్లీ యే కాదు, కీట్స్, వర్డ్స్‌వర్త్ వంటి మహాశయుల సంయుక్త స్వరూపం కృష్ణశాస్త్రి’ అన్నారు.ఆ మహానుభావుడుని శార్వరి యుగాది నాడు స్మరించడం మన తెలుగువారి అదృష్టం.

❖ ❖ ❖

నిజమైన హీరో....

ప్రజామీడియా నెట్‌వర్క్ సౌజన్యంతో



కొన్ని సంవత్సరాల క్రితం..హైదరాబాద్ జింఖానా మైదానంలో వరద బాధితులకోసం ఒక ప్రఖ్యాత క్రికెటర్ ఇచ్చిన "బ్యాట్ "వేలం జరుగుతుంది. సినీపరిశ్రమలోని మహా మహులంతా ఆ వేలం పాటకు విచ్చేశారు...

బ్యాట్ వేలం పాట మొదలైంది... సినీహీరోలు పాట పాడటం ప్రారంభించారు. అంతా వేలల్లోనే పాడుతున్నారు..అతి కష్టం మీద 1.5 లక్షలకు చేరుకుంది పాట.. నిర్వహులకు నిరాశ..అంతలో తెల్లని ఫ్యాంట్, షర్ట్ ధరించి, మాసిన గడ్డం,చేతిలో గుడ్డసంచితో వచ్చాడొకవ్యక్తి.. వస్తూనే నా పాట? 8,50000 (ఎనిమిది లక్షలా యాభైవేలు) అంటూ అరిచాడు,. అందరూ నిర్ఘాంతపోయారు.

అగ్రహీరోలకు సహితం నోటిమాటరాలేదు.. నిర్వహకులు ఆనందంగా ఆయన పాటను ఫైనలైజ్ చేశారు.. తన వెంట తెచ్చుకున్న గుడ్డసంచిలోని డబ్బునంతా టేబుల్ మీద పోసి బ్యాట్ తీసుకొని దానిని ముద్దుపెట్టుకొని మళ్ళీ దానిని ఒక అనాధ శరణాలయానికి ఇచ్చేశాడు.. నా దగ్గర అంత డబ్బేవుంది.. లేకుంటే అంతకంటే ఎక్కువే పెట్టి పాడుందును అని నవ్వుతూ చేప్పాడావ్యక్తి..

అతనే రెడ్డి బాబులు. ఉరఫ్ రెడ్డి నారాయణమూర్తి నాయుడు.. పీపుల్స్ స్టార్ .. దాదాపు 25 సినిమాలు తీసినా..ఈ రోజుకీ సొంత ఇల్లులేని నటుడు.. కేవలం ఒక చాప, దిండు అతని ఆస్థి,, తను సంపాదించినదంతా పేదలకే పంచాడు.. ఎక్కడ తను పెళ్ళిచేసుకుంటే సమాజసేవకు ఆటంకమవుతుందో అని పెళ్ళి చేసుకోకుండానే "బ్రహ్మచారి"గా మిగిలిపోయాడు..

హీరోలంటే ఆరడగులు, అందమైన ముఖం,కండలు తీరిన శరీరం కాదు... అందమైన మనసు ... నారాయణమూర్తిగారే అతిగొప్ప హీరో!!!

జో బైడెన్ గెలుపు భారత్ కి లాభమా ?

బిందు

జో బైడెన్ గెలుపు మన దేశానికి లాభమా నష్టమా అన్న చర్చ ప్రారంభమైంది. ఒకటి స్పష్టం. అక్కడ ఏ పార్టీ అధికారంలో ఉన్నా అమెరికన్ కార్పొరేట్ల ప్రయోజనాలే వారికి ముఖ్యం. మీ ఇంటికొస్తే మాకేం పెడతారు, మా యింటి కొస్తే మాకేం తెస్తారు అన్నట్టుగా ఉంటుంది. డెమోక్రాట్లు అందరికీ ఆరోగ్యం అనే ఎన్నికల వాగ్దానం చేశారు. దాన్ని ఆచరణలో పెడితే మన ఔషధ పరిశ్రమకు మరింత ఉపయోగం అని కొందరు లెక్కలు వేస్తున్నారు. అదే విధంగా హెచ్1బి వీసాలు మరిన్ని ఇవ్వొచ్చని కొందరు ఆశపడుతున్నారు. అమెరికా కార్పొరేట్ సంస్థలకు చౌకగా పని చేసే వారు కావాలి. ఎన్నికల్లో ఓట్ల కోసం ట్రంప్ స్థానిక యువతను ఆకట్టుకొనేందుకు విదేశీయులకు వీసాలు బంద్ అన్నట్లు హడావుడి చేశారు. నిజంగా అలాంటి ఆంక్షలను అమలు జరిపితే అక్కడి కార్పొరేట్లు సహించరు. చైనాతో వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించిన ట్రంప్ రెండు సంవత్సరాలు దాటినా సాధించిందేమీ లేదు. ఒక వేళ జో బైడెన్ దాన్ని కొనసాగించినా ఒరిగేదేమీ లేదు. ట్రంప్ ప్రచారం చేసినట్లు జో బైడెన్ కమ్యూనిస్టు కాదు, పక్కా కార్పొరేట్ల ప్రతినిధి. బరాక్ ఒబామా హయాంలో కూడా అమెరికా యుద్ధాలు చేసిన విషయం మరచి పోకూడదు. అందువలన ట్రంప్ మాదిరి దురహంకారం, నోటి దురుసుతనం ఉండకపోవచ్చు తప్ప అమెరికా మౌలిక విధానాల్లో మార్పు వచ్చే



అవకాశం లేదు. చైనాతో వైరం కంటే రాజీయే లాభం అనుకుంటే దూకుడు తగ్గించి, కొంత ఆలస్యం చేయవచ్చు తప్ప అమెరికా పెత్తందారీ వైఖరిలో మౌలిక మార్పు ఉండే అవకాశాలు లేవు.

కాశ్మీరు, సీఏఏ, ఎన్ఆర్‌సీ సమస్యల మీద డెమోక్రటిక్ పార్టీ ఎంపీలు మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. కాశ్మీరీలు ఒంటరిగా లేరు, మేమందరం చూస్తున్నాం, అవసరం అయితే జోక్యం చేసుకోవాలి అని తాజాగా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయిన కమలా హారిస్ గతంలో చెప్పారు. డెమోక్రటిక్ పార్టీ ఎంపీ ప్రమీలా జయపాల్ గతంలో నరేంద్రమోడీ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. గతేడాది డిసెంబర్‌లో ఆమె సభ్యురాలిగా ఉన్న పార్లమెంటరీ బృందం భారత పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆమెను మినహాయించాలని మన విదేశాంగ మంత్రి జై శంకర్ కోరగా అమెరికా నిరాకరించింది. దాంతో ఆ బృందంతో జరగాల్సిన సమావేశాన్ని మంత్రి రద్దు చేసుకున్నారు. ఇప్పుడు తిరిగి ఆమె పెద్ద మెజారిటీతో గెలిచారు. అలాంటి ఎంపీలు నరేంద్రమోడీ సర్కార్ గురించి ఇప్పుడు మౌనంగా ఉంటారా? చైనా మార్కెట్‌ను పూర్తిగా తమకు అప్పగించాలని, ప్రపంచంలో ఎక్కడా చైనా పోటీకి రాకూడదని అమెరికా కోరుకుంటోంది. అందుకు ఎవరు ఉపయోగపడితే వారిని ఉపయోగించుకుంటున్నది. గతంలో మన మార్కెట్ కోసం మనకు వ్యతిరేకంగా పాకిస్థాన్‌ను ఎగదోసి మన మీద వత్తిడి తెచ్చింది. మన పాలకులు లొంగిపోవటంతో ఇప్పుడు పాక్‌ను తాత్కాలికంగా పక్కన పెట్టింది. ఈలోగా చైనాక్ష ఆర్థికంగా ఎదుగుతుండటంతో దానికి వ్యతిరేకంగా మనలను ప్రయోగించేందుకు చూస్తున్నది. అమెరికాలో ఎవరు అధికారంలో ఉన్నా అమెరికా ప్రయోజనాలకే పెద్ద పీటవేస్తారు. అందువలన తమ అవసరం కోసం జో బైడెన్ కూడా మోడీని మరింతగా కౌగలించుకోవచ్చు.అమెరికా ఎన్నికల్లో ట్రంప్‌కు మద్దతు ఇచ్చిన తీరులో మోడీ ప్రవర్తన చౌకబారుగా ఉందా, రాజనీతిజ్ఞుడిగా వ్యవహరించారా అన్నది వేరే అంశం. ఇప్పటి వరకు అనుసరిస్తున్న విధానానికి వ్యతిరేకం, ప్రమాదకరమైన పోకడ.గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమెరికా పర్యటనకు నిరాకరించింది కూడా అదే జోబైడెన్, అదే పార్టీకి చెందిన బరాక్ ఒబామా అన్న విషయం తెలిసిందే.

జ్ఞాన దీపావళి

దీపావళి అంటే
లక్ష్మీబాంబులు, కుక్కసీరికలు
మిర్చి బాంబులు వంకాయబాంబులు
రాకెట్లు, చిచ్చుబుడ్లు క్రాకర్స్ శబ్ద కాలుష్యాలేనా ?

దీపావళి అంటే చెవులు తూట్లుపడి
వాయు కాలుష్యాన్ని పెంచి జీవరాసుల్ని చెల్లా
చెదురుచేసే కన్నీళ్ల గోసలేనా?

దీపావళి అంటే
బెల్లంబూరెలు, పాలపొంగలి
కజ్జకాయలు అక్కాచెల్లెండ్ల అనుబూతుల
మకరందాల సందడి !

దీపావళి అంటే పాడి పంటల వెలుగు
పిల్లా పాపాలతో ఉగ్రుతలూగె ఆనందాల
జునుం జాతర !

పటాకుల ఉత్పత్తి వేల మందికి ఉపాధైనా
మానవ అవసరాలకై సమాజ ఉన్నతికై
ఎన్నింటినో కూల్చి ఎన్నింటినో నిర్మించి లేమా?

బాణా సంచాకర్మాగారాలు
వందల సార్లుపేలి
వేల నెలవంకలు నేలపాలు
భూమిని రసాయనాల పాల్జేసే
వికృతి వేలుగులు ఓ వెలుగులేనా..?
టపాసులే దీపావళా?
దీపావలే పటాకులా ?

నేలను విషపూరితం చేసి
ఖరీదైన ధరలతో
శ్వాశకోశ వ్యాధుల్ని
ఉచితంగాపంచె
అనారోగ్య దీపావళి
మన దీపావలేనా?

మన దీపావళి
పర్యావరణహిత
హరిత దీపావళి
పాడిపంటల వెలుగుల దీపావళి
స్వచ్ఛ దీపావళి
జ్ఞాన దీపావళికి జై

వనపట్ల సుబ్బయ్య
9492765358